# కథా కౌముది

2008 - 1



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 24

# విషయసూచిక


| | | |
|---|---|---|
| పేషెంటుకి తెలివొచ్చింది | అవసరాల రామకృష్ణారావు | 3 |
| మలుపు | మాధవ్ మౌర్య | 7 |
| కొత్త సీసా - పాతసారా | నిడదవోలు మాలతి | 18 |
| పాత సైంకిల్ | టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి | 22 |
| సారీ రా సారిక | వియోగి | 29 |
| అపస్వరాల అనుబంధం | డా. ఏల్చూరి విజయ రాఘవ రావు | 38 |
| ప్రాజని | పొన్నాడ కుమార్ | 42 |
| మసక వెన్నెల | ఎలక్ట్రాన్ | 50 |
| దూకితే దూకండి | వారణాసి రామకృష్ణ | 56 |
| నాలుగు దినాలు | కవనశర్మ | 61 |
| పరమార్థం | సునీల్ గూరి | 66 |
| కనువిప్పు | అన్నపూర్ణ | 69 |
| వేరుపురుగు | ఎమ్వీ.రామి రెడ్డి | 75 |
| పున్నమి చంద్రుడు | ఎమ్.ఆర్.వి.సత్యనారాయణ మూర్తి | 84 |
| మీ వాళ్ళే | గుండా నారాయణ రావు | 91 |
| ఊర్వశి పోలసీ | డా.గాయత్రీ దేవి | 96 |
| అద్దెకు గర్భం | శింగిసెట్టి సంజీవ రావు | 101 |
| మన్నించవా చిన్నా | యం.ఆర్.అరుణ కుమారి | 105 |
| రాజు - ఏడుగురు కొడుకులు | జె.యు.బి.వి.ప్రసాద్ | 109 |
| అమ్మ కోరిక | డొక్కా ఫణికుమార్ | 113 |
| బంధం | వడ్లమాని పద్మావతి | 116 |
| చిన్నమ్మ | మంథా భానుమతి | 122 |
| ప్రవల్లిక | భాను | 126 |
| ఆరాధ్య దేవత | ఆర్.శర్మ.దంతుర్తి | 129 |
| మేలి ముసుగు | మద్దూరి శివప్రసాద్ | 136 |



# కథా కౌముది

## ఉగాది కథల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ





'నర్సమ్మా, మా వారికి తెలివొచ్చిందా?'

మా ఆవిడ సుబ్బలక్ష్మి గొంతు.

'డాడీకి గుడ్‌మార్నింగ్ చెప్పొచ్చా? మాటాడగలరా?'

మా అమ్మాయి సివంగి స్వరం.

చెవిలో శబ్దాలు పడుతున్నా ఓ పట్టాన రెప్పలు విడడం లేదు. పెదవులు కదపాలని ఉన్నా ముద్దమాట తప్ప మరోమాట ఇవతలకి రావడంలేదు.

'ఇంకో అయిదు నిముషాల్లో మామూలు మనిషి అయిపోతారు. ఈలోగా ఆయన్ని డిస్టర్బ్ చేయకండి'

నాకు హెర్నియా ఆపరేషను చేసిన డాక్టరు వెంకట్రాజుగారి స్వరం. మామూలు మనిషిని కాకుండా నన్నెంతో డిస్టర్బ్ చేసింది, నిజానికి ఆయనే! అయితే అలా జరిగిందెప్పుడంటే, ఆనాటికి రెండేళ్ళ తర్వాత ఆయనే మమ్మల్ని ఆహ్వానించిన ఆయన కొత్త ఆసుపత్రి ప్రారంభోత్సవం నాటి విందు సందర్భంలో. బెడ్ మీద పడుకుని కళ్ళు తెరిచి కొత్తగా చూపు ప్రాక్టీసు చేస్తున్నట్టున్న ఆనాడు, నిజంగా తెలివి తెచ్చుకోవలసిన సమయం ముందుందని అనుకోలేదు. ఓ చవకరకం బొకేని పట్టుకుని నాకు స్పీడ్ రికవరీ చెప్పడానికి వస్తున్న సూరిబాబుని మా ఆవిడ అడ్డేసిందని తెలీదు. నా మానసిక స్థితి మీ ముందు పరుస్తే గానీ పూర్తిగా అవగాహన అవదు మరి.

❀❀❀

చిన్నప్పుడు నాటకాల్లో పాత్రలు ధరించడంతో నేనూ, సూరిబాబూ దగ్గరయ్యాం. హరిశ్చంద్రలో వాడు విశ్వామిత్రుడిగా ఎంతగా ఎస్టాబ్లిష్ అయ్యాడంటే ఆ పాత్రపేరుతో తప్ప 'కణితేటి సూరిబాబు' అనే పేరుతో వాణ్ణెవరూ గుర్తుంచుకునే వారు కారు. అదే నాటకంలో లోహితాశ్యుడిలాంటి అనామిక పాత్రనాది. అయినా ఈ తేడాలేమీ మా స్నేహాన్ని అడ్డుకునేవికావు.

అయితే అక్కడితో సరిపెట్టుకోక సినిమాల్లో అవకాశం కోసం కొండంత ఆశతో మేమిద్దరం మద్రాసు చేరుకున్నాం. అడ్డమైన వాళ్ళ కాళ్ళూ పట్టుకుని ఎనిమిదేళ్ళ పైమాటగా ఎన్నెన్నో బాధలు అనుభవించాం. ఏవేవో చిన్నపాత్రలు దొరికేవిగానీ అవి భిక్షాపాత్ర స్థాయిలోనే ఆగిపోయేవి. అయితే ఉన్నట్టుండి నా దశ తిరుగుతుందని మాత్రం కలలో అనుకోలేదు. వీరాధివీరుడు అనే డబ్బింగు సినిమాలో నాకు దొరకిన ఓ మోస్తరు పాత్ర అక్షయపాత్రగా మారడానికి కారణం అది అన్ని సెంటర్లలోనూ ఏభైరోజులుపైగా ఆడడమేనుట. ఆ సినిమాలో నా పాత్ర పేరు ఎర్రగడ్డ ఎనమంద. ఆ పాత్ర ధరించిన నాపేరు 'స్వరాజు సోమిరెడ్డి' అని తెలుగు సినీ ప్రేక్షకులు మరచిపోయేటంతగా ఆ పాత్ర వారిపై ప్రభావం చూపించినట్టుంది. ప్రముఖ పాత్రల జాబితాలో నేను చేరగలనని ఎప్పుడూ అనుకోలేదు. నా దృష్టిలో నా కంటే గొప్పనటుడైన మా సూరిబాబుకి మాత్రం నిలబడే పాత్ర ఏదీ ఇప్పటికి దొరకలేదు. పైగా చేరదీసిన ఎక్స్ట్రా మల్లితో కాపరానికి శిక్షగా ఇద్దరు పిల్లలతో ఇంకా ఇంకా దిగజారుడు లెవెలుకి చేరుకుంది వాడి బతుకు. అదే సమయంలో అంచెలంచెలుగా పుంజుకున్నాను నేను. మేడింటి వాణ్ణి ఎప్పుడైతే అయానో అర్జంటుగా తన కూతురు సుబ్బలక్ష్మిని అంటగట్టి నన్ను ఓ ఇంటివాణ్ణి చేసేశారు మా మేనమామ.

అంతకుముందు ఆకలి రోజుల్లో అనుకుంటాను, సూరిబాబుతో పాటు నన్నూ సామ్యవాదం ప్రభావితుణ్ణి చేసింది. అందర్నీ ఒకేలా చూడ్డం ఇంచుమించు అసాధ్యమేమోగానీ ఒకే చిత్రసీమలో వేళకి రాని హీరోని నెత్తిమీది చందమామలాగా, ఇరవైనాలుగ్గంటలూ కనిపెట్టుకుని కష్టపడే వార్డ్‌బాయ్‌ని కాలికింద కండ చీమలాగా చూడ్డం భరించలేక పోయేవాణ్ణి. పార్టీలో అయితే చేరలేదుగానీ ఆ సాహిత్యం మమ్మల్నో కుదుపు కుదిపేది. ఆ భావజాలం ఉక్కిరిబిక్కిరి చేసేది.

అయితే వేషాలు దొరకనప్పుడే ఎలాంటి ఆవేశాలయినా. ఒకప్పుడు పది మార్కులు దాటని పనికి మాలిన వాళ్ళ లిష్టులో నేనూ సూరిబాబూ ఏళ్ళ తరబడి చూరు పట్టుకు వేళ్ళాడాం. పాపం వాడింకా అక్కడే ఉన్నాడు గానీ నేను నలభై మార్కులు తెచ్చుకునే అదృష్టానికి ఎదిగాను. తెలివైన భార్యని కట్టుకోడం చేత సంపాదించిన డబ్బులు చెల్లాచెదురు అయిపోక ఆర్థికంగా రోజురోజుకీ ఎదగగలుగుతున్నాను. కమ్యూనిజం ఒకటే కటిక నిజం అనే ధోరణికి కాస్త దూరంగా జరుగుతూ వచ్చాను. అసలు ఎలాంటి ఆలోచనలకైనా పీకలదాకా దిగిన ఈ సినీఫీల్డు నాకు అవకాశం ఇస్తేనా!

పడక సుఖంతో పాటు ఇల్లు నడిపే ఒడుపు తెలిసిన పెళ్ళాం ఏ మొగుడికి చేదు!? అలాంటి ఆడదానికి పూర్తిగా లొంగిపోయినట్టు నటించడం ఎంత హాయి! ఎప్పుడు పిలిస్తే అప్పుడు హాజరు కావలసిన సినీనటుల బిజీలైఫులో ఇల్లాలు చెప్పే ఏ మాటకైనా కాదనగల లీజరు ఏ మగాడికైనా ఎక్కడుంటుంది? పిల్లలు పుట్టడం ఆలశ్యమైన కొద్దీ తనతోపాటు నన్నూ గుళ్ళ చుట్టూ ప్రదక్షిణాలు చేయించేది. నా మనసు మొరాయిస్తున్నా ఎక్కళ్ళేని మొక్కులూ మొక్కించేది. 'పెళ్ళేకాక పోయినా, తినడానికిన్ని మెతుకులు లేకపోయినా అడ్డమైన వెధవలకీ పుట్టుకొస్తారు పిల్లలు' అంటే మాత్రం అంది మా సూరిబాబు ఫామిలీ గురించే అని చివుక్కుమనేది నా మనసు. పైకి ఏమీ అనలేకపోయేవాణ్ణి గానీ లోపాయికారీగా సూరిబాబుకి ఎన్నో విధాలుగా డబ్బు సాయం చేసేవాణ్ణి.

పోనీ సూరిబాబుతో ఉంటున్న మల్లి అయినా నా సహృదయతని మెచ్చుకుంటుందేమో అంటే అదీ కనపడలేదు. ఓ సారి నా పాత బట్టలు, ఎక్కడా చిరుగైనా పట్టని రెండు జతలు ఇస్త్రీ చేయించి ఓ సంచిలో పెట్టి ఇవ్వపోతే నా కర్మం కాలి వాడు ఇంట్లో లేక మల్లి వాటిని తిరక్కొట్టిన తీరు ఎప్పుడూ మరచిపోలేను.

'ఉన్నదేదో ఓ పూట తినో ఓ పూట తినకో మా మటుకు మేం బతుకుతున్నాం. ఏదో రోజులు గడుపుతున్నాం గానీ మీ ఇంటికొచ్చి ఆవిడ కాళ్ళు పట్టుకోలేదు కదా! మమ్మల్ని ఇలా అయినా బతకనివ్వండి. మా దరిద్రాన్ని ఇలా ఎత్తి చూపాలా, ఇదేనా మీ స్నేహం? రెండు చేతులా సంపాదించుకుంటున్నారు, ఎంతో మంది డైరక్టర్లతో, ప్రొడ్యూసర్లతో సంబంధం పెట్టుకుని ఉంటారు. మమ్మల్ని ఇలాగే ఉండమని చేప్పేలా పనిగట్టుకుని ఇంటికొచ్చి అవమానం చెయ్యడానికి కాకపోతే, తెలిసిన వాళ్ళకెవరికైనా చెప్పి మీ ఫ్రెండుకి మీరెందుకు పోర్షన్లు ఇప్పించరు!?'

ఆ ధోరణి వినలేక ఇటు తిరిగిపోయాను. ఆవహించిన అశక్తత నన్ను క్రుంగదీసింది. నాటక రంగంలో ఉన్నంత కాలం మేం స్నేహితులం. సినీరంగం మమ్మల్ని విడదీసిందా? లేదు. నేనూ సూరిబాబూ ఎప్పుడూ కలిసే ఉన్నాం, ఉంటాం. ఇక ఆడవాళ్ళున్నారా- ఆర్థిక పరమైన అంతరాలు వారిని వేరు చేస్తే అది వాళ్ళ సంస్కారం. మేమేం చెయ్యలేం. తక్కిన రంగాల్లో ఏమోగానీ ఎంతో రిస్కు తీసుకుని కోట్లు పెట్టుబడిపెట్టే ఫిల్మ్ ఇండస్ట్రీలో మాత్రం ఆ తరతమ బేధాలు మరీ స్పష్టంగా కనిపిస్తాయి. "అన్నీ 'డబ్బుల్' స్టాండర్డ్స్" అని ఎప్పటికప్పుడు రుజువౌతూ ఉంటుంది.

పిల్లలు ఆలశ్యంగా పుట్టి ఆ లోపమూ తీరినా, మాకు సగం ఆనందమే మిగిలింది. మేం ఎన్నిట్లోంచో ఏంచి లవంగి, సివంగి అని పేర్లు పెట్టుకున్న మా కవల పిల్లల్లో మాకు ఒక్కర్తే దక్కింది. పుట్టుకతోనే గుండెల్లో ఏదో లోపంతో పుట్టారు వాళ్ళు. కాస్త ముదిరితేగానీ ఆపరేషన్లు చేసి సరిచెయ్యడం కుదరదన్నారు. లక్షలు కర్చుపెట్టి ఎక్స్‌పర్ట్ డాక్టర్స్ చేత ట్రీట్‌మెంట్ ఇప్పించినా సివంగి మాత్రమే మాకు దక్కింది. అన్ని బాలారిష్టాలు దాటి అదిప్పుడు నాలుగోక్లాసు చదువుకుంటోంది.

అయితే నా హేతువాదాన్ని ఈ సంఘటన కిందా మీదా పెట్టేసింది. 'తప్పని సరై నాతో గుళ్ళూ గోపురాలూ తిరుగుతారు గానీ పరమ నాస్తికులు మీరు. కాదని దబాయించక నా ప్రశ్నకి జవాబు చెప్పండి' అని మా ఆవిడ నన్ను నిలదీసింది. 'ఇద్దరూ కవలలు. పుట్టింది ఒకే రకం గుండె జబ్బుతో. ఆపరేషన్లు జరిపించింది ఒకే డాక్టరు. అన్నిట్లోనూ అంతటా సమానం అయినప్పుడు ఫలితం కూడా ఒకటే అవక నేరుగా ఎందుకుంది? ఒకదానికి బతుకూ ఇంకోదానికి చావూనా? అంటే? లవంగి ఏ జన్మలోనో ఏదో పాపం

చేసుకుని ఉండాలి. దీన్నెలా కాదంటారో అనండి చూద్దాం'

నేను పైకేం అనలేదు కానీ, లోలోపల ఎన్నెన్నో అనుకోకుండా మాత్రం ఉండలేకపోయాను. సమానత్వం సమానత్వం అనుకోవడం సిద్ధాంతానికే పరిమితమేమో! ప్రకృతిలోని రకరకాల కొండలూ, చెట్లూ, జంతువులూ ఏ రెండూ ఏ విధంగానూ సమానంగా ఉండవు. ఏ ఇద్దరు మనుషులూ ఒకేలా ఉండక పోడం అటుంచి ఓ చేతి వేళ్ళూ, అవి చేసే పనులూ ఒకలా ఉండవు కదా! సమానం అనే ప్రమాణం సాధించవలసింది ఆర్థికరంగంలో మాత్రమేనా! వాటిని మించిన బంధాలు లేనేలేవా! వేగంగా తగినంత సంపద చేకూరింది గనక మా ఆవిడ లక్షవత్తులతో నోము నోచుకోగలిగింది. ఒక్క ఒత్తి అయినా వెలిగించుకోడానికి చమురు లేని మల్లిలాంటి వాళ్ళు ఏం చెయ్యగలరు! ఆర్థిక పుష్టి ఉన్నవాళ్ళు ఎన్ని పారమార్థిక కబుర్లయినా చెప్పగలరు, అవి లేనివాళ్ళు?

ఇదిలా ఉండగా మూడు చిత్రాలలో ఒకేసారి పనిచేసే వర్క్‌లోడ్ తట్టుకోలేకో, మరెందుచేతో కుడివైపు పొత్తికడుపు చివరకీ తొడకీ మధ్య భాగంలో నొప్పి పట్టుకుని ఎంతకీ వదిలింది కాదు. ఇక అశ్రద్ధ చెయ్యకూడదని మూడో ఫిల్మ్ వర్క్స్ ముగించుకుని, సూరిబాబుని తీసుకుని, అతని సలహా మీదే డాక్టరు వెంకట్రాజుగారిని కలిశాను. ఆ మాత్రం ఈ మాత్రం పేరు సంపాదించిన ఫిల్మ్ యాక్టర్ను కి అభిమానుల బెడద ఎక్కువ. ఫేమస్ సర్జయితే ఏమయింది అంతకన్న నా పబ్లిసిటీ ఎక్కువ కదా, నా సినిమా అనుభవాల గురించి ఏం అడుగుతాడో అనుకున్నాను. చిత్రమేమిటంటే నేనో యాక్టర్నని గానీ తనో డాక్టర్నని గానీ మా తొలి పరిచయంలో అతను రానివ్వలేదు.! ఓ మనిషి ఇంకో మనిషి సాయం కోరి వచ్చాడు, అంతే. పరిక్ష చేసి హెర్నియా అనీ ఆపరేషన్ చెయ్యవలసి ఉంటుందనీ తేల్చాడు. నాకు బీ.పీ షుగరూలాంటివి లేవు గనుక ఆరోజుకి మూడోనాడే ఆపరేషను చేస్తానన్నారు. ఇంత అవుతుందని చెప్పి ముందే అంతా తీసుకుని రసీదు చేతిలో పెట్టాడు.

లాస్టియరు మా సూరిబాబూ ఇదే రోగం వస్తే ఇతనిచేతే ఆపరేషను చేయించుకోవాలనీ డబ్బుసాయంకావాలనీ సూరిబాబు నాకు ఫోన్ చేస్తే, ఆడాళ్ళ చెవిని పడకుండా కొంత డబ్బు సాయం చేశానని గుర్తుంది. కానీ ఇదే ఆస్పత్రి అనీ ఈ డాక్టరు చేతే వైద్యం జరిగిందనీ నాకు తెలియదు. 'శ్రద్ధా చాదస్తమూ లేవని చెప్పలేం గానీ అవేం నెగిటివ్ లక్షణాలు కాదుకదా! హస్తవాసి ఉన్న మంచి మనిషి' అని మావాడు చెప్పింది అక్షరాలా నిజమని నా ఆపరేషను అనుభవమే రుజువు చేసింది. మామూలు ఆరోగ్యం చేకూరి హాయిగా ఇల్లు చేరాను.

❋❋❋

ఆ తర్వాత వెంకట్రాజుగారి ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొనమని ఓనాడు ఆహ్వాన పత్రం అందితే, అదెవరో ఆ తర్వాత పెరిగిన సినిమా ఛాన్సుల ఒత్తిడిలో ఓ పట్టాన గుర్తురాలేదు. తీరా గుర్తువచ్చాక అంత గొప్పవ్యక్తిని మరచిపోయినందుకు గిల్టీగా ఫీలయ్యాను. సివంగికి యాన్యువల్ ఎగ్జామ్స్ గనక ఆయా దగ్గర వదిలేసి మేమిద్దరం ఎటెండయ్యాం.

అతని వ్యక్తిత్వంలాగే విధి నిర్వహణలాగే ఆ ఫంక్షనూ నా దృష్టిలో సింపుల్ బట్ గ్రాండ్ అప్పటికే డెబ్భై మార్కులు తెచ్చుకున్న సినిమా నటుణ్ణి గనక నా స్థాయిలో ఉన్న ఘరానా వ్యక్తులే ఆహ్వానితులనుకున్నాను. పొరపాటు. చాలామంది సాదాసీదా వ్యక్తులుండడం ఆశ్చర్యమనిపించింది. అంతేకాదు, మాకు అల్లంత దూరంలో ఉన్న సూరిబాబునీ, మల్లినీ పిల్లల్నీ చూసి సుబ్బలక్ష్మి నొచ్చుకున్నట్టుంది. అందరూ వెళ్ళిపోయేదాకా ఆగి వెంకట్రాజుగారిని నిలదీయకుండా ఉండలేకపోయింది. ఆయన జవాబు మాత్రం ప్రత్యక్షం నాకు గుర్తుండిపోతుంది.

'చూడండి మేడమ్. నేనిప్పుడు పిలిచిన వీళ్ళందరూ సర్జరీకని మా ఆస్పత్రికి వచ్చి ఎప్పుడో అప్పుడు మా ఆసుపత్రి బల్ల ఎక్కినవాళ్ళే, సాధారణంగా నేను చేసేది మేజర్ ఆపరేషన్లే, ఇచ్చేది జనరల్ ఎనస్తీషియానే. అంటే నా వైద్యం మీద పూర్తి నమ్మకంతో అపస్మారక స్థితిలో ఆడా మగా పెద్దా చిన్నా అని లేకుండా తమ నగ్న శరీరాన్ని అప్పచెప్పిన వారే. అలా నా చికిత్స పొంది క్షేమంగా వెళ్ళిన

ప్రతి ఒకరి పేరూ, ఎడ్రసూ నేను నోట్ చేసుకుంటాను. సెలబ్రేట్ చేసుకునే ఏ అకేషన్‌కయినా వాళ్ళను ఆహ్వానిస్తాను. వాళ్ళిచ్చిన ఫీజుతోనే సంబంధం తెగిపోయిందంటారా? నన్ను పూర్తిగా నమ్మి నా మీద ఎంతో విశ్వాసంతో ఇంత బాధ్యత పెట్టిన వీరందరికీ ఏమిచ్చి తిరిగి తీర్చుకోగలను! ఇలాంటి ఆత్మీయుల్ని ఆహ్వానించేటప్పుడు కూడా తరతమ బేధాలు పాటించాలంటారా'

రెండేళ్ళ కిందటి ఆస్పత్రి బెడ్ మీంచి లేచినప్పుడు నాకేం తెలివొచ్చిందో గానీ అర్థం చేసుకునే అంతర్యమే ఉంటే దానికి మెలుకువ కలిగింది నిజంగా ఇప్పుడే ఈ జవాబుతో ఈ క్షణంలోనే ఎలాంటి భావజాలాల్లయినా పదిమందిలోకి తీసుకొచ్చేది మనుష్యులే. ఏ సిద్ధాంతమైనా రాద్ధాంత స్థాయికి చేర్చక చేసి చూపిస్తేనే మానవతలోని మర్మం బయటపడేది.

ఇకముందు ఈ ఇద్దరాడవాళ్ళ మాటా లెక్కచెయ్యదలచుకోలేదు. సూరిబాబుకి ఓ నెలకి సరిపడే డబ్బులు ఏర్పాటు చేసి, నెల దాటకుండానే వాడికో నిలబడే పాత్ర దొరికేలా ప్రొడ్యూసర్‌తో మాట్లాడతాను.

❀❀❀

# ములుపు

**మాధవ్ మౌర్య**

**అది హైదరాబాద్ నగరం.** సమయం పదిగంటలు కావస్తోంది. విజయకుమార్ ఒక పెద్ద షాపింగ్ మాల్ ఎదురుగా తన కారును పార్క్ చేసాడు. ఆ రోజు ఆదివారం కావడంతో ఆ ప్రాంతంలో రద్దీ ఎక్కువగా ఉన్నది. అప్పటికే అతని భార్య సుమ మూడేళ్ళ కూతురు ప్రీతిని ఎత్తుకుని, జీబ్రా క్రాస్ వద్ద అతని కోసం ఎదురు చూస్తోంది. విజయకుమార్ కూడా వచ్చి ఆమె ప్రక్కన నిల్చున్నాడు.

గ్రీన్ సిగ్నల్ పడింది. విజయ్, సుమ, అక్కడున్న మిగతా వారంతా వేగంగా నడవసాగారు. విజయ్ చేతికి పెట్టుకున్న వాచ్ స్ట్రూలూజ్ అయి హఠాత్తుగా క్రింద పడిపోయింది. ఇది విజయ్ గమనించలేదు. ఇద్దరూ రోడ్‌ను దాటేశారు. తన చేతికి వాచ్ లేదన్న సంగతిని విజయ్ అప్పుడు గమనించాడు. వాచ్ కోసం రోడ్ మీద చూశాడు. ఆ వాచ్ రోడ్‌కు అటువైపున పడివున్నది. ఆ వాచ్ అంటే అతనికి ప్రాణం. పద్దెనిమిదేళ్ళ నుండి ఆ వాచ్ తన జీవితంలో అంతర్భాగమయి పోయింది, ఆ వాచ్ కోసం పిచ్చి పట్టినట్లు పరిగెత్తాడు.

అప్పటికే వాహనాలు వెళ్ళటానికి గ్రీన్ సిగ్నల్ పడినది. భర్త పరుగెత్తటాన్ని చూసిన సుమ "విజయ్, ఎక్కడికి వెళుతున్నావ్, ఏమి చేస్తున్నావు. ఆగు, ఆగు" భయంతో వణికిపోతూ పెద్దగా అరచింది.

విజయ్ ఆ వాచ్‌ని చేతిలోకి తీసుకున్నాడు. అప్పటికే వాహనాలు బాగా దగ్గరకు వచ్చేశాయి. విజయ్ వెంటనే వాటినుంచీ తప్పించుకోడానికి వేగంగా పరిగెత్తాడు. అప్పటికే ఒక కారు అతని మీదకు వేగంగా దూసుకు వచ్చింది. ఆ కారు డ్రైవరు సకాలంలో సడన్ బ్రేక్ వేసినా, కారు మెల్లగా అతన్ని గుద్దింది. విజయ్ ఎగిరిపడ్డాడు. ఇదంతా గమనిస్తున్న సుమ "విజయ్, విజయ్" అని అరుస్తూ స్పృహ కోల్పోయింది. అప్పటికే వాహనాలన్నీ ఆగిపోయాయి. కొంత మంది విజయ్‌ను లేపి ఫుట్‌పాత్ మీద కూర్చోపెట్టారు. విజయ్ తన ఎడమ కాలును కదిల్చాడు. అది కలుక్కుమంది. అతనికి వెంటనే అర్థమైంది అది విరిగిందని.

❀❀❀❀

విజయకుమార్ హాస్పటల్లోని రూములో పడుకుని ఉన్నాడు. సుమ మందులు తేవటానికి క్రిందకు వెళ్ళింది. విజయ్ ఎడమకాలు ఫ్రాక్చర్ అయ్యింది. ఒక అరగంట ముందే సుమ, ప్రీతిని ఇంటి వద్ద దింపి వచ్చింది. అక్కడ పొరుగున ఉన్న ఆవిడను తోడుగా ఉంచి వచ్చింది.

విజయ్‌కుమార్ తన ఇంజినీరింగ్ పూర్తి చేసిన తరువాత, భారత దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన మేనేజ్‌మెంట్ ఇన్స్టిట్యూట్‌లో ఎమ్.బి.ఏ చేసి ప్రస్తుతం ఒక బహుళజాతి కంపెనీలో చేరి పెద్ద పొజిషన్‌లో ఉన్నాడు.

సుమ మందులు తీసుకుని వచ్చింది. నర్స్ ఎప్పుడెప్పుడు ఏ మందులు వేయాలో చెప్పి వెళ్ళిపోయింది. ఇప్పుడు ఆ గదిలో ఇద్దరే ఉన్నారు.

"నిన్ను ఈ హాస్పటల్లో కాదు, మెంటల్ హాస్పటల్లో చేర్పించాల్సింది." సుమ కోపంగా అరిచింది.

"అయామ్ సారీ సుమా" విజయ్ మనస్ఫూర్తిగా చెప్పాడు.

"ఏంటి సారీ, అసలు నీకేమైనా జరిగుంటే" ఆమెకు నోట మాటరాలేదు. అక్కడ ఉన్న కుర్చీలో కూర్చుని ఏడవసాగింది.

"ఏయ్ సుమా, ఎందుకు ఏడుస్తావు, ఇలారా, ఇక్కడ కూర్చో" విజయ్ ఆప్యాయంగా పిలిచాడు.

సుమ వెళ్ళి అతని ప్రక్కన మంచం మీద కూర్చుంది.

"సుమ, ఈ వాచ్ నా జీవితాన్నే మలుపు తిప్పింది. నేను మొట్టమొదటిసారి జీవితంలో సాధించిన విజయంతోపాటు, ప్రతి విజయంలోనూ ఇది నాకు తోడుగా ఉన్నది. ఎందుకనో ఈ వాచ్ పెట్టుకోగానే నామీద నాకు ఎక్కడలేని నమ్మకం, ధైర్యం వస్తాయి. అది నువ్వు మూర్ఖత్వం అనుకో, బలహీనత అనుకో లేదా సెంటిమెంటనుకో" అతను చెప్పడం పూర్తి చేసి సుమ వైపు చూశాడు. ఆమె అప్పటికే అతను చెప్పేది ఎంతో సీరియస్‌గా వింటున్నది.

"సుమా మన పెళ్ళి జరిగి ఆరు ఏళ్ళు అయినా కూడా ఒక విషయం నీకు చెప్పలేదు, ఎందుకో తెలుసా" విజయ్ రియాక్షన్ కోసం ఆమె వైపు చూశాడు.

ఆమె తెలియదన్నట్లు తల అడ్డంగా ఊపింది.

"నీకు నేనంటే ఎంతో గౌరవం కదూ, నీకే కాదు ఆఫీసులోని కొలీగ్స్ అంతా నేనెంతో దయ కలిగిన వాడినని, నీతిమంతుడినని అనుకుంటారు కదా" విజయ్ కళ్ళలో సన్నటి నీటి పొర.

"అవును, ఇది నిజం కదా, మీరు చాలా మంచివారు" సుమ ఆప్యాయంగా అతని నుదుటి మీద ముద్దు పెట్టింది.

"నేనిలా మంచివాడిగా మారింది ఈ వాచ్ వల్లనే, నాకీ వాచ్ ఎలా వచ్చిందో తెలుసా" విజయ్ చెప్పడం ఆపి ఆమె వైపు చూశాడు.

"నేనీ వాచ్‌ని దొంగలించాను" విజయ్ చెప్పడం పూర్తి చేశాడు.

"దొంగిలించారా" సుమ మొహంలో విపరీతమైన ఆశ్చర్యం.

"సుమారు 18 ఏళ్ళ క్రితం నా జీవితంలోని సంఘటనను నీకు చెప్పాలి. అప్పుడే ఈ వాచ్ అంటే నాకు ఎందుకంత ఇష్టమో తెలుస్తుంది." విజయ్ చెప్పడం ఆపి క్షణకాలం పాటు ఆమెవైపు చూశాడు. ఆమె ఆసక్తిగా వింటోంది.

18 ఏళ్ళ క్రితం, నెల్లూరు పట్టణంలో

"అమ్మా! నాకు ఈ కార్టూన్ బొమ్మలుండే వాచ్ వద్దంతే, ఓ యాభై రూపాయల వాచ్ తెచ్చి నా మొహాన పడేస్తే నేను పెట్టుకోను" విజయ్ కోపంగా అరుస్తూ ఆ వాచ్‌ని విసిరి కొట్టాడు. ఆ వాచ్ ఇంటిలోనికి వస్తున్న విజయ్ నాన్న గోపాలయ్య మీద పడింది. "ఏందిరా నీ యవ్వారం నాకేమీ అర్థంగావట్లేదు. నువ్వు చదివేదేమో పదోక్లాసు, నీకింతకంటే మంచి వాచ్ ఎందుకురా. నీకెంత ఖర్చవుతుందో తెలుసునా నీకు" గోపాలయ్య విజయ్ వైపు తీక్షణంగా చూస్తూ అరిచాడు.

"నాకదంతా తెలియదు. తొమ్మిదోక్లాసు ఆన్యువల్ పరీక్షల్లో ఫస్టు వస్తే మంచి వాచ్ కొనిస్తానని అమ్మ చెప్పింది" విజయ్ అమ్మవైపు చూస్తూ చెప్పాడు.

"సర్లేరా ఇప్పుడేమయ్యిందని! వాచ్ తెచ్చినాను కదా" గోపాలయ్య బుజ్జగింపుగా చెప్పాడు.

"నాకా వాచ్ వద్దంతే, అవన్నీ చిన్న పిల్లలు పెట్టుకునేవి, నాకు టైటాన్ వాచ్ కావాలి, ఓ వెయ్యిరూపాయలవ్వుద్ది " విజయ్ నెమ్మదిగా చెప్పాడు.

"వెయ్యిరూపాయలా, అంత డబ్బు మన దగ్గర ఇప్పుడు లేదురా, నాయనా" విజయ్ అమ్మ రామమ్మ అతని తలపై చెయ్యి వేసి అనునయంగా చెప్పింది.

"అయినా నాకీ వాచ్ వద్దంతే" విజయ్ తల విదిలించాడు

"వద్దనుకుంటే ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు. మీ నాయన కోటీశ్వరుడు గాదు, ఒక మామూలు ఆటో డ్రైవర్, నీవు కోరే గొంతెమ్మ కోర్కెలన్నింటినీ తీర్చే డబ్బు నా దగ్గర లేదు. ఇది అర్థం చేసుకుంటే బాగుపడతావు. నేనొస్తానే, నాకు నైట్ షిఫ్ట్‌కు టైమయ్యింది" విజయ్ మొహం వైపు చూడకుండానే గోపాలయ్య బయటకు వెళ్ళిపోయాడు.

అప్పుడు సమయం రాత్రి పదకొండు గంటలు దాటింది. గోపాలయ్య అప్పుడే కొందరిని దింపి మళ్ళీ రైల్వే స్టేషన్ వద్దకు బండి తెచ్చి ఆపాడు.

"ఏమయ్యా, ఆటో వస్తుందా" ఒక వ్యక్తి చాలా నెమ్మదిగా అడిగాడు.

"ఆ వస్తుంది సార్, ఎక్కడికి పోవాలి" గోపాలయ్య తన మొహాన్ని ఆటోలోంచి బయటకు పెడుతూ అడిగాడు.

"దర్గామిట్టకు పోవాలి" ఆ వ్యక్తి వెంటనే చెప్పాడు.

"ముప్పై రూపాయలవ్వుద్ది సార్" ఆయనేమంటాడోనని ఆయన మొహంలోకి చూశాడు గోపాలయ్య.

"సరే పద" ఆటోలో కూర్చుంటూ చెప్పాడా వ్యక్తి.

వెంటనే, గోపాలయ్య ఇంకో బేరం దొరికిందన్న ఆనందంలో ఆటోను స్వరున ముందుకు దూకించాడు.

ఆ కూర్చున్న వ్యక్తికి ఓ యాభై ఏళ్ళదాకా ఉంటాయేమో, సగం వరకు బట్టతల వచ్చింది. వెంట్రుకలు కూడా సగం నల్లగానూ, సగం తెల్లగానూ ఉన్నాయి. అతని మొహం ఎంతో నిర్మలంగానూ, ప్రశాంతంగానూ ఉన్నది.

ఇలా రెండు నిముషాలు ఆటోను నడిపాడో లేదో ఒక మినీ లారీ వేగంగా వచ్చి ఆటోను గుద్దింది. గోపాలయ్య జరగబోయే ప్రమాదాన్ని గ్రహించి వెంటనే ఆటోను ప్రక్కకు త్రిప్పాడు. అయినా అప్పటికే జరగాల్సిన అనర్థం జరిగిపోయింది. వెంటనే దభాలున శబ్దం చేస్తూ ఆటో ఎడమ ప్రక్కకు పడిపోయింది. ఆటో ముందర ఉన్న అద్దం పగిలిపోతూ టక్ టక్ మంటూ శబ్దం చేసింది. లారీవాడు వాహనాన్ని ఆపి, ఆటోలో ఉన్నవారికి ఏమీ కాలేదని నిర్ధారించుకున్నాక వెంటనే లారీని ముందుకు దూకించాడు.

గోపాలయ్య ముందుగా ఆటోలోంచి కష్టం మీద బయటకు వచ్చాడు. వెంటనే అటుగా పోతున్న ఆటోవాడు తన ఆటో ఆపి, పడిపోయిన ఆటో వద్దకు వచ్చాడు. నిముషంలో అక్కడ దాదాపు పదిమంది దాకా పోగయ్యారు.

ఓ ఇద్దరు వ్యక్తులు ఆటో లోపలికి వంగి చూసి లోపలున్న వ్యక్తిని బయటకు లాగారు. ఇంతలో గోపాలయ్య ఫ్రెండు పోలయ్య ఇంకో ఆటోలో వచ్చాడు.

"ఏందిరా ఏమయ్యింది, ఎప్పుడు జరిగింది" అంటూ పోలయ్య ప్రశ్నల వర్షం కురిపించాడు.

"ఇప్పుడేరా, ఓ మినీ లారీ గుద్దింది" గోపాలయ్య దిగాలుగా చెప్పాడు. వెంటనే పోలయ్య ఆ వ్యక్తిని దగ్గర్లో ఉన్న టీ షాపు వద్దకు తీసుకుని వెళ్ళాడు.

"సార్ , మీ పేరేంది సార్" పోలయ్య వినయంగా అడిగాడు.

"కృష్ణారావు" అంత నొప్పిలోనూ అతని మొహంలో ప్రశాంతత.

అప్పుడే గోపాలయ్య కూడా షాపు వద్దకు వచ్చాడు.

గోపాలయ్య మెడ దగ్గర కొంచెం రాసుకుంది. కానీ కృష్ణారావు మాత్రం ఎడమవైపున పడేటప్పుడు, ఎడమ చేయి చాచడంతో చేతి మణికట్టు దగ్గర చర్మం బాగా చీరుకుపోయి రక్తం ధారగా కారసాగింది.

"రేయ్ గోపాల్! ఆ వాచ్‌ని తీయరా, రక్తమంతా అంటుకుంటూ ఉన్నది" పోలయ్య గబగబా చెప్పాడు.

గోపాలయ్య వెంటనే కృష్ణారావు చేతికున్న వాచ్‌ని తీసేసాడు.

గోపాలయ్య వాచ్‌ని దగ్గర్లో ఉన్న కుళాయి దగ్గరకు తీసుకెళ్ళి, కర్చీఫ్‌ని తడిపి, దాని మీదున్న మరకల్ని తుడిచేసి వెనక్కి తిరిగాడు.

ఇంతలో ఎవరో గోపాలయ్యను అతని ఆటో వద్దకు పిలిచారు. అప్పటికే పడిఉన్న ఆటోను అందరూ కలిసి లేపారు. గోపాలయ్య ఆటోను తేరిపార చూశాడు. ఆటో అద్దం పూర్తిగా ధ్వంసమైంది. ఆటో పైనున్న పట్టా కొద్దిగా చిరిగింది. ఆటో ముందర కొద్దిగా నొక్కు పడింది. 'పెద్దగా ఏమీ నష్టం జరగలేదులే!' గోపాలయ్య మనస్సులోనే అనుకున్నాడు.

"గోపాలయ్యా కొంచెం లోపలికెళ్ళి పట్టాను సరిచేయి" ఎవరో అరిచారు. వెంటనే ఆటో వెనక సీటు వద్దకువచ్చి క్రింది పట్టాను సరిచేయసాగాడు." ఒక చేత్తో సరిచేస్తే సరిగ్గా రాలేదు. దాంతో తన చేతిలోని వాచ్‌ని వెనక సీట్ మీద పెట్టి రెండు చేతుల్తో సరిచేశాడు.

ఇంతలో పోలయ్య "రేయ్ గోపాలయ్యా, రారా, ఎక్కడున్నావు" చుట్టూ చూస్తూ పిలిచాడు.

'ఆ, వస్తున్నా" గోపాలయ్య ఆటోలోంచి అరిచాడు.

"రేయ్ గోపాలం, రక్తం ఎక్కువగా కారుతావున్నది. ఆసుపత్రికి తీసుకుపోవాల, రారా తొందరగా" పోలయ్య గట్టిగా అరిచాడు.

వెంటనే గోపాలయ్య, వాచి సీటు మీద పెట్టిన విషయం మరచి, పోలయ్య దగ్గరకు పరిగెట్టాడు.

అక్కడున్న వ్యక్తులు, ఇంకా కొన్ని అద్దం పెంకులు ఆటోకు అతుక్కుని ఉంటే, అవి క్రింద పడతాయని వారు ఆటోను గట్టిగా కుదిలించారు. ఆ కుదుపులకి వెనకనున్న సీటు బాగా ముందుకు జరిగింది. దాని మీదున్న వాచ్ కాస్త సీటు క్రింద భాగంలో ఉన్న స్థలంలో పడిపోయింది.

ఇంతలో పోలయ్య తన ఆటోను స్టార్ట్ చేశాడు. ఆటో వెనకాల గోపాలయ్య, కృష్ణారావు కూర్చున్నారు. పోలయ్య చాలా వేగంగా ఆటోను నడుపుతున్నాడు. "సార్, నన్ను క్షమించాలండి, ఇదంతా అనుకోకుండా జరిగింది" గోపాలయ్య తల దించుకుని బాధగా చెప్పాడు.

"సర్లేవయ్యా, నీవు కావాలని ఏక్సిడెంటు చేశావా ఏమిటి, నీ తప్పేమీ లేదులే, పెద్దగా ఏమీ దెబ్బలు తగల్లేదుకదా" కృష్ణారావు తన బాధను ఓర్చుకుంటూ, మెల్లగా నవ్వుతూ చెప్పాడు.

ఐదు నిమిషాల తర్వాత ముగ్గురూ హాస్పటల్‌లో ఉన్నారు. కృష్ణారావు చేయి కేవలం బెణికిందని చెప్పి కట్టు కట్టి మందులు రాసిచ్చాడు డాక్టర్. ఆ డాక్టర్‌కు, మందులకు నూట యాభై రూపాయలైనాయి. అంతా గోపాలయ్య కట్టాడు.

అక్కడ నుంచీ కృష్ణారావుని అతనింటికి తీసుకుని వెళ్ళారు. అప్పటికే అతని భార్య అన్నపూర్ణ అతని కోసం ఎదురుచూస్తూ ఉన్నది. ఆమె గేటు తీసి లోపలికి వస్తున్న ముగ్గురిని చూసింది. వెంటనే కృష్ణారావును గుర్తించి దగ్గరకు పరుగెత్తుకు వచ్చింది. 'అయ్యో, ఏమైందండి, ఏమైంది, షర్టు మీదంతా రక్తం ఉన్నది. ఏక్సిడెంటా ఏమిటి?" ఆమె కంగారుగా కృష్ణారావుని పట్టుకుని కుదిపింది.

"అబ్బా ఏమీ కాలేదులేవే, చిన్న ఏక్సిడెంట్ జరిగింది. మేము హాస్పటల్‌కు వెళ్ళి కట్టుకట్టుకుని వస్తున్నాం. నువ్వు ముందర లోపలికి వెళ్ళి కొంచెం మంచినీళ్ళు తీసుకురా" కృష్ణారావు నవ్వుతూ అన్నపూర్ణను పురమాయించాడు.

అన్నపూర్ణ మంచినీళ్ళు తెచ్చిచ్చింది. కృష్ణారావు తన జేబులోంచి నూట యాభైరూపాయలు తీసిచ్చాడు.

"ఇప్పుడివన్నీ ఎందుకులెండి సార్" గోపాలయ్య మొహమాటపడ్డాడు.

"ఫర్వాలేదయ్యా, నాకయిన ఖర్చునే కదా నేనిస్తున్నాను, తీసుకోండి" కృష్ణారావు నవ్వుతూ అన్నాడు.

గోపాలయ్య మారుమాటాడకుండా కృష్ణారావు ఇచ్చిన డబ్బును తీసుకున్నాడు.

"మీరెక్కడయ్యా ఉండేది" కృష్ణారావు అడిగాడు.

"ఆటోనగర్‌లో సార్, గోపాలయ్య అంటే ఎవరైనాచెబుతారు" గోపాలయ్య వినయంగా చెప్పాడు.

"నేను మాటవరసకు అడిగాలే, నీ పేరేంది" కృష్ణారావు పోలయ్య వైపు చూస్తూ అడిగాడు.

"పోలయ్య సార్" పోలయ్య నవ్వుతూ చెప్పాడు.

"ఇక ఉంటాం సార్" గోపాలయ్య చెప్పి బయలుదేరాడు.

"సరేనయ్యా, మంచిది. బయలుదేరండి" కృష్ణారావు కూడా నవ్వుతూ చెప్పాడు. ఇద్దరూ బయలుదేరి వెళ్ళిపోయారు.

"చేయి బాగా వాసిందండి" అన్నపూర్ణ భర్త వైపు దిగాలుగా చూస్తూ చెప్పింది.

"సర్లేవే, అంత రక్తం కారితే, ఈ మాత్రం చేయి వాయిదా ఏమి. ఇప్పుడేమయ్యిందని, స్కూల్ కెళ్ళే పనికూడా లేదు, విజయదశమి సెలవలు కదా, రెస్ట్ తీసుకుంటే అదే తగ్గిపోతుంది."

"సర్లెండి, పాలు తెచ్చిస్తానుండండి" అన్నపూర్ణ వంటింట్లోకి వెళ్ళింది.

"అన్నపూర్ణా నా వాచ్ ఏమైంది" కృష్ణారావు కంగారుగా వంటింట్లోకి వెళ్ళాడు.

"నాకేం తెలుసునండి" ఆమె కృష్ణారావు వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

"ఆ, నాకు రక్తం కారుతూంటే ఆ ఆటో డ్రైవర్ వాచ్ తీసి కడగటానికి తీసుకువెళ్ళాడు" కృష్ణారావు దిగాలుగా చెప్పాడు.

"ఇంకేముంది, వాచ్ మీద ఆశలు వదిలేసుకోండి, వాడు తన జేబులో వేసుకుని ఉంటాడు" ఆమె దెప్పి పొడుస్తూ చెప్పింది.

"సరేలే అతని పేరు గోపాలయ్య అనికదా చెప్పాడు. రేపొద్దున ఆటోనగర్‌కు వెళ్ళి అడుగుదాం" కృష్ణారావు ఆశగా అన్నాడు.

"ఆ వాచ్ ఇంక వెనక్కి వచ్చే ప్రశ్నే లేదు" అన్నపూర్ణ నవ్వుతూ అంది.

"అదీ చూద్దాం" కృష్ణారావు నవ్వుతూ బెడ్‌రూంలోకి వెళ్ళి పడుకున్నాడు.

కృష్ణారావు గవర్నమెంట్ స్కూల్లో టీచర్, ఆ దంపతులకు ఒక్కగానొక్క కూతురు. ఆ కూతురుకి పెళ్ళి చేసి పంపించేశారు. ఆమె ప్రస్తుతం బెంగుళూరులో ఉంటుంది.

గోపాలయ్య, పోలయ్య దాదాపు ఒంటిగంటకు తమ ఆటోలను తీసుకుని ఇళ్ళకు చేరారు.

గోపాలయ్య ఇంటి తలుపు తట్టగానే అతని భార్య తలుపు తీసి వారిద్దరినీ చూసి ఎంతో భయపడింది. వారిద్దరినీ రకరకాల ప్రశ్నలు వేయసాగింది. వారిద్దరూ ఆమెను సమదాయించారు.

"ఇప్పుడేమీ కాలేదు లేమ్మా, దెబ్బ దూసిపోయింది" పోలయ్య అనునయంగా చెప్పాడు.

"ఏంది పోలన్న, గొంతు దగ్గర బాగా చీరుకు పోయుంటే" ఆమె తన ఏడుపు ఇంకాస్త పెంచింది.

"ఇదిగో ఏమీ కాలేదు, నువ్వు అనవసరంగా గాబరాపడకు, పిల్లలు నిద్ర లేస్తారు" అని గోపాలయ్య ఆమెను సముదాయించాడు.

ఆమె తన ఏడుపును నెమ్మదిగా ఆపింది. "ఏరా, నువ్వు పడుకో, రేపొద్దున పదింటికి వస్తాను, ఇద్దరమూ కలిసి రిపేరు చేయించడానికి వెళదాము" పోలయ్య వెనుదిరుగుతూ చెప్పాడు. గోపాలయ్య సరేనని తలాడించి మంచం మీద కూలబడ్డాడు.

సమయం ఉదయం ఏడు గంటలు కావస్తోంది. విజయ్ తన కాలకృత్యాలన్నీ పూర్తి చేసుకుని ఫ్రెండు ఇంటికి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు.

"అమ్మా నా మెటీరియల్ ఇక్కడే పెట్టాను, ఎవరు తీసారు?" విజయ్ అసహనంగా అరిచాడు.

"నాకేమి తెలుసురా." ఆమె చిరాకుగా సమాధానమిచ్చింది.

విజయ్ ఇల్లంతా మెటీరియల్ కోసం వెదకసాగాడు. వెంటనే విజయ్‌కు మెటీరియల్ ఎక్కడ పెట్టాడో గుర్తుకు వచ్చింది నిన్న సాయంత్రం తను ఆటోలో కొంతసేపు కూర్చుని చదివాడు. ఇంతలో స్నేహితులు క్రికెట్ ఆడడానికి పిలవడంతో తానా మెటీరియల్ ఆటోలో వెనక సీటుని లేపి, దాని లోపలున్న స్థలంలో పెట్టి ఆడటానికి వెళ్ళిపోయాడు. ఆ విషయం జ్ఞప్తికిరాగానే విజయ్ ఆటో దగ్గరకు పరిగెత్తాడు. ఆటోలోని వెనుక సీటు లేపి, అక్కడున్న మెటీరియల్‌ను తీసుకుని, మరలా సీటుని యధాస్థానంలో ఉంచాడు.

అప్పుడు గమనించాడు ఆటోకి ముందర అద్దం పగిలిన విషయం. వెంటనే పైకి చూశాడు, పైన పట్టా అక్కడక్కడా చిరిగి ఉంది. వెంటనే అమ్మ దగ్గరకు పరుగెత్తుకుని వెళ్ళాడు.

"అమ్మా! నిన్న ఆటోకు యాక్సిడెంటు జరిగిందా?" సూటిగా ఆమెనే చూస్తూ ప్రశ్నించాడు విజయ్.

"అవునురా! చిన్న యాక్సిడెంట్ జరిగింది, పెద్దగా ఏమీ దెబ్బలు తగల్లేదులే," ఆమె వాడి భుజం మీద చేయి వేస్తూ చెప్పింది.

విజయ్ వెంటనే నాన్న దగ్గరకు పరిగెత్తుకెళ్ళాడు. గోపాలయ్య ఇంకా నిద్రపోతున్నాడు. విజయ్ నాన్నని అంతా పరిశీలించాడు. గొంతు దగ్గర కొంత చీరుకు పోయింది, పెద్ద దెబ్బలేమీ కనిపించలేదు. విజయ్ మనస్సు స్థిమితపడింది. విజయ్ వెంటనే "నేను ఫ్రెండ్ ఇంటికి వెళుతున్నాను" "అలాగే నాయనా," అని లోపల్నుంచీ సమాధానం వచ్చింది.

విజయ్ బయటకు వచ్చాడు. ఎందుకనో మరలా ఆటో దగ్గరకు వెళ్ళాడు. ఆటో అంతా పరిశీలించసాగాడు. ఇందాక మెటీరియల్ తీస్తున్నప్పుడు ఏదో వస్తువు అతడిని ఆకర్షించింది. కానీ అప్పుడు పెద్దగా గమనించలేదు. ఇప్పుడు మళ్ళీ ఆటో సీటు పైకి లేపి, లోపల పరిశీలించాడు. అతనికి ఒక అందమైన "వాచ్" కనిపించింది.

"ఏమిటి ఇది 'వాచ్'లాగా ఉందే?" మనస్సులో అనుకుంటూ చేతిలోకి తీసుకున్నాడు. "అబ్బా, ఎంత బాగుంది!" అప్రయత్నంగానే అతని నోటినుంచీ ఆ మాట వచ్చింది.

బంగారు రంగులో ఉందా వాచ్, దానికి బ్లాక్ డయల్ ఎంతో చూడముచ్చటగా ఉంది. వెంటనే అతను వాచ్‌ని చేతిలో పట్టుకుని ఆటో వెనుక సీట్లో కూర్చుని ఆలోచించసాగాడు. "ఇప్పుడేం చేద్దాం, ఇది నిన్న ఆటో ఎక్కిన అతడిదయ్యుంటుంది. యాక్సిడెంట్ జరిగినప్పుడు పొరపాటున పడిపోయి ఉంటుంది. అతను ఎలాగూ తిరిగిరాడు కదా. ఇది ఇక్కడే ఉంటే నాన్నగానీ, వేరెవరో తీసుకుంటారు. నేనే తీసుకుంటే ఏమవుతుంది?" ఇలా ఆలోచిస్తూ ఆ వాచ్‌ని తన చేతికి పెట్టుకున్నాడు.

ఆ రోజు నుంచీ విజయ్ ఆ వాచ్‌ని రహస్యంగా ఇంటి వీధి మలుపు దాటాకే పెట్టుకునేవాడు. ఆవాచ్ పెట్టుకుంటే వాడికెందుకనో చెప్పలేని ఆనందం కలిగేది. తాను అధికుడననే భావం కలిగేది.

"ఒరేయ్ గోపాలం, గోపాలం" బయటినుంచీ పోలయ్య గట్టిగా కేకవేశాడు. ఆ కేకకు గోపాలయ్య ఉలిక్కిపడి లేచాడు. లేచిన వెంటనే బయటికి వెళ్ళాడు. బయట కృష్ణారావు నిలబడి ఉన్నాడు. అతనెందుకు వచ్చాడో గోపాలయ్యకు అర్థంకాలేదు. ఇంతలో రామమ్మ కూడా బయటికి వచ్చింది.

"నీవు నిన్న నా చేతి నుంచీ వాచీని తీశావు కదా? ఎక్కడ పెట్టావో గుర్తుందా?" కృష్ణారావు ఒక్కొక్క మాట వత్తి పలికాడు.

"అవునయ్యా, ఆ సంగతే మర్చిపోయాను," అంటూనే గోపాలయ్య ఆటో వద్దకు పరుగెత్తాడు. ఆటోలో అంతా వెదకసాగాడు. "ఒరేయ్ పోలయ్య, నిన్న వాచ్‌ని ఈ సీటు మీదే పెట్టాను రా, ఏమయ్యుంటుంది" ఎంతో గాబరాపడుతూ అన్నాడు.

"సీటు మీద పెట్టుంటే ఎక్కడికి పోయుంటుంది వెతకరా" పోలయ్య సర్దిచెబుతానే, అతను కూడా ఆటోలో వెతకటం ప్రారంభించాడు.

ఆ వాచ్ ఆటోలో కనిపించలేదు. వెంటనే గోపాలయ్య ఇంటిలోనికి వెళ్ళి ఇల్లంతా వెదికాడు. తాను ఇంటిలోనికి ఆ వాచ్ తేలేదని అతనికి బాగా గుర్తుంది, అయినా ఏదో ఆశ.

కొంతసేపటికి గోపాలయ్య బయటికి వచ్చాడు. "ఏయ్, నీవేమన్నా వాచ్‌ని చూశావా," అతను తన భార్యను సూటిగా ప్రశ్నించాడు "నాకేం తెలుసయ్యా?" అని నిష్టూరంగా సమాధానమిచ్చింది.

"సరేలేండి, పర్వాలేదులే మనమందరం హాస్పటల్‌కు వెళ్ళినప్పుడు ఎవరో తీసుకుని ఉంటారు" కృష్ణారావు సర్దిచెప్పి వెనుదిరిగాడు. "సార్ క్షమించాలి. మేము ఏమీ కావాలని చేయలేదు. ఏదో అనుకోకుండా ఇలా జరిగింది" గోపాలయ్య భయంతో చేతులు కట్టుకుని ప్రాధేయపడ్డాడు.

"ఫర్లేదులేవయ్యా! నీవేమి కావాలని ఇదంతా చేయలేదు కదా వస్తాను" కృష్ణారావు చిరునవ్వుతో చెప్పి వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

"ఏరా శెలవల్లో అందరూ బాగా ఎంజాయ్ చేశారా? లేక బాగా చదివారా?" కృష్ణారావు పిల్లలను నవ్వుతూ ప్రశ్నించాడు.

"రెండూ చేశాం సార్", అని అందరూ అరిచారు.

"సరే, పరీక్ష పేపర్లు ఇస్తున్నాను, తీసుకోండి", అంటూ పేపర్ల కట్టను విప్పాడు. అందరికీ పేపర్లు ఇవ్వసాగాడు. విజయ్ వంతు వచ్చింది.

"చాలా బాగా రాశావురా, ఈసారి కూడా నూటికి నూరు మార్కులు వచ్చాయి. ఇదే విధంగా పబ్లిక్ పరీక్షల్లో కూడా వస్తే నీకు ఒక మంచి బహుమతినిస్తాను" కృష్ణారావు నవ్వుతూ పేపర్‌ను విజయ్ చేతికిచ్చాడు. విజయ్ ఆ పేపర్‌ని వినయంగా తీసుకున్నాడు.

కృష్ణారావు లెక్కలను విజయ్‌కు ఎనిమిదవ తరగతి నుంచీ బోధిస్తున్నాడు. అతని శిక్షణలోనే విజయ్ లెక్కల్లో అమోఘమైన ప్రగతిని సాధించాడు. ప్రతి పరీక్షలోనూ, అతనికి నూరుశాతం మార్కులు వచ్చేవి. దీంతో కృష్ణారావుకు విజయ్ అంటే అమితమైన అభిమానం ఏర్పడింది. ఇక విజయ్‌కి కృష్ణారావు అంటే ఎనలేని భక్తి. గౌరవం.

విజయ్ పదవ తరగతికి వచ్చేసరికి వారి మధ్య అనుబంధం మరింత బలపడింది.

"సార్, ఈ డౌట్‌ని చెబుతారా", విజయ్ కృష్ణారావు దగ్గరకు కొచ్చాడు.

కృష్ణారావు చూపు అప్రయత్నంగానే విజయ్ చేతికున్న వాచ్ మీద పడింది. కృష్ణారావు ఒక్కసారిగా అవాక్కయ్యాడు. నోటమాట రాలేదు.

"సార్, సార్" విజయ్ పిలుపుతో కృష్ణారావు ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు.

"విజయ్, మీనాన్న ఏమి చేస్తుంటాడ్రా," కృష్ణారావు విజయ్‌నే చూస్తూ ప్రశ్నించాడు. ఎప్పుడో ఒకసారి వాళ్ళ నాన్న ఆటో డ్రైవరని చెప్పినట్లు అతనికి గుర్తు.

"ఆటో నడుపుతుంటాడు సార్", విజయ్ చాలా ఇబ్బందిగా సమాధానమిచ్చాడు

"పేరేందిరా?"

"గోపాలయ్య సార్, ఎందుకు సార్".

"ఏమీ లేదులేరా, ఊరికినే అడిగాను," కృష్ణారావు విజయ్ తెచ్చిన బుక్‌ను తెరుస్తూ ప్రశ్నించాడు. కృష్ణారావు ఆ డౌట్‌ను చెప్పడంలో లీనమయ్యాడు.

అది మొదలు క్లాస్‌లో ప్రతీసారీ కృష్ణారావు కళ్ళు అప్రయత్నంగానే విజయ్ వాచ్ మీదకు మళ్ళేవి.

"విజయ్ ఆ వాచ్ ఎందుకు తీసుకున్నాడు. దానికి సంబంధించిన వారెవరూ రారనుకున్నాడా? వాడు ఆ వాచ్‌ను తీసుకున్నట్లు అతని తల్లితండ్రులకు తెలుసునా, ఏది ఏమైనా విజయ్ చేసింది తప్పు కదా!" కృష్ణారావు మనస్సు పరిపరి విధాల ఆలోచించసాగింది

తన వాచ్ పోయిందన్న బాధ కన్నా, తన ప్రియాతిప్రియమైన శిష్యుడు అలా వేరేవాళ్ళ వాచ్ దొంగతనంగా పెట్టుకు తిరగడం కృష్ణారావు గుండెలను పిండేసింది.

అయితే వారం తిరిగేసరికల్లా తనకు తాను సర్దిచెప్పుకున్నాడు. తన శిష్యుడు చేసిన తప్పును ఏనాటికైనా సరిదిద్దుకుంటాడని సమాధానపడ్డాడు.

ఇదే విషయం భార్యకు కూడా చెప్పాడు. "అయ్యో రామా! వాడికి నాలుగు చీవాట్లు పెట్టి, ఆ వాచ్ వెనక్కి తీసుకోలేకపోయారా?" అన్నపూర్ణ నిష్టూరమాడింది.

"ఎప్పటికైనా విషయం తెలుసుకుని ఆ వాచ్ తిరిగి తెచ్చిస్తాడని నా నమ్మకం, పిల్లల్లో చపల చిత్తం సహజం. నిజాయితీ యొక్క గొప్పతనాన్ని వాడు నెమ్మదిగా తెలుసుకుంటాడు. ఇక మళ్ళీ భవిష్యత్తులో ఎప్పటికీ ఇలాంటి తప్పు చేయడని నా ప్రగాఢ విశ్వాసం."

"దిక్కుమాలిన నమ్మకం, వాడు మీ ప్రియతమ శిష్యుడు కాబట్టి మీరూరుకున్నారు. అదే వేరెవరైనా అయితే ఇలాగే చేసేవారా? సూటిగా నా కళ్ళలోకి చూసి చెప్పండి", అన్నపూర్ణ తన భర్తనే చూస్తూ ప్రశ్నించింది.

కృష్ణారావు కొంతసేపు ఏమీ సమాధానం ఇవ్వకుండా అలాగే ఉండిపోయాడూ.

"వాచ్ వేరే పిల్లవాడు ఎవరైనా తీసుకుని ఉన్నా, ఇలాగే చేసుండేవాడినని అనుకుంటున్నాను" అని కృష్ణారావు కూడా తన భార్య కళ్ళలోకి సూటిగా చూస్తూ సమాధానమిచ్చాడు.

కృష్ణారావు తర్వాత ఆ వాచ్ విషయాన్ని పూర్తిగా మరచిపోయాడు. కాలం శరవేగంగా పరిగెత్తసాగింది. పదవ తరగతి పరీక్షలు పూర్తి అయి, ఫలితాలు కూడా విడుదలయినాయి.

విజయ్ కృష్ణారావు వద్దకు పరుగెత్తుకు వచ్చాడు. "సార్ నాకు 95 శాతం మార్కులు వచ్చాయి. "

"మాథ్స్‌లో బాగా కష్టపడ్డావు దాని ఫలితమిది" కృష్ణారావు విజయ్ తల మీద చేయివేసి ఆశీర్వదిస్తూ చెప్పాడు.

"సార్, సార్", విజయ్ నెమ్మదిగా పిలిచాడు. "ఏంటి చెప్పరా?"

"మా అమ్మ మిమ్మల్నొకసారి భోజనానికి పిలవమంది. వస్తారా సార్", విజయ్ ఆశగా అడిగాడు.

"తప్పకుండా వస్తానురా, సరేనా", కృష్ణారావు వెంటనే అంగీకరించాడు. సార్ అంగీకరించడంతో విజయ్ మొహం మతాబులా వెలిగిపోయింది.

కృష్ణారావును ఆ మర్నాడు విజయ్ తనింటికి తీసుకు వెళ్ళాడు. కృష్ణారావును చూస్తూనే గోపాలయ్య ఆశ్చర్యపోయాడు. "మీరా సార్" అంటూ పలకరించాడు.

"నాన్నా, సార్ నీకు ముందే తెలుసా?" విజయ్ అనుమానంగా ప్రశ్నించాడు. " ఆ కొంచెం తెలుసులే" గోపాలయ్య నవ్వుతూనే కృష్ణారావును లోపలికి ఆహ్వానించాడు.

మాటల మధ్యలో గోపాలయ్య "సార్, నిజంగానే ఆ వాచ్ ఏమయిందో మాకెవ్వరికీ తెలియదు" చాలా బాధగా చెప్పాడు. "భలేవాడివయ్యా, నీకింకా ఈవిషయం గుర్తుందా, నేనెప్పుడో దాని గురించి మర్చిపోయాను", కృష్ణారావు పెద్దగా నవ్వుతూ చెప్పాడు.

అంతే, వారి మాటలు విన్న విజయ్ వేయి ఓల్టుల షాక్ తిన్నవాడిలా వణికిపోయాడు. ఒక్కసారిగా ప్రపంచమంతా శూన్యంగా మారిపోయింది.

వారు ఏం మాటలు మాట్లాడుతున్నారో, సార్ ఎప్పుడు భోజనం చేసి వెళ్ళిపోయాడో తనకేమీ తెలియలేదు. ఏమీ అర్థంకావడంలేదు. అప్పటికే అతని షర్ట్ చెమటతో పూర్తిగా తడిసిపోయింది.

కృష్ణారావు వెళ్ళిపోగానే, తాను మంచం మీద దిగాలుగా పడుకున్నాడు. తన గుండె కొట్టుకోవడం తనకే తెలుస్తోంది.

"నేనింతకాలం పెట్టుకున్నది సార్ వాచ్‌నా, నేనెంత పాపం చేశాను, ఎందుకిలా చేశాను, ఇప్పుడు సార్‌కు నా మొహం ఎలా చూపించేది" ఇవే మాటలు విజయ్ చెవుల్లో మారుమ్రోగసాగాయి. నెమ్మదిగా వాడి కళ్ళు మూతపడ్డాయి.

ఉదయం అయ్యేసరికి విజయ్ వళ్ళంతా వెచ్చబడింది. వాళ్ళమ్మ వచ్చి విజయ్ తల మీద చేయివేసింది.

"ఏందిరా వళ్ళంతా వెచ్చగా ఉంది" వాళ్ళమ్మ కంగారుగా వెళ్ళి తన భర్తకు చెప్పింది.

గోపాలయ్య వెంటనే తన ఇంటి దగ్గర ఉన్న డాక్టరుకి చూపించాడు. అతడు కొన్ని మందులు రాసిచ్చాడు.

ఆ మందులతో సాయంత్రం అయ్యేసరికి జ్వరం కొంచెం తగ్గింది. అప్పటికే విజయ్ ఒక నిర్ణయానికొచ్చాడు.

"ఆ వాచ్‌ని, ఎలాగైనా సరే తిరిగి సార్ ఇంట్లో పెట్టేసిరావాలి", విజయ్ తన మనస్సులో గట్టిగా అనుకున్నాడు.

సమయం రాత్రి పది గంటలు దాటింది. అప్పటికే విజయ్ ఇంట్లో వారందరూ నిద్రపోతున్నారు.

విజయ్ నెమ్మదిగా లేచి బయటకు వచ్చాడు. వాచ్‌ని అంతకు ముందే తన జేబులో వేసుకున్నాడు.

అరగంట తర్వాత కృష్ణారావు లోపల నోట్సు రాసుకుంటున్నాడు. విజయ్ బయట కిటికీ దగ్గర కొంత సేపు వెయిట్ చేశాడు.

ఆమె ఏదో పని ఉండి లోపలికెళ్ళింది. వెంటనే విజయ్ తన జేబులోని వాచ్‌ని బయటకు తీసి, హాల్లోని కుర్చీలోకి విసిరేశాడు. ఆమె తిరిగి రావటం గమనించి, ఉన్నపళాన వెనక్కి పరిగెత్తాడు.

ఆ వెనక్కి తిరిగి పరిగెత్తడంలో, పక్కన గోడకు ఆనించి ఉన్న రేకు విజయ్ ఎడమ చేతికి గట్టిగా రాసుకుంది. వెంటనే అది కింద పడింది. విజయ్ నోట్లోంచి అప్రయత్నంగానే "అమ్మా!" అని కేక వచ్చింది.

ఆ శబ్దం విన్న అన్నపూర్ణ "ఎవరది?" అని గట్టిగా అరిచింది.

వెంటనే తేరుకున్న విజయ్, గోడెక్కి, దూకి, గబగబా పరుగెత్తి వెళ్ళిపోయాడు.

ఇంతలో అన్నపూర్ణ తన భర్తను రమ్మని కేకవేసింది. కృష్ణారావు రాగానే ద్వారం తెరచి అంతా వెతికారు కానీ, ఎవ్వరూ కనిపించలేదు.

"అబ్బా అన్నపూర్ణ, దొంగ ఎవరూ రాలేదులే నీవు లోపలికి రా" అని కృష్ణారావు పిలిచాడు. ఇద్దరూ లోపలికి వచ్చి పడుకున్నారు.

"ఏవండీ ఇది చూశారా హాల్లో కుర్చీలో ఈ వాచ్ పడుందండి" ఆమె ఉదయాన్నే భర్తను లేపుతూ అంది.

"నేను చెప్పానా వాడు ఎప్పటికైనా తన తప్పు తెలుసుకుంటాడని, ఏమైతేనేం అది రావలసిన చోటికి వచ్చింది," కృష్ణారావు తృప్తిగా చెప్పాడు

కృష్ణారావు మర్నాడు లెక్కల్లో 90 శాతం పైన వచ్చిన వారి అందరికీ బహుమతులు ప్రదానం చేశాడు. విజయ్ మాత్రం అక్కడికి రాలేదు. కృష్ణారావు, విజయ్ ఎక్కడని మిగతా పిల్లలను అడిగాడు. అందరూ తెలీదన్నారు. కృష్ణారావు కొంతసేపు ఆలోచించి తన ఇంటికి బయలుదేరి వెళ్ళాడు.

మర్నాడు కృష్ణారావు విజయ్ వాళ్ళింటికి వెళ్ళాడు. అక్కడ వాళ్ళమ్మ మాత్రమే ఉంది. కృష్ణారావును చూడగానే వాళ్ళమ్మ "రండి, రండి సార్" అంటూ ఆహ్వానించింది.

"విజయ్ లేడా అమ్మ" కృష్ణారావు వెంటనే ప్రశ్నించాడు. "అయ్యో ఏం చెప్పేది సార్, నిన్న రాత్రి మేమందరం పడుకున్న తర్వాత వాడెక్కడికి వెళ్ళాడో ఏమిటో, ఎడమ చేతికి పెద్ద గాయం అయింది. వాళ్ళ నాన్న వాడిని ఆసుపత్రికి తీసుకెళ్ళాడు." ఆమె కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ చెప్పింది. కృష్ణారావు ఏమీ మాట్లాడలేదు.

"నేనిక్కడ, వాడొచ్చేదాకా ఉండొచ్చా అమ్మా", కృష్ణారావు కుర్చీ మీద కూర్చున్నాడు. గంట గడిచింది. ఇంతలో గోపాలయ్య, విజయ్ ఇద్దరూ లోపలికి వచ్చారు. కృష్ణారావును చూడగానే విజయ్ పై ప్రాణాలు పైనే పోయాయి. బిక్కచచ్చిపోయాడు.

సార్, ఇక్కడికి వచ్చాడేంటి, ఆయనకి నిజం తెలిసిపోయిందా? ఇప్పుడేం చేయాలి? విజయ్‌కి ఏడుపు తన్నుకొస్తోంది.

"గోపాలయ్యా! అమ్మా! మీరిద్దరూ ఆ మంచం మీద కూర్చోండి" కృష్ణారావు వారిద్దరినీ చూస్తూ అన్నాడు. వారిద్దరూ అలానే మంచం మీద కూర్చున్నారు.

"మీరిద్దరూ నా మీద ఏ మాత్రం గౌరవం ఉన్నా నేను చెప్పేంత వరకు మంచం మీద నుంచీ లేవద్దు" చెబుతూనే కృష్ణారావు ముందున్న తలుపును దగ్గరకు లాగాడు.

"ఎందుకు మా ఇంటికి వచ్చి వాచ్‌ని తిరిగి ఇచ్చేశావు?" కృష్ణారావు విజయ్‌ని సూటిగా చూస్తూ ప్రశ్నించాడు. విజయ్ అప్పటికే కన్నీళ్ళ పర్యంతమయ్యాడు.

"నేనేమన్నా అంటానని భయపడుతున్నావా నిన్నేమి అనను రా" కృష్ణారావు విజయ్ తలమీద ఆప్యాయంగా చేయి వేసి చెప్పాడు.

"ఆ వాచ్, నీ కెంతో ఇష్టమయిన గురువుదని తిరిగి ఇచ్చేశావా? లేక నీవు తప్పు చేశానని పశ్చాత్తాపపడి నాకు తిరిగిచ్చేశావా?" కృష్ణారావు విజయ్ తలపైకెత్తి నెమ్మదిగా ప్రశ్నించాడు.

గోపాలయ్యకు విషయం అర్థమైంది. "ఎంత పని చేశావురా..." అంటూ కోపంగా లేవబోయాడు.

కృష్ణారావు వారించాడు.

"నీవు పెట్టుకున్న వాచ్ నాదేనని నాకు ముందు నుంచీ తెలుసు. ఏమీ బాధపడవద్దు! నీ వయస్సులో ఉండేవారికి చపలచిత్తం సహజం."

"జీవితంలో చిన్న చిన్న విషయాలలో కూడా నిజాయితీగా ఉండడం చాలా ముఖ్యం. ఇదే మనిషిని గొప్పవాడిగా చేస్తుంది. ఇవి నేను చెప్పిన మాటలు కాదు, మహాత్ముని మాటలు," కృష్ణారావు చెప్పడం ఆపి విజయ్ వైపు చాశాడు.

విజయ్ ఏడుపును కొద్దిగా ఆపి ఎంతో శ్రద్ధగా వింటున్నాడు.

కృష్ణారావు మళ్ళీ ప్రారంభించాడు.

"జీవితంలో ఆశ ఉండవచ్చు. కానీ దురాశ ఉండకూడదు. కోరికలు ఉండవచ్చు, కానీ అవి ఇతరుల సంపదను లాక్కొని తమదిగా చేసుకోవాలనేవిగా ఉండకూడదు. జీవితంలో ఆశయాలు ఉండొచ్చు, కానీ, అవి ఇతరుల సంతోషాన్ని, ఆశయాల్ని బలిపెట్టి సాధించేవిగా ఉండకూడదు" కృష్ణారావు చెప్పడం పూర్తిచేసి, విజయ్ కన్నీటి ధారను తన కర్చీఫ్‌తో తుడిచాడు.

"నేను నిన్న నీకోసం ఒక బహుమతి కొన్నాను, కానీ నువ్వు ఆ వాచ్‌ని తిరిగిచ్చేయడంతో, ఇంకో రెండు బహుమతులను అదనంగా చేర్చాల్సి వచ్చింది."

"రెండవది, "మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ద ట్రూత్", ఇది చదువు, ఒక మహాత్ముని ఆత్మ సంఘర్షణ, సత్యవంతమైన మార్గంలో నడవడానికి సహాయపడుతుంది."

"ఇక మూడవది" అంటూ ఆ వాచ్‌ని జేబులో నుంచీ తీశాడు.

"నీవే చెప్పావుగా, ఈ వాచ్ వల్ల, నీకెంతో కలిసి వచ్చిందని, తీసుకోరా" అంటూ కృష్ణారావు ప్రేమగా విజయ్ చేతిని దగ్గరకు తీసుకున్నాడు.

"నాకొద్దు సార్" విజయ్ ఏడుస్తూనే చేతిని వెనక్కి లాక్కున్నాడు.

"విజయ్ ఈ వాచ్ నీ జీవితంలోని మొట్టమొదటి విజయంలో తోడుగా ఉంది. ఇక ముందు కూడా, నీవు జీవితంలో సాధించబోయే ప్రతి విజయంలో కూడా ఇది నీవెంటే ఉంటుంది. అలా ఉండాలనేదే నా కోరిక", అటూ మళ్ళీ విజయ్ చేతిని దగ్గరకు లాగాడు. విజయ్ వాళ్ళ నాన్న వైపు చూశాడు. వాళ్ళ నాన్న తీసుకోమన్నట్లు సైగ చేశాడు.

కృష్ణారావు ఆ వాచ్‌ని విజయ్ చేతికి పెట్టాడు.

"నీ నడవడికలో నిజాయితీ, ఆలోచనల్లో నిజాయితీ, మాటల్లో నిజాయితీ, మనస్సులో నిజాయితీ, గెలుపులో నిజాయితీ, ఇవే నేను నీ గురువుగా ఆశిస్తున్న గురుదక్షిణ" కృష్ణారావు కళ్ళల్లో సన్నటి నీటి పొర.

విజయ్ కళ్ళనీళ్ళ పర్యంతం అవుతూ మాష్టారి కాళ్ళకి నమస్కరించాడు. కృష్ణారావు ఆప్యాయంగా శిష్యుడి తల మీద చేయివేసి అక్కున చేర్చుకున్నాడు.

విజయ్ చెప్పడం పూర్తిచేశాడు. సుమ కూర్చుని ఉన్నది. తన రెండు చేతులతోనూ, అతని ఎడమ చేతిని పట్టుకుని ఉన్నది. ఇద్దరూ కళ్ళు మూసుకుని ఉన్నారు. ఆమె కళ్ళల్లోంచి ఆగి, ఆగి ఒక్కొక్క బొట్టు కన్నీరు కారుతున్నది. అలా కొన్ని క్షణాలు గడిచాయి. విజయ్

తమ పెళ్ళి జరిగినప్పటి నుండి ఎప్పుడూ కృష్ణారావు మాష్టారి గురించి చెబుతుండేవాడు. రెండేళ్ళ క్రితం మాష్టారు దివంగతులైనప్పుడు, ఇద్దరూ వెళ్ళారు. అప్పుడు విజయ్ "మాష్టారు తన జీవితాన్ని సన్మార్గంలో పెట్టిన మహనీయుడు" అని అన్నాడు.

అలా ఎందుకన్నాడో సుమకు ఇప్పుడు అర్థమయింది.

"గురుసాక్షాత్ పరబ్రహ్మ అనే వాక్యానికి కృష్ణారావు మాష్టారు నిలువెత్తు ప్రతిరూపం. అలాంటి వ్యక్తులు లోకానికి ఆదర్శప్రాయులు" సుమ భక్తిభావం నిండిన గొంతుతో చెప్పింది.

"అవును సుమా, నీవు చెప్పింది అక్షర సత్యం," విజయ్ ఆర్ద్రంగా చెప్పి మాష్టారికి మనస్సులోనే నమస్కరించుకున్నాడు.

# కొత్త సీసా.పాతసారా

## -నిడదవోలు మాలతి



స్థానిక కాలేజీలో నాకు ఉద్యోగం దొరికినప్పుడు కొండనందుకున్నట్టు పొంగిపోయాను. ఎందుకంటే నాకు ప్రాణప్రదమైన మానవతా విలువలకి సంబంధించిన పని అది. ప్రతి విద్యార్థీ ఒక సెమెస్టరులో పది గంటలసేపు సాంఘిక సేవ చెయ్యాలి. దానికి కొన్ని నియమాలు ఉన్నాయి. ఆ నియమాలు వివరించడం, వాళ్ళని చక్కని రాజమార్గాన నడపడం నా విధి. మా డైరక్టరు నాకు వివరాలు చెప్పినప్పుడు నాకు చిన్న నవ్వొచ్చింది. మేం చిన్నప్పుడు కాపీబుక్కుల్లో రాసేవాళ్ళం "ఆడి తప్పరాదు", "తల్లితండ్రులు దేవునితో సమానము" లాటివి. దాంతో నీతులూ రాతలూ కూడా నీటుగా నాటుకుంటాయని మా పెద్దల ఉద్దేశం. అలా జరిగిందా అన్నది వేరే కథ అనుకోండి.

అమెరికాలో ఉగ్గుపాలతో "గెలుపు" పాఠాలు నూరిపోసి, ఎదిగిన తరువాత ఈ సన్మార్గాలూ, సంఘసేవా బోధిస్తున్నారు. అమెరికా, ఇండియా భౌగోళికంగా డయమెట్రికల్లీ ఆపోజిట్టు కదా.

మికెలా వచ్చింది తను చెయ్యబోయే ప్రాజెక్టు గురించి మాటాడడానికి.

"ఏంచేస్తున్నావు? అని అడిగాను మామూలుగానే.

"ఏమో"

ఇది కూడా మామూలే. వాళ్ళకి ప్రపంచంలో సమస్త విషయాలూ తెలుస్తాయి కానీ "సాటిమనిషికి నువ్వు చెయ్యగల సాయం ఏమిటి"అంటే చప్పున చెప్పలేరు.

అరగంట సేపు తన కుటుంబం, చదువు, చెయ్యబోయే ఉద్యోగం మాటాడిన తరువాత ఆ ఉద్యోగానికి పనికొచ్చే సాంఘిక సేవ బోధిస్తాను. అందులో కూడా సొంత లాభం పొందు పరచక తప్పదు మరి! పుణ్యమనే కదా పూజలూ, వ్రతాలూను. బిజినెస్

ఎడ్మినిస్ట్రేషన్ మేజరట..

సరే, ఏ బిజినెస్ గానీ మనుషులతో పని - ఎదుటివారి తత్వాలు అర్థం చేసుకోవడం - కదా. అంచేత ఊళ్ళో ఉన్న రెండు సేవా సమాజాలకి వెళ్ళి అక్కడ ఏం చేస్తున్నారో, తనక్కడ చెయ్యగల్గిన సాయం ఏమేనా ఉందేమో చూడమన్నాను. ఇప్పుడు ఆ మాట చెప్పడానికే వచ్చింది.

"నాకో మంచి ప్రాజెక్టు దొరికింది," అంది హుషారుగా.

ఎక్కడ అని అడిగాను.

ఊరి చివరనున్న నర్సింగుహోంలోనట. "పైగా అక్కడ ఒక ఇండియన్ ఆవిడ ఉంది. అంచేత నేను కల్చరల్ డైవర్సిటీ కుడా స్టడీ చెయ్యొచ్చు" అంది మికేలా.

సరే, తాను అక్కడ తన ప్రాజక్టుకి సానుభూతి (compassion) నిస్సహాయులకి సాయము చేయుట (helping the needy) భిన్న సంస్కృతులలో విలువలు (cultural diversity) అను మానవతా విలువల అధ్యయనం చేయుటగా నిర్ణయమయిపోయింది.

ఆ అమ్మాయి లేవబోతూ, "ఇండియాలో ఉమ్మడి కుటుంబాలు కదా, రెండు గదుల్లో పదిమంది ఉంటారు. ఆవిడని ఇక్కడికి తీసుకొచ్చి నర్సింగుహోంలో పెట్టడం ఏమిటి?" అంది.

ఇదివరకు ఇలాటి విషయంలోనే తను అడిగిన ప్రశ్న గుర్తొచ్చింది. "రెండుగదుల్లో ఆరుగురు ఉంటే మరి పిల్లల ఎదుటే... చేస్తారా?" అని. ఏమిటి అడుగుతుందో వాచ్యం చెయ్యలేదు నా మీద గౌరవంతో. నాకు ఏం చెప్పాలో తోచలేదు. "పిల్లలముందు చెయ్యరు.. కాని కావాలనుకుంటే దారే ఉండదా? జనాభా చూస్తే తెలుస్తోంది కదా" అన్నాను తేలిగ్గా. ఎవరు ఎలాటి ప్రశ్నలు వేస్తారు అన్నది కూడా సాంస్కృతిక విజ్ఞానంలో భాగమే. అదే వయసుగల తెలుగు పిల్లలు ఆ ప్రశ్న వెయ్యరు అనుకుంటూ.

మికేలా నా మొహం చూస్తూ నిలబడింది నా జవాబు కోసం. "ఆయన ఇక్కడ ఉండడంతో మారిపోయారా?"

నాక్కూడా ఆ అనుమానం వచ్చింది కానీ బయటపడటం నాకు ఇష్టంలేదు. మామూలుగా పెద్దవాళ్ళని ఇక్కడికి తీసుకొచ్చింతరువాత ఇంట్లో పెట్టుకోవడమే చూశాను కానీ నర్సింగుహోంలో పెట్టడం చూడలేదు.

"నీ ప్రోజక్టులో అది కూడా భాగమే. చూడు ఏం నేర్చుకుంటావో" అన్నాను గోడమీద పిల్లివాటంగా. సరేనంటూ వెళ్ళిపోయింది.

ఆ తరువాత మికేలా అప్పుడప్పుడొచ్చి తను కనుగొన్న సరికొత్త విషయాలు చెపు తూనే ఉంది. ఆశ్చర్యం, ఆవిడ, పూర్ణిమాదేవి పెళ్ళిచేసుకోలేదట. వాళ్ళ చెల్లెలికి పదకొండుమంది పిల్లలట. స్కూలు టీచరుగా పనిచేస్తూ వీళ్ళందరికీ చదువులు చెప్పించిందట. పెద్దపిల్లలు ఎదిగి ఉద్యోగాల్లో చేరిన తరువాత, చిన్నవాళ్ళని చదివించారట. తాను ఎన్నో సంగతులను నేర్చుకున్నాని చెప్పేది మహోత్సాహంతో. తనని గురించి కూడా చాలా ప్రశ్నలు వేసిందట ఆవిడ. మొదట చిరాగ్గా అనిపించినా అది వాళ్ళ అలవాటు అనుకుని జవాబులు చెప్పిందట. తన కుటుంబం ఫోటీ కూడా ఇచ్చిందట. గుడ్, గుడ్ అంటూ వస్తున్నాను నేను నవ్వుతూ.

పూర్ణిమాదేవి - అదే నర్సింగ్‌హోంలో మికేలా సందర్శిస్తున్న ఆవిడ - తన కుటుంబం గురించి పదే పదే చెపుతూండటంతో మికేలాకి ఓ ఆలోచన తోచింది.

"నేను ఆవిడకి ఒక కలాజ్ (collage) చెయ్యమని చెప్పాను. ఓ పెద్ద బోర్డు మీద తనకి అభిమానులయిన వాళ్ళందరి బొమ్మలూ అమర్చి, దానికి వత్తాసుగా ఓ చిన్న పుస్తకం వాక్చిత్రాలు రాయమని. నేను సాయం చేస్తాను," అంది.

"చాలా మంచి ఊహ," అన్నాను. నిజంగానే సంతోషిస్తూ. మనకి దాపరికం లేదు. డాక్యుమెంటేషను చాలా తక్కువ. మన చరిత్ర అంతా మౌఖికమే కదా.

మికేలా సందేహిస్తూ, "ఖర్చులు డిపార్ట్‌మెంటు ఇస్తుందా?" అని అడిగింది నెమ్మదిగా.

"ఎంత"?

"ఏమో".

కలాజ్‌కి అట్టబోర్డు, గమ్, కథ రాయడానికి ఓ నోట్‌బుక్కు, లేకపోతే తెల్లకాయితాలు - చూసినా పది డాలర్లకి మించదు. డిపార్ట్‌మెంటంటే, రసీదులూ, ఫారాలు, అప్రూవలూ, ఎందుకొచ్చిన గొడవ అని నా పర్సు తీసాను.

మికేలా చూసి, నెవర్ మైండ్ అనేసి శలవు పుచ్చుకు వెళ్ళిపోయింది. వెళుతూ, "వెరీ ఎక్సైటింగ్" అని మరోసారి చెప్పి. ఆ తరువాత నాలుగు వారాలు కనిపించలేదు.

సెమిస్టరు చివరికొచ్చింది. మికేలా తను కనుగున్న సంగతులూ, దాని మూలంగా తన దృష్టిలో, ఆలోచనా ధోరణిలో వచ్చిన మార్పులూ రిపోర్టివ్వాల్సిన రోజు దగ్గరకొచ్చింది.

ఎపాయింటుమెంటు తీసుకోమని ఈ మెయిలు పంపించాను. జవాబుగా తనే వచ్చింది.

"నాకో చిన్న సమస్య వచ్చింది," అంది రవంత జంకుతో.

ఇది కూడా మామూలే. చాలామంది ఆ ముగింపు దగ్గరకొచ్చేసరికి కాస్త ఆదుర్దాపడతారు - తాము చేసింది చాలదేమో. ప్రోజెక్టు అప్రూవు కాదేమో అని.

"ఫరవాలేదులే. నువ్వు పాసవుతావు," అన్నాను ధైర్యం చెపుతూ.

"అది కాదు. నేను కాలేజీ చివరి రోజునే ఊరు విడిచి పోవాలి. ఈలోపున మూడు పెద్ద పేపర్లు రాయాలి ..."

నాకు చిరాకేసింది. ఈ సోది అంతా ఎందుకు?

"ఏం చెయ్యాలనుకుంటున్నావో చెప్పు" అన్నాను.

"ఆ కలాజ్ ఇంకా పూర్తి కాలేదు."

"అంటే మధ్యలో వదిలేస్తానంటావా?"

"లేదు. చేస్తాను, వచ్చేవారం వెళ్ళి పూర్తి చేస్తాను. ఈ లోపున మన ఇంటర్వ్యూ చెయ్యొచ్చా అని..."

నాకు ప్రాణం కుదుటపడింది. తొందరపడ్డది నేనే. క్షమాపణలు చెప్పుకోలేదు కానీ ఇంటర్వ్యూ చేస్తానన్నాను. మర్నాడు తొమ్మిది గంటలకి రమ్మన్నాను. సరే అని వెళ్ళిపోయింది.

మికేలా రిపోర్టు రాయలేదు, ఇంకా పని పూర్తికాలేదు కనక.

అంచేత ప్రస్తుతానికి వాగ్రూపంలోనే.

మామూలుగా ఈ ఇంటర్వ్యూలు టేప్ చేస్తాం తరువాత తగువులేమైనా వస్తే సాక్ష్యం కోసం.

మికేలా దానివేపు చూసి "రికార్డు చెయ్యాలా" అంది. ఆ అమ్మాయికి చెమటలు పడుతున్నాయి.

అది చూసి, "నీకు అభ్యంతరమయినందున టేపు రికార్డరు ఆపు చెయ్యడమయినది" అని రాసుకున్నాను.

"ఏమిటి నీ ప్రోజక్టు?"

"వయసు మళ్ళిన వాళ్ళ ఆలోచనలు, అభిప్రాయాలూ తెలుసుకోడం, ఇతర సంస్కృతుల గురించి తెలుసుకోవడం."

"నీ సబ్జక్టు వయసు మళ్ళిన విదేశీ స్త్రీ కదా. అందువల్ల నీకు అధికంగా తెలిసినదేమిటి?"

"చాలా తెలిసింది. నేను ఇండియాలో ఆడవాళ్ళ గురించి విన్న చాలా సంగతులకీ, విడివిడిగా ఒకో మనిషి జీవితానికీ చాలా తేడాలుంటాయి."

"ఏమిటి ఆ తేడాలు?"

"పెద్ద పెద్ద కుటుంబాలు చాలా మంది చిన్న ఇళ్ళల్లో ఉన్నప్పుడు రాగల తగువుల గురించే నేనెప్పుడూ వింటూ వచ్చాను. మేం ఇక్కడ అంటుంటాం ఫెమిలియారిటీ మితి మీరి కంటేంప్టుకి దారి తీస్తుందని. కాని అదే ఫెమిలియారిటీ వల్ల ఆత్మీయతలు కూడా పెరుగుతాయేమో ననిపించింది ఆమెతో మాటాడిన తరువాత. నేను మా కాంపింగ్‌కి వెళ్ళినప్పుడు చూసాను కొంచెం. కాని అవి అట్టే కాలం నిలువవు. అక్కడున్నంతసేపే "కేరింగ్ అండ్ షేరింగ్."

పూర్ణిమాదేవిని ఇక్కడికి తీసుకొచ్చిన మిస్టర్ ప్రనీల్ కొడుకు సొంత కొడుకు కాదు. చెల్లెలి కొడుకు. పదేళ్ళ కిందట ఇండియా వెళ్ళినప్పుడు ఆవిడ చెప్పిందట తనకి జరుగుబాటు కష్టంగా ఉందని. చెప్పుకోడానికి పదిమంది ఉన్నా ఎవరి బాధలు వాళ్ళవి. అంచేత ప్రనీల్ తనతో తీసుకొచ్చేసాడు. ఆవిడ తనని పెంపకం తీసుకుందని దాఖలా చూపి గ్రీన్‌కార్డు సంపాదించి తన దగ్గరే ఉంచుకున్నాడు. కానీ ఈ మధ్య పరిస్థితులు మారిపోయాయి. ఇద్దరు పిల్లల తరువాత కలిగిన పిల్లాడికి మల్టిపుల్ సొలరిసిస్. ఆ పిల్లాడికి తల్లి అవసరం 24 గంటలూను. అంచేత ఆ దంపతులు మరో దారి లేక, అందుబాటులో ఉన్న సదుపాయం కాదనలేక ఆవిడని నర్సింగుహోంలో పెట్టారు."

మికేలా కళ్ళు చెమర్చడం చూసి. నాక్కూడా అదోలా అనిపించింది. ఏ దేశంలో కానీ ఏ జాతిలో కాని మానవత్వపు ఛాయలు ఎప్పుడూ ఒక్కలాగే ఉంటాయేమో అనిపించింది.

సెమిస్టరు అయిపోయింది. ఆఖరిరోజు. అమ్మ రాసిన ఉత్తరంలో సంగతులు ఆలోచిస్తూ కూర్చున్నాను. అమ్మమ్మకి చాదస్తం ఎక్కువయిపోయింది. మామయ్య కొన్నాళ్ళు నీ దగ్గర పెట్టుకో అని తీసుకొచ్చి ఇక్కడ దించేసి పోయాడు రెండూ నెలలకిందట. ఆవిడ చిట్టినీ, సుజినీ చంపుకు తినేస్తోంది.. ఎక్కడికెళుతున్నావు, ఎవరితో వెళుతున్నావు, ఏ సినిమాలు, చీరలెందుకు కట్టుకోవూ, కట్టుకుంటే అలా కట్టుకున్నావేమిటి, తల దువ్వుకోలేదేం, దువ్వుకుంటే అదేం దువ్వుకోడం.... ఏదో ఓ గొడవ రోజూ... టైము చూసాను. ఆలోచిస్తుండగానే నాలుగున్నర. ఆ రోజుకి నా పని అయిపోయింది. కంప్యూటరు ఆఫ్ చేసి, కాయితాలు డ్రాయరులో పడేసి లేవబోతుంటే మికేలా వచ్చింది.

మరోసారి నాకు బై చెప్పడానికి వచ్చిదనుకున్నాను నా బాధ్యత నేను అత్యంత సమర్థవంతంగా నిర్వహించాను. మరొకసారి నాకు తన కృతజ్ఞతలు చెప్పడానికొచ్చింది. నాకు కించిత్ గర్వం కలిగింది.

"ఇంకా ఇక్కడే ఉన్నావేమిటి, నీ ఫ్లైటు టైమయిపోలేదూ?" అన్నాను.

ఆ అమ్మాయి మొహంలో ఏదో తికమక కనిపించింది.

"టైము అయిపోతుంది. కాని ఒక సంగతి మీతో అత్యవసరంగా మాటలాడాలనిపించింది."

"ఏమిటి?"

"అదే కలాజ్‌మాట."

"కలాజ్? ఏమయింది? బాగా రాలేదా?"

"నేను అన్ని రోజులు గడిపేను ఆవిడతో. నా పనులు మానుకున్న సమయాలు కూడా ఉన్నాయి. కలాజ్ చూపించి ఆవిడ పరమానంద పడిపోతూ థాంక్సు చెప్పింది. అది చూసి నాకు ఆశ్చర్యంతో నోటమాట రాలేదు."

"బాగుంది, నీకు గర్వకారణం."

"అది కాదు. ఆ కలాజ్‌లో నా బొమ్మ..."

"ఏం. లేదా?"

"ఉంది" అని ఓ క్షణం ఆగి, "పోస్టేజి స్టాంపంత ఓ మూల. ఆవిడ నా గడ్డం పుచ్చుకుని ఇదిగో నువ్వు అని నా బొమ్మ చూపించినప్పుడు నాకు అర్థమయింది ఆవిడ ఎనభై అయిదేళ్ళ జీవితంలో నా పాత్ర ఎంత చిన్నదో... నేను ఎంతసేపూ నేనెంత సేవ చేస్తున్నానో అనే ఆలోచిస్తూ వచ్చాను ఇంతవరకూ."

నేను తెల్లబోయాను.

"వెరీ హంబ్లింగ్ ఎక్స్పీరియన్స్. అదే నా ప్రాజెక్టులో నేను నేర్చుకున్న నిజమైన పాఠం, మీకు చెప్పాలనిపించింది. బై" అనేసి గబగబా వెళ్ళిపోయింది.

నాకు తల తిరిగింది. కుర్చీలో కూలబడ్డాను అచేతనంగా. అమ్మమ్మా, సుజీ చిట్టీ, పూర్ణిమాదేవీ, కొత్త రంగులు పులుముకుంటున్న పాతకాలపు విలువలూ, "నా" చుట్టూ గిరికీలు కొట్టే "నేను" కలగాపులగంగా ఝుమ్మని లేచాయి కందిరీగల్లా నా మనసాకాశంలో.

## పాత సైంకిల్

- టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి

### ఉగాది కథల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

**నేనెప్పటికీ** మరచిపోలేని రోజుది.

అందుకే ఆ పాత సైకిలును మరింత శ్రద్ధగా, పరిశుభ్రంగా తుడవడం మొదలు పెట్టాను.

ఆఫీసుకు వెళ్ళడానికి మోటరు సైకిలు స్టాండు తీసి రోడ్డు మీదకి దించుకుంటూ మా అబ్బాయి శరత్ నాకేసి నవ్వుతూ చూశాడు... కానీ ఏమీ మాట్లాడలేదు... ఒకప్పుడయితే "ఇంకేం పని లేదా?" అనేవాడు.. ఆ తరువాత, తరువాత తన తల్లిద్వారా ఆ సైకిలు కథ తెలుసుకున్నాడు కాబోలు.. అలా మాట్లాడడం మానుకున్నాడు. సైకిలు తుడవడం పూర్తయింది!

నేను ఇంట్లోకి వెళ్ళి స్నానం పూర్తి చేసుకుని వచ్చేసరికి సుగాత్రి, సాహిత్య పూజ సామాగ్రితో సిద్ధంగా ఉన్నారు.

నా భార్య సుగాత్రి సైకిలుకు అక్కడక్కడ పసుపుకుంకుమలతో చుక్కలు పెడితే నా కుమార్తె సాహిత్య పూలతో అలంకరించింది.

నేను అగర వత్తులు వెలిగించి, టెంకాయ కొట్టి, కర్పూర హారతి ఇచ్చాక ముగ్గురం కలిసి ఆ టెంకాయ నీళ్ళను తీర్థంలా పుచ్చుకున్నాం.

టిఫిన్ తీసుకోవడం, కాఫీత్రాగడం అవగానే బట్టలు తొడుక్కుని సైకిలు తీసుకుని బయలుదేరాను.

నేను సైకిలు మీద వెళుతుంటే బజార్లో వెళుతున్నవాళ్ళు నాకేసి కాస్త వింతగా చూస్తున్నారు. చూడకేం చేస్తారు?ఈవాళ ఆయుధపూజ, విజయదశమి... కనీసం శుక్రవారమైనా కాకపోయె!!

పూలహారాలతో తళుకులీనుతూ పాత సైకిలు పురవీధులలో పరుగులు తీస్తోంటే పరిచయస్తులు కొందరు ఆశ్చర్యంగా చూస్తున్నారు... మరి నేనిప్పుడు కార్లలో తిరగగల మనిషిని వాస్తవానికి!

నా సైకిలలా చాలామందిని ఆశ్చర్యచకితులను చేస్తూ పరుగులు తీస్తోంటే.. నా ఆలోచనలు ముప్పయి సంవత్సరాల క్రితం... ఆనాటి కేసి పరుగులు తీశాయి!!

ఆరోజు ఆదివారం అయినందున నింపాదిగా వరండాలో కూర్చుని ట్రాన్సిస్టర్ రేడియోలో సిలోన్ నింపాదిగా పెట్టుకుని హిందీ పాటలు వింటూ హిందూ పేపరు చూసుకుంటున్నాను.

"స్టవ్వులు.. గ్యాస్ స్టవ్వులు రిపేర్....." అంటూ వీధిలో సైకిలు మీద పోతున్నాడో యువకుడు.

అతని కేక ఎలా వినిపించిందో కానీ......

"ఇక్కడే కూర్చుని ఉన్నారు కదా? ఆ రిపేరీ అతన్ని ఆపలేరా?" అని విసుక్కుంటూ వీధిలోకి వెళ్ళింది నా శ్రీమతి సుగాత్రి.

"ఓప్పోవ్! ... స్టవ్వు రిపేరీ... ఇట్లారా!" అని నా భార్య కేక వేయడం అయ్యాక ఒక నిముషంలోనే ఆ యువకుడు మా ఇంటి ముందు సైకిలు దిగాడు.

"కంపెనీ గ్యాస్ స్టవ్వు.. గ్యాస్ వాసన వస్తోంది... రిపేర్ చేస్తావా?" అని ప్రశ్నించింది నా శ్రీమతి.

"చేస్తానమ్మా!" అన్నట్లుగా తలవూపాడతడు.

"చూద్దువురా!" అంటూ లోనికి రాబోయింది నా శ్రీమతి.

"అమ్మా, సైంకిలుకు తాళం లేదు. లోపల పెడతాను!" అన్నాడు అతడు.

"ఆ, ఈ వరండాలో పెట్టు.. ఏమండీ ఆ రేడియో కట్టేసి ఆ స్టవ్వు బాగు చేయించండి!" అంది సుగాత్రి.

"గ్యాస్ స్టవ్వు ఎవరంటే వాళ్ళు చూడకూడదు. కంపెనీ మెకానిక్కే చూడాలి!" అన్నాను కాస్త కోపంగా.

"ఆ! కంపెనీ మెకానిక్కొచ్చి చూసేసరికి తెల్లారిపోతుంది.. మూడురోజులుగా మూడుసార్లు పోయి చెప్పొచ్చారు కదా? ఎక్కడొచ్చారు? ఆయుధపూజన్నారు, పండగ సెలవన్నారు, ఇప్పటికయినా రాలేదు. వంట చేస్తున్నప్పుడొస్తున్న ఆ వాసనకు కడుపులో తిప్పేస్తోంది.. వాంతి అయ్యేలా, తలతిరిగిపోయేలా... ఎవరో ఒకరు చూడనీలే!" అంది విసుగ్గా.

ఈలోగా ఆ యువకుడు వరండాలో ఓ వారగా తన సైకిలు పదిల పరచుకుని వెనుక క్యారియర్‌లోంచీ తన సామాన్ల సంచి తీసుకున్నాడు.

"ఏమోయ్! నీకు గ్యాస్ స్టవ్వు రిపేరీ తెలుసా అసలు?" అన్నాను సంశయంగా.

టెక్నీషియన్ కాని వాడి చేత గ్యాస్ స్టవ్ రిపేరు చేయించ కూడదని వివేకం హెచ్చరిస్తోంది. కానీ మెకానిక్‌ను పంపించని కంపెనీ వాడి మీద కోపం..., గ్యాస్ వాసన వస్తుండడం వల్ల సుగాత్రి పడే ఇబ్బంది మాట అటుంచితే కంపెనీ మెకానిక్ వచ్చేలోపు ప్రమాదం ఏదయినా జరిగితే ఎలా? అన్న ఆలోచన కలగలసి వివేకాన్ని కాస్త అలా ఉండమంటున్నాయి.

"కిరసనాయిలు స్టవ్వు, కిరసనాయిలు పంపు స్టవ్వు, గ్యాస్ స్టవ్వు... ఏదయినా అరువు చేసేస్తాను!" అన్నాడతడు ధీమాగా.

అతని రూపమూ, వేషమూ, సైకిలును "సైంకిల్" అని అనడమూ, మిగతా మాటలూ అన్నీ చూసి అతడు ముస్లిం సోదరుడనుకున్నాను కానీ పేరడిగితే గోవిందో, గోపాలో... ఏదో చెప్పాడు... గ్యాస్ ఆపేసి పైపు డిస్కనక్ట్ చేసి స్టవ్వు తీసుకుని వంటగది వెనుక పెరట్లో పెట్టుకుని మొత్తం భాగాలన్నీ విడివిడిగా విడదీసి పెట్టేశాడు ఓ సంచి పట్టా మీదికి.

విప్పదీయడమైతే మొత్తం అరగంటలో అయిపోయింది కానీ క్లీన్ చెయ్యడం, బిగించడం రెండుగంటలపాటయినా పూర్తికాలేదు.

అంతా చేసి ఆనక అరగంటయ్యాక స్టవ్వు వెలిగించేసరికి గ్యాసు వాసన వస్తుండడమే కాదు... కాస్త ఎక్కువయినట్లుగా కూడా అనిపించింది.

"ఏంది నా బొంద నీవు రిపేరు చెయ్యడం?" అంటూ కేక తీశాను.

"నీవు రిపేరు చేసేదెప్పుడు? నేను అన్నం అదీ కానిచ్చేదెప్పుడు?" అంటూ మండిపడింది సుగాత్రి కూడా.

మనిషి సుఖానికి అలవాటు పడ్డాకా... ఏకాస్త అసౌకర్యాన్నీ భరించలేడన్నది వాస్తవం. గ్యాస్ స్టవ్వుకు అలా అంతగా అలవాటు పడిపోయింది సుగాత్రి. అందుకే తనకంత కోపం వస్తోంది.

"స్టవ్వంతా అరువు చేశానమ్మగారూ... పైపు జాయింటులోనో, రెగ్యులేటర్ తొడుగు దగ్గరో లీకేజుంది... అరగంటలో అదీ అరువు జేసేస్తాను!" అన్నాడు చమటలు కక్కుకుంటూ.

సందులో బొగ్గుల పొయ్యో, కిరోసిన స్టవ్వో పెట్టి వంట మొదలు పెడతానంది సుగాత్రి విసుగ్గ.

గ్యాస్ స్టవ్వక్కడ రిపేరీ అవుతుండగా.... అవన్నీ సందులో అయినా సరే వెలిగించడం నాకు ఇష్టం లేకపోయింది.

ఒక పూటకు హోటల్ నుండీ క్యారియర్ తెచ్చేస్తానన్నాను. మొదట కాదన్నా... చేసేది లేక ఒప్పుకుంది సుగాత్రి.

భోజనాల వేళవుతున్న సమయానికి అంత కష్టపడుతున్న ఆ మెకానిక్ కుర్రాడికీ అంత అన్నం పెట్టి పంపడం ధర్మమనిపించింది. అందుకే పెద్ద క్యారియరు, చిన్న క్యారియరూ.. రెండూ పట్టుకుని విజయదుర్గావిలాస్ హోటలుకు బయల్దేరాను.

హోటల్లో బాగా రద్దీ ఉంది. మూడు ప్లేట్ల భోజనం క్యారియర్లలో సర్దివ్వడానికి అరగంటకు పైగానే పట్టింది.

నేను క్యారియర్లు పట్టుకుని కాళ్ళీడ్చుకుంటూ మా ఇంటి దగ్గరకు వెళ్ళేసరికి నాకోసం ఎదురుచూస్తూ వీధిగేటు దగ్గరే ఎండలో నిలబడివుంది సుగాత్రి.

"ఒట్టిమనిషివి కూడా కావు... ఎర్రటి ఎండలో ఎందుకు నిలబడడం?" అని విసుక్కున్నాను.

తనేదో అనబోతూ నా చేతిలోంచి, ఓ క్యారియర్ అందుకోబోతోంది సుగాత్రి... అప్పుడు... ఆక్షణాలలో...

"అమ్మో... ఓ యమ్మో... ఓ ర్నాయనో!" అన్న కేకలు భయానకంగా వినిపించాయి మా ఇంటిలోపల్నుండీ.... మా ఇంటికప్పెగిరిపోయేలా, మా గుండెలవిసి పోయేలా!

ఏం జరిగిందో తెలిసేలోపే మంటలు కనిపించాయి లోపల్నుండీ.. అవి హాలువైపు కూడా విస్తరిస్తుండగా పిడుగు పడ్డట్లుగా పెద్ద శబ్దం.. చాలా పెద్ద శబ్దం వినిపించింది.

అవాక్కయి నిలబడి పోయిన మమ్మల్నిద్దర్నీ ఎవరో పశువుల్ని లాక్కువెళుతున్నట్లుగా గబగబా దూరంగా లాక్కుపోయారు.

అరుపులు అరనిముషంపాటు వినిపించాయి... అంతే!

ఎవరు ఎలా కబురు పెట్టారో కానీ ఐదారు నిముషాలలో గంట వాయించుకుంటూ వచ్చేసింది ఫైరింజను.

మరో ఐదారు నిముషాలలో మంటలయితే ఆరిపోయాయి కానీ మా ఇల్లు ఇల్లులా లేదు. బాంబుల దాటికి గురయిన గుహలా కనిపించింది.

సగం కూలి మిగతా సగం కూలకుండగా ఉన్న వంట గదిలో మాడి బొగ్గయి పోయిన ఒక నిర్జీవ మానవాకృతి భయానకంగా.... "సైంకిలు" "అరువు చేస్తాను" లాంటి పదాలతో తమాషాగా, సజీవంగా మాట్లాడిన యువకుడిదే అంటే నమ్మశక్యం కానట్లుగా కనిపిస్తోంది.

ఫైర్ సర్వీసు వాళ్ళు ప్రశ్నలు వేస్తోంటే నా బుర్ర కొద్ది కొద్దిగా పని చెయ్యడం మొదలు పెట్టింది.. కానీ... ఆషాక్‌లోంచీ తేరుకోలేకపోతున్నాను! నా భార్య పరిస్థితి అయితే మరింత ఘోరంగా ఉంది!!

"ఎవరేం అడిగినా ఏ జవాబూ చెప్పవద్దు!" అంటూ తగ్గు స్వరంతో నా భార్యను హెచ్చరించి ప్రక్క వీధిలో ఉన్న దూరపు బంధువులతో పాటు పంపేశాను.

ఫైర్ సర్వీసు వాళ్ళు అడిగిన వాటికి వీలయినంత జాగ్రత్తగా జవాబులు ఇవ్వడానికి ప్రయత్నించాను కానీ వికలమైపోయిన మనసు, బుద్ధి సహకరించడం లేదు. వాళ్ళు స్టేట్‌మెంటు వ్రాసుకుని నా సంతకం తీసుకోకమునుపే బిలబిల మంటూ పోలీసులు వచ్చేశారు సైకిళ్ళమీద.

గంట తరువాత అధికారుల పర్యవేక్షణలో సబ్‌ఇన్స్‌పెక్టర్ పంచనామా రాస్తుంటే వీధిన పోతున్న ఆ మెకానిక్ యువకుడిని నేనే పిలిచి గ్యాస్ స్టవ్ రిపేర్ చేయమని చెప్పానని వ్రాయించాను. ఆ సమయంలో ఆ మాత్రమైనా బుర్ర పని చెయ్యడం వల్ల గర్భవతి అయిన నా భార్య నాతో పాటు పోలీసు స్టేషను చుట్టూ తిరిగి అవస్థలు పడకుండా కాపాడుకోగలిగాను.

మార్చురీ సౌకర్యం లేనందునా, శవాన్ని గుర్తించడానికి ఏకాస్త ఆనవాలయినా కనిపించకుండా తగలబడిపోయినందునా మరునాడు పోస్ట్‌మార్టం అవగానే శవాన్ని మునిసిపాలిటీ వారికి అప్పజెప్పేశారు.

శవాన్ని మునిసిపాలిటీ పనివారు బండిమీద లాక్కుపోతుంటే వారికి కాస్త ఎక్కువ మొత్తం ఇచ్చి జాగ్రత్తగా ఖననం చేయించాను కొద్దో గొప్పో శాస్త్రోక్తంగా.

ఇల్లు వల్లకాట్లో ఓ భాగంలా తయారయింది. వంటపాత్రలు మొదలుకుని ఫర్నిచర్ వరకూ అన్నీ తగలబడి పనికి రాకుండా పోయాయి.. కట్టుకున్న బట్టలు తప్ప!

నా భార్యను పుట్టింటికి పంపేశాను.

అనర్హుడి చేత గ్యాస్ స్టవ్ బాగు చేయించుకునే ప్రయత్నం చేసి అతని మరణానికి కారకుడయినందుకు పోలీసు శాఖవారు నా మీద నాలుగు సెక్షన్లతో కేసు నమోదు చేశారు. గుడ్డిలో మెల్ల అన్నట్లు బెయిల్ లభించింది.

గ్యాస్ కంపెనీ ఏజన్సీ వాళ్ళమీదా కేసు బనాయించారు కానీ వాళ్ళు తప్పించుకోవడానికి దార్లున్నాయి. పైగా వరుసగా మూడురోజులూ శెలవులుండడం వారికి సహకరించింది.

నా మీద మోపబడిన కేసు చాలా బలమైనదే.. డబ్బు ఖర్చుచేసి కొంత వెసులు బాటు పొందే ప్రయత్నం చేశాను. బ్యాంకులో దాచుకుని ఉంచిన కొద్దో గొప్పో డబ్బూ క్రమంగా హారతి కర్పూరంలా ఖర్చవడం మొదలు పెట్టింది కానీ పెద్దగా ఉపయుక్తం అయ్యే సూచనలు కనిపించలేదు.

పోతే మరణించిన వ్యక్తి పేరయినా నేను చెప్పలేక పోవడం అన్నది కేసు విచారిస్తున్న జడ్జిగారికి కానీ వ్యతిరేకంగా వాదిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు కానీ బొత్తిగా నచ్చలేదు... పైగా నా దురదృష్టం కొద్దీ చచ్చిన వాడిని వెతుక్కుంటూ ఎవరు రాకపోయారు ఎన్నిరోజులుగడిచినా.

అతనెవరో? అతని తల్లిదండ్రులెవరో? ఎక్కడ పుట్టాడో, ఎక్కడ పెరిగాడో, ఏ ఊర్లో ఉండేవాడో, వెనుక ముందెవరున్నారో.... చెప్పగలిగేవారే లేకపోయారు.

నా ఇల్లంతా తగలబడిపోయినా వరండాలో ఓ మూల ఉంచబడ్డ అతని సైకిల్ మాత్రం చెక్కుచెదరలేదు.

మొదట్లో కేసు దర్యాప్తులో భాగంగా సైకిలును పోలీసులు తీసుకువెళ్ళి స్టేషనులో పెట్టారు.

పది రోజుల తరువాత చూస్తే ఆ సైకిలు ముందు చక్రమూ, సీటూ కనిపించలేదు. నా గుండె జల్లుమంది.

"పోలీసు స్టేషనులోని వస్తువులోంచీనే చోరీనా?" అని అనుకున్నాను.

చనిపోయిన వ్యక్తి తాలూకు వారెవరైనా అతన్ని వెతుక్కుంటూ వస్తే గుర్తించడానికి అతని రిపేరీ పరికరాలు కూడా సగం కూలిన మా వంటగది కప్పు క్రింద కలిసిపోగా మిగిలిన సజావైన వస్తువు ఆ సైకిలొక్కటే. దాన్ని కాస్తా పీసుల క్రింద ఎర్రటోపీల వాళ్ళు పంచేసుకుంటే ఎలా?

పోలీసు వాళ్ళతో అప్పటికే ఓ అవగాహన ఏర్పరచుకున్న ఉండడం వల్ల ఓ చక్రమూ, సీటూ కోల్పోయిన ఆ సైకిల్ను నా స్వాధీనంలోకి తీసుకోవడం పెద్ద కష్టం కాలేదు.

సరిక్రొత్త ముందు చక్రమూ, సీటు బిగింపచేయించిన తరువాత ఓ మిత్రుని ఇంట్లో ఆ సైకిలు ఉంచి కొంతకాలం పాటు దాన్ని పదిల పరుస్తూ ఆ వ్యక్తి తాలూకు వారెవరైనా దొరుకుతారేమో తెలుసుకునే బాధ్యత అతని మీదుంచాను.

మొత్తానికి ఎంత ప్రయత్నించినా... కేసులోంచీ వెలుపల పడలేకపోయాను.

ఆరునెలల తరువాత ఆర్నెల్ల సాధారణ జైలు శిక్ష విధించింది జిల్లా కోర్టు. దిగులు పడిపోయిన నాకు ధైర్యం చెప్పారు బంధు మిత్రులు.

"ఏం భయపడవద్దు... హైకోర్టులో పేరు మోసిన లాయర్లు మనవాళ్ళే ఉన్నారు. కేసు కొట్టించెయ్యొచ్చు!" అన్నాడు నా తరపు లాయరు.

మరో సంవత్సరం పాటు హైకోర్టులో సాగింది కేసు. కానీ అక్కడా నాకు చుక్కెదురయింది.

హైకోర్టు కూడా జైలు శిక్ష ఖాయపరిచేశాక అన్ని రోజులుండిన చిన్న అద్దె ఇల్లు కూడా ఖాళీ చేసేసి, అప్పుడప్పుడే నన్ను గుర్తుపడుతూ బోసినవ్వులు చిందిస్తున్న బాబునూ, దిగులు పడిపోయిన భార్యనూ మళ్ళీ పుట్టింటికి పంపేసి నేను జిల్లా జెయిలుకు చేరక తప్పలేదు.

బంగారంలాంటి ఉద్యోగం పోతున్నందుకూ, భార్యా పిల్లల్ని వదిలి జైలు చేరినందుకూ నేను పెద్దగా బాధ పడలేదు... ఎందుకంటే "జీవితంలో సర్వస్వం కోల్పోయినా ఒక్కటి మాత్రం మిగిలే ఉంటుంది.. అదే భవిష్యత్తు!" అన్న ఓ రచయిత మాటను దృఢంగా నమ్మే మనిషిని నేను.

కానయితే చనిపోయిన వ్యక్తి తాలూకు వాళ్ళెవరూ అతన్ని వెతుక్కుంటూ రాకపోవడం మాత్రం నాకు తీవ్రమైన నిరాశనూ, నిస్పృహనూ, అంతులేని బాధనూ కలిగించింది.

"అమ్మా! సైంకిలుకు బీగం లేదు. లోపల పెడతాను!" అన్న అతని తమాషా అయిన మాట సదా నా చెవుల్లో మెదులుతుండగా, కాస్సేపు... ఆనాటి అతని సజీవమైన ఆ యువకుడి శవాకృతీ కళ్ళముందు పదేపదే మెదులుతూ నాకు అంతు తెలియని ఆవేదనను సృష్టించాయి. అతని వాళ్ళెవరైనా, ఎక్కడైనా ఎంత బాధపడుతున్నారో, ఏమో?? అన్న ఆలోచన కూడా పదే పదే వేధించసాగింది వంటరి తనం మధ్యన.

జైలులో కొద్దిరోజులపాటు ఓ చివర్న, చిన్న గదిలో వంటరిగా ఉండాల్సి వచ్చింది. అప్పుడయితే రాత్రులందు అతడు ఊచల కిటికీలోంచీ నాకేసి నవ్వుతూ చూస్తున్నటుగానో, లేదా మాడి మసయిపోయిన రూపంతో గదిలో అవతలి వైపు పడుకున్నట్లుగానీ అనిపిస్తూ అంతులేని, అంతు తెలియని భయాన్ని కలిగిస్తూ నిద్రలేని రాత్రులు గడపాల్సి వచ్చింది.

ఏ జన్మలో ఏ పాపం చేశానో కానీ... పరిహారంగా మొత్తానికి ఎలాగో జైలు జీవితం ముగిసింది.

జైలులోంచీ వెలుపలికి రావటం అవసరం.... మా నాన్నగారు అటునుంచీ అటే రైలెక్కించి తిరుపతి తీసుకు వెళ్ళి తిరుమల కొండ కాలినడకన ఎక్కించి గుండు గీయించి శ్రీవారి దర్శనం చేయించిన తరువాతే ఇంటి దిక్కు తిరుగనిచ్చారు.

అనుకున్నట్లుగానే ఉద్యోగం ఊడిపోయింది.

కొంత పొలం అమ్మేసి పల్లెనుండీ కొంత మొత్తం తెచ్చి ఇచ్చారు నా తల్లితండ్రులు. దాంట్లో కొంత ఖర్చు చేసి పాడుబడ్డ ఇంటిని బాగు చేయించాను. అయితే అందులో నివసించడానికి నా భార్య అంగీకరించలేదు. తను, బాబు పుట్టింట్లోనో లేదా మా పల్లెలోనో ఉండిపోసాగారు.

నేను మాత్రం ఆ ఇంటిలోనే వంటరిగా ఉండి ఓ అమాయకుడి అకాల మరణానికి సంబంధించిన బాధను, దుఃఖాన్ని, భయాన్ని అనుభవిస్తూ.., బెంగుళూరు, చెన్నై, హైదరాబాదు నగరాలకు టమేటాలు ఎగుమతి చేసే చిన్న వ్యాపారాన్ని ప్రారంభించాను.

మొదట్లో పెద్ద లాభదాయకంగా అనిపించకపోయినా క్రమంగా ఊపందుకుని లాభాల పంట పండించడం మొదలు పెట్టింది వ్యాపారం. పండించే రైతులకన్నా నాకే ఎక్కువ లాభాలు గిట్టడం మొదలయింది క్రమంగా.

కాస్త నిలదొక్కుకోగానే ఉన్న అకౌంట్లు కాక మరో జాతీయ బ్యాంకులో మరో అకౌంటు ఓపెన్ చేసి నా సంపాదనలో ఐదుశాతం అందులో క్రమం తప్పకుండా జమ చేస్తూ వచ్చాను... కానీ.. ఏనాడు అందులోంచీ ఒక్క రూపాయి అయినా వెలికి తీయలేదు. ఆ ఖాతా అంతరంగిక ఖాతాగా ఉండిపోయింది.

మాకు మరో పాప కలిగి, నా వ్యాపారం మరింత అభివృద్ధి చెందిన తరువాత కూడా ఆ ఇంట్లో కాపురం ఉండడానికి ఇష్టపడకపోయింది నా భార్య.

తన భయం పోవాలంటే ఆ ఇల్లు పూర్తిగా మార్చి వెయ్యాలి. అయితే ఆసాంతం మార్చేస్తే చనిపోయిన ఆ అభాగ్యుడిని వెతుక్కుంటూ ఎప్పుడైనా, ఎవరైనా వస్తే ఆచూకీ చెప్పేవారు లేకపోవచ్చు.

అందుకే వరండా, ముందుగదీ ఏ మాత్రం మార్చకుండా మునపట్లా ఎలా ఉన్నది అలాగే ఉంచేసి తతిమ్మా ఇల్లు మొత్తం తీయించి వేసి అత్యంత అధునాతనంగా పునర్నిర్మింపచేశాను. మరోమారు సంప్రోక్షణ జరిపించి, ప్రాణ ప్రతిష్ట చేయించి, గృహప్రవేశం చేయడానికి సిద్ధం చేశాక నా శ్రీమతి ఆ ఇంట అడుగు పెట్టడానికి అంగీకరించింది.

అయినా ఆమెకు ఆనాటి భయం, దిగులు పోలేదు. అందుకే ఆర్నెల్లపాటు గ్యాస్ ముట్టుకోకుండా కిరోసిన్ స్టవ్వుల మీదే వంట కానిచ్చింది.

ఓ వంట మనిషిని ఏర్పాటు చేసి ఏడాది పాటు ధైర్యం చెప్పి కిరోసిన్ స్టవ్వులు మరుగున పడేలా చెయ్యగలిగాను చివరికి.

ప్రతి మాహాలయ అమావాస్యనాడు నా పూర్వీకులతో పాటు పేరయినా సరిగ్గా గుర్తులేని ఆ అనామకుడికి తర్పణాలు వదులుతున్నాను అశ్రుతర్పణంతో పాటు.



ప్రస్తుత స్థాయికి ఏ మాత్రం బాగుండక పోయిన అప్పుడప్పుడు ఆ సైకిలు తొక్కుతున్నాను... దాన్నెవరైనా గుర్తుపట్టి ఆ అభాగ్యుడి తాలూకు వాళ్ళ ఆచూకీ చెప్పగలరేమోననే ఆశతో!

అంతేకాదు... ప్రతి ఏట ఆ ప్రమాదం జరిగిన తేదీ నాడు సైకిలుకు పూజ కానిచ్చి వేరే పనేమీ చెయ్యకుండా ప్రత్యేకంగా దానిమీద ఊరంతా తిరిగివస్తున్నాను.

కానీ నా ఆశ... అడియాశగానే మిగిలిపోతోంది.

మధ్యాహ్నందాకా సైకిలు మీద అనేక వీధులు తిరిగి చివరికి డీలక్స్ హోటలు ముందు ఆపాను.

భోజనానికి రావటం లేదని సుగాత్రికి ఫోన్ చేసి చెప్పేసి హోటల్‌లో భోజనం కానిచ్చాను.

ఎండకాస్త తగ్గాక మళ్ళీ సైకిలెక్కి నెమ్మదిగా వీధులమ్మట తిరగడం ప్రారంభించాను.

వయసు ప్రభావం కాబోలు... సైకిలు మునుపట్లా తొక్కలేకపోతున్నాను. అలసట వస్తోంది!

సైకిలూ పాతబడి పోతోంది మరి!!

నెమ్మదిగా మిషన్ కాంపౌండులోకి పోనిచ్చి సైకిలు ఓ చెట్టు క్రింద ఆపి ఓ రాతి బండమీద కూర్చున్నాను సాయంకాలం దాకా.

ఆటలాడుకుంటున్న పిల్లల దగ్గరనుండీ, అలసిపోయి మానసిక విశ్రాంతి కోసం వచ్చే పెద్దవాళ్ళవరకూ ఎందరో చూశారు సైకిల్ను. కానీ దాని పూర్వాపరాలనూ, యజమానినీ గుర్తుపట్టగల ఆపద్భాంధవులెవ్వరూ కనిపించలేదు.

సూర్యుడు అస్తమించాక నిరాశగా నిట్టూర్చి సైకిల్ను నెట్టుకుంటూ ఇంటి ముఖం పట్టాను.

సుగాత్రి దేవుడి దీపాలు వెలిగించాక దేవుడి గదిలో... ఆ అనామకుడి ఆత్మకు శాంతి కలిగించమనీ, అతని వాళ్ళెవరున్నా, ఎక్కడున్నా సుఖసంతోషాలతో జీవించేలా చూడమనీ భగవంతుని ప్రార్థించి, నెమ్మదిగా వచ్చి వరండాలోని పడక్కుర్చీలో నిస్సత్తువుగా వాలాను.

నా అంతరంగిక ఖాతాలో లక్షలాది రూపాయలు మూలుగుతున్నాయిప్పుడు. ఆ ఖాతాను గూర్చి మాత్రం కనీసం నా భార్యా పిల్లలకయినా తెలియదు ఇప్పటికీ!

ఆ అనామకుడి తాలూకు వాళ్ళెవరైనా, ఎప్పుడైనా వస్తే వారికి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఆ ఖాతా ప్రారంభించినప్పుడు ఆ ఖాతాలో అంత డబ్బు చేరుతుందని నేనెప్పుడూ అనుకోలేదు.. కానీ.. ఆ మొత్తం పెరుగుతూంటే నా ఆనందం పెరుగుతూ వచ్చింది ఇంతకాలం... కనీసం అతని తాలూకు వాళ్ళకయినా న్యాయం చేయగలుగుతానని!

కానీ ఇప్పుడు నిరాశ ఆవరిస్తోంది!

నిరాశగా పాత సైకిలుకేసి చూశాను.

## సారీ - రా - సారిక

- వియోగి

**గోడగడియారం** ఠంగ్ ఠంగ్ మంటూ గంటలు కొట్టింది.

చీకట్లో పడుకున్న సారిక లెక్కపెట్టింది - పదకొండు - ఇంకా గోపీ రాలేదు అని నిట్టూర్చింది. కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. నీరసం ముంచుకొస్తున్నది నిద్రముంచుకొస్తున్నది. కానీ - బలవంతాన ఎదురు చూస్తున్నది సారిక అభిసారికలాగా.

గేటు చప్పుడైంది. ఇనుపగేటు కిర్రుమని తెర్చుకున్న చప్పుడు బుయ్ మంటూ కారు లోపలికి వచ్చిన చప్పుడు.

`ఓహో! గోపీయే వచ్చాడు` అనుకుంది కోపంగా.

బెల్ మోగింది - కాలింగ్ బెల్ మోగింది.

బద్ధకంగా లేచి తలుపు తీసింది.

"డార్లింగ్! హౌ ఆర్యూ!" గోపీ బ్రీఫ్ కేసు పట్టుకుని లోపలికి వస్తూ అడిగాడు.

"ఊ! ఇంత ఆలశ్యమైందేం?" చిరుకోపంతో అడిగింది.

"ఏం చేస్తాం - ఆఫీసులో పని." టేబుల్ మీద కాళ్ళు పెట్టి బూట్లు విప్పుకుంటూ చెప్పాడు.

టై విప్పదీసి - ప్యాంటు షర్టు హేంగరుకు తగిలించి - టవల్ తీసుకుని బాత్‌రూంలో దూరాడు.

ఓ పదిహేను నిమిషాలు ఆమెకు యుగాల్లాగా గడిచాయి.

"నిద్రొస్తుంది..." ఆవలించాడు. ఒళ్ళు విరుచుకుంటూ టవల్ విప్పేసి లుంగీ కట్టుకున్నాడు.

అనాచ్ఛాదిత హృదయం బలిష్టంగా మెరిసిపోతున్నది లైటు కాంతులలో.

"ముందు ఫుడ్డు - ఆ తర్వాతే బెడ్డు!" చెప్పింది.

"నాకు తినాలని లేదు -" చెప్పాడు.

"యూమీన్ ఎక్కడన్నా తినొచ్చావా?"

"ఔను - దార్లో ఫ్రెండు కనిపిస్తేను - మొహమాటానికి ఎంగిలిపడ్డాను."

"మరి ఈ వంట అంతా ఏం కావాలి?" కోపంగా అడిగింది.

"డబ్బు గురించేనా - నో ప్రాబ్లం -"

"డబ్బు కాదు - నా శ్రమ శక్తి! నీకోసం ఇంత కష్టపడి ఎన్నో ఐటమ్స్ చేశాను - అసలు ఈ రోజు ఏంటో గుర్తుందా?" కోపంగా అడిగింది.

"సారీ! సారిక.. గుర్తుకు రావడం లేదు" ఆలోచిస్తూ చెప్పాడు.

"మనం తొలిసారిగా కలుసుకున్న రోజు -" చెప్పింది సారిక.

"ఔను కదూ - సారీ - రా - పడుకుందాం -" పిలిచాడు.

"ఏం మనిషి ఇతను - తనకు ఆకలవుతుందా లేదాని అడగడేం -' మనసులో బాధపడింది. ఆ మాటకు సారికలో ఆకలి చచ్చిపోయింది.

నిశ్శబ్దంగా మంచం మీద పడుకుంది అతని ప్రక్కన.

నిద్ర రాక అతను అటు ఇటు దొర్లుతున్నాడు. అతని చెయ్యి మెత్తగా ఆమె నడుం మీద పడింది. అలజడి ప్రారంభమయింది.

"గోపీ! బుద్ధిగా పడుకో -" చెప్పింది.

"సారీరా! నువ్వు అలవాటు చేశావుగా - నిద్రరాదు -"

"ప్లీజ్ నాకు ఒంట్లో బాగోలేదు -"

"అన్నీ పోతాయి - ఒకటయితే -" దగ్గరకు తీసుకోబోయాడు.

"నాకు మూడు లేదు"

"అది ఎలా రప్పించాలో నాకు తెలుసు" గోపీ చెప్పాడు.

"ఇవ్వాళ నీ వల్ల కాదు" సీరియస్‌గా చెప్పింది సారిక.

గోపీ అర్థం చేసుకునే మూడులో లేడు కాస్త రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడు - కానీ ఆమె చలనం లేకుండా సీలింగు కేసి చూస్తూ పడుకుంది.

"ఏమయిందిరా నీకు ఇవ్వాళ - "విసిగిపోయి అడిగాడు.

"ఒంట్లో బాగోలేదు -"

"ఈ మధ్య తరచుగా ఒంట్లో బాగో లేదంటున్నావు. ఇలాగైతే ఎలా?"

"ఏం? నీకు ఇబ్బందిగా ఉందా? ఇంకెవరినైనా చూసుకుంటావా? చంపేస్తాను జాగ్రత్త!" బెదిరించింది సారిక.

ఈ మధ్య నీ ప్రవర్తన అర్థం కావడం లేదు - వాటీజ్ రాంగ్ విత్‌యూ"

"నాతోనే కాదు - నీతోనే... నాకడుపులో పెరుగుతున్నది మన బిడ్డ -"

"అరే! ఇంకా అబార్షన్ చేయించుకోలేదా? కలుపు మొక్కలు ఏరి పారెయ్యకపోతే - పంటలు ఎలా పండుతాయి. ఇలా బిడ్డలు గిడ్డలు అంటూ అవాంతరాలొస్తే మన జీవన పంట ఎలా పండుతుంది," కంగారుగా చెప్పాడు గోపీ.

"ఏం వాడుకున్నా బిల్లు కట్టాలిగా - మన సెక్సువల్ ప్లెజర్ బిల్లు చైల్డ్ బైగాడ్! కరెంటు బిల్లు కడతావు - ఫోన్ బిల్లు కడతావు గ్యాస్ బిల్లు కడతావు.. ఈ మాతృత్వపు బిల్లు ఎందుకు భరించవు?" సూటిగా అడిగింది.

"ఎందుకంటే - నేను భర్తను కాదు గాబట్టి - ముందే చెప్పుకున్నాంగా - పాత చింతకాయ పచ్చడిలాగా - మొగుడు పెళ్ళాలు అని - భార్య - భర్తలని అనుకోవడం బోర్ బోర్ అని మరిచిపోయావా - మనం ఫ్రెండ్సు - మనది సహజీవనం -" విసుగ్గా చెప్పాడు.

"ఎలా మర్చిపోతాను - పెళ్ళి చేసుకుంటే కదా తాళిబొట్టు ఉండటానికి -"?

"మరి ఎందుకు ఇప్పుడు - బిడ్డలు అంటావు?" తీవ్రంగా అడిగాడు.

"నేను స్త్రీని మీకెలా కొన్ని అవసరాలున్నాయో - స్త్రీగా నాకూ కొన్ని అవసరాలున్నాయి. అందులో మాతృత్వపు మాధుర్యం ఒకటి. మీకు లేంది నాకొకటి అదనంగా ఉంది. అదే గర్భకోశం," చెప్పింది.

"ఇవన్నీ నీకు ఇప్పుడెందుకు గుర్తొస్తున్నాయిరా - అప్పుడే మనం సహజీవనం మొదలెట్టి అయిదేళ్ళు దాటింది. నువ్వు కూడా మామూలు ఆడదానిలాగా ఆలోచిస్తే నీ ప్రత్యేకత ఏముంటుంది? మొన్న బాసు నచ్చలేదని బంగారం లాంటి జాబు మానుకున్నావు - మళ్ళీ ఇంకో జాబ్ కోసం వెతుకుతున్నావు - ఎన్నాళ్ళు పడుతుందో ఏమో రావడానికి."

"అరే! నువ్వేం వర్రీ కావద్దు - నా దగ్గర బ్యాంక్ బాలెన్సు ఉంది. నన్ను నేను పోషించుకోగలను. ఇంటి ఖర్చు చెరి సగంగా భరించగలను." కొంచెం విసుగ్గా చెప్పింది.

"అందుక్కాదు నే చెప్పింది - నీలో ఏదో మార్పు వస్తున్నది."

"ఏమో - ఇవ్వాళ డాక్టరు దగ్గరికి వెళితే ఓ బ్యాడ్ న్యూస్ చెప్పాడు - ఆరోగ్యం నెగ్లెక్టు చేస్తే నాకు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందిట. ముందు - ప్రివెంటివ్‌గా భారీ ట్రీట్ మెంటు తీసుకోమంటున్నాడు. రెండూ లక్షలు ఖర్చు రావచ్చు." సారిక చెప్పింది బాధగా.

గోపీ మొహం కళ తప్పింది. ఆలోచనల్లో పడిపోయాడు.

అతని మౌనాన్ని ఇంకో రకంగా అర్థం చేసుకుంది.

"ఏం బాధపడుతున్నావా? తగ్గిపోతుందిలే..." చెప్పింది.

"ఇంటి నుంచి లెటరు వచ్చింది... పెళ్ళి చేసుకోమని - పాతిక లక్షలు కట్నం ఇచ్చి పిల్లనివ్వడానికి రెడీగా ఉన్నారట - ఎంతైనా సాఫ్ట్‌వేర్ ఇంజినీరును కదా! అమెరికా ఛాన్సులు దండిగా ఉన్నాయి" గోపీ చెప్పాడు.

"ఓహో! అబ్బాయి గారికి పెళ్ళిమీద మోజు పోయిందా - అంతేలే - నాలుగు డబ్బులొస్తాయనే సరికి పాత స్నేహితురాలు కనబడ్డంలేదు - ఒరేయ్! అలాంటి తిక్కవేషాలేస్తే నేను ఊరుకునేది లేదు - కోర్టుకెళతాను" బెదిరించింది.

గోపీ నవ్వాడు చిన్నగా అడిగాడు.

"పిచ్చి సారికా! ఏమని వెళతావు? నేను నిన్ను పెళ్ళి చేసుకున్నానా? నీ మెళ్ళో తాళి కట్టానా - ఏమని నీకు నా మీద అధికారం ఉంది?"

"ఇరుగు పొరుగు లేరూ - మనం అయిదేళ్ళుగా కలిసి కాపురం చేస్తున్నది వాళ్ళు సాక్ష్యం చెప్పరూ?" సారిక సాలోచనగా చెప్పింది.

"ఏమని చెపుతారు - వాళ్ళ భాషలో మనల్ని ఉంచుకున్నవాళ్ళంటారు - నిన్ను నేను ఉంచుకున్నానట - నన్ను నువ్వు ఉంచుకున్నావట - మనకు పుట్టబోయే వాడు లం - కొడుకట - బాస్టర్డ్!"

"ఇవన్నీ నీ కెవరు చెప్పారు?" భయంగా అడిగింది.

"భూమి గుండ్రంగా ఉంది. ఎక్కడ ఏం మాట్లాడినా చివరికి అవి మనకే తగులుతాయి" చెప్పాడు.

"పోనీ ఇప్పుడన్నా రిజిష్టరు మ్యారేజి చేసుకుందాం!" ప్రాధేయపడుతూ అడిగింది సారిక.

"నో! నో! పెళ్ళి, పెటాకులు ఆ రొచ్చు మనకొద్దు. నీకు పడాలనుకుంటే ఎవరినైనా చేసుకో నాకు అభ్యంతరం లేదు. కానీ అప్పుడప్పుడు నన్ను కూడా కనికరిస్తూ ఉండు" చెప్పాడు గోపీ.

సారికకు ఒళ్ళంతా కారం పూసినట్లయింది.

లేచి అతని చెంప మీద బలంగా లాగి కొట్టింది.

గోపీ బిత్తరపోయాడు - తేరుకున్నాడు - వెంటనే తనమీద ఒంగి చూస్తున్న సారికను కాలితో బలంగా డొక్కలో తన్నాడు 'అబ్బా!' అంటూ ఎగిరి మంచం మీంచి కిందపడింది.

గిలగిల కొట్టుకోసాగింది.

"ఒరేయ్! నన్ను చంపేస్తావురా - నువ్వు నాశనం అయిపోతావు - కట్నం కోసం ఆశపడి నన్ను చంపుతావా? నీ అంతు చూస్తాను" బాధగా మూలిగింది.

కాసేపటికే ఆమె స్పృహ కోల్పోయింది.

గోపీకి భయం పట్టుకుంది ఆమెని రెండు చేతులతో ఎత్తుకుని కార్లో పడుకోబెట్టి కారు బయటకు తీసి ఓ నర్సింగ్ హోమ్‌కు బయలుదేరాడు.

ఎమర్జెన్సీ డాక్టరు చూసి సీరియస్ అన్నాడు.

గోపీ గుండెలు లబలబ కొట్టుకున్నాయి. ఒక గంట తర్వాత -

"అబార్షన్ అయింది. ఒకరోజు గడిస్తే గానీ ఏం చెప్పలేం - వాళ్ళ వాళ్ళు ఎవరన్నా ఉంటే రమ్మని కబురు చేసుకోండి" లేడీ డాక్టరు చెప్పింది.

"నేనున్నానుగా -" తడబడ్డాడు.

"మీరెవరు?"

"ఫ్రెండు..."

"అంటే - కడుపు చేసింది..?"

"ఆ! నేనే - ఆమెకు తోడు నీడ." చెప్పాడు.

"ఆమె భర్తలేడా!"

"నో! ఆమెకు పెళ్ళి కాలేదు - అన్నీ నేనే! మొగుడ్ని - ఫ్రెండుని అన్నీ నేనే!" కంగారుగా చెప్పాడు.

"సారీ! ఆమె తల్లిదండ్రుల్ని పిలిపించండి. మెడికో లీగల్‌కేసు అయ్యే లాగుంది - లేదా డిశ్చార్జి చేస్తాం తీసుకుపోండి." ఆమె చెప్పింది కటువుగా.

"అంత పని చెయ్యొద్దు - పిలుస్తాను" అంటూ కంగారుగా బయటకు వచ్చాడు.

జేబులోంచి డైరీ తీసి పేజీలు తిప్పాడు - నంబరు దొరికింది. సెల్ తీసి రింగు ఇచ్చాడు.

అప్పటికి రాత్రి మూడు దాటింది. చాలా సేపు రింగు అయింతర్వాత అటునుంచీ 'హల్లో' అంటూ ఓ గొంతు విసుగ్గా వినిపించింది.

"అంకుల్! మీ అమ్మాయికి సీరియసుగా ఉంది. మీరు అర్జెంటుగా హాస్పిటల్‌కు రావాలి!" కంగారుగా చెప్పాడు.

"నువ్వెవరు - మా అమ్మాయి ఎవరు?"

"హాలో మీరు రామనాధశాస్త్రిగారే కదా?" అనుమానంగా అడిగాడు.

"అవునయ్యా - అయితే -" ఇంకా విసుగ్గా అడిగాడు.

"అంకుల్ నన్ను గుర్తుపట్టలేదా - గోపీని - సాఫ్టువేరు ఇంజినీరుని... అదే మీ అమ్మాయితో షేర్డు అకామిడేషన్‌లో ఉంటాను -" గుర్తుచేశాడు.

"ఓ! సారిక ఉంచుకున్నవాడివా? అయితే నాకేంటి - అదెప్పుడో చచ్చిపోయిందిగా మా దృష్టిలో - కర్మ కూడా చేసేశాంగా -" కోపంగా అరుస్తున్నాడు - సారిక అమ్మ లేచినట్లుంది - అతన్నుంచీ ఫోన్ లాక్కుని అడిగింది.

"ఎవరు బాబు - ఎవరు కావాలి - అర్ధరాత్రి పూట అంకమ్మ శివాల్లాగా ఏంటి అర్ధరాత్రి ఫోన్లు -"

"సీతమ్మగారు - నన్నర్థం చేసుకోండి - మీ అమ్మాయి సారికకు సీరియస్‌గా ఉంది - అబార్షన్ అయింది - హాస్పిటల్లో చేర్పించాను. డాక్టర్లు వాళ్ళ వాళ్ళని పిలిపించమని చెప్పారు - నాకేం చేయాలో దిక్కు తోచడం లేదు - ప్లీజ్ - వెంటనే బయలుదేరి రండి - ఆలశ్యం అమృతం విషం?" ఆవేదనగా చెపుతూ ఉన్నాడు.

"సారీ! రాంగ్ నంబర్!" సీత ఫోన్ పెట్టేసింది.

మళ్ళీ ప్రయత్నించాడు - ఎంగేజ్ సౌండు వచ్చింది. అంటే రిసీవర్ తీసి పక్కన పెట్టేసి ఉంటారు.

వాళ్ళ వాళ్ళ దృష్టిలో సారికకు ఎంత విలువ ఉందో అర్ధమైంది.

లాభం లేదని తన తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు.

కాసేపటికి అతని తల్లి అనుసూయమ్మ ఫోన్ ఎత్తింది.

కొడుకు గొంతు వినగానే సంతోషపడింది.

"ఏరా బాగున్నావా? ఎప్పుడొస్తున్నావు -" అడిగింది.

"రావడమేమిటి - మీరే రావాలి - ఇక్కడ కొంపలు అంటుకున్నాయి" అంటూ సారిక కండిషను చెప్పాడు.

"మీ నాన్న వింటే మండిపడతారు - పోతే పోయింది లేరా పీడా వదులుతుంది. నీకు సంబంధం రెడీగా ఉంది కదా - నువ్వు రావడం ఆలశ్యం ముహూర్తాలు పెట్టుకుందాం -" చాలా తాపీగా చెప్పి ఫోన్ పెట్టేసింది.

బుర్ర వేడెక్కిపోయింది. ఎవరూ తమని ఆదుకోవడానికి సిద్ధంగా లేరు - కన్న బిడ్డల్ని ఆదుకోని తల్లిదండ్రులు తల్లితండ్రులా? 'కసాయి వాళ్ళు' కసితీరా తిట్టుకున్నాడు.

అతనికి తన కొలీగు వాసు గుర్తుకొచ్చాడు. రింగు చేశాడు. జరిగింది వివరించాడు.

"డోంట్ వర్రీ నేను వస్తున్నాను" చెప్పాడు.

చెప్పినట్లుగానే అరగంటలో వాసు అతని భార్య దీప వచ్చారు.

దీప గోపిని చూడగానే మొహం చిట్లించింది. అయినా అది సమయం కాదు కాబట్టి గమ్మునూరుకుంది. ఎందుకో అతని వాలకం ఆమెకు నచ్చదు.

"వాసూ! నువ్వు దేవుడివిరా. రేపు ఆఫీసులో బోల్డు పనుంది. ఇక్కడ ఈమెకు సీరియస్. సెలవు పెట్టడానికి లేదు" బాధగా చెప్పాడు గోపీ.

"అరే! నువ్వుండి మటుకు ఏం చేస్తావు? మంచి నర్సింగ్ హోమ్‌లో చేర్చావు డాక్టర్లు అంటెండవుతున్నారు - ఆపైన దేవుడున్నాడు నీ పాటికి నువ్వు ఆఫీసుకు పో - నేను మానడానికి లేదు - అంతగా అయితే మా దీపను ఇక్కడ ఉంచుతాను" చెప్పాడు వాసు.

"నేనొక్కదాన్నేనా - నాకు భయం -" దీప నిజంగానే భయపడింది జరగరానిది జరిగితే తనేం చేయాలని.

"ఏం కాదు సిస్టర్! జస్ట్ మోరల్ సపోర్ట్ - చేయాల్సిందంతా డాక్టర్లు చేస్తున్నారు - ఎంతైనా ఖర్చు పెడతాను -" గోపీ ఆమె చేతులు పట్టుకున్నాడు.

ఆమె విదిలించి కొట్టింది.

వాసు ఇబ్బందిగా చూశాడు.

"సారీ! నాకీ ఊళ్ళో కావల్సిన వాళ్ళు ఎవరూ లేరు - ఉన్నా అందరూ నన్ను వదిలేశారు - మీరే దేవుళ్ళు - మీ కాళ్ళు పట్టుకుంటాను, కాపాడండి" ఆవేశంగా ప్రార్థించాడు గోపి.

"అన్నయ్యగారు మీరేం దిగులు పడద్దు నేనుంటాను -" దీప మనసు కరిగి చెప్పింది.

ఎంత చెడ్డా వాళ్ళు ఆపదలో ఉన్నారు కదా మరి.

మరునాడు రాత్రికి గానీ స్పృహ రాలేదు సారికకు.

ఆమె కళ్ళు తెరిచే సరికి అందరూ సంతోషపడ్డారు. గోపికి గుండెల మీద కొండంత భారం దిగిపోయినంత సంతోషపడ్డాడు.

వారం రోజుల తర్వాత సారిక ఇంటికి చేరింది.

ఆ రాత్రి చెప్పాడు గోపి.

"సారికా నీ మెడికల్ బిల్లు - మూడు లక్షలు దాటింది.... నేనే ఖర్చు పెట్టాను. నీకు వీలును బట్టి ఇచ్చేస్తావుగా -" గోపి అడిగాడు.

సారికకు సర్రున కోపం వచ్చింది. దుఃఖం వచ్చింది.

"ఎందుకివ్వాలి? నేనివ్వను" చెప్పింది.

"అరే! నేనంత ఖర్చు పెట్టానురా నీకోసం -" ఆశ్చర్యంగా అన్నాడు.

"ఏం నా దగ్గర సుఖం దోచుకున్నప్పుడు నేను నీకు బిల్లు చేతికిచ్చానా? నా సుఖంలో భాగస్వామివైనప్పుడు నా కష్టంలో భాగం పంచుకోలేవా?" నిలదీసి అడిగింది రౌద్రంగా.

"కానీ మన ఒప్పందం ప్రకారం ఎవరి ఖర్చు వాళ్ళమే భరిస్తున్నాంగా..." గోపి లాపాయింటు లాగాడు.

"అదే నా బాధ! ఒక కుక్కకు అన్నం పెట్టినా జీవితాంతం విశ్వాసంగా ఉంటుంది. అటువంటిది నీకోసం నా సర్వస్వం నీకు ధారపోశాను. నాలుగేళ్ళు అయిపోయింది. ఇంకా నన్ను పరాయి దానిగానే చూస్తావు. నీ డబ్బు నా డబ్బు అంటూ. అస్సలు నాకు అనుమానం వస్తుంది - నువ్వు ఇష్టపడింది నన్నా - నా ఉద్యోగాన్నా - కడుపు ఎలాగూ పోయింది కాబట్టి మళ్ళీ ఉద్యోగం చేస్తాను. కాస్త జీతం తక్కువొచ్చినా ఫర్వాలేదు. ఈ ఒంటరితనాన్ని భరించలేకపోతున్నాను నేను" బాధగా చెప్పింది సారిక.

"అంతగా ఒంటరి తనం బాధపడేదానివి పెళ్ళి చేసుకో ఎవరినన్నా - నన్ను చేసుకోమని మా వాళ్ళు ఒకటే పోరుతున్నారు -" గోపి చెప్పాడు.

"ఇడియట్! ఎంత తేలిగ్గా చెప్పావు. నన్నెవరు చేసుకుంటారు? నువ్వు మొగాడివి కాబట్టి నిన్నెవరైనా చేసుకుంటారు - మరి నాసంగతో! బరితెగించిన ఆడది అని ముద్ర వేసి ఒక్క మొగ వెధవా పెళ్ళి చేసుకోడు" భోరున ఏడిచింది.

గోపి అదేమీ వినదల్చుకోనట్టు చాప - దిండు తీసుకుపోయి బాల్కనీలో వేసుకుని పడుకున్నాడు. చల్లగాలికి వెంటనే నిద్రపోయాడు.

సారికకు మటుకు నిద్రపట్టలేదు. తను తీసుకున్న నిర్ణయం తప్పా అని అనిపించసాగింది. ఆమెకు తల్లితండ్రులు గుర్తుకొచ్చారు.

వాళ్ళు తనకు చెప్పిన హితవులు గుర్తుకొచ్చాయి. కానీ తను వయసు వేడిలో వినలేదు. కాలేజీలో చదివిన పుస్తకాలు, స్నేహితురాండ్ర సహవాసం - చూసిన సినిమాలు తన మనసుని అదో రకంగా మార్చేశాయి. తన బంధువుల్లో - తన తల్లిదండ్రులను - వాళ్ళ సంసారాలను చూసిం తర్వాత పెళ్ళి అన్నది స్త్రీని బంధించడానికి మొగాడు కనిపెట్టిన కుట్ర అని తను అర్థం చేసుకుంది.

ఆ కుట్రకు లోను కాకుండా ఉండాలంటే - పెళ్ళిని తిరస్కరించాలనుకుంది. కానీ వయసు వేడి ఆగదుగా - ఆ వేడి తగ్గించుకోవాలంటే తనకు ఓ మొగాడు కావాలి. కానీ వాడు మొగడులా అధికారం చెలాయించకూడదు. తన మనసు అర్థం చేసుకుని మెసలు కోవాలి. పురుష అహంకారం చూపకూడదు.

ఉద్యోగంలో చేరినప్పుడు గోపీ పరిచయం అయ్యాడు. ఒక ఆరునెలలు అతన్ని బాగా దూరం నుంచీ గమనించింది. అతని మనసు అర్థం చేసుకున్నానుకుంది.

అతను రూము దొరక్క ఇబ్బంది పడుతున్నాడు - తను ఎక్కువ రెంటు కట్టలేక బాధపడుతున్నది ఇద్దరు కలిసి ఒక చిన్న పోర్షను తీసుకుంటే కలిసి వస్తుందని తీసుకున్నారు. ఆ తర్వాత వారి శరీరాలు వారి మాట వినడం మానేశాయి.

ఇద్దరూ చాలా ఉద్యోగాలు మార్చారు - ఇళ్ళు మార్చారు.

చూచాయిగా తెలుసుకున్న పెద్దలు నానా రచ్చ చేస్తూ ఉండేవాళ్ళు - కానీ తమ స్నేహాన్ని విడదీయలేకపోయారు.

నిజంగా గోపీ తనకు స్నేహితుడేనా - అంతకంటే ఎక్కువా? మరి మేనేజరు చెయ్యి పట్టుకుంటే తనెందుకు తిరగబడింది! అతను కూడా గోపీ కంటే అందగాడే - మంచి యవ్వనంలో ఉన్నాడూ. కేవలం సుఖం కోసం అర్రులు చాస్తూ ఉంటే అతని పక్కలో పడుకుని ఉంటే తనకు ఉద్యోగమూ ఉండేది - ప్రమోషన్ కూడా వచ్చేది. ఎందుకు తిరస్కరించింది.

ఆలోచనల్తో నిద్ర పట్టక డాక్టరిచ్చిన స్లీపింగ్ ట్యాబ్లెట్లు వేసుకుంది. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు.

తెల్లారి లేచింది. గోపీ అప్పటికే వెళ్ళిపోయాడు.

తన బాధ తల్లితో పంచుకుంటే గానీ తగ్గదు అనుకుని యస్‌టిడి చేసింది. చాలా సేపు రింగైయిన తరువాత అటునుంచీ ‘హలో‘ అని వినిపించింది చిట్టి చెల్లెలు కరుణ. ఇప్పుడే ఇంటర్‌లో ఎంటరయింది అది.

"కరుణా! నేనమ్మా సారికను - అమ్మలేదా?"

"అక్కా! బాగున్నావా! అమ్మా వాళ్ళు హైదరాబాద్ వెళ్ళారు - పెళ్ళికి..."

అంటే ఇక్కడికే వచ్చారన్నమాట. వాళ్ళు ఎక్కడికి వెళ్ళింది డిటైల్సు తీసుకుంది. కుశల సమాచారాలు అడిగి పెట్టేసింది.

కళ్యాణ మండపానికి పోతే దొరుకుతారు - కానీ చాలామంది బంధువులు అక్కడికి వచ్చి ఉంటారు. తన్ను చూస్తే రాబందుల్లా పీక్కుతింటారు.

ఆలోచించి - ఆలోచించి - చించి పక్క పోర్షన్‌కు పోయి తనకు తెలిసిన సుల్తానాబేగం నుండీ బురఖా తెచ్చుకుంది. నల్లటి బురఖా అంటే ఆమెకు బాగా సరదా! కారు తీసుకుని బయలు దేరింది. గంట తర్వాత -

బురఖా ధరించి ఆ పెళ్ళి పందిరిలోకి ప్రవేశించింది. తలంబ్రాలు జరుగుతున్నాయి. అందరూ పెళ్ళిలో హడావిడిగా ఉన్నారు - తండ్రిని చూసింది బంధువులతో జోకులు వేసుకుని నవ్వుతున్నాడు.

తల్లి అపరిచితులతో మాట్లాడుతున్నది.

సారిక ఆమె దగ్గరకు పోయి చేత్తో సైగలు చేసింది. ఆమెకు బాగా పరిచయం ఆ సైగలు ఎవరు చేయగలరో -

ఆమె వెంట బయటకు వచ్చింది చెట్ల దగ్గరకు.

"ఒసే బాగున్నావా! నిన్ను చూసి చాలాకాలమైంది" ప్రేమగా అడిగింది తల్లి "అమ్మా! నన్ను క్షమించమ్మా - నేను తప్పు చేశాను? మీ మనుషులు కష్టపెట్టాను - నా స్వార్థం చూసుకున్నాను?" ఏడుపు గొంతుతో అడిగింది సారిక

"అవన్నీ ఇప్పుడెందుకే - అల్లుడుగారొచ్చారా?" ప్రేమగా అడిగింది.

"లేదమ్మా! ఆయన అలా అనుకోవడం లేదు - కేవలం - తనొక ఫ్రెండుగానే భావిస్తున్నాడు - కష్టాల్లో పాలుపంచుకోడట -" వివరంగా జరిగింది, జరుగుతున్నది చెప్పింది సారిక తన తల్లిని కావలించుకుని.

తల్లి మనసు ఏడిచింది - కూతురి కన్నీరు తుడిచింది.

"ఇప్పుడు ఏం చేయాలమ్మా! ఆయన పెళ్ళికి సుముఖంగా లేరు. అట్లాగని నాతో ఇంక ఎంత కాలం ఉంటాడని అనుకోవడం లేదు. ఈ రోజు కాకపోయినా రేపైనా డబ్బుకు లొంగి మంచి సంబంధం చేసుకోవచ్చు - నా గతేం కావాలి - కుక్కలు చింపిన విస్తరిలా మిగిలిపోవాలా!" సారిక బాధపడుతూ అడిగింది.

"నేనేం చదువుకున్నాను - నేను కనీసం బడి మొహం కూడా చూడలేదు - మీ నాన్నగారు నిన్ను అతి గారాబంగా పెంచారు - మొదటి సంతానానివని తాహతుకు మించిన చదువులు చదివించారు - నువ్వు ఆదుకుంటావని. తీరా చేతికి అంది వచ్చావనుకున్న తరుణంలో నీకు ఏమైందో, ఆ గోపీగాడి వలలో పడ్డావు - నువ్వు మునిగిపోయింది కాక - కుటుంబానికి చెడ్డపేరు తెచ్చావు. నీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకు చాలా కష్టపడాల్సి వచ్చింది. కానీ వాళ్ళు సుఖంగానే ఉన్నారు - మీ తమ్ముళ్ళు కూడా బాగానే ఉన్నారు కాపురాలు చేసుకుంటూ.." చెబుతున్నది.

"అంతా బాగానే వున్నారు - మరి నా సంగతేమిటి?" ఆవేదనగా అడిగింది.

"ఇంట్లో ఎలుకలు పడ్డాయని ఇంటికి నిప్పు పెడతామా? పెళ్ళిలో కొన్ని లోపాలున్నాయని పెళ్ళినే బహిష్కరిస్తావుటే పిచ్చిదానా! పెళ్ళి అతి పవిత్రమైంది. అంతేకాదు ఆడదానికి పెద్ద రక్షణ! ఆమెకు కొన్ని హక్కులు కలిపిస్తుంది మొగవాడు పిచ్చివేషాలు వేయకుండా వాడికి పలుపుతాడు కడుతుంది. మూడూ ముళ్ళే మొగాడికి ముప్పయి ముళ్ళయి ఎక్కడికీ పోనివ్వవు. ఒకవేళ ఆ నియమాన్ని ధిక్కరించినా సమాజం ఊరుకోదు. ఆడదానికి అండగా నిలుస్తుంది. పెళ్ళి అన్నది మొగాడికంటే ఆడదానికి చాలా అవసరం - దాని మీద ద్వేషం పెంచుకున్నావు" సందు దొరికింది కదాని ఉపన్యాసం దంచుతున్నది సారిక తల్లి.

"అన్నీ నా కర్థమయ్యాయి - ఇప్పుడేం చెయ్యాలి?" బాధగా అడిగింది సారిక.

"కొన్ని పొరపాట్లకు మూల్యం చాలా భారీగా చెల్లించాల్సి ఉంటుంది. అతను కాదంటే నిన్ను స్వీకరించే వాడు వచ్చేదాకా ఎదురు చూడాల్సిందే.. అది నెలలు కావచ్చు - సంవత్సరాలు కావచ్చు." ఇంతలో ఆమె కోసం ఎవరో హడావిడిగా రావడంతో వెళ్ళిపోయింది.

సారిక కాసేపు ఎదురు చూసి వచ్చేసింది.

బాగా చీకటిపడ్డాక గోపీ ఇంటికి వచ్చాడు. వస్తూ వస్తూ ఓ గర్ల్‌ఫ్రెండును తెచ్చుకున్నాడు. ఆమె కుందనపు బొమ్మలాగుంది.

"సారికా - సారీ - మా ఫ్రెండు - రోజీతో కొంచెం బిజీగా ఉంటాను - మమ్మల్ని డిస్టర్బ్ చెయ్యద్దు -" బెడ్ రూము తలుపులు బిగించాడు లోపలికి పోయి రోజీతో.

సారిక నిశ్చేష్టురాలైపోయింది.

అర్ధరాత్రి బయటకు వచ్చిన గోపీకి సారిక కుర్చీలో కూర్చుని తదేకంగా తమ బెడ్‌రూము వైపు చూస్తూ కనిపించింది.

"సారీ - సారిక - ఏం చెయ్యను - ఈ మధ్య నువ్వు సహకరించడం లేదు... మొగాడన్న తర్వాత కొన్ని అవసరాలు - అలవాట్లు ఉంటాయిగా - సర్దుకుపోతుండాలి." నొచ్చుకుంటూ చెప్పాడు గోపి.

"నేకూడా రేపు తెచ్చుకోనా నా బాయ్ ఫ్రెండును?" కోపంగా అడిగింది.

"నీ పర్సనల్ మేటరు - నేనెవర్ని చెప్పడానికి!" నిర్లిప్తంగా అన్నాడు.

సారికకు ఏడుపు వచ్చింది ఏడ్చేసింది.

రోజీ టాటా చెప్పి వెళ్ళిపోయింది

సారిక గోపీని పట్టుకుని ఆ చెంపా ఈ చెంపా వాయించింది.

'సహజీవనం - సహజీవనం అంటూ మత్తు మందు పోస్తూ వచ్చావు. ఏ పేరు పెట్టీ పిలిచినా ఆ వ్యవస్థ మొగాడికే అనుకూలంగా ఉంటుంది అని నా కిప్పుడు అర్థమైంది. వయసు వేడిలో - నీ అందంలో పడి నేను నా సర్వస్వం కోల్పోయాను. ఆఖరికి నా తల్లిదండ్రులకు తీరని అన్యాయం చేశాను - ఇప్పుడిప్పుడే కళ్ళు తెరుస్తున్నాను- అంతా మాయ - వట్టి భ్రమ - మొగాడి ప్రేమ ఒక పెద్ద ఒయాసిస్సు. దాంతో ఎప్పటికీ దాహం తీరదు - మొగాడు స్వార్థపరుడు - తన అవసరం గడుపుకోవటానికి రకరకాల పేర్లు పెడతాడు - అమ్మ - చెల్లి - అక్క అంటాడు - వాళ్ళంతా కష్టపడితే తనొక్కడు సుఖపడతాడు - అందుకే గోపీ నేను వెళ్ళిపోతున్నాను - నువ్వేం చేసుకుంటావో నీ ఇష్టం -"

"మరి నా డబ్బులు -" అడిగాడు గోపి.

"ఛీ! సిగ్గులేదు ఆ మాట అడగడానికి. ఒక అమ్మా అయ్యకు పుట్టలేదా - నేను నీకు చేసిన సేవలకు విలువ కడితే నువ్వే నాకు లక్షల్లో బాకీ పడ్డావు! దానిలోంచీ నా ట్రీట్‌మెంటు ఖర్చు తీసేవేసి మిగతాది నాకు పంపించు - నీ దగ్గర అంత డబ్బు లేదంటావా - నీకు కట్నం డబ్బులొస్తాయిగా దానిలోవయినా పంపించు!" సారిక చిందులేసింది ఆవేశంతో.

"సారిక! నువ్వు చాలా ఆవేశ పడుతున్నావు బి ప్రాక్టికల్!" నచ్చచెప్పబోయాడు. ఆమెని తాకబోయాడు.

"నో! నన్ను ముట్టుకోవద్దు. నీ చేయి తగిలితే నాకు ఎయిడ్సు రావచ్చు రేపు నేను వెళ్ళిపోతాను - ఆ తర్వాత నువ్వేమన్నా చావు -" గట్టిగా అరిచింది సారిక.

గోపీ బెడ్ రూములోకి పోయి తలుపు వేసుకున్నాడు.

తెల్లారింది.

సారిక తన బట్టలు సర్దుకుంది ఒక సూట్‌కేసులో - ఇంకా కొన్ని వస్తువులు అట్టపెట్టెల్లో ప్యాక్ చేసింది.

గోపీ నిద్రలేచి జరుగుతున్నది చూస్తూ నిల్చున్నాడు.

"ఏయ్! మిష్టర్ - బండి తీసుకురా ఇవి తీసుకుపోవడానికి."

"సరే!" అని తలాడించించి బయటికి వచ్చాడు - మళ్ళీ లోపలికొచ్చి సారికను చూస్తూ "ఎక్కడికి అని చెప్పాలి?" అడిగాడు

"విమెన్స్ హాస్టల్!" చెప్పింది.

అతను మినీ లారీ తెచ్చాడు. సామాన్లు సర్దాడు డ్రైవరు లారీలోకి.

"గుడ్‌బై" సూట్ కేసుతో బయటకు నడిచింది.

కనీసం ఉండమని చెబుతాడని ఆశించింది - కానీ అతనిలో ఆ భావం లేదు.

"సారీరా సారికా ఆల్‌ది బెస్టు జరిగింది మర్చిపో! ఈ అయిదేళ్ళ సహజీవనాన్ని మధురస్వప్నంగా గుర్తుపెట్టుకో పెళ్ళి చేసుకుని సంసారంలో పడిపో! అన్నీ సర్దుకుంటాయి - టాటా!" నవ్వుతూ చెయ్యి ఊపాడు గోపీ.

సారికకు ఒళ్ళంతా కారం పట్టించినట్లు మంతగా ఉంది.

"యస్! పోనీ!" అంది కళ్ళు మూసుకుంటూ డ్రైవరును ఉద్దేశించి.

పెద్దలు ఏర్పాటు చేసిన సాంప్రదాయంలో కట్టుబాట్లు యొక్క విలువ ఆమెకిప్పుడు అనుభవంలోకి వచ్చింది.

కాలం అయిదేళ్ళు వెనక్కి తిరిగితే ఎంత బాగుండును అని ఆలోచిస్తున్నది సారిక.

పాశ్చాత్య దేశాల సాంప్రదాయాలని చూసి, పులిని చూసి నక్కవాత పెట్టుకున్నట్లు, మోజుపడి పోయే తనలాంటి వాళ్ళకు తన జీవితం గుణపాఠం కావాలని భావించింది సారిక. కానీ తననుకున్న పాపానికి తన వాళ్ళు ఎన్ని అవమానాలు భరించారో! పాపం!

జీవనపయనంలో ఆమె మరో మంచి మలుపు కోసం పోతున్నది. సారిక తన జీవననౌక ఏ ప్రమాదం లేకుండా ఒడ్డుకు చేరుకోవాలని ఇప్పుడు దేవుడ్ని ప్రార్థిస్తున్నది. ఆధునిక జీవితం పట్ల రోత కలిగింది స్వానుభవంతో.

## అపస్వరాల అనుబంధం

- డా. ఏల్చూరి విజయరాఘవరావు

"ఎక్కడున్నావే కంబళీ? - అంటే - వేసిన చోటే ఉన్నానే గొంగళీ!" అన్నట్టు కొందరి జీవితాలు కదలికే లేకుండా బండలా జడమై కరుడు గట్టుకు పోతాయి.... మరికొందరికి 'కదలిక' ఉగ్గుపాలతోనే పోసిన పస!

గుర్రబ్బగ్గీల్లా 'తుత్తు'మని సాగి, కార్లై, రైళ్ళై, విమానాలై, చివరకు 'మనోజం మారుతతుల్య వేగం'తో జీవన చైతన్య ప్రస్థానం చేస్తాయి బ్రతుకులు... ఈ జీవన చైతన్య బహురూపభ్రమణానికి మరో పేరే 'లోకం' మరి!

ఆలోచనలకు అంతులేదు....

నలభై మైళ్ళు దాటేసొచ్చాను....

మేము కూర్చున్న రైలు కూడా పవనసుతుని సముద్రలంఘనం లాగా గాలిలో ఎగురుతున్నదేమో! 'ధన్' ధనా' 'ఠకా' అంటూ పట్టాల మీద చక్రాల శబ్దం అద్భుత సంగీతజ్ఞుడు కీ.శే. పాలఘాట్ మణిగారి మృదంగంలాగా 'త్రిశ' 'మిశ్ర' 'సంకీర్ణా'ది జతులలో కుడి ఎడమలకు మమ్మల్ని నాట్యమాడిస్తోంది....

తోటిప్రయాణీకుల వాలకం, ఇంకా కాస్త తీక్ష్ణంగా అవలోకిస్తే, అతి చతురమైన కథా వస్తువు జనిస్తోంది... అదొక దృశ్యనాటికకు నాంది!

'గుర్రులు' గొడుతూ నిద్రపోతోందొక ముసలమ్మ...

కర్రబట్టుకుని ఝుడిపిస్తున్నాడొక ముసలాయన, తన సీట్లో ఇరుక్కుంటున్న వాళ్ళతో సమరం చేస్తూ....

కుర్రకారు కిటికీలోంచి చెట్లూ చేమలూ, కొండలూ కోనలూ పరిగెడుతుంటే, వాటి శృతిలయల్లో అతికీ అతకని సినిమా పాటల అను పల్లవీలు నెమరేస్తూ కూనిరాగాలు తీస్తున్నారు...

నరసరావు పేట నుంచీ బెజవాడకు ప్రయాణం అప్పుడే జరిగిందీ విచిత్ర ఘటన! - నా కుడివైపు కూర్చున్న పెద్ద మనిషి, ఆ కుర్రాళ్ళ గుంపులోకి చేరుకుని, పక్కవాళ్ళేమనుకుంటారో - అన్న ప్రశ్నే లేకుండా, తనూ కూనిరాగాలతో మొదలెట్టి, అతికర్కశమైన రైలు కూతల్లా ఆరోహణావరోహణలు సంధించుకున్నాడు!

"శిశుర్వేత్తి పశుర్వేత్తి, వేత్తిగానరసం ఫణిః"

నాకూ సంగీతమంటే మహా ఇష్టం గనక, అతన్ని, తన పాట ఆపమనడం నాకు సబబుగా తోచలేదు. అందరికీ సమాన హక్కులుగదా... కర్మఫలాన్నాశించకుండా స్వానందం కోసం సృజనాత్మకతకు ఉబలాటపడుతున్న అతన్ని చూస్తూ, వింటూ, మౌనముద్ర ధరించాను....

అపస్వరాలు మిన్నంటుతున్నై!!

గుంటూరు స్టేషన్ రాగానే చటుక్కున అనాయాచితంగా తన "విజిటింగ్ కార్డు"ను నా చేతిలో అతికించి అతిద్రుతలయలో స్వపరచిత వాక్యాలు వినిపించి, హరికథా భాగవతార్‌లాగా చిందులు తొక్కుతూ గేటు బైటకి నిష్క్రమించాడతను!

సంభాషణల సారాంశమిది...

నన్ను గురించి విన్నాడట....

"మీలాంటి పెద్ద మనుషుల సాంగత్యంలో అనుకోకుండా ఆవేశం పొంగి పొంగి, రాగం తానం పల్లవి - వాటంతటవే రక్తీ ముక్తీ కలిగిస్తాయి స్వామీ! అది నా అదృష్టం.... కాగా - ఏ ఉత్సవాల్లో అయినా సరే, నా పాట కచ్చేరీ పెట్టించే అవకాశముంటే బేరాలాడకుండా స్టేజి మీదికెక్కేస్తాను సార్!"

"తప్పకుండా"

"సెలవు మరి"

కనుచూపు మేరకు దూరమయ్యాక, జేబులోంచి అతని "విజిటింగ్ కార్డు" తీసి చూశాను!

చామరాజ చంచయ్య భాగవతార్

సంగీత విద్వాంసుడు

అడ్రసు... టెలీఫోన్ నం....

Truth Is Stranger Than Fiction!

రైల్లో తారసపడ్డ ఆ పెద్ద మనిషి జీవన గీతంలో 'ప్లస్' పాయింట్లకన్నా 'మైనస్'లే మదించి మదించి, అతని (అహంకారం) ఆత్మవిశ్వాసాన్ని అంకుశం లేకుండా పెంచేశాయనుకుంటా...

ఎవరి జీవితాల్లోని లోతుపాతులు వాళ్ళకే తెలుస్తాయి, సాధారణంగా... రచయిత సిద్ధహస్తుడైతే, ఇతరుల జీవితాల్లోని నిగూఢమైన విషయాలను కూడా తొంగిచూడగల నేర్పరి అవుతాడు...వివిధమైన పంథాలూ, విచిత్రమైన స్త్రీ పురుషుల సంబంధాలూ, ప్రకృతి నవ్వినా ఏడ్చినా ప్రతి క్షణమూ సంచలనం కలిగించే బ్రతుకు జలపాతపు ఒడుదుడుకులూ, మనిషి గుండెపోటుల్లో ప్రతిధ్వనించే మమతల నిర్వాణాలూ - ఇలా లోకం పోకడ చూస్తూ చూస్తూ కలం కదులుతుంది. గొప్ప వాళ్ళను గురించి రాస్తూనే ఉంటారు. తరాల తరబడి మనం చదువుతూనే ఉంటాం. త్యాగరాజు, తాన్‌సేన్ ప్రభృతులను గురించి తెలియని వాళ్ళు అరుదుగదా... అయినా, ఉబుసుపోకకు, ఊరూ పేరూ లేని ఈ రైలు గాయకుణ్ణి గురించి ఆరా తియ్యాలని కుతూహలం పెరిగిందెందుకో! అంతులేనన్ని కొత్త 'స' 'రి' 'గ' 'మ' ల ఆవిష్కరణం జరిగింది! ఈ వినాయక చవితి సెలవుల్లో నా దైనందిన చర్యల ఒత్తిడి నుంచీ విముక్తి పొంది, అతని "విజిటింగ్ కార్డు" ఆధారంగా ఎదుర్కొన్న అపస్వరాల దాడి ఫలితమో ఈ అనుబంధం! -

చదివినవారికి చలిమిడి పాకం!

"గార్ధభ స్వరభూషణు"లనీ, "ఖరకంఠీరవు"లనీ, తమతమ ప్రత్యర్థుల తాత ముత్తాతలను తూర్పారబోస్తున్నారీ మధ్య కొందరు గాయకులనే నాయకులు! - వాస్తవంగా వాళ్ళకు కళలకన్నా రాజకీయాల్లోనే ఆత్మీయత... ఇతరులను దూషిస్తే తమకు పేరు ప్రతిష్ఠలు పెరుగుతాయన్న పిచ్చి నమ్మకం... అలాంటి నిశితమైన చేదుగుణాల కుటుంబమే అతనిది...

తెలియని బాల్యం నుంచీ తిట్లకు, పొగడ్తలకూ భేదం సంగీతమంటే చెవికోసుకునే చంచయ్యకు నోరు తెరిస్తే పాడాలనిపిస్తుంది పాపం! సామగానం కూసు విద్యా మరి!? కడుపునిండా నేర్చుకోవాలి అందుకు, ఆరితేరిన గురువు కావాలి... అలా నేర్చుకున్న, కోయిల కూతల్లా శృతులో పలుకుతూ, పక్కవాళ్ళనిట్టే రంజింప జేయగలమన్న గ్యారంటీ అందరూ ఇవ్వగలరా, మరి! - ఏ కొందరికో అది

భగవద్దత్తం! ఏమైనా సరే, చంచయ్యపట్టు జలగపట్టు... వదల్లేదతను! పొద్దున్లేస్తే నిద్రపొయ్యేదాకా వంశపారంపర్యంగా వాళ్ళ నాయనమ్మ నేర్పిన సరళీ స్వరాల దగ్గర్నుంచీ, సబ్బులమ్మే పాటల్దాకా సాధన చేస్తూ పోయేవాడు...

ఏళ్ళు ఎదుగుతున్నా బాల్య చాపల్యం పోవడం లేదెందుకో... కొద్దో గొప్పో చదువుకుంటూ, స్కూల్లో కూడా, చనువు దొరికితే చాలు "పాడ్తా"ననేవాడు! కొందరికది బెదిరింపులా భయపెట్టేది! కిటుకు తెలిసిన మరికొందరు చంచయ్య సంగీతాన్ని తెగపొగుడుతూ, అతని 'స' 'రి' 'గ' 'మ'ల్లోని గరళాన్ని మందులా వాడుకునేవాళ్ళు! అంటే - మచ్చుకు;

ఒకరి ఇంట్లో అద్దెకున్న అఘోరంగారు, "కావాలో మొర్రో" అన్నా, ఇల్లు ఖాళీ చెయ్యకుండా, ఆ ఇంటి యజమానిని ముప్పతిప్పలు పెడుతుంటే, ఇంటాయన, చంచయ్యకు డబ్బిచ్చి పిలిపించి

"పక్కింట్లో కూర్చుని పాడుతూ పోవయ్యా" అన్నారు.

అంతే...

వారం తిరిగే లోపల, ఒక్క అఘోరమేకాదు, వారి ఇరుగూ పొరుగుగున ఎందరో ఇళ్ళు మారినట్లు పి.టి.ఐ. వార్త! మహామారిలాంటి మహత్తుందన్న మాటట చంచయ్యపాటల్లో!

భక్తిగల ప్రజానీకం ఈ ఏడుకూడా పక్క ఊళ్ళో వినాయక చవితి సంబరాలు 'దూమ్' 'ధామ్'గా జరుపుకుంటున్నారు. గల్లీ గల్లీలో గాత్రకచ్చేరీ లేర్పాటవుతున్నై. పర్వదినాలు ముగిసిన వెంటనే ఎలక్షన్లు గూడా! ఓట్ల కోసం నోట్ల కట్టలు ఖర్చుపెడుతూ, పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్ కావాలని ఉవ్విళ్ళూరుతున్నారు ఉమామేశ్వరంగారు ఆయనకూ సంగీతానికీ 'మార్జాల మూషిక' సంబంధమైనా, తన పనికోసం గాడిదకాళ్ళు పట్టుకున్న వసుదేవుడిలా, ఈసారి సంగీత ముతాల శరణ్యం వేడుకున్నాడాయన అదెలానంటారా? -

పాడ్తానన్న ప్రతివాడికీ, 'వద్ద'నకుండా, కచ్చేరీల 'ఛాన్స్' ఇచ్చేశాడు... పాటవినడానికి జనం చేరుకోగానే, గాలంతో చాపలు పట్టినట్టు, స్వయంగా తనో, లేక తన ఏజంటో, వినాయకుని మహిమతో పాటు ఎలక్షన్ల మహిమ రంగరిస్తూ సొంత డబ్బా కొట్టుకోవాలి... చిట్టస్వరాల ధాటి కమ్మగా పాకంలో పడి, తాళవాద్య కచేరీ తడాఖా చూపించిన వెంటనే "ఉమామహేశంగారికి జై" అని, కరతాళధ్వనులు - జనం వున్నా, లేకపోయినా, ముందుగా రికార్డు చేసి పెట్టినవి - ప్రతిధ్వనిస్తాయి.... చెప్పాల్సినదంతా చెప్పి, ఓట్ల వరదానం కోరుకున్నాక కచ్చేరీలో మిగతా భాగం ముగించి, ఆరతి పళ్ళెం పట్టుకొస్తారు

"పవమాన సుతుడు బట్టు
పాదార విందముకకూ,
నీ నామ రూపములకూ
నిత్య జయమంగళం"

అప్పుడు నోట్ల వర్షం! ఆనాటి ఖర్చు వసూలైతీరుతుంది! భక్తజనం లేచి నుంచుని, భగవంతుడికీ, హాజరైన నేతగణానికీ పాద నమస్కారాలు చేసి, ప్రసాదం పుచ్చుకుని నిష్క్రమిస్తారు. ఉమామహేశంగారి జనన విశేషాలచ్చయిన కాయితంలో చుట్టిన అక్షింతలూ, పూలూ, నలుదిశలకూ ప్రసారమవుతాయి.

అనుకోకుండా ఈసారి చంచయ్య భాగవతార్ గారికి కూడా 'ఛాన్స్' దొరికిందండోయ్! వీరి గాత్ర ప్రతిభ ఇదివరకే చవిచూచిన కొందరు "ఎదురు పార్టీవాళ్ళ ఎలక్షన్ మీటింగ్ ప్రాంతాల్లో పిట్టవాలకుండా, జనాన్ని హడలు కొట్టడానికి, విరోధి పక్షం వాళ్ళాయనకు ఆహ్వానం పంపారు" అంటున్నారు! నిజానిజాలు గమనిద్దాం...

యావత్ప్రపంచంలో
మొట్ట మొదటిసారి,

దక్షిణ తీసుకుని, అధికార రీత్యా,

తను స్టేజీకెక్కబోతున్నాడంటే, మాటలా మరి!! మునుపో పేషెంటు, డాక్టర్‌గారి దగ్గరకెళ్ళి "అయ్యా! ఇది నా మొదటి 'ఆపరేషన్... జాగ్రత్త, స్వామీ!" అనగానే, ఆ వైద్యుడు జవాబిచ్చాట్ట "భయపడకోయ్! నేనూ, మొదటి ఆపరేషనే చేస్తున్నాగదుటోయ్!"

కాగా -

పదిరోజులకు ముందట్నుంచే, గణపతి దేవుని గుడిచుట్టూ నూటొక్కప్రదక్షిణాలు రోజూ చేసి, పాడబొయ్యే పాటొక్కింటికీ నూటొక్కసార్లు వల్లించుకున్నాడు చంచయ్య...

ఇహ, పాటెల్లా పాడినా

విఘ్నానికి తావులేదు!! -

సాయంత్రం కచ్చేరీ గాబట్టి శాంతంగా సావధానంగా సాధన చేసుకుంటూ కదలొచ్చుగనక, ఒక ఎడ్లబండిని 'భాడా'కు తీసుకుని, పాటలు వల్లిస్తూ పరవశుడై, కచ్చేరీ కార్యరంగానికి చేరుకున్నాడు చామరాజు చంచయ్య భాగవతార్!

ఆ నాలుగు మైళ్ళూ నాలుగు తరాలుగా గడిచాయి బండివాడికి!

అదొక పాత శిధిలం. ఆర్క్యాలజీ డిపార్ట్‌మెంట్ వాళ్ళు ఆదుకున్నట్టు లేదు.... చిమ్మినా పోని చెత్తా -చెదారం తాలూకు (సు) గంధం, సంవత్సరానికొకసారైనా జనం ఆఘ్రాణించవల్సిందే, ఇక్కడ...

అడగడమే తడవుగా, కచ్చేరీలకు కాణీ ఖర్చు లేకుండా పర్మిషన్ దొరుకుతుంది... కొన్నేళ్ళుగా ఎలక్షన్ వాళ్ళ 'అడ్డా' ఇది...

గుమ్మం ముందర ఎలెక్షన్ విజ్ఞాపన కాయితాలు పంచేందుకు ఆడ వాలంటీర్లు... పాటల కచ్చేరీల ధ్వనులతో మాట్ల కచ్చేరీల ధ్వనుల పోరాటం... ఘర్షణ! కల్లోలం! అయోమయం!.... "విఘ్నేశ్వరునికీ జై... ఉమామహేశ్వరునికీ జై" అన్న నినాదాలు... మద్దెల దరువులు చుట్టుముట్టి మత్తెక్కినట్టు నుంచుని చూస్తున్న చంచయ్యకు "పక్క గుడి సందులో పాడమ"ని తాఖీదొచ్చింది.

ఎక్కడైతేనేం... తనకు పాడడం ముఖ్యం...

ఏమి 'ఎక్సైట్‌మెంట్'!!

మూసిన కళ్ళు తెరిచినట్టే లేదు!

కొత్త మద్దెల దెబ్బతో, మళ్ళీ స్మృతి వచ్చింది! ఒక్కసారి కుడి ఎడమలకు మెడతిప్పి పరికించాడు... పక్క వాద్యాల వాళ్ళు శృతి చేసుకుంటున్నారు...

వాళ్ళ మినహా, ముగ్గురే ముగ్గురు కూర్చున్నారు హాల్లో! చంచయ్యకు ఆర్గనైజర్ మీద పట్టరాని కోపం వచ్చింది, కానీ, సంగీత సృష్టికి కోపం వినాశకారణం కదా! తన్ను తాను ఓదార్చుకుని "ఇలాంటి సమయంలోనే ధైర్యం కావాలి.... మహా మహాత్మ్యంగల విఘ్నేశ్వర భగవానుడి పర్వదిన సందర్భంగా తనకీ 'ఛాన్స్' దొరికింది. సద్వినియోగం చేసుకుని తీరాలి. కనీసం ముగ్గురైనా (తన) సంగీత ప్రియులున్నారు కదా ఈ ఊళ్ళో..." అనుకుని, పాట మొదలెడదామనుకుంటూ, ప్రేక్షకులలో కూర్చున్న మొదటి పెద్దమనిషిని ప్రశ్నించాడు చంచయ్య

"అయ్యా! నమస్కారం! మీరేమీ అనుకోకపోతే, మీకు నా సంగీతం ఎందుకు వినాలనిపించిందో కాస్త చెపుతారా?"

మొదటాయనన్నాడు సీరియస్‌గా "స్వామీ! మీ సంగీతం మాట నాకు తెలీదు... మీ తర్వాత నన్నుపాడమని, ముందే డబ్బిచ్చి పంపించారిక్కడికి. అందుకే, గత్యంతరం లేక కూర్చున్నా"

కొంచెం గాభరాపడ్డాడు చంచయ్య... ఏంతోచిందో, 'తక్కు'న రెండో పెద్దమనిషిని కూడా అడిగేశాడు

"మరి మీరెందుకుకూర్చున్నారని?"

"పండగ హడావిడిలో ముందు జాగ్రత్త నయం కదండీ! ఇక్కడ ఖాళీ కుర్చీలూ, మీరు కూర్చున్న తివాసీ - అన్నీ నావే... మీరు లేస్తేనేగా, అవితీస్కెళ్ళడం..."

శ్రీ గణేశ... శ్రీగణేశ... శ్రీగణేశ...

ముచ్చెమటలు పోస్తున్నై...

మరిమూడో ఆయనో!!-

"అంత మతిమరుపైతే ఎలా బాబూ! దోవపొడుగునా మా ఎడ్లు బెదురుతున్నా మీరు పాడుకుంటూనే వచ్చారు! - మిమ్మల్ని దేనికి ఇబ్బంది పెట్టడం - కచ్చేరీ అయ్యాక మీరు మీ 'ఫీజు' వసూలు చేసుకుంటే, నాకూ మరో నాల్గుకాసులు ఎక్కువ ఇస్తారేమో, వాపసుక్కూడా నా ఎడ్లబండిలోనే తీసుకుపోదామని, కూలీ అడగకుండానే కూచునిపోయానిక్కడ" అన్నాడతను!

చంచయ్య భాగవతార్ గారి కచ్చేరీని గురించి విమర్శకులేం రాశారో, ఉమామహేశ్వరంగారు ఎలక్షన్లలో గెలిచారో లేదో... వగైరా వగైరా.......... వివరాల కోసం, అప్పటిన్యూస్ పేపర్లన్నీ గాలిస్తూనే ఉన్నానింకా... తెలిస్తే మీరే చెప్పాలి...

మరోమాట...

క్షమించాలి...

మహానుభావులైన మన సంగీత వాగ్గేయకారకులు, తరాలుగా, తోటివాళ్ళను మైమరపించి, కోటి కోట్ల ప్రజలలో సుహృద్భావాన్ని పంచే సునిసితమైన అమృతవర్షిణిప్పుడూ, రైలు కూతల సరిగమలతో, బాంబులను పేల్చే లయవిన్యాసాలతో గుండెలదరగొడుతోంది! సినిమాల కెళ్ళండి... కచ్చేరీల కెళ్ళండి... చోటు మార్చినా ప్లేటు మార్చక, 'సెక్స్', 'క్రైమ్'ల శంఖారావమూదుతోంది! సిసలైన రామరాజ్యమొచ్చేదాకా, ఈ అపస్వరాల అనుబంధ శృంఖల మనకు తప్పదేమో! నీడ నిజమనే భ్రమతో జాడ కోల్పోతున్నాం మనం!

స్వప్న జనిత రాగంలో
స్వనితమైన అపస్వరాలను
పునీతమైన అనాహతంతో
పునఃశృతి చేసుకుంటూ
చీకటి వెలుగుల మధురిమ
చిరస్మరణీయం చెయ్యాలిక.

## ప్రాజ్ఞి

**- పొన్నాడ కుమార్**

## ఉగాది కథల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

**పంకజం ఒంటరిగా పడుకుని,** బంగారయ్య ఎప్పుడు తిరిగొచ్చేదీ మరోసారి రోజులు లెక్కపెట్టుకుంది.

వారం రోజుల్లో తిరిగొచ్చేస్తానంటూ పంకజానికి ఇల్లంతా అప్పచెప్పి, పుణ్యనదుల్లో భార్య అస్థికల్ని కలపడానికి బంగారయ్య మొన్ననే బయల్దేరి వెళ్ళినా పంకజానికి ఎన్నాళ్ళో అయినట్లనిపించింది. బంగారయ్య వెళుతూంటే, గతంలో అతడికి తప్పిన ఓ జలగండాన్ని గుర్తుచేసి, పంకజం అతడికెన్నో ముందు జాగ్రత్తలు చెప్పింది. బంగారయ్య కూడా తన దగ్గర పాతికేళ్ళ నుండీ నమ్మకంగా పనిచేస్తున్న సీనియర్ గుమాస్తా జోగయ్యను పిలిచి, బయట వ్యవహారాలతో పాటు ఇంట్లో ఒక్కర్తే ఉండే పంకజం అవసరాలను కూడా చూస్తూండమని చెప్పి వెళ్ళాడు.

బంగారయ్య భార్య నెల్లాళ్ళ కిందట వైజాగ్‌లో పోయిందన్న కబురందగానే, పంకజం రాజమండ్రి నుండీ వైజాగొచ్చింది. పంకజమే శవానికి స్నానం చేయించి, ముత్తైదువ అలంకరణ చేసింది. పిల్లల్లేనందున బంగారయ్యే, భార్యకు తలకొరివి పెట్టి కర్మంతా చేశాడు. దశాహం నాడు ధర్మోదకాలు ఇచ్చాడు. దండిగా దశదానాలు చేశాడు. పన్నెండో రోజున ఇంట్లో బంధుమిత్రులకు ఘనంగా సంతర్పణ చేశాడు. ఇంటి ముంగిట పేదలకు తృప్తిగా అన్నదానం వస్త్రదానం చేశాడు. మగవాళ్ళకు అతడు దోవతులు పంచితే, ఆడవాళ్ళకు పంకజం చీరలు పంచింది. పిల్లలున్న తల్లులకు అదనంగా పాలప్యాకెట్లిచ్చింది. బంగారయ్యకు చేదోడు వాదోడుగా ఉంటూ పరామర్శింప వచ్చిన వాళ్ళందరికీ ఆత్మీయతను కూడా పంచింది. పన్నెండురోజులు ఇంటా బయటా పంకజం నిర్వహించిన పాత్ర పలువురిని అబ్బురపరిచింది.

పెద్దవారింట చావు కూడా పెళ్ళితో సమానమే అన్నారు చాలామంది. బంగారయ్యను నిజంగా బంగారు బాచీ అన్నారు. పంకజాన్ని సాక్షాత్తు బంగారు తల్లే అన్నారు. ఈ 'బంగారు తల్లి' బిరుదు, ముప్పయ్యేళ్ళ కిందట అగ్నిసాక్షిగా పరిణయమాడిన బంగారయ్య ధర్మపత్నికి లభించలేదు. పన్నెండేళ్ళ కిందట గోదావరి సాక్షిగా బంగారయ్య చే(యి) పట్టిన పంకజానికే ఇప్పుడు దక్కింది.

పంకజం వైజాగొచ్చి, బంగారయ్య ఇంట్లో ఉండడం ఇదే ప్రథమం. బంగారయ్యే పంకజం దగ్గరకు రాజమండ్రి వెళ్ళేవాడు. ఇటుపై పంకజం వైజాగులో బంగారయ్య ఇంట్లోనే శాశ్వతంగా ఉండదలచుకుంది.

బంగారయ్య విలాసపురుషుడని పంకజానికి తెలుసు! వ్యసనపరుడనీతెలుసు. మొదట్లో పిత్రార్జితాన్ని తగలేశాడు. చేస్తున్న వృత్తివ్యాపారాన్ని నిర్లక్ష్యం చేశాడు నష్టాల ఊబిలో కూరుకుపోయాడు. అయితే తన సాంగత్యం లభించిన తర్వాత అతడు కొంత మారినట్లు తెలిసి పంకజం సంతోషించింది. తన సలహాలు, వాణిజ్య వ్యాపార రంగాల్లో అతడి స్పెక్యులేషను ఫలించి గత పదేళ్ళుగా అతడు పట్టిందల్లా బంగారమే అవుతూంటే పంకజం ఎంతో గర్వించింది.

'ఇదంతా నీ మహత్వమే! నువ్వు పంకజానివి కావు; పద్మశ్రీవి! కనకమహా లక్ష్మివి కన్నె బంగారానివి' అంటూ అతడప్పుడప్పుడు శ్లాఘిస్తూ పలికిన మాటలు ఇప్పుడేకాంతంలో జ్ఞాపకం రాగా తన యాభై ఏళ్ళ వయసునే క్షణకాలం మరచిపోయింది పంకజం.

బంగారయ్య ఇప్పుడు విధురుడు. అతడికి కాబోయే ద్వితీయంగా పంకజం త్వరలో ఆరంభం కానున్న తన కొత్త వైవాహిక జీవితాన్ని, తద్వారా లభించే సాంఘిక ప్రతిపత్తిని తలుచుకుంటూ బంగారయ్య కోసం ఎదురు చూస్తూంది. అతడెక్కడా మళ్ళీ కాలు జారకుండా, దారి తప్పకుండా క్షేమంగా, శీఘ్రంగా తిరిగి రావాలనీ కోరుకుంది. ప్రయాణంలో ఉన్న అతడికి ఫోను చేసింది. జవాబు లేదు. కంగారు పడింది. అసుర సంధ్యలో పడుకోకూడదని లేచి కూచుంది...

గది తలుపు తట్టిన శబ్దం.

బంగారయ్యే వచ్చేశాడనుకుంది.

లేచొచ్చి తలుపు తీసింది.

ఎదురుగా నమస్కరిస్తూ ఓ ఆడపిల్ల ప్రత్యక్షం. జోగయ్యగారి కూతుర్నని పరిచయం. లోపలికి రమ్మంది పంకజం.

ఆ పిల్ల తన 'గోడు' వెళ్ళబోసుకుంది. ముగింపు వాక్యంగా "ఈ గండాన్ని గట్టెక్కించి నన్ను రక్షించండమ్మా! నా భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంది" అంటూ ప్రాధేయపడింది.

పంకజం ఆ పిల్లను మొదటి సారి 'సంతర్పణ' రోజున బంగారయ్య ఇంట్లోనే చూసింది హుషారుగా, చలాకిగా తిరుగుతూ చిన్న చిన్న పనులు చక్కబెడుతూ కనిపించింది. తననూ, తన పెద్దరికపు పోకడల్నీ ఎంతో ఆసక్తితో గమనించినట్లు పంకజానికిప్పుడు స్ఫురించింది.

బంగారు బొమ్మలాంటి ఆ అమ్మాయి ఇప్పుడు తన గదిలో కాలిడుతూనే తనను 'అమ్మా' అని సంబోధించినప్పుడు పంకజానికి కమ్మని అనుభూతి కలిగింది. అయితే ఆ పిల్ల చెప్పిందంతా విన్న తర్వాత ఆమె తనకూ ఓ సమస్యగా పరిణమించినట్లు పంకజం ఆందోళన చెందింది. అయినా ఆ చిన్నారికి పిన్న వయసులోనే కలిగిన మానసిక సంక్షోభం, అందుకు ప్రతిగా నిలుపుకున్న ధైర్య సాహసాలు పంకజానికి కొత్త ఊపిరులు పోశాయి. ఆ కన్నెపిల్లనెలాగైనా ఆదుకోడానికి అనువైన మార్గాలను అన్వేషిస్తూనే ఆ పిల్లకు అభయహస్తం చూపించింది.

ఆ అమ్మాయి వెళ్ళగానే, పంకజం మార్కెట్లోని బంగారయ్య ఆఫీసుకు ఫోను చేసింది. పదినిమిషాల్లో పంకజం ఎదుట జోగయ్య ప్రత్యక్షమయ్యాడు. ఉదయం ఆఫీసులో తన గైర్హాజరకు కారణం అడిగితే బంగారయ్య బాబుగారి పనిమీదే పై ఊరెళ్ళొచ్చిన సంగతి చెప్దామనుకున్నాడు, అయితే ఆ పనేమిటో ఎవరికీ చెప్పాల్సిన అవసరం లేదని బాబుగారు ముందే హెచ్చరించారు.

పంకజం అంటే జోగయ్యకు సదభిప్రాయం తక్కువ. ఎవరు పెట్టారోగానీ ఆమెకా పేరు అక్షరాలా సరిపోతుందని ఇదివరకే అనుకున్నాడు. ఇప్పుడామెను బంగారయ్య బాబుగారి పడకగదిలో మరీ చేరువగా చూస్తుంటే పూర్వపు అంచనాలను మించి ఎంతో దూరం ఆలోచించవలసి వచ్చింది.

'తామర పువ్వు బురదలో పుడుతుంది. పంకజం అలా ఎక్కడ పుట్టినా, ఎలా పెరిగినా ప్రస్తుతం రాజమండ్రిలాంటి రంగుల పట్నంలో యుక్తిగా, ధైర్యంగా బతుకుతోంది. ఎంత జాణకాకపోతే, పన్నెండేళ్ళ కిందట బంగారయ్య బాబుగారు గోదావరి పుష్కర స్నానానికెళ్ళి, రేవుకాడ బురదలో కాలుజారి పడబోతే, అతడి చేయి పట్టుకులాగి తన ఒంటి బురదను అంటించగలుగుతుంది!? ఆయన ప్రాపకం ధర్మమా అని ఆమెకక్కడో చిన్న ఇల్లూ, బ్యాంక్ అక్కౌంటూ ఉండగా ఇప్పుడిక్కడకొచ్చి ఓ రకం ధర్మకర్తలా గుడినీ, గుడిలో లింగాన్నీ మింగెయ్యాలని చూస్తూంది. ఈ దివాణంలో ఇటుపై ఏ చిన్న పనికైనా ఈమె పర్మిషన్ ఉండాలి కాబోలు!? చచ్చి స్వర్గాన ఉన్న ఆ దొడ్డ ఇల్లాలెపుడూ ఇలా ఫోన్లు కొట్టి ఎవర్నీ పిలవలేదు. బెడ్‌రూముకి రప్పించుకోలేదు. ముందొచ్చిన చెవుల కన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి ఏం చేస్తాం? ఏ ఎండకా గొడుగు పట్టాలి మరి! ఆ అమ్మగారు బతికున్నపుడు ఆమెకు సపర్యలు చేయాలనే మిషతో ఇక్కడ తిష్టించడానికి ఈమె ఎంత ప్రయత్నించినా ఆ అమ్మగారు ఈవిడిని ఈ గడప తొక్కనీయలేదు. బాబుగారి దయవల్ల తుదకు 'శవసేవ' మాత్రమే ఈవిడకి దక్కింది. ఈమెకిప్పుడు ఈ అసుర సంధ్యలో తన అవసరమేమొచ్చిందో!?' అనుకుంటూ జోగయ్య స్వగతంలో కొట్టుకుంటూంటే "కూచోండి జోగయ్యగారూ!" అనేమాట వినిపించిద్కి.

పంకజం సోఫాలో కూచుంటూ జోగయ్యకు ఎదురుగా కుర్చీ చూపించింది.

"ఫర్వాలేదు; చెప్పండి నేనిపుడేం చెయ్యాలో చెప్పండి మీ గురించి ఏం చెయ్యాలని పిలిచారో చెప్పండి" అన్నాడు జోగయ్య

"మీతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలి!" అంది పంకజం.

'ఏమిటి?' అన్నట్లు అందమైన పెద్దకళ్ళతోనే ప్రశ్నార్థకంగా చూశాడు జోగయ్య.

"మీరెంతో మంచివారని బంగారయ్య బాబుగారు చాలాసార్లు చెప్పారు! నా గురించి మీకంతా తెలియకపోయినా కొంతైనా తెలిసేఉంటుంది. నేను రాజమండ్రిలో ఉన్నప్పుడు బాబుగారి పనిమీద మీరు అప్పుడప్పుడు అక్కడకొస్తూ, ఆయన చెప్పినట్లుగా నా

యోగక్షేమాలు విచారించి వీధిలోంచే వెళ్ళిపోయేవారు. లోపలికి రమ్మన్నా వచ్చేవారు కాదు. ఈ మధ్య మీరు రాజమండ్రి వెళ్ళినట్లు లేదు... అన్నట్లు మీ ఆవిడగారికి బాగోలేదని విన్నాను. ఇప్పుడెలా ఉంది?" ఆత్మీయంగా అడిగింది పంకజం.

"చావడం కాదు; బతకడం కాదు. ఎన్ని మందులిచ్చినా రోగం నయం కాలేదు డాక్టర్లామెను అటు తిప్పి, ఇటు తిప్పి, కిందేసి, మీదేసి ఆఖరికి క్యాన్సరన్నారు"

"అయ్యో; అలాగా! ఆమె ట్రీట్ మెంట్కై బోలెడు డబ్బు అడపాదడపా బాబుగారి దగ్గర అప్పుగా తీసుకుని, తీర్చలేక సగం జీతం తోనే బతుక్కొస్తున్నారు, పాపం మీరు!"

"అదేనండి; ఇప్పటి నా అవస్థ"

"మీ ఆవిడగారు తనుండగానే పిల్లకు పెళ్ళిచేసెయ్యమని గోలపెడుతున్నారు కదా! చేసేస్తే ఆమె మనోవ్యాధి తగ్గి, ఒళ్ళు కూడా బాగుపడుతుందేమో ఆలోచించారా? ఒక్కర్తే అమ్మాయికదా!.. అమ్మాయి పెళ్ళిగురించి ఏం చేశారు?" అడిగింది పంకంజం కొద్దిసేపటికిందే తన కూతురొచ్చి పెళ్ళి సమస్యను పంకజానికి చెప్పినట్లు జోగయ్యకు తెలీదు. పంకజమే బంగారయ్య బాబుగారి ద్వారా విషయాలు తెలిసుకుని ఉండచ్చునని జోగయ్య అనుమానించాడు.

జోగయ్య పరధ్యానంగా ఉంటే, పంకజం మళ్ళీ అడిగింది. "పిల్ల పెళ్ళి విషయం ఏంచేశార"ని.

"ఏం చెయ్యగలను? డబ్బులేనివాడిని అమ్మాయి పక్కింటి అబ్బాయిని చేసుకుంటానంటుంది. కుర్రాడు బుద్ధిమంతుడే, మాక్కావల్సినవాడే, నమ్మదగినవాడే అయితేనేం? నాకన్నా దరిద్రుడు. పెళ్ళాన్ని పోషించే స్తోమత లేనివాడికి పెళ్ళెందుకంటే... తనూ పెళ్ళాం బతకడానికి ఓ ఆటో రిక్షా కొనుక్కుని నడిపిస్తానన్నాడు. అప్పుగానైనా ఓ ఏభైవేలు కావాలన్నాడు. బంగారయ్య బాబుగారు హామీ ఉంటే బ్యాంకులో ఋణం తెచ్చుకోవచ్చన్నాడు."

"బాబుగారిని అడగలేకపోయారా?"

"అడిగాను"

"ఏమన్నారు?"

"ఈ బాధలేమీ లేకుండా తనే నాకూతురిని పెళ్ళాడేస్తానన్నారు. అమ్మగారు ఆఖరి శ్వాస విడుస్తున్న సమయంలో ఆమెను చూడ్డానికై మా ఆవిడ రాలేకపోయినా, మా అమ్మాయే వస్తే, దానివైపు జాలిగా చూసి త్వరలోనే పెళ్ళాడతానన్నారు. అంతకు ముందు కూడా చాలాసార్లు పిల్ల పెళ్ళికై బాధపడొద్దని నాకు ధైర్యం చెపితే, ఏమైనా డబ్బు సాయం చేస్తారనుకున్నాను. కానీ ఆయనే ఓ పేదింటి పిల్లను పెళ్ళాడ్డానికి ముందుకు రావడం.."

"నిజంగా మీ అదృష్టమే అనుకుంటున్నారా? అరవయ్యేళ్ళవాడు ఇరవైయ్యేళ్ళదాన్ని చేసుకుంటానంటే మీకు బాధకలగడం లేదా?"

"మరో గత్యంతరం లేదు."

"అమ్మాయి ఒప్పుకుందా?"

"నయాన చెప్పాను. భయాన్న చెప్పాను. మాటాడకుండా ఊరుకుంది"

"ఆ తర్వాత ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటే?"

"అంత పిరికిది కాదు! తెలివి తక్కువదనీ అనుకోను"

"అయితే మీరు మరో విషయం అమ్మాయికి చెప్పారో లేదో? బంగారయ్య బాబుగారికి పిల్లల్లేరని తెలుసుకదా! ఆయనకిపుట్టరు కూడా. ఎవరికీ తెలియకుండా చిన్నప్పుడే ఆపరేషను చేయించుకున్నారట; కారణం మీకు తెలుసునో లేదో? ఈ రోజుల్లో

పిల్లలొద్దు మొర్రో అని ప్రతివారూ గోల పెడుతూంటే పిల్లల్లేకపోతేనేం? అమ్మాయి బతుకంతా హాయిగా గడుచిపోతుంది కదా! పిల్లల్లేని వాళ్ళు ఏ బాదరా బందీ లేక ఎంతో సంతోషంగా ఉన్నారు. ఇదేమీ పెద్ద సమస్యకాదు" అన్నాడు జోగయ్య ధీమాగా.

"నిజమే ఈ పాలరాతి మేడలూ, ఈ ఏ.సి పడక గదులూ, కారులు, షికారులూ, ఆరు బీరువాల చీరలూ, ఏడువారాల నగలూ ఎన్ని పూజలు చేసుకుంటేగానీ ఆడదానికి లభిస్తాయి? ఇన్ని ఉన్నా బంగారయ్య బాబుగారి భార్య చనిపోవడానికి పిల్లల్లేక పోవడమే ఓ ముఖ్యకారణమంటే మీరు ఒప్పుకోరేమో! మరి ఆవిడెలా పోయిందంటారు?" పంకజం అడిగింది.

"రోగం దీర్ఘ రోగం డాక్టర్లక్కూడా లొంగని మొండిరోగం" అన్నాడు జోగయ్య.

"అవునా మరి; ఆవిడ మానసిక వ్యాధికి తోడైన మరో శారీరక రోగం. ఆ రోగం నయం కాదు ఇంకా ఏవేవో జబ్బులు. ఈ జబ్బులు ఆవిడకెలా అంటుకున్నాయో తెలుసాండీ? మీ బాబుగారివల్లనే"

'కాదు; మీవల్లనే మా బాబుగారికి సంక్రమించి ఉంటాయి' అని అందామనుకున్నాడు జోగయ్య. కానీ తనకు పూర్తిగా తెలియని బాబుగారి పూర్వ చరిత్రంతా ఈమె తిరగేస్తూంటే, బాబుగారే సీనియర్ రోగి అని అనుమానం కలిగి మౌనంగా ఉండిపోయాడు.

పంకజం ఒక్కొక్క విషయమే చెప్పుకుపోతూంది - "బాబుగారిలో ఆ జబ్బులన్నీ జీర్ణించుకుపోయాయి. అవి తల్లి కడుపులో పిల్లలకి కూడా సోకే ప్రమాదముందని డాక్టర్లు ముందుగానే హెచ్చరించారు. పెళ్ళైన కొత్తలో ఆయన తన హెల్త్ చెకప్ గురించి డాక్టర్ల దగ్గర కెళితే పుట్టబోయే పిల్లల అనారోగ్యం గురించీ, అంగవైకల్యం గురించీ, అకాల మరణాల గురించీ చెప్పారట. దాంతో ఆయన భయపడి వెంటనే బర్త్ కంట్రోలు ఆపరేషన్ చేయించేసుకున్నారట..."

"బాబుగారు బాగా తెలివైనవారు. ఏపని చేసేముందైనా కీడెంచి మేలెంచుతారు. రోగిష్టి బిడ్డలు పుట్టకుండా ముదే జాగ్రత్త పడ్డారు.... పుణ్యం కొద్దీ దొరికిన పురుషుడి వల్లనే ప్రాప్తిస్తుందేమో!? బాబుగారు సంతానం వద్దన్నారు గానీ సంసారం వదల్లేదుగా. మీ లాంటివారు ఎంతమంది అమ్మాయిల్నిచ్చినా కాదనరు... బాబుగారికి కొత్త కొత్త రుచులు కావాలి అనుభవాలు కావాలి, మత్తుకు మందు; పెదవికి పెదవి ఎల్లప్పుడూ ఉండాలి."

పంకజం ఇలా చెప్పుకుంటూ పోతూంటే, బాబుగారి రుచులూ, అభిరుచుల విషయంలో నిజానిజాలెలా ఉన్నా సంసారిగా జోగయ్యకు, ఆమె సంస్కారమేమిటో, సాంప్రదాయమేమిటో మరోమారు ఇంకా లోతుగా పరిశీలించాలనిపించింది.

బాబుగారి నోట్లో నోరు పెట్టి, ఆయన ఉప్పు తింటూ, ఆయన నోటికే తప్పు కట్టే దుస్సాహసిగా కృతఘ్నురాలిగా పంకజం, జోగయ్యకు కనిపిస్తూంది. ఆమె పెదవులకు ప్లాస్టర్లు అంటించాలన్నంత కోపం వచ్చింది. ఐతే పేదవాడికోపం? దిగమింగుకున్నాడు జోగయ్య.

పంకజానికి బాబుగారు విధేయులు. బాబుగారికి తాను విధేయుడు. తొందరపడి తన సమస్యలు ఆమెకు వినిపించి తానుకూడా ఆమెకు విధేయుడైపోతున్నందుకు భయపడుతూ, బాధపడుతూ ఆ గదిలోనుండీ బయటపడాలనుకున్నాడు జోగయ్య.

గోడ మీద బంగారు రంగు ఫ్రేములో బంగారయ్య కలర్ ఫొటో సిరితో, మగసిరితో మెరిసిపోతూ కనిపించింది. గుండె నిబ్బరంతో నిలబడి జోగయ్య గొంతు పలికించాడిలా - "బాబుగారికి మా అమ్మాయికి మధ్య వయసు తేడా నలభయ్యేళ్లైనా ఫర్వాలేదనుకున్నాను. పిల్లలు పుట్టరని తెలిసికూడా ఏమంత బాధపడలేదు. మేలే అనుకున్నాను... కానీ మీ దృష్టిలో ఓ పేద పిల్లను చేసుకునే భాగ్యవంతుడు..."

"వ్యసనపరుడైనా ఫర్వాలేదని నేను అనుకోను. గొప్పవాళ్ళ స్టేటస్ అలవాట్లు కొన్ని మితిమీరిన దురలవాట్లుగా మారితే అది వారికీ, వారిమీద ఆధారపడ్డవారికీ ఎంత చేటు కలిగిస్తాయో మీకు తెలియదా? డబ్బుతో ఖరీదైన మందులు కొనుక్కోవచ్చుగానీ పూర్ణారోగ్యాన్నీ, ఆయుష్షునూ కొనలేంగదా! ఆరోగ్యమే మహాభాగ్యమైతే అదిలేకపోయినా, క్షీణించి పోయినా ఎవరి బతుకైనా దుర్భరం కాదా?

ఆరోగ్యసూత్రాలు అందరికీ తెలుసున్నవే అయినా అమ్మాయి క్షేమం కోరి, మీకుటుంబ శ్రేయస్సు కోరి ముందుగా ఇవన్నీ చెపుతున్నాను" పంకజం అంది.

"ఇలా ఏవేవో చెప్పి, మమ్మల్ని భయపెట్టో, మా మనసులు విరిచేసో, బంగారయ్య బాబుగారితో మా పిల్లకు పెళ్ళికాకుండా చేద్దామనా మీ ఉద్దేశ్యం? ఇందులో మీకొచ్చే లాభమేమిటి? ఒక్క సంగతి; మావల్లగానీ, మా అమ్మాయి వల్లగానీ మీకేం నష్టం ఉండదు. పెళ్ళై మా పిల్ల బంగారయ్య బాబుగారితో కాపురం చేస్తూ ఇక్కడే ఉంటుంది. మీరిక్కడ్నుంచీ రాజమండ్రి పోయి ఎప్పట్లాగే బతకొచ్చు. ఏ సమస్యా ఉండదు. మీరే చెప్పండి ఈ ఛాన్సు పోతే మా అమ్మాయికి పెళ్ళవుతుందా?"

"అవుతుంది. మీ అమ్మాయిని పెంచుకుని నేను పెళ్ళిచేస్తాను. నాకూ పిల్లల్లేరు"

'సరి సరి మీకు మరెవరూ దొరకలేరా?' అని అందామనుకున్నాడు. అలాగాక మరోలా అన్నాడు. మా అమ్మాయికి మీరు 'అమ్మ' అవడం కన్నా బాబుగారు భర్త అవడమే గౌరవం, మర్యాద' ఈ మాటకు పంకజం ఆగ్రహించి 'ఇక్కడినుండీ పొండి' అని కసురుతుందేమో అనుకున్నాడు జోగయ్య, కానీ ఆమె నిశ్చలంగా ఉండి మెత్తగా పలికిందిలా -

"కన్నతల్లినయ్యే అదృష్టం లేకపోయినా పెంపుడూ తల్లిగానైనా ఉందామనుకుంటే నాలో అర్హతలు, యోగ్యతలు వెతుకుతున్నారా? అనాధగా, ఏకాకిగ బతికే ఆడది ఎన్ని అపనిందలు, అగచాట్లు పడాల్సివస్తుందో నా చేదు అనుభవాలు మీకు చెపితే మీరు నమ్మగలరా? పడ్డవాళ్ళెపుడూ చెడ్డవాళ్ళు కాదు. దిక్కులేని వాళ్ళంతా చెడిపోతారని మూర్ఖులు మాత్రమే అనుకుంటారు. కడుపులో పిండం నుండీ కాటికెళ్ళే పండు ముదుసలి వరకూ ఆడదానికి అన్నీ గండాలే! అన్నీ ఛీత్కారాలే. ఆడదాన్ని తక్కువగా ఊహించడానికి, తక్కువ చేసి మాట్లాడ్డానికి ఇంకా బతికే ఉన్న ఈ ఛాందస భావజాలం, ఈ అసభ్య పదజాలం మీలాటి అమాయకుల్ని సవ్యంగా ఆలోచింపనీయవు. అనుకోకుండా బంగారయ్య బాబుగారితో నా సంబంధం ఏర్పడ్డానికి ముందు నేనెలా బతికేదాన్నో ప్రత్యక్షంగా మీరెవరూ చూడలేదు..."

'అప్పుడెలా బతికినా ఇప్పుడు మాత్రం ప్రత్యక్షంగా కనబడుతూనే ఉందిగా; ఎదుట వారి బలహీనతల్ని సొమ్ము చేసుకుంటూ బతకడం మమ్మల్ని మట్టుబెట్టడానికి కట్టుకథలు చెప్పకండి' అని జోగయ్య అందామనుకున్నాడు. కానీ బంగారయ్య బాబుగారితో చిక్కుముడి పడి ఉన్న తమ సమస్య మరింత జటిలమై పోతుందని ఋుడిసి మిన్నకున్నాడు. ఊసుపోనమ్మ ఊకదంపుడు ఉపన్యాసాలు తమకేం లాభం అనుకుంటూ ముఖం చిట్లించుకున్నాడు జోగయ్య.

అదిగమనించిన పంకజం వెంటనే అంది. "జోగయ్యగారూ! ఇటు వినండీ అసలు సంగతి చెపుతున్నాను. మీ అమ్మాయి విషయంలో బాబుగారి మీద ఆశవదులు కోండి. నేనిపుడు ఆయన్ని నమ్ముకున్నాను. ఈ లేటు వయసులో నాకు శాశ్వతంగా ఓ తోడుకావాలి! ఇద్దరం కలిసి ఒకేనీడలో బతకాలి. మేడిపండు లాంటి బంగారయ్య బాబుగారితోనే నా ఆఖరి రోజులు గడవాలి. అతని భోగమైనా, రోగమైనా నేనే అనుభవించాలి. ఇంకో ఆడది అతడిని పెళ్ళాడి పాడైపోకూడదు. అకాలమృత్యువాత పడకూడదు. అతడు వేరే స్త్రీని పెళ్ళాడకూడదు. పెళ్ళాడ్డానికి వీలుపడదు. పెళ్ళాడనివ్వను. అతడిని నేనే పెళ్ళాడతాను. మొదటి భార్య పోయిన తర్వాత రెండో భార్యగా నేను ఇక్కడ ఈ ఇంట్లోనే స్థిరపడగలనని బంగారయ్యగారు నాకిచ్చిన 'ప్రామిస్' ఈనాటిది కాదు; ఓ పుష్కరం కిందటిది. అది ఇప్పుడు నెరవేరే శుభసమయం వచ్చింది" అంది పంకజం దిటువుగా.

ఇదంతా వింటున్న జోగయ్యకు ఏం చెయ్యాలో తోచలేదు.

పంకజం ఏ దిక్కులేనమ్మకో పుట్టి, పిల్లల్ని అమ్ముకుని బతికే ఓ బ్రోకరమ్మ పెంపకంలో పెరిగి, బొంబై చీకటి గల్లీల్లో గడపలేక, పెళ్ళికాకుండా ఎక్కడెక్కడో తిరిగి, ఆఖరికి రాజమండ్రి వచ్చిందని ఆ నోటా, ఈనోటా విన్న మాటలు, సత్యాసత్యాల ఘర్షణలో జోగయ్య బుర్రను ఇంకా దొల్చేస్తూనే ఉన్నాయి.

'పంకజం స్వార్థపరురాలు మెతుక్కోసం, బతుక్కోసం ఏమైనా చెయ్యగలదు. తనదారికి అడ్డొచ్చిన వారిని ఎదిరిస్తుంది సాహసి. ఆమెదే ఇప్పుడుపై చెయ్యి. పెంపకం పేరుతో కన్నెపిల్లనెలాగైనా వాడుకుంటుంది. ఏ రొంపిలోకైనా దింపుతుంది. పెళ్ళి చేస్తుందని నమ్మకం లేదు... పిల్లకు పెళ్ళికాకపోతే పోయె, పుట్టింటిలోనే చచ్చేవరకూ అవివాహితగానే ఉండిపోగాక. దాని కర్మ ఎలాగుంటే అలాగవుతుంది' ఇలా లోలోనే మథనపడుతూ జోగయ్య వెనుతిరిగాడు.

"జోగయ్యగారూ!" బిగ్గరగా పిలిచింది పంకజం.

జోగయ్య ఆగిపోయాడు.

పంకజం అతడికెదురుగా వచ్చింది. అధికారణిలా ప్రశ్నించింది. "ఇలా అధైర్యపడి వెళ్ళిపోదామనుకుంటే పిల్లకెలా పెళ్ళవుతుందనుకున్నారు"

"అవకపోతే కన్యగానే మిగిలిపోతుంది" బింకంగా అన్నాడు జోగయ్య.

"కన్యగా మిగిలిపోతే మీ తర్వాత, నా తర్వాత ఆమె భవిష్యత్? బంగారయ్య బాబుగారి పాపదృష్టి మీ అమ్మాయి మీదే ఉంది. తప్పించగలరా? అతడు చిరాయువు. అతడిలోని విషక్రిములు, అతడు తాగే ఖరీదైన మందుల్నీ అతడు తినే బలమైన తిండినీ సుఖంగా ఆరగిస్తూ తమ ఆయుష్షును పెంచుకుంటూ, బాబుగారి రోగగ్రస్త ఆయువును కూడా పెంచుతున్నాయి... ఆఖరికి అమ్మాయి నిస్సహాయురాలై బలిపశువు కావాల్సిందేనా?"

"................." జోగయ్య అయోమయంగా చూస్తున్నాడు; ఏం చెయ్యాలో తోచక పెంపకానికిమ్మన్నాను. నా రక్షణలో, సంరక్షణలో ఆమెను కోరుకున్నవాడికే ఇచ్చి, పెళ్ళిచేసి పంపించాలనుకున్నాను. నాతోపాటు బంగారయ్యబాబుగారికీ కన్యాదాన ఫలితం దక్కుతుందనుకున్నాను... మళ్ళీ అడుతుగున్నాను; అమ్మాయి పెంపకం విషయంలో ఏమాలోచించారు?"

"మాకున్నది ఒక్కర్తే అమ్మాయి; కూతురైనా కొడుకైనా అదే పెంపకం ఇవ్వడానికి మా ఆవిడ ఒప్పుకోదు. మీకో నమస్కారం" అంటూ జోగయ్య తన అసమ్మతికి చిహ్నంగా రెండుచేతులూ జోడించాడు.

అంతవరకూ సోఫాలోనే కూర్చుని ఉన్న పంకజం ఒక్కసారి లేచి నిలుచుంది.

ఆ క్షణంలో పంకజం, పరాజితలా కనిపించింది జోగయ్యకు.

అయితే ఆమె జోగయ్య కూతురి పెంపకం విషయంలో వీగిపోయినా, ప్రత్యామ్నాయంగా అంపకం విషయంలో ముందే స్థిరపరచుకుని ఉన్న మార్గంలోనే అడుగిడి ముందుకు సాగిపోడానికే నిశ్చయించుకుంది. ఆమెకది తరుణోపాయం; తరుణోపాయంకూడా!

"అయితే ఉండండి" అంటూ పంకజం చరచరా కబ్బోర్డుకేసి నడిచింది.

జోగయ్య గుడ్లప్పచెప్పి చూస్తూ, ఆమె నడకను నడతతో బేరీజు వేయసాగాడు. 'నడమంత్రపు సిరి నారీమణి; నడకలో 'ఠీవి' ఒలకబోస్తుందే గానీ నడతలో 'ఈవి' చూపించదేమి?" అనుకున్నాడు.

అంతలో ఫోను మ్రోగింది. పంకజం వచ్చి ఎత్తింది. బంగారయ్య బాస్ వాయిస్ పైక్కూడా వినిపిస్తూంది "...మొన్న గోదావరిలోనూ, నిన్న కృష్ణలోనూ, నేడు కావేరిలోనూ అస్థికల్ని కలిపాను. నువ్వు ఎంపిక చేసి నాతో పంపిన ఘనాపాఠి వైజాగ్ శాస్త్రిగారు శాస్త్రోక్తంగా నిమజ్జనం చేయించారు. అలాగే నువ్వు చెప్పి పంపించిన రాజమండ్రి కుర్రాడు, నీదగ్గరే భయభక్తులతో పెరిగినవాడు నీకు కాపలా అయినట్లే నాకూ 'బాడీగార్డై'. అన్ని వేళలా నన్నంటి పెట్టుకునే ఉంటున్నాడు. ఆ యువకుడు నీకే కాదు, నాకూ ఇప్పుడు అభిమాన పుత్రుడే!... ముగ్గురుం ఈ రోజు రాత్రే బయలుదేరి బెనారస్ వెళుతున్నాం. గంగలో పని అయిన తర్వాత మూడు రోజుల్లో వచ్చేస్తున్నాం"

"వచ్చేటప్పుడు కాశీవిశాలాక్షి కుంకుమ, గంగాజలం తీసుకురావడం మర్చిపోకండి" గుర్తుచేసింది పంకజం

"ఓ..కే నీకు మరేం ప్రోబ్లమ్ లేదు కదా? జోగయ్య వస్తున్నాడా?..." బంగారయ్య మాటాడుతుంటే మధ్యలోనే ఫోన్ కట్ అయిపోయింది. పంకజం ఫోను పెట్టేసింది.

జోగయ్య చీకటి వెలుగుల మధ్య ఊగిసలాడుతున్నాడు.

కబ్బోర్డు నుండీ తీసి పట్టుకొచ్చిన ఓ కాగితం ముక్కను జోగయ్య చేతికందించింది పంకజం.

జోగయ్య, దాన్ని పరిశీలనగా చూసి నిర్ఘాంతపోయాడు.

అది అక్షరాలా పాతికవేల రూపాయల బ్యాంక్ చెక్.

"పోన్లెండి, అమ్మాయిని పెంపకానివ్వొద్దు. ఈ చెక్ ఎన్‌క్యాష్ చేసి కొంత డబ్బుతో నిరాడంబరంగా పిల్ల పెళ్ళి చేసెయ్యండి. మీక్కాబోయే అల్లుణ్ణి 'బ్యాంకు లోను' అప్లికేషన్ ఫారాల్తో వెంటనే ఇక్కడకు తీసుకురండి. ఆటో రిక్షా బ్యాంకు ఋణానికి నేను హామీ ఉంటాను. ఇక్కడ నాకూ బ్యాంక్ అక్కౌంటు ఉంది" అంటూ పంకజం లైట్లు వెలిగించింది.

జోగయ్య కళ్ళల్లో కాంతులు మెరిసినా గుండెలో గుబులు.

"బంగారయ్య బాబుగారు వచ్చేలోగా మీ అమ్మాయి పెళ్ళి, వచ్చింతర్వాత మా పెళ్ళి ఇక వెళ్ళిరండి" అంటూ పంకజం ఆజ్ఞాపించింది, ఉభయతారకమైన తుది నిర్ణయం తీసుకున్న ప్రాజ్ఞిలా

"ఏమో ఏమౌతుందో? బాబుగారికిదంతా తెలిస్తే నా పని..." జోగయ్య నసుగుతున్నాడు, భయపడుతూ.

"ఆయన వ్యాపార రహస్యాలన్నీ తెల్సున్న మిమ్మల్ని ఆయనెపుడూ వదులుకోరు. అలాగే నన్నూ. నా చెయ్యి మొట్టమొదటిసారి తగిలిన తర్వాతే తనను లక్ష్మీదేవి పైకెత్తేసిందని నామీద ఆయనకు గొప్ప నమ్మకం. వెళ్ళండి. మరేం ఫర్వాలేదు." అంటూ పంకజం, జోగయ్యను గుమ్మం దాటించింది.

'ఇది ఈమె స్వార్థమా!? స్వార్థంలో ఒకింత నిస్వార్థమా?'అనుకుంటూ జోగయ్య 'చెక్కు' పట్టుకుని వెళ్ళిపోతూంటే, పంకజం కళ్ళు చెమర్చాయి..

ఎప్పుడో మూడు పుష్కరాల కిందట తనలాగే బొంబై చీకటి గల్లీలలో చిక్కుకు పోయిన ఓ పధ్నాలుగేళ్ళ అమ్మాయి, ఆ అమ్మాయి తనూ ఓ రోజు రాత్రి రహస్యంగా, ధైర్యంగా సెక్స్ వర్కర్స్ బారి నుండీ తప్పించుకున్న వైనం ఇప్పుడు జ్ఞాపకం రాగా... ఆ అమ్మాయికూడా పెద్దదైపోయి ఇప్పుడెక్కడుందో, ఎలాఉందో తెలియక కాస్సేపు బాధపడింది పంకజం.

తన బతుకు మాత్రం కుక్కలు చింపిన విస్తరి కాకుండా తనకు మొదట రక్షగా నిలిచిన ఓ పోలీసు బృందం, తర్వాత కూడు గుడ్డలూ చదువు సంధ్యలూ అందించిన ఓ అనాధ శరణాలయం, తను సేవించిన ఓ వృద్ధ దంపతుల జంట, వారింట్లోనే తన దగ్గర ఓనమాలు నేర్చిన బాలబాలికలు, తనకు కాపలాగా గోదారి ఒడ్డున దొరికిన బొడ్డూడని ఓ బిడ్డడు, తర్వాత తనకు తోడుగా లభించిన తన మదిలో ఇప్పుడు కదలాడుతుంటే, రేపటి తన విధిని మరోసారి గుర్తుచేసుకుంది పంకజం, కొత్త పెళ్ళికూతురి స్పృహతో.

మసక వెన్నెల

# మసక వెన్నెల

## ఎలక్ట్రాన్

**ఉగాది కథల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

"సంధి ప్రాలాపనలనేవి అనారోగ్యం ముంచుకొచ్చిన వ్యక్తికి మరణం ముందరా, ఎంతటి నిగ్రహమున్న వ్యక్తికైనా సరే తాగిన తర్వాతా సాధారణంగా వస్తాయి. చావు ముందరి సంభాషణల్లో జీవితాంతమూ దాచుకున్న రహస్యాలు బయటకొస్తే, తాగిన తర్వాత తత్కాల సంబధమైన ఆలోచనలు హద్దులు మీరిన మాటల రూపం దాలుస్తాయి. ఇవి తన గురించి కావచ్చు, తన చుట్టూ ఉన్న సమాజం గురించి కావొచ్చు. అవి ఆశుకవిత్వాలూ కావొచ్చు, కఠిన వాస్తవాలూ కావొచ్చు. అందుకని తాగిన వాళ్ళ మాటల్ని శ్రద్ధగా ఆలకిస్తే లోకం తీరు తెలుస్తుంది!" అన్నాడు మురళీకృష్ణ ముద్దమాటలతో.

వేసవి వెన్నెలలో మల్లె పొద దగ్గర కుర్చీలు వేసుకుని కూర్చున్న వాళ్ళ ముగ్గురులోనూ మురళీకృష్ణ శనివారం సాయంత్రపు విస్కీబాబు. సాయికృష్ణ రమ్‌బాబు, బాలకృష్ణ ఉత్తి సోడాబాబు, నీరు బాబు. తాగితందనాలాడేవాళ్ళు ఏ ఆనంద రసానుభూతిని, ఏ తాదాత్మ్యాన్ని పొందుతారో తెలియదు కానీ, చూసేవాళ్ళకి మట్టుకు ఒక్కోసారి ముచ్చటగానూ, మితిమీరిన సందర్భాల్లో కాస్త వెగటుగానూ ఉంటుంది. అయితే ఈ దోసుబాబులిద్దరూ శనివారం సాయంత్రాలు మాత్రమే పరిమితానికీ, అపరిమితానికీ మధ్యగా మరో గీత గీసుకుని, దాన్ని హద్దుగా మధుపానం చేసే బాపతు కాబట్టి, బాలకృష్ణ వారి మాటల్ని శ్రద్ధగా ఆలకిస్తూ ప్రశ్నలు సంధిస్తూంటాడు. వేయించిన వేరుశనగ పప్పులు వాళ్ళకంటే ఇతనే ఎక్కువగా లాగించేస్తుంటాడు.

"మల్లెల వాసనల మత్తుని మీమందు వాసనలు ఎగరకొట్టడంతో నా మెదడంతా వెలుగుతో నిండిపోయింది. వెన్నెల కాంతుల్లో మీ మాటలు చీకటి కిరణాల్లా దూసుకు పోతున్నాయి. చెప్పండి, విని అజ్ఞానంలోకి కొట్టుకు పోవడానికి సిద్ధంగా ఉన్నాను!" అన్నాడు బాలకృష్ణ.

"మత్తు మాటలు మావికావు, నీవి! లేకపోతే ఈచీకటి కిరణాలేమిటి?" అన్నాడు మురళీకృష్ణ.

"అంతా సాపేక్షం. దుర్మార్గంలోంచీ సన్మార్గం వెలుగు. సన్మార్గంలోంచీ దుర్మార్గం చీకటి. వెలుతురిని ప్రసరించే నక్షత్రమండలాలలాగే వెలుతురిని మింగే కృష్ణ నక్షత్రాలున్నాయి. అవి ప్రసరించేవి కృష్ణకిరణాలే కదా? మీరు చెప్పే మాటలన్నీ మడత పేచీలే! ఉన్న మాటల్ని తిరగరాసి చెప్పే రకం!"

"ఎలాగైనా నీ బుర్ర గట్టిదే! నా మనసులోని మాటని ఖచ్చితంగా చెప్పేశావు! పంచ తంత్రాన్ని తిరగరాద్దామనుకుంటున్నాను" అన్నాడు మురళీకృష్ణ కళ్ళు మూసుకుని.

"వేల సంవత్సరాలు గడిచినా పంచతంత్రం కథల్లోని నీతినిలబడే ఉంటుంది. దాన్ని మార్చడం ఎవరితరమూ కాదు!" అన్నాడు బాలక్రిష్ణ.

"నిలువ నీరూ, చలామణీలేని సొమ్మూ, పుస్తకాలకే పరిమితమైన ఆచరణలో లేని నీతినియమాలూ ఎందుకూ పనికిరావు. అందుకని కాలాన్ని బట్టి నీతి శాస్త్రం మారాలి, మారుతోంది కూడాను. పాత కథల్ని తిరగరాయవలసిన అవసరం ఉంది."

"వాణ్ణిలా బాధించే బదులు మచ్చుకోకథ చెపితే నీతి సారం వాడే గ్రహించేస్తాడు! "అన్నాడు సాయికృష్ణ తన గ్లాసునోసారి ఎత్తి చూసుకుంటూ. రెండోసారి నింపుకున్న గ్లాసు ముప్పావు భాగం నిండే ఉంది.

మురళీకృష్ణ ఓ గుక్కెడు మందు తాగి, గొంతు సవరించుకుని చెప్పసాగాడు.

"సరే చెపుతా వినండి -

'పదుగురాడుమాటపాటిమాటియై ధరంజెల్లును' అని ఓ సుప్రసిద్ధ శతకకారుడన్న సంగతి మీకు తెలిసిందే కదా?... అదుగో... ఎవరని ప్రశ్నించవద్దు. సాక్షులు చెప్పిన సాక్ష్యం ప్రకారమే న్యాయాధికారి తీర్పునివ్వవలసి వస్తుంది. చెవిలో ఇల్లు కట్టుకుని పోరి - దీన్నే హిందీలో కాన్‌కచ్చా చెయ్యడం అంటార్లే - మనిషి ఆలోచనల్ని ప్రభావితం చేసే ప్రక్రియ కూడా ఇలాంటిదే అనడంలో ఏ మాత్రం సందేహం అక్కర్లేదు. పంచతంత్రంలో ఓ వెర్రిబాగులవాణ్ణి మోసం చేసి, ఆవుని మేకగా నమ్మించి ఎత్తుకు పోయిన నలుగురు ధూర్తుల కథ ఈ కోవకి చెందిందే కదా? ఆ కథ మరోలా చెపుతాను.

తెలివి బాగుల తిక్కశంకరం అనే పెద్ద మనిషి ఆదివారం సంతలో ఓ ఆవుని కొనుక్కుని ఇంటికి తోలుకుపోతున్నాడు. నలుగురు ధూర్తులకా ఆవుని కాజేయాలని బుద్ధిపుట్టి, తక్షణంలో పంచమ తంత్రం కథని అమలు పెట్టదలచుకున్నారు. అయితే మార్పుకోసమూ, మరింత శక్తివంతంగా ఉండడం కోసమూ 'మేషా'న్ని గాడిద చేసి ప్రయత్నించారు.

మొదటివాడు శంకరాన్ని సమీపించి, కూడా అడుగులు వేస్తూ, 'శంకరం గారూ, గాడిద చాలా బావుంది, గొల్లపాలెం సంతలో కొన్నారా?' అని ప్రశ్నించాడు.

'గొల్లపాలెం పశువుల సంత శుక్రవారం జరుగుతుంది దీన్ని వెలంపాలెం ఆవుల సంతలో ఇవ్వాలే కొన్నాను. ఇది గాడిద కాదు, ఆవు!! ' అన్నాడు శంకరం నవ్వుతూ.

కొంత దూరం నడిచి మొదటివాడు తప్పుకున్న తర్వాత, మరి కొంత దూరంలో రెండోవాడు కలుసుకుని శంకరం పక్కగా నడవసాగాడు. కుశల ప్రశ్నలడిగిన తర్వాత 'శంకర్‌జీ! మీరుకొన్న ఈ 'గార్దభం' మంచి బలంగా ఉంది, ఎంతకు కొన్నారేమిటి? ' అని కుతూహలం నటిస్తూ ప్రశ్నించాడు.

శంకరం కొద్దిగా కోపం నటించి, 'భలేవాడివయ్యా! చెట్టంత కొమ్ములు కనబడుతోంటే ఆవుని పట్టుకుని గాడిదంటావేమిటి, పోయి కళ్ళజోడు వేయించుకో!' అన్నాడు. రెండో వాడు మరి కాస్త దూరం కూడా వెళ్ళిపోయాడు.

ఇంకొంచెం సమయం గడచిన తర్వాత మూడోవాడు శంకరానికి ఎదురుపడి నమస్కారం చేసి, ఆపు చేసి పలకరించాడు! 'ఏం శంకరయ్యా, ఈ మధ్య కనపడ్డమే మానేశావు! ఈ ఉదయమే రామప్ప దుకాణంలో కనుక్కుంటే గోకవరం గాడిదల సంతకి పోయావన్నాడు. 'గ్రామ్యాశ్వమ'న్న పేరుకు తగ్గట్టుగా దిట్టంగా ఉంది! ఏమాత్రం వదిలేను?' అని.

శంకరం కాస్త ఆందోళనతో ఆ మూడో మనిషి కేసి చూశాడు. కాస్తగా సందేహించి ఆ తర్వాత అన్నాడు. 'తాగిన కళ్ళకి కురూపి కూడా రంభలా కనబడుతుందని విన్నా కాని 'గోవు' రేవు గుర్రంలా కనబడుతుందని ఎక్కడా వినలేదు! వేళాకోళానికైనా వేళాపాళా ఉండాలి!' అని మందలించి ముందడుగు వేశాడు.

ఓ అయిదు నిముషాలు పోయిం తర్వాత నాలుగోవాడు శంకరాన్ని చేరాడు. 'ఏమయ్యా శంకరం కులాసానా? అయినా నీకిదేం బుద్ధి? నడి వీధిలో ఇలా గాడిదని తోలుకు పోతే నలుగురూ నవ్వరూ? ఇంతకీ నీకు గాడిదతో ఏం పని?' అని ప్రశ్నల మీద ప్రశ్నలు గుప్పించాడు.

'అయితే ఇది 'పయస్విని' కాదా? నిజంగా 'రాసభమే' అంటావా? ఇందాకా ఇద్దరు ముగ్గురు ఇదే మాటంటే నవ్వుతాలుకనో, అంధత్వం చేతనీ, తాగుడూ మైకంలోనో అన్నారనుకున్నాను! 'అన్నాడు శంకరం.

'ఇది ఖచ్చితంగా 'ధూసరమే' కాని 'ధేనువు' కాదు. అమ్మినవాడెవడో నిన్ను కనుకట్టు చేసి, గాడిదని ఆవుగా చూపించి మోసం చేశాడు. నువ్వు తిరిగియిద్దామనుకున్నా వాడీపాటికి ఉడాయించేసి ఉంటాడు!' అన్నాడు మనో వైజ్ఞానిక ఒత్తిడికి గురిచేస్తూ.

'సరే నా ఖర్మ ఇలా కాలింది! ఇందాకటి నుంచీ దీన్ని 'ఆవ'ని నడిపించుకుంటూ వచ్చి కాళ్ళు పీకుతున్నాయి. గాడిదని నడిపించుకుని వెళ్ళడం మూర్ఖత్వమే కదా? నీ మాటలు నా కళ్ళు తెరిపించాయి కాబట్టి కాళ్ళకి విశ్రాంతి నిస్తాను!' అని ఎగిరి ఆవు మీద కూర్చుని అదిలించాడు. ఆవు భారంగా ముదుకు కదిలింది.

నాలుగో ధూర్తుడు స్థాణువులా నిలబడిపోయాడు, ఆస్ట్రేలియా ఆదిమవాసుల ఆయుధం తిరిగి వచ్చి దెబ్బ తీసినట్టుగా!

కథ అదే బాలక్రిష్నా! కాలం మారింది కాబట్టి ముగింపు మార్చాలి భాష్యం మార్చుకోవాలి. దీని నీతి సారమేమిటంటే....?"

మురళీకృష్ణని ఆపు చేశాడు బాలక్రిష్ణ "ఆ కాలంలో మంచి వాళ్ళెక్కువా, మోసగాళ్ళు కూడా మోసం చెయ్యాలని కాకపోయినా, మోసగాళ్ళని గుర్తించి తమకు చేతనయినంతలో బుద్ధి చెప్పాలి. ధూర్తుల్ని మంచి వాళ్ళు కూడా ధూర్తత్వంతోనే దెబ్బతీయాలి!" అన్నాడు.

సరే, కథలోని నీతి సంగతటుంచి కొసమెరుపు చెప్పలేకపోతే కథ పూర్తికాదు. ఏ పొదుగునైతే చూసి ఆవుని కొన్నాడో, ఆ పొదుగుది జీడి పిక్కల పొగతో వాచిన బలుపని తెలివి బాగుల శంకరానికి త్వరలోనే తెలియ వచ్చింది! అందుచేత తెలివి తేటలనేవి అందరికీ, అన్ని కాలాల్లోనూ అచ్చిరావు. ఎప్పుడో అప్పుడు, ఎక్కడో అక్కడ పప్పులో కాలేస్తారు. ఇది కథలోని ధూర్తులకీ వర్తిస్తుంది, శంకరానికీ వర్తిస్తుంది! ఒక్క కొసమెరుపుతో నీతి భాష్యం ఎలా మారిపోయిందో చూశావు కదా, ఏమంటావు?" అన్నాడు మురళీకృష్ణ.

"ఏమంటాను? నీ విస్కీ మాటలు నా ఎదలో ఓ కిటికీని తెరిచాయి!" అన్నాడు బాలక్రిష్ణ.

మురళీకృష్ణ హాయిగా గ్లాసందుకుని ఓ సెంటీ మీటరు తాగి, తిరిగి గ్లాసుని బల్ల మీద పెట్టాడు.

"నువ్వెప్పుడూ వాడి కథల్నే ఆసక్తిగా వింటావ్!" సాయికృష్ణ బాలక్రిష్ణ వైపు చూస్తూ నిందాపూర్వకంగా అన్నాడు.

" నా మనస్సులో మరో కిటికీ నువ్వు తెరవాలనుకుంటే మరో కథ చెప్పు, నిరభ్యంతరంగా వింటాను," అన్నాడు బాలక్రిష్ణ.

సాయికృష్ణ ఓ అర సెంటీమీటరు రమ్ తాగి, గొంతు సవరించుకుని చెప్పడం మొదలు పెట్టాడు. "వర్షాలు కురవకా, భూమిలోంచి నీరందకా ఓ చిట్టడవి ఎండి పోవడంతో - ఓ కోతి దూరంగా ఉన్న మరో అరణ్యానికి వలసపోయి, ఓ ఫలవృక్షం మీద నివాసం ఏర్పరచుకుంది. ఆ ఫల వృక్షం ఓ చిన్న సరస్సు ఒడ్డున ఉంది. సరస్సు మధ్యలో ఓ లంక ఉంది. ఆ లంక ఒడ్డున రెల్లు పొదల్లో ఓ మొసలి కాపురముండేది. అది కోతితో స్నేహం కట్టి, ప్రతి రోజూ లంక ఒడ్డు నుంచీ ప్రధాన తీరానికి వచ్చి కోతితో బాతాఖానీ కొడుతుండేది...."

బాలక్రిష్ణ అడ్డుకున్నాడు. "ఈ కథ నాకు తెలుసు. కోతికీ, మొసలికీ స్నేహం ముదురుతుంది. మొసలి భార్య దీర్ఘకాలికమైన వ్యాధితో బాధపడుతుంటుంది. ఆ జబ్బు నయమవడానికి కోతి గుండెని తాంబేలు గుడ్లతో ఉడక బెట్టిన కూరని తినాలని ఎవరో నాటు వైద్యుడు చెప్పగా, మొగుడు మొసలి మాయమాటలు చెప్పి కోతిని తన లంకకి విందుకాహ్వానిస్తుంది. ఈ తరానిదీ, సుదీర్ఘ లంఘనము చేయలేనిదీ అయిన ఆ మర్కటం మకరం వీపు మీద కూర్చుని నావ ప్రయాణం చేస్తుంది. నడి సరస్సులో ఉండగా 'మిత్రద్రోహం చేస్తున్నానేమో'నని ఆ మొసలి కన్నీరు కారుస్తుంది. కారణం తెలుసుకున్న కోతి జాలి నటిస్తూ 'అయ్యో పాపం! రాక్షసులు తమ ప్రాణాన్ని చిలకల్లో దాచుకున్నట్లుగా మా వైపు మర్కటాలన్నీ చెట్ల గుబుర్లలో తమ గుండెల్ని దాచుకుంటాయి. ఇక్కడకు రాగానే మొదటగా చేసింది ఆపనే. ముదుగా చెబితే గుండెతో సహా వచ్చేదాన్నిగా?' అంటుంది. మొసలి కోతి మాటలు నమ్మి మళ్ళీ ఒడ్డుకీడుకుంటూ పోతుంది. దరిజేరగానే కోతి ఓ గెంతు గెంతి, చెట్టెక్కి కొమ్మ మీద కూర్చుని మకరాన్ని వెక్కిరిస్తుంది!"

"నన్ను చెప్పనియ్యకుండా నువ్వే చెప్పేస్తే ఇలానే ఉంటుంది మరి! మర్కటాన్ని మకరం ఆహ్వానించడం వరకూ బాగానే ఉంది కానీ, అక్కడే విషయం కొత్తదారులు తొక్కుతుంది," అన్నాడూ సాయికృష్ణ.

"నే చెప్పిందాంట్లో కూడా కొత్త విషయం ఉంది. తాంబేలు గుడ్లని అనుపానంగా వాడాలన్న ఓ కొత్త విషయాన్ని కల్పించి, జోడించి చెప్పానుగా?"

"మధ్యలో వాటి ప్రసక్తి ఎందుకు?"

"చూడు సాయికృష్ణా! తాంబేళ్ళు సాధు ఉభయచరాలు, అల్పజంతువులు. ప్రమాదం వస్తే ముడుచుకుపోవడమే తప్ప విరుచుకు పడ్డం వాటికి తెలియదు. అందుకని అవి జనావాసాలకి దూరంగా గుడ్లు పెడతాయి. లంకలు అందుకనువైన ప్రదేశాలు. మొసళ్ళు జలచరాల్లో కిరాతక జంతువులు. షార్క్, ఫిర్హానాల్లాంటి ఇతర క్రూర జలచరాలున్నా, మొసల్ని మట్టుకు మన భాషలో అంబుకంటకమంటారు. యివి లంకల్లో నిద్రచేసి, ప్రధాన తీరాల దగ్గరకు మేతకొచ్చి నీటిలో పొంచిఉంటాయి. నీటిలో అడుగు పెట్టే దాహార్తులైన జంతువుల్నీ మనుషుల్నీ ...పోనీలేవయ్యా జలకాలాడ్డనికొచ్చేవాళ్ళని అనుకుందాం...అదను చూసి ఓ పట్టు పట్టేస్తాయి. లంకల్లో పుష్కలంగా లభ్యమయ్యే తాంబేళ్ళ గుడ్లతో కోతి గుండెకాయని కూడా కలిపి కూరొండితే అద్భుతంగా ఉంటుందని ఓ వంట మొసలి చెప్పడంతో, మకర దంపతులీ వ్యూహాన్ని పన్నారన్నమాట. అసలు విషయమది కానీ రోగమూ కాదు, మందూ కాదు! నీవాలకం చూస్తుంటే కోపమొచ్చేస్తుందనుకుంటాను. అడ్డురాని కానీ కథను నువ్వే చెప్పు." అన్నాడు బాలక్రిష్ణ తన మాటల్ని ముగిస్తూ.

" అంతరాయం కలిగితే కథనం చతికిల పడుతుంది.. ఒక్క క్షణమాగు," అంటూ సాయికృష్ణ రెండు గుక్కలు రమ్ తాగి, తిరిగి మొదలుపెట్టాడు.

"జలకిరాటం 'ఆహ్వానాన్నందుకొన్న' చెట్టుదిమ్మరి ఈ విధంగా అంది. 'మకర మిత్రమా! స్త్రీ చపల చిత్తంతోనూ, 'నేనూ, నా భర్తా, నా పిల్లలూ' అన్న సహజ మైన స్వార్థ బుద్ధితో ప్రవర్తించడం వల్లనూ పురుషుడైన భర్త బంధు మిత్రులనూ, ఏక గర్భజనితులనూ, ఆఖరికి జన్మనిచ్చిన తల్లిదండ్రులనూ దూరం చేసుకుంటాడు. సమిష్టి కుటుంబాలు ఛిద్రమవడానికి కారణమిదే! భార్యా మోహంతోనే నన్ను విందుకు పిలిచావు కదూ?"

'నీకెలా తెలుసు?!' మొసలి ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

'మనుషుల మధ్య మసలడం వల్ల ఈ పంచతంత్ర కథలన్నీ నాకు తెలుసు. వాళ్ళకున్న దుర్గుణాలన్నీ మనకి ఆపాదించి ఈ కథలు చెప్పారు, అది వేరే సంగతనుకో! నీ ఆహ్వానం వెన్కనున్న కారణం తెలుసున్న దాన్ని కనకనే ఈ విందు పిలుపుని నిర్మొహమాటంగా తిరస్కరిస్తున్నందుకు క్షమించు,' అంది కోతి.

'కాదు మిత్రమా కాదు! నా స్త్రీకి నిజంగానే ఏదో మాయదారి రోగమొచ్చింది. బురదనీటిలో ఉన్న ఎన్నో నాచుమొక్కల్నీ, గుర్రపుడెక్కల్నీ మింగినా ఫలితం కనపడలేదు. కోతి గుండెకాయతో వైద్యం చేస్తే తగ్గుతుందని విని, మరోజీవి గుండెని చీల్చి ఉపయోగించక తప్పదని నా మనస్సు చంపుకుని నిన్ను విందుకు ఆహ్వానించాను ' అంది మొసలి దీనంగా.

'నీ మనస్సాక్షిని చంపుకోవల్సిన అవసరం లేదు. ద్వంద్వమనేది ప్రతి జీవిలోనూ ఉంటుంది. స్వప్రయోజనాలకీ, పరిస్థితులకీ అనుగుణంగా ఆలోచనల్నీ, మాటల్నీ, చేతల్నీ మార్చడమనేది నిత్యధర్మమైపోయింది. అహింసావాదం కారణంగా శాకాహారులైన వాళ్ళుకూడా తమకు తెలిసో, తెలియకో జంతు పదార్థాలు కలపబడ్డ లేదా తయారీ విధానంలో పరోక్షంగా ఉపయోగించబడ్డ ఎన్నో నిత్యావసర వస్తువుల్ని వాడుకొంటున్నారు. సబ్బులు, టూత్ పేస్ట్‌లు ఈ కోవకి చెందినవే. పంచదారకి తెలుపు రంగు తీసుకురావడానికి భాస్వరం అధికంగా ఉండే జంతువుల దుమ్ములు ఉపయోగించబడతాయని ఎంతమంది ఆలోచిస్తారు? అవశేషాలతో చేయబడ్డ తోలు పాదరక్షల్ని గురించి, చేతి సంచులగురించి, దుస్తుల గురించి ఎంతమంది ఆలోచిస్తారు?

యింక ఓషధుల సంగతి చెప్ప మొదలిడితే ఎంతైనా ఉంది.. పావురాన్ని చంపి , మాంసంతో మసలా కూర వండుకుని మజాగా తినే మాంసాహారులు కూడా, పావురం రక్తం పక్షవాతవైద్యానికి పనికి వస్తుందని తాగమంటే, వెగటుతో వెనకడుగూ, రోగభయంతో ముందడుగూ వేస్తారు. పెద్దపులి మాసంలోంచి తీసిన కొవ్వుతో చేసిన తలనొప్పి మందు అంతర్జాతీయ ఖ్యాతి పొందింది. ఖడ్గమృగం కొమ్ముల్నీ, ఏనుగుతోక వెంట్రుకల్నీ కాల్చి వ్యాజీకరణ భస్మాలూ, లేపనాలూ చేస్తున్నారు.

ప్రాణభయం కూడా శాస్త్రవిజ్ఞానం పెరగడానికి ఒక ముఖ్యకారణం. రోగభయం వైద్యరంగాభివృద్ధికి కారణం. సరైన మందులు లేని పాతరోగాలకీ, పుట్టుకొస్తున్న కొత్త రోగాలకీ కొత్తమందులు కనుక్కోవడనికి ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పరిశోధనలు నిత్య నిరంతరంగా జరుగుతున్నాయి. ఈ పరిశోధనల్లో ఎన్నిలక్షల జీవాలు ఆహుతైపోతున్నాయో లెఖ్ఖకందదు. మూషికాలు, చెవులపిల్లులు, పందులు, మా మర్కటాలు, ఒకటేమిటి..,ఎన్నో! ఈ పరిశోధనల ఫలితంగా, ప్రయోగాల ఫలితంగా ఓ ఔషధం వ్యాపరపరంగా రంగప్రవేశం చేస్తుంది. వైద్యులు రోగ్యప్రదానంకోసం, రోగనివారణకోసం  మందుని రోగులకిస్తారు. వేసుకున్న ఒక్క మాత్రలో ఎన్ని జీవాల గుండెల ఆవేదన ఉందో  రోగికి తెలియదు.

అయితే మనిషి ప్రవృత్తి చాలా విచిత్రంగా ఉంటుంది. అవకాశ వాదంతో సమాజంలో కొన్నికొన్ని యిబ్బందుల్ని తీసుకొచ్చేస్తాడు. దేశదేశాలా ప్రాచీన వైద్యాలలో జంతు అవశేషాలు వాడ బడ్డాయి, వాడబడ్తోనే ఉన్నాయి. సజీవమైన జంతుజాలం మీద రసాయనాలతో ప్రయోగం చేసి, ఆ తర్వాత వాటిని మానవరోగ నివారణకుపయోగించే ఆధునిక వైద్య నిపుణులకి ప్రాచీన వైద్యరీతుల్నీ, మందుల్నీ తీసికట్టుగా చూసి, అవహేళన చేసే నైతిక బలముందా? ఉండదనీ, లేదనీ భావము!

మనిషి బ్రతికుండగానే మూత్రపిండాలు దానం చేస్తున్నారు. మరణావస్థలో ఉండి యిక బ్రతకడని నిర్ధారణకొచ్చిన తర్వాత ఆ మనిషి గుండె తీసి మరో హృద్రోగికి అమరుస్తున్నారు. మనిషి మరణించిన తర్వాత నేత్రదానం చేస్తున్నారు. ఆధునిక వైద్యం పేరిట యిన్ని చేయగాలేంది - మరణించిన మనిషి శల్యభస్మాన్ని కాని, కపాల భస్మాన్ని కాని ప్రాచీన వైద్యవిధానాలు వివరించిన మేరకుపయోగిస్తే కొంపమునిగిందేమిటంట?

యింక దుష్ఫలితాలంటవూ, అవి లేని మందులేమున్నాయని? మందుల దాకా ఎందుకు? వంకాయకూరతింటే వంటి దురదలొచ్చేవాళ్ళు, ములక్కాడ సాంబారుతో ముక్కు దిబ్బడ వచ్చేవాళ్ళు, యిలా ఏదో తింటే ఏదో అయ్యే వాళ్ళు కోకొల్లలు..!

పుష్కలంగా దొరికే అల్పజలచరాల్ని అతిగా భక్షించవద్దని నీ ఆడదానికి చెప్పు. అలా చేసినా రోగం తగ్గకపోతే నువ్వూ,మీ ఆవిడా ప్రభుత్వ మకర సంరక్షణా జలాశయాన్ని చేరుకోండి. మా కోతి గుండెలతో ప్రయోగాలు చేసి కనుక్కొన్న మందుల్ని అక్కడి వైద్యులు నీ ఆడదానికి ఇస్తారు. రోగమూ నయమవుతుంది, మీ యిద్దరికోరికా తీరుతుంది! ఏమంటావు?' మర్కటం అంతా చెప్పి చివరగా ప్రశ్నించింది.

మొసలి కన్నీరు కారుస్తూ 'ఈ కోతి వ్యవహారం బాగో లేదు. మరోకోతిని వెదుక్కోవాలి' అనుకొంటూ అక్కణ్ణుంచీ కదిలింది.

చూశావా బాల్రకిష్టా! నువ్వు చెప్పిన నీటి కథకీ, నేను చెప్పిన 'రమ్' కథకీ ఎంత తేడా ఉందో? అందుకనే పాతకథల్ని పాఠ్యాంశాలుగా తీసుకొచ్చినప్పుడు ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా మార్పులు చెయ్యాలి. లేకపోతే అవి నిలవ నీతి కథలుగానే మిగిలిపోతాయి, మురళీ చెప్పినట్లుగా! విస్కీ, రమ్, బ్రాందీలొద్దు కానీ కనీసం బీరు తాగు, నీ బుద్ధి వికసిస్తుంది.!" సాయికృష్ణ ముగించాడు.

"సరేనయ్యా! మహానుభావులారా! మీ సారా భాష్యాలు ఓపిగ్గా విన్నందుకు నన్నూ ఓ కథ చెప్పనివ్వండి మరి! నే చెప్పబోయేది పంచతంత్రంలోనిది కాదు, అవధరించండి!

ఓ డిసెంబరు ఆదివారం. పది గంటలవేళ వెచ్చటి ఎండలో వయ్యారంగా నడిరోడ్డమ్మట పోతున్న మాలక్ష్మి, వెనకపాటుగా వచ్చి

మీదపడ్డ ఆకారాన్ని చూసి స్తంభించిపోయింది. రోడ్డు మీద నడుస్తున్న జనాలు దగ్గరగా పోయే దమ్ములేక, హాహా కారాలు చేసుకొంటూ దూరంగా పోయారు.

అరుగుమీద కూర్చుని పాఠం చెబ్తోన్న పార్వతమ్మ తన ఆరేళ్ళ కొడుకుని బర బరా లోపలికి లాక్కుపోయి, తలుపు మూసి గడియపెట్టింది. వీధి గదిలో కిటికీ పక్క కూర్చుని లెక్కలు చేసుకొంటున్న ఆరోక్లాసు పద్మలత పుస్తకాన్ని పక్కనబెట్టి, బయట జరగుతున్న భాగోతాన్ని వింతగా చూడ్డం మొదలు పెట్టింది. రోడ్డుమీద గోల విని ముందు గదిలోకి వచ్చిన పద్మలత తల్లి జరుగుతోన్నది చూసి, కిటికీ తలుపుల్ని మూసి కూతుర్ని లోపలి గదిలోకి తీసుకుపోయింది.

అడుగుల్లో అడుగులు వేసుకొంటూ, చంకల్లో బిందెల్ని యిరికించి మంచినీళ్ళు మోసుకువెడ్తున్న మంగమ్మా, మాణిక్యాలూ ఆ దృశ్యాన్ని తిలకించి, వేగం హెచ్చించి వడివడిగా నడవసాగారు. ఆ క్షణంలో వాళ్ళిద్దరికీ మిల్ట్రీలో పన్జేస్తున్న తమ భర్తలు ఇళ్ళకు వస్తే బావుండుననిపించింది. మేడమీది గదికిటికీ తెరచాటునుంచి రోడ్డు మీద జరుగుతున్న ఆ దృశ్యాన్ని చూసి లలితాదేవి భారంగా నిట్టూర్చింది. చతుర్ముఖ పురాణంలో ఎక్కడో కొలువుదీరి వారం రోజులుగా యింటిని మరచిన భర్తని తలచుకొంటూ.

అఘాయిత్యం చేసిన ఆకారం అవసరం తీర్చుకుని వెళ్ళిపోగానే, రోడ్డుమీది జనాలు ఏమీ జరగనట్టే కదిలిపోయారు.

రెండిళ్ళకవతలగా ఓ పెంకుటింటి అరుగుమీద నిల్చున్న వెంకటస్వామి నెమ్మదిగా వచ్చి, మాలక్ష్మి వద్దకు వెళ్ళి మెడమీద చెయ్యివేసి తీసుకుపోయాడు. ఊరి చివరనున్న తాటాకు గుడిసెచేరి, 'ఏయ్, సుందరం! బయటకురా!' అని గట్టిగా అరిచాడు.

'రోడ్డు మీద నిలబడి ఏవింటా గావు కేకలు? ఎవరైనా వింటే నవ్విపోతారు!' అంది బయటకు వచ్చిన సుందరమ్మ.

'అదికాదే! మన మాలక్ష్మిని నందిగాడు దాటాడు! యింక బెంగలేదు!' అన్నాడు వెంకటస్వామి ఆనందంగా.

'దీని కడుపు పండి పెయ్యగాని పుట్టే మరిడి మాలక్ష్మికి కోడిపుంజుని నరుకుతాను!' అని మొక్కుకొంటూ, సుందరమ్మ మాలక్ష్మి మెడనిమిరి దొడ్లోకి తీసుకుపోయింది.

సెక్స్ తర్వాత మన సమాజానికి పాలిచ్చే ఆడపశువులూ, కట్నాలు తెచ్చే మగశిశువులూ కావాలి మరి! ఊరి ఆవులన్నింటికీ ఒక్క ఆంబోతు చాలు. అయితే తమతమ వంశాలు కొనసాగడానికి పలువురు పురుషులకి ఒకే స్త్రీ లభ్యమయ్యే దిశగా సమాజం ఎందుకు పరుగులు తీస్తోందో, అది ఎంత చేటో, దానికి కారణం ఎవరో ఆలోచించాలి కదా?" బాల్రకిష్ణ ముగించాడు.

" ఈ కథలో ఏముందని?" మురళీకృష్ణ ప్రశ్నించాడు.

"చివరగా ప్రశ్న సంధించాను కారణం అడుగుతూ మురళీ కృష్ణా! నీకు రెండులక్షల కట్నం ఇవ్వడానికి నీ మామగారు ఉన్న యింటినమ్ముకున్నారు. సాయికృష్ణా నీకు అయిదు లక్షల కట్నమిచ్చిన మామగారు లంచాలు పట్టారు. ఆస్తులు లేని వాళ్ళ సంగతి, లంచాలు పట్టని వాళ్ళ సంగతి ఏమిటి? స్త్రీ సంతానం సమాజ విముఖంగా తయారవడానికి మీలాంటి వాళ్ళే కారణం కాదా? మరి ఈ ఆంబోతు కథ ఎంతటి నీతిని బోధిస్తోంది.! సమాజ స్వరూపాన్ని ఎంత చక్కగా చూపిస్తోంది?! ఎలా వుంది ఈ నీరు తాగేవాడు చెప్పిన నీటి కథ?" బాల్రకిష్ణ వాళ్ళిద్దరికేసి చూస్తూ అన్నాడు.

అంతవరకూ కొసరు కొసరుగా తాగిన వాళ్ళిద్దరూ ఒక్కసారిగా గ్లాసులు ఖాళీ చేసేశారు.

చంద్రుడు ప్రసరించే వెన్నెల్లో మార్పులేకపోయినా అడ్డొచ్చిన మబ్బులు మట్టుకు భూమికి మసక వెన్నలని ప్రసారిస్తున్నాయి. నీతి అనేది కూడా యిలాంటి ప్రక్రియకీ, పద ప్రయోగానికీ అతీతంకాదు.

****

# దూకితే దూకండి

- వారణాసి రామకృష్ణ

**ఆంధ్రప్రదేశ్ పత్రిక వారు నిర్వహించిన దీపావళి కథలపోటీ – 2007 లో ద్వితీయ బహుమతి పొందిన కథ**



**నర్సాపురం దగ్గర ఓ ఊరు –**

ఎనిమిదో క్లాసు చదివే అప్పలమ్మకి ఏదో క్లాసు చదివే సూరిపండు ప్రేమలేఖ ఇచ్చాడు.

"డియరెస్టు అప్పలం – నువ్వంటే నా కిష్టం – నీనవ్వంటే చచ్చేంత ఇష్టం! మరి నేనంటే ఇష్టమేనా అప్పలం? ఐలవ్‌యూ, ఐ

లవ్‌యూ – ఇట్లు సూరిపండు!"

మర్నాడే అప్పలమ్మ రిప్లై ఇచ్చింది, "ఒరే పండూ – నాకు ఆపిల్ పండుకన్నా సూరి పండంటేనే ఇష్టం! స్కూల్లో చేరిన కొద్దిరోజులకే నువ్వు నా బాయ్ ఫ్రెండవటం నా కెంతో బాగుంది. ఇక ప్రేమించుకోవటం అనే ఓ పని అయింది. గనక రేపట్నించి చింత తోపుల దగ్గర కలుద్దాం. సరేనా – రాకపోయావో నీ ముక్కు కోస్తా – హహహా... ఇట్లు అప్పలం."

ఆ తర్వాతి నుంచీ ఇద్దరూ స్కూలు ఎగ్గొట్టి యధాప్రకారం చింతతోపు దగ్గర కలిశారు. అచ్చంగా సిన్మా హీరోహీరోయిన్ల మాదిరే ప్రేమకి ఎదురవుతున్న కష్టాల్ని చర్చించుకున్నారు.

"ఐతే అప్పలం – మన పెళ్ళికి పెద్దాళ్ళు ఒప్పుకుంటారంటావా?" డౌటొచ్చింది సూరిపండుకి.

"వొప్పుకోకపోతే గట్టిగా తిట్టి అల్లరి చేసయినా వొప్పిస్తాన్రా పండూ! అది పెద్ద సంగతి కాదు! అసలు సమస్య చట్టంతోనే!"

"చట్టమా? అంటే ఏంటి అప్పలం?"

"నీకు 21 ఏళ్ళు, నాకు 18 ఏళ్ళు వచ్చే దాకా పెళ్లి చేస్కో కూడదురా! మొన్న టీవీలో కూడా చెప్పారు చూడలేదా?"

"హా అప్పలం! ఎంత దారుణం! ఐతే నేను అంత పెద్దయ్యేదాకా ఆగాలా?"

"లేదురా! ఈ దారుణాన్ని మునలాంటి ప్రేమికులే ఎదిరించాలి!"

సూరిపండు బేల మొహం వేసి "ఎలా ఎదిరిస్తాం అప్పలం?" అడిగాడు.

"నువ్వేం వర్రీ కాకురా! వెంటనే ఇద్దరం హైదరాబ్యాడ్ పారిపోదాం!"

"హైద్రాబ్యాడ్కా? ఎందుకూ? అక్కడ చట్టం ఉండదా?"

"వొరే ఫూల్ – నీకసలేం తెలీదు!" అంటూ అప్పలమ్మ హైద్రాబ్యాడెళ్ళి ఏం చెయ్యాలో మార్గం బోధించింది! అంతే రహస్యంగా ఆ రోజే ఇద్దరూ రైలెక్కేశారు!

కరీంనగర్ కాలేజీలో ఇంటర్ గత ఆరేళ్ళుగా చదువుతున్న రజినీ తన ఒకప్పటి క్లాసుమేటు ఇప్పుడు అదే కాలేజీలో జువాలజీ లెక్చరర్ నీలవేణిని పీకలోతుల్దాకా ప్రేమిస్తున్నాడు. కానీ నీలవేణి మాత్రం ఛీ కొట్టి "ఇంకోసారి ప్రేమా దోమా అన్నావో పళ్ళురాలగొడతా! పెళ్ళి గిళ్ళీ అన్నావో మా శేఖర్ బావ నిన్ను దంచుడే దంచుడు! జాగ్రత్త!" అన్నది. దాంతో రజనీ రోజూ "హృదయం ఎక్కడున్నది?

హృదయం ఎక్కడున్నది?" అంటూ పాటపాడుతూ బేలగా తన చుట్టూ తాను తిరుగుతున్నాడు. రజనీ తండ్రి ఓసారి చూసి 'అరె బిడ్డా! జర బుక్కు తీసి చూడరాదే! అదేడున్నదో! అప్పటి సంది పిచ్చి లెక్క తిరగకపోతే!" అన్నాడు కంగారుగా!

"అరె నాయనా - నీకేం తెల్వదు" అంటూ మళ్ళీ "హృదయం ఎక్కడున్నది?" అంటూ గుండ్రంగా తిరగసాగాడు.

"అరె నాయనా - నీకేం తెల్వద్? హృదయం యాడుంటదో, బ్రెయిను, కిడ్నీలు యాడుంటాయో సిన్నప్పుడే సదివిన బిడ్డా! గిప్పుడు యాదిమర్సిన గానీ నువ్వు బుక్కు వోపెన్ చెయ్యి - చూపిస్తా!"

"వోరి నాయనోయ్ - నువ్వు గారూట్లో వచ్చినవా? ఇది సిన్మా పాట నాయినా!"

"ఇవేం పాట్లరో! గిసుంటి పాటలింటంటే పాగల్‌గాని లెక్క తిరగబట్టితివి! హృదయం యాడున్నదో తెల్వదా బిడ్డా! గీడ - గీడుంటది!" అంటూ జేబు చూపించాడు.

"అరె నాయినా! నీకేం తెల్వదు పో! నేనియ్యాలే లష్కర్ పోతన్న!"

"లష్కర్ ఏమిటి బిడ్డా?"

"గాపోరి నీల్వేణికి ఇయ్యల పెండ్లి దావత్ చేస్తుండ్రు! గెట్లన్నా దాన్నాపాలే!"

"వొద్దొద్దు బిడ్డా..! ఫాల్తు పన్లు సెయ్యొద్దు బిడ్డా.."

"అరె నాయనా - నీకేం తెల్వదే!" అనేసి రజనీ సరాసరి బస్టాండ్ కెళ్ళి బస్సెక్కాడు! అనక సికింద్రాబ్యాడ్‌లో బస్సు దిగేడు!!

కడప జిల్లా రాజంపేట టౌన్‌లో - ఇద్దరు పిల్లల తల్లి రాధ సిన్మా చూద్దామని వెళ్ళి ఇంటర్వెల్‌లో తిరిగొచ్చేసి బాధతో మంచం మీద అడ్డంగా పడుకుని ఆలోచించసాగింది. సిన్మాహాల్లో కృష్ణని (పేరు సూటయింది కదాని) గాఢంగా ప్రేమిస్తే పెద్దలు తొందరపాటుగా మేనమామ రామారావునిచ్చి పెళ్ళిచేసేశారు. సిన్మాహాల్లో రాధని చూడగానే కృష్ణ ఆనందంతో ఊగిపోతూ "రాధా! ఎన్నాళ్ళకి కనిపించావు రాధా! ఇంతకాలంగా వెతుకుతున్నాను! ఐ లవ్ యూ రాధా!" అంటూ అచ్చు సిన్మా హీరోలా భారీగా డైలాగ్ చెప్పాడు. పాపం రాధ బాధతో నలిగిపోతూ "పిచ్చి కృష్ణా! నా కోసం పెళ్ళి గిళ్ళీ మానేసి ఎదురు చూస్తున్నావా? అవతల నేను ఇద్దరు పిల్ల రాక్షస వెధవలకి తల్లినయ్యాను! పాపిష్టిదాన్ని! హు హు హు!" అని ఏడ్చింది. కృష్ణ ఖంగు తిని -

"రాధా! నీకులానే నా శరీరానికీ పెద్దలు పెళ్ళి చేస్తే నాకూ ఇద్దరు పిడుగులు పుట్టుకొచ్చారు కానీ నా మనసు, హృదయం, తనువు అన్నీ నీకే అంకితం!" మరో భారీ డైలాగ్ పేల్చాడు.

దాంతో రాధ కరిగిపోయి " నిజమే! రాధ ఎప్పుడూ కృష్ణుడికే అంకితం!" కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది. ఐతే సరిగ్గా అప్పుడే మొగుడు రామారావు అక్కడికొచ్చాడు. ఉన్నట్టుండి మొగుడు అలాంటి రసవత్తర సీన్‌లోకి ఎంటరవుతాడని ఊహించని రాధ తుళ్ళిపడి -

"ఏవండీ! ఇంటర్‌లో నా క్లాస్మేట్ కృష్ణ!" పరిచయం చేసింది.

పాత కథ చెప్పింది. రామారావు మాత్రం బరువుగా మొహం పెట్టి - "రాధ! మీరిద్దరూ ఇంత లెవిల్‌లో గాఢంగా లవ్ చేసుకున్నారని తెలీక ఎంతపని చేశాను? ఛా!, బుష్ సద్దాంహుస్సేన్‌ని ఉరితీయించినట్టు మీ పవిత్రప్రేమని నులకతాడుతో బంధించాను. ఐనా మించిపోయింది లేదు! మీ ఇద్దరికీ వెంటనే పెళ్ళి చేసేస్తాను!" చెప్పగానే కృష్ణ ధామ్మని క్రింద పడి లేచి గజగజా వణికి పోతూంటే రామారావు ఉద్వేగంగా -

"అవును కృష్ణా! రాధని నువ్వు పెళ్ళాడితే ఎంచక్కా నేను సీతని చేస్కోవచ్చు!" అన్నాడు వెంటనే రాధ "సీతా? సీతెవరండి?" కంగారు పడింది.

రామారావు బాధగా మొహం పెట్టి "హుఁ! ఏం చెప్పను రాధా! సీతగారు నా కొలిగ్. పేరు సూటయింది కదాని లవ్ చేశాను. భర్త చనిపోయాక ఆవిడకి జాబ్ ఇచ్చారు. ఆవిడిని చూసిన తొలిరోజే నా గుండెలో ప్రేమ కలుక్కుమంది! ఆవిడ ఇద్దరు మనవళ్ళు, నలుగుగురు మనవరాళ్ళని చూశాక, వాళ్ళతో మాట్లాడాక..." పూర్తి కాకముందే కృష్ణ మళ్ళీ ధామ్మని కింద పడి లేచి –"ఏమిటీ! సీతకి మనవళ్ళు, మనవరాళ్ళూ ఉన్నారా? కొంపదీసి ఆవిడ వయసులో నీకంటే –" మాట రాక ఆగిపోయాడు.

"నీకంటే నా కంటే ఏమిటి కృష్ణా! ఆవిడ మనందరికంటే పెద్దది! అవును - రాముడి కంటే సీత పెద్దది! సచిన్ కంటే అంజలి పెద్దది! అభిషేక్ కంటే ఐశ్వర్య పెద్దది!"

"అంటే - అంత పెద్దావిడిని నువ్విప్పుడు పెళ్ళాడుతావా?"

"ఆడతావా కాదు పిచ్చి కృష్ణా! ఆడాలి! రాధని నువ్వు ఆడితే సీతతో నేను సెటిలవుతాను! అప్పుడే బోలెడంత కోట్ల ఆస్తికి ఓనరవుతాను!" గబుక్కున అనేసి రామారావు ఛటుక్కున నాలిక కరుచుకున్నాడు.

కృష్ణ మనసులోనే ఆల్జీబ్రా లెక్కలు వేశాడు.'సొంత పెళ్ళాం, ఇద్దరు పిల్ల వెధవలకి తోడు, ఇప్పుడు రాధ ప్లస్ ఇద్దరు పిడుగులు నా నెత్తిన పడితే నా పని నిజంగానే సద్దాం హుస్సేనయి బతుకు హుస్సేన్ సాగర్లో పడుతుంది! వామ్మో!' పారిపోయాడు వెంటనే అక్కడినుంచీ.

.....ఆలోచనల్లోంచీ బైటపడ్డ రాధ తలెత్తి చూస్తే రామారావు బ్యాగు పుచ్చుకుని హడావిడిగా ఎక్కడికో వెళుతున్నాడు.

"ఏవండీ! ఎక్కడికండీ? సీత దగ్గరికేనా?" సంబరంగా అడిగింది.

"కాదు రాధా! ఆ కిట్టిగాడు అప్పుడే ఊరునుండీ మకాం ఎత్తేశాడు. వాడెక్కడ దాక్కున్నా బైటకి లాగాలి హైద్రాబ్యాడెళ్ళీ...." చెప్పబోతే –

"మధ్యలో హైదరాబ్యాడెందుకూ?" ఆశ్చర్యపోయింది.

రామారావు పెళ్ళాన్ని పిచ్చిదాన్ని చూసినట్టు చూసి రాజధాని కెళ్ళే ట్రైనెక్కేశాడు మర్నాడు పొద్దున్నే 'నాంపల్లి టేసనుకాడ' దిగేడు

జంట నగరాలు! పేరులోనే 'జంట' ఉండడం వల్ల కావచ్చు ఎక్కడెక్కడి'జంట'లన్నీ తమ ప్రేమ 'పంట' పండించుకునేందుకు జంటనగరాలకి వచ్చేశాయి.

ఉదయం వేళ - రోడ్లన్నీ వాహనాలతో క్రిక్కిరిసిన వేళ - హఠాత్తుగా కలకల! సజావుగా సాగుతున్న ట్రాఫిక్ కాస్తా ఆగింది. జనం తలెత్తి చూశారు. ఇరవై అంతస్తులపైన అప్పలమ్మ, సూరిపండు చేతులు పట్టుకుని - "అందరూ వినండి! బాగా చూడండి!" అంటూ అరిచారిలా - "దూకుతున్నాం! దూకి చచ్చిపోతాం!" పాపం జనం కంగుతిని "వద్దు! దూకొద్దు!" కేకేలేశారు.

"నో! పరమ పవిత్రంగా ప్రేమించుకున్న జంటల్ని పిచ్చి చట్టాలు విడదీస్తున్నాయి. అందుకే దూకేస్తాం" జనం గుంపులు గుంపులుగా గుమికూడారు. ట్రాఫిక్ అస్తవ్యస్తం అయింది. ట్రాఫిక ఐలెండ్ దిగి కానిస్టేబుల్ పరుగెత్తుకొచ్చాడు. అప్పలమ్మ రెచ్చిపోతూ "న్యాయంగా ధర్మంగా చట్టాన్ని కాపాడాల్సిన ఈ పోలీసులు మైనార్టీ పేరుతో మెజార్టీ ప్రేమికుల్ని విడదీస్తున్నారు!" అరిచింది. పాపం ట్రాఫిక పోలీసు ఆ డైలాగ్‌కి బెదిరిపోయి పిచ్చి చూపులు చూశాడు. సూరిపండు ఉత్సాహంగా అరిచాడిలా -

"వెంటనే సిఎం అంకుల్ వచ్చి హామీ ఇస్తే కిందకి దిగుతాం! లేకుంటే దూకేస్తాం!"

"వద్దు ! దూకొద్దు! కాళ్ళు చేతులు విరిగి ఛస్తావు!" జనం అంటూండగానే పోలీసు అధికారి దూసుకొచ్చి "ఇదిగో పాపా! నీ డిమాండ్స్ చెప్పు! ప్రభుత్వాన్ని నేను నొప్పిస్తాలే!" ఎలాగో ఒకలా వాళ్ళని క్రిందకి సేఫ్‌గా దించాలని చెప్పాడు. అప్పలమ్మ విజయగర్వంతో ఊగిపోయింది.

"పెళ్ళి వయసు తగ్గించాలి! ఎల్‌కేజీ చదివే పిల్లలకి లవ్ చేసుకునే హక్కు ఉండాలి!"

"అలాగే! తప్పకుండా! అసలు ఆస్పత్రిలో పిల్లలు పుట్టీ పుట్టగానే లవ్ చేసుకుంటే ఉయ్యాల్లోనే మ్యారేజీ చేస్తాం. ప్రభుత్వమే శిశు కళ్యాణోత్సవం జరిపేలా చట్టాల్ని మార్పిస్తాం గానీ ముందు మీరిద్దరూ దిగిరండి!" పోలీస్ అధికారి చెపుతుండగానే మరో అర్జెంట్ ఫోన్‌కాల్ వచ్చింది. ఆగమేఘాల మిద అక్కడికెళ్ళి చూస్తే - అక్కడా ఇదే సీన్ నడుస్తోంది. ట్రాఫిక్ ఆగిపోయింది. బిల్డింగ్ పైకెక్కి రజినీ చిందులేస్తూ అరుస్తున్నాడు.

"దూకుతా! నీల్వేణి నా పెహలా ప్యార్! గా పోరి నా తాన రాకపోతే దూకి చచ్చిపోతా? నీల్వేణి...."

"ఒరే బాబూ! నీలవేణి ఎవరు నాయనా? ఎక్కడుంటుంది??"

"కుక్కట్ పల్లి దిక్కుగా పోరి నీల్వేణికి ఈ దినం ఎంగేజ్‌మెంటుంది! దాన్ని క్యాన్సిల్ చెయ్యాలి! నీల్వేణి ఈడికొచ్చి నాతోన ఐ లవ్ యూ చెప్పాల! చెప్పకపోతే దూకేస్తా - దూకుతా! దూకేస్తా!"

ఈలోగా మీ టీవీ, ఆ టీవీ ఛానెల్ వాళ్ళంతా చంకలు గుద్దుకుని సంబరపడుతూ బిలబిలమని కెమేరాలతో సహా దిగేశారు. వాళ్ళని చూడగానే రజనీ మరింత రెచ్చిపోయాడు.

"వెంటనే ఛానెల్స్‌లో స్క్రోలింగ్ న్యూస్ రావాల! గా నీల్వేణి పెండ్లి ఆగిపోవాల!లేదా దూకేస్తా!!" పోలీసులు వెంటనే ఆదేశాలిచ్చారు. మరికొందరు నీలవేణిని తీసుకు రావటానికెళ్ళారు.

ఈ తతంగమంతా నడుస్తుండగా టైం మధ్యాహ్నం రెండు గంటలయింది. రోడ్ల మీదున్న జనం ఎక్కడి వాళ్ళు అక్కడే టిఫిన్ కారియర్లు ఓపెన్ చేసి తినసాగారు.

ఇంతలో పోలీస్ అధికారికి మరో ఏరియాలో కూడా ట్రాఫిక్ జాం అయి అక్కడా ఇదే తంతు సాగుతుందని తెలిసి పరుగులు పెట్టాడు. బిల్డింగ్ పై కప్పు మీద రామారావు చిందులు తొక్కుతూంటే క్రింద జనం హాహాకారాలు పెడుతున్నారు.

"నా పెళ్ళాం రాధని ప్రేమించిన కిట్టిగాడు జంటనగరాల్లో ఏ బంకర్లో దాక్కున్నాడో పోలీసులే వెతికి పట్టుకోవాలి!"

"బంకరా..-ఏం? వాడేమైనా దొంగా?"

"అవును! వెన్నదొంగ. కృష్ణుడిలా ఈ కృష్ణ నా పెళ్ళాం గుండెని దొంగలించిన దొంగ! వాడెక్కడ షెల్టర్ తీసుకుంటున్నాడో ఆచూకీ తియ్యాలి!"

"షెల్టరా? కొంపదీసి నీ పెళ్ళాన్ని ప్రేమించింది నక్సలైటా?" పోలీసు అధికారి నోరెళ్ళబెట్టాడు.

"నక్సలైటో, ట్యూబులైటో - మీరు కూంబింగ్ చేసి పట్టుకురాకపోతే దూకేస్తా! దూకి ఛస్తా!" గావుకేకలు పెడుతూంటే పోలీసులు ఆ పనిలో పడ్డారు.

సాయంకాలమైంది. ఈలోగా నీలవేణి వచ్చిందీ లేనిదీ చూద్దామని పోలీసు అధికారి బైలుదేరబోతే మరో ఏరియాలో పెద్దగా అరుపులు! కేకలు!

బోలెడుమంది అమ్మాయిలు పెద్ద భవంతి వాటర్ ట్యాంకెక్కి అరుస్తున్నారు!

"అమ్మా! మీరెవరు తల్లీ! మీ డిమాండ్స్ చెప్పండి!" పోలీసు అధికారి వాపోయాడు.

ఓ అమ్మాయి ముందుకొచ్చి పై నుండే అరిచిందిలా -

"మా డిమాండ్ మీకంత త్వరగా అర్థమయ్యేవి కాదు సార్! ఏ సినిమాలో చూపించని, ఏ రచయితా రాయని సమస్యలు మావి! ప్రేమంటే ఏమిటో తెలీని ఇద్దరు సన్నాసులు మేడలు గోడలు ఎక్కి చస్తామని బెదిరించగానే మీరు లోగడ బోలెడు పెళ్ళిళ్ళు చేసేశారు! బానే ఉంది కానీ - ఆ పెళ్ళి అయ్యాక, వ్యామోహం తీరాక - నెత్తిమీద బాధ్యతలు పడ్డాక, వీళ్ళు ఒకరి పొడ మరొకరికి గిట్టక విడిపోతున్నారు. పిల్లల్ని అనాధల్ని చేస్తున్నారు. మేము ఆ కోవకి చెందిన అమ్మాయిలం సార్! మేమెవరమో ఇప్పుడు అర్థమైందా? మాకు అమ్మా నాన్నల్లేరు, చదువు లేదు. సరైన తిండి లేదు. మాకు పెళ్ళిళ్ళూ అవవు! మరి నా గతేమిటి? మా సంగతేమిటి"

ఇంతలో ఇంకో స్త్రీ పై కప్పు మీద నుంచే ముందుకొచ్చి నిలబడి - "అయ్యా! నేనో పోలీసు భార్యని! నా భర్తకి ఉన్న ఉద్యోగ బరువు బాధ్యతలకి తోడు ఈ మధ్య ఈ దిక్కుమాలిన లవ్వు కేసుల బెడద ఎక్కువైపోయిద్కి! బ్లాక్ మెయిలింగులకి దిగి దూకుతాం, దూకుతాం అని తెగ రెచ్చిపోతున్న వాళ్ళని సంరక్షించటంలోనే బతుకు తెల్లారిపోతోంది! లవ్వు పైత్యం తలకెక్కి తింగర చేష్టలు చేస్తున్న వాళ్ళ మూతి మీద అట్లకాడ తిరగేసి వాత పెట్టి జన్మలో మళ్ళీ ఐలవ్‌యూ అనకుండా చూడకపోతే పోలీసు కుటుంబాల్లో ఒకరి పట్ల మరొకరికి ఉండాల్సిన ప్రేమాభిమానాలు ఛస్తాయి! అసలు ప్రేమ అనేది మానసిక బంధానికి సంబంధించిన సంగతి కానీ ఇదో సామాజిక సమస్యలా ఎందుకు పరిణమించాలి? రోగులు ఆస్పత్రికి, పిల్లలు స్కూళ్ళకి, ఉద్యోగులు ఆఫీసులకి వెళ్ళలేక ఇంతింత మంది జనం ట్రాఫిక్కులో చిక్కుకుని నానా నరకయాతనలెందుకు పడాలి? ప్లీజ్ - దీనికో పరిష్కారం చూడండి సార్!"

అంటూ ఆవిడ క్రిందకి దిగి వచ్చేసింది. పొద్దున్నించీ ట్రాఫిక్కులో ఇరుక్కుపోయిన మంత్రులు, డాక్టర్లు, లాయర్లు, జడ్జీలు, రచయితలు - అందరూ అదే రోడ్డు మీద అప్పటికప్పుడు సమావేశమయ్యారు. అరగంటలో ఓ నిర్ణయానికొచ్చారు. కమీషనర్ దగ్గరున్న మైక్ పుచ్చుకుని న్యాయమూర్తిగారు జనాంతికంగా చెప్పారిలా -

"చచ్చు పుచ్చు తెలుగు సినిమాల వల్లో, మానసిక రుగ్మత వల్లో కొందరిలో ప్రేమ పైత్యం ముదిరిపోయింది. గంగవెర్రులెత్తి పోతూ అది మిద్దెలు మేడలు సైతం ఎక్కుతోంది! ఈ టైపు వెర్రి ముదిరి క్లైమాక్సు కొచ్చింది. అందుకే - 'దిగి రండి రండి!' అని నచ్చ చెప్పాలనుకోవటం లేదు, మూర్ఖపు ప్రేమల కోసం దూకి చద్దామనుకుంటే నిరభ్యంతరంగా దూకండి! కాళ్ళు, చేతులు విరిగితే పుత్తూరు పంపిస్తా! ఒకవేళ నిజంగానే ఛస్తే వైద్య విజ్ఞాన ప్రయోగాల కోసం శవాల్ని వినియోగిస్తాం. పోలీసులకీ, ప్రభుత్వాలకీ ఏ జవాబు దారీ లేదు! ఇలాంటి కేసుల్లో మా జవాబుదారీ ఉండదు! ఉండకూడదు! దూకుదామనుకుంటున్న వెర్రి ప్రేమికులారా! దూకితే దూకండి!!"

జనం వినగానే సంతోషంతో చప్పట్లు చరిచారు. ఎవరి వాహనం వారెక్కి కూర్చున్నారు. ట్రాఫిక మెల్లమెల్లగా కదిలింది. మరో గంటయ్యాక - ఎవరి దోవన వారు వెళుతున్నారు. అపర ప్రేమికుల గావుకేకలు, బ్లాక్‌మెయిలింగ్ చావుకేకలు వినిపించినా ఎవరూ పట్టించుకోవటం లేదు! దాంతో భవంతుల వాటర్ ట్యాంకుల పైకెక్కి నటరాజుల్లా నాట్యం చేస్తూ, పైత్యం తలకెక్కినా నానా యాగీ చేస్తూ 'దూకుతాం - దూకుతాం' అని తెగ రెచ్చిపోతున్న కుహనా ప్రేమికులు 'దూకాలా ఈ దూకుడు ఆపాలా' అన్న ఆలోచనలో పడి జుత్తు పీక్కుంటున్నారు!!

(రచయిత ప్రత్యేక అనుమతితో ప్రచురణ)

# నాలుగు దినాలు

- కవన శర్మ

"ఏటి బాబు! సొతంత్రం వొచ్చిందన్నారు. కామోసనుకున్నాం. గాంధీ, నెహ్రూ బాబుల పరిపాలనన్నారు. సీరామచందురుడే తిరిగి బూమ్మీద అవుతరించినట్టు రామరాజ్జెం తెచ్చేస్తారనుకుండిపోనాం... ఇంతలో గాంధీ బాబుని గుండేసి కాల్చీసినారు. తెల్లోడే గాంధీ బాబుని ఏటి సెయ్యనేక జైల్లో పెట్టి యెంటనే ఒగ్గేసినోడు. ఆడికి సేతకాని పని మనోల్లే నిముసంలో చేసేసినారు. ఆ పైన నెహ్రూ బాబే పొట్టిసీరాములు బాబుని పొట్టనెట్టుకున్నాడు. తెలుగుదేసం వొచ్చేసింది. ఒరేయ్ తెలుగు అప్పలకొండా నువ్వే ఇక రాజువిరా అన్నారు. నేనమ్మలా! కానీ సిన్న ఆశపడ్డాను. మునిసిపాలిటీలో సీపురుచ్చుకుని యీదులూడ్చే సీపరుద్యోగంలో నాకేటి పదవులిచ్చేత్తారు! ఇవ్వనేదు. సరే తెలుగు దేశం పార్టీ పవర్నోకి వచ్చింది అప్పుడు 'ఒరే! అప్పల కొండ నీకు యాభైపైన మరో అయిదొచ్చేసినాయిరా! ఇంక రిటేరు అయిపోరా' అన్నారు మూడేళ్ళుముందే అయిపోనాను. సతంత్రం వచ్చిన, తెలుగు రాష్ట్రం వొచ్చేసినా, మొత్తం దేశమే వొచ్చేసినా ఏటి బాబు! పేదోడి బతుకులో మార్పేటుంటాది."

ఈ ఊసులాడుతున్న అప్పలకొండ నాకు సొయాన సిన నాయన. మా నాయనకి సొయాన తమ్ముడు. నాను పుట్టిన మూడేళ్ళకే మా నాయన ఏరాడ కొండ ఓడల్దారి దాటుతూ నావతోపాటు మునకేసేసాడు. మా సిననాయనే నాకు అయ్యా అన్నా! నాకంటే పదమూడో, పద్నాలుగో ఏళ్ళు పెద్ద. మా యమ్మ కంటే ఏడెనిమిదేళ్ళు సిన్న. మా యమ్మ దురగమ్మగారింటోను, మరో బామ్మలింట్లోను పాచిపని చేసేది. ఆదిబాబు కొట్లో పప్పులు, ఉప్పులూ బాగు సేసేది. నన్నూ మా సిన్నాయన్ని తనే సాకేది. ఇప్పుడో రేపో సొతంత్రం వచ్చుద్దనగా మా సిన్నాయన మా సిన్నమ్మని మనువాడి ఏరే ఎల్లిపోయాడు. నాకప్పుడు ఏడో ఎనిమిదో వయుస్సు. మా సిన్నాయన పాటలు బాగాపాడేటోడు.

నాకో పాట గుర్తుంది. "ఏరాడ కొండ మీద సొనున్నది. ఏగాణి డబ్బులకి రాన్నది." అంటూ పాడేవోడు. ఆ పాట నాను పాడుతుంటే "గుంటడ్ని సెడగొట్టకు" అంది మాయమ్మ మా అప్పలకొండ సిన్నాయనతో.

అదిగో ఆ మాటకి మా సిన్నాయన సింవాచలం కొండమీద నాగు పాంవులాగా బుస్సుమని కస్సుమని, సిన్నమ్మతో వేరింటికెళ్ళిపోనాడు. కానీ ఇప్పటికీ నానంటే ప్రేమే. అందుకే అప్పుడప్పుడు ప్రేమగా ఊసులాడటానికి వత్తాడు. ఏటేటో గుర్తు సేత్తాడు.

ఈ దినం మీరు నా మాటలాలకిత్తన్నారనో మరేటో గాని నా సిన్నతనమంతా కల్లముందు సినేమా నాగా ఆడ్తా ఉంది

✵✵✵✵

ఆ మర్నాడు సొతంత్రం వచ్చేదినం. సొతంత్రం అంటే నాకేటి ఎరుక! ఏటీనేదు. సుబ్బరంగా ముసుగుదన్ని, సూరీడు కంట్లో పొడవకుండా తొంగుండిపోనాను. మా యమ్మ గొణుగుడు నాసెవుల పడతానే ఉంది.

"ఒరి సింవాసెలం. ఇంకా తొంగుండిపోనావేట్రా! నెగు! నెగు! నెగరా అయ్యా! ఆదిబాబు కొట్టుకట్టుకొత్తానని ఆ బాబుకి సెప్పానా.... ఏటి నెగుస్తావా, సెంబుడు నీల్లు దిమ్మరించేసేదా!" అమ్మ వార్నింగిచ్చేసింది. ముసుగు కొద్దిగా తొలిగించి సూద్దును కదా, వాల్టర్ టేసన్లోకి కలకత్తా మెయిల్ దూసుకొచ్చేసేటట్టు, సూరు కింద దూరి నోపలికి సెంబుతో వస్తాఉంది. టక్కున నేచిపోయి, మా

యమ్మని తప్పించుకుని బయటపడి, గోలం నోని నీల్లతో ముకం సేసేసి నోపలికి వొచ్చి అమ్మ ఇచ్చిన కాపీ చల్ల కాపీ ఓ గుక్కలో తాగేసి, గూట్నోంచి పైనా తీసి జుట్టుకి నీల్లు రాసి క్రాపు ఎగదువ్వి రెడీ అయిపోనాను.

ముందుగా నేను మా యమ్మ దురగమ్మగోరింటికెల్లినాం. అమ్మ తప్పేలాలు ముందేసుకుని కూకుంది. మా ఇంట్నో అన్నీ సిల్వర్ తప్పేలాలే! ఇయ్యింట్నో ఇత్తడి తప్పేలాలు, ఎండి కంచాలు, పింగాణీ బొచ్చెలు, ఎన్నో! నేను ఎగిరెగిరి బోరింగ్ కొట్టి నీల్లందిస్తావుంటే అమ్మ తప్పేలాలు తోమేసింది. అమ్మ సీపురట్టుకుని గదులూడ్సీడానికి రెడీ అయిపోతూంటే "ఒసే నూకాలూ! రేపు పద్దపండుక్కదే! ఇయ్యాల బూజులు దులిపి ఇల్లు కడిగి ముగ్గులెట్టే!" అంది దురగమ్మగోరు.

అమ్మ బూజుల కర్రందుకుని బూజులు దులుపుతుంటే నాను సీపురట్టుకుని కింద ఊడుత్తున్నాను. నాకు సీపురట్టుకోటంలో సులువులు మా సిన్నాయన సెప్పాడు. ఆ టయంలో దురగమ్మగోరన్నారుగందా!

"ఏటే నూకాలూ! నువ్వేమో సినదానివి. మీలోనేమో మారుమనువులున్నాయి! నువ్వు మరో మనువెల్లరాదా"అని.

"నా మారుటి మగడు, నా బొట్టెడిని కొడుకునాగా సూసుకోగలడా! వొయిసుదేవుందిలే తల్లీ! కల్లు మూసుకుంటే గడిసిపోద్ది" అంది. మాయమ్మకి నేనంటే పేనం! నాను ఊడిసిన గదుల్ని అమ్మని కడగమంది దురగమ్మగోరు. అమ్మ మాటాడకుండా కడుగుతావుంటే

"ఏటే నూకాలు! రైకేసుకోరాదుటే! వొయిస్సులో ఉన్నదానివి" అంది దురగమ్మగోరు. వంగుని కడుగుతున్న అమ్మ లేసి నిలబడి,

"అమ్మా! మీరు కంపెనీ బాడీలేసుకోరేం?" అని అడిగింది.

"సీ! నేనేం సినిమాదాన్నిటే" అంది ఆవిడ

"అమ్మా! పెల్లయేసరికి పదేను లేవు సరిగా పెల్లయిన మర్నాడే మా అత్తమ్మ మనం సాన్లం కామే కోడలా! రైకలేసుకుని సోకులు సేసుకోడానికి. పనీపాటల కెల్లేవోల్లం. కూసంత మగనాలినాగుండు` అంటూ మా అత్తమ్మ రైక తీయించింది" అంది అమ్మ. దురగమ్మగోరా దినం ఎందుకు ముకం అదోలా పెట్టిందో ఈ దినం నాకు తెలుసు.

ఆవిడ మరునాడు పండుగంటూ సానా సాకిరీ సేయించింది ఆ దినం, మా అంచేత. బామ్మర్ల ఇంటోను అంతే. అమ్మకి రెక్కలు గుంజేసినాయి.

అప్పుడు మా యమ్మ నన్ను ఆదిబాబుకి రాణాకొట్టుకట్టుకు పోయింది. ఆదిబాబు సాపుకి రంగు రంగుల కాయితాల జండాలు దారాని కంటించినయి సాపు సుట్టూ పనోడి సేత కట్టిత్తా ఉండాడు.

"కుర్రాడు మరీ పీలగా ఉన్నాడే! పనేటి సేత్తాడు" అన్నాడాదిబాబు నన్ను సూడగానే.

"పీలగా ఉన్నోల్లే సెలాకీగా పనిసేత్తారు. దిబ్బగున్నోల్లు పనేటి సేత్తారు!?" అంది మా అమ్మ. ఆదిబాబు బస్తా నాగా దిబ్బగుంటాడు. పనేటి సెయ్యడుగామోసు. అదిననట్టు,

"ఉప్పుడే సెప్పేత్తున్నాను. నా నీ గుంటడికి రోజుకి బేడ డబ్బులిత్తాను. నెల జీతం నేదు" అనేసినాడు. నాకు నోరూరిపోనాది.

"అమ్మా నేను జీల్లు, పిప్పలమెంట్లూ రోజా కొనుక్కుతింటానే" అన్నాను ఆసగా. అమ్మ అది యినిపించుకోక,

"డబ్బులొద్దు, రోజా కూలికి నూకలిచ్చి పంపించు" అంది

"బేడ డబ్బులికి రేసన్రోజుల్నో నూకలేటొత్తాయే" అన్నాడాదిబాబు.

"వచ్చినన్నే ఇయ్యి. అయినా రేపు సొతంత్రం వత్తుందంటగా. వచ్చినాక కూడా బియ్యం సేరారణాలకమ్మవా! దొంగసాటుగా రూపాయి పావలాకే అమ్ముకుంటావా! రేసనెత్తేరా. రేసనున్నా నెహ్రూ గాంధీ బాబులు దొంగయాపారం సేసేవోల్లని జైల్లో ఎట్టేరా?" అంది అమ్మ.

"నూకాలు! నువ్వు కాంగిరేసులో సేరి మంత్రివైపోయి నన్ను పట్టిచ్చెయ్యి" అన్నాడు ఆదిబాబు.

"హాసికాలకేటి బాబు! గుంటడ్ని ఎప్పటి నుంచీ పన్లోకంపేది?" అనడిగింది.

"ఎవలూ కొని సచ్చేది లేదు. ఈ రెండు మూడు రోజులు. మొదటి తారీకు నుంచీ పంపు" అన్నాడాదిబాబు.

"చోదర చోదరీమణుల్నారా! కొలాయి మూతల్నారా! సున్నప్పిడతల్నారా! రేపు సొతంతరదినం. "అంటూ మోహనుదాసు కరమ చందర గాందీ ఉపన్నాసం ఇత్తా ఉండాడు. దాసు దురగమ్మగోరి కొడుకు. నాయీడోడే! సుట్టూ తెలగాల పిల్లడు, గవర్ల పిల్లడూ, పెరికేల పిల్లడు కూర్సుని సప్పట్లు కొడతా ఉండారు.

"సింవాసెలం! రేపట్నుంచీ నీకు సొతంతరమ్మా! నీకొట్టంలేని పని సెయ్యనక్కర్నేదు." అన్నాడు దాసు.

"దాసూ! అయితే నేను ఆదిబాబు కొట్నోకి పనికిపోనక్కరనేదా! నాను నీలాగా బడికెల్లి సదూకోవచ్చా?" అని ఆసగా అడిగాను.

"ఆ సొతంతరం నీకుంది" అన్నాడు దాసు.

ఆ రాతిరి సరింగా అర్ధరాతిరికి, నాకు దాసుకి మాయమ్మకి సొతంతరం వత్తుందంట. నాకు నిద్దరపట్టనేదు. మా సిన నాయనొచ్చి "రేతిరికి పంపాన కోంసిలరు, విస్సినాదంబాబు, ఊల్లో ఇంకా పెద్దోల్లు డబ్బున్నోల్లు, దేసబత్తున్నోల్లు టపాకాయలు కాలుత్తార్రా. ఆల్లు ఇల్లా టపాకాయలు కాల్సీగానే అలా సొతంతరం వచ్చుద్ది. నెహురూబాబు ఢిల్లీలో కాంగిరేసు జండా ఎగరేత్తాడూ" అన్నాడు.

రాతిరి ధనాధనా టపాకాయలు మోగాయి. నా సిన్నప్పుడూ జపానోల్లు వేసిన బాంబులు సప్పుడు గుర్తుకొచ్చినయి. కానీ ఇప్పుడు బయం వెయ్యనేదు. సప్పుడు సంతోసమే!

పొద్దుటేల నెగిసినప్పటి నుంచీ వీదినోకి ఒప్పుడు పారొద్దరా అనే! మా యమ్మ నన్ను నేపనేదు. నేనే బేగినెగిసిపోనాను. పందుంపుల్లెట్టి ముకం సేసినాను. కాపీ బిల్ల, కాపీ తాగేసినాను. దాసు బాబిచ్చిన సొక్కా, నాగు కొత్తయి, దాసుక్కాదు నాక్కొత్తయి యేసుకొని ఈదినోకి ఉరికినాను.

సెట్టు సెట్టుకీ, కొట్టు కొట్టుకీ, పూరింటికి మిద్దింటికీ ఆపీసులకు బళ్ళకి ఆకరికి పెద్దదరమాసుపత్తిరికి కూడా మూడు రంగుల జెండా, అదే ఆపాట నోది, 'తిరివర్నాంపితపతాకం' కట్టేసినారు. వోలిండియా రేడియో," ఉదయమ్మాయెను సేచ్చాబతము దయమ్మాయెనహో" అంటూ మోతెత్తిపోతా ఉంది. నా వొయిసుకుర్రాళ్ళందరు సొక్కా జేబీలకి అలిపిలో కాయితం జెండాలు, నెహురూ బాబు గులాప్పువ్వెట్టుకుంటాడే, ఆనాగెట్టుకుని తిరగేస్తున్నారు.

దాసు ఇంటికి లగెత్తుకెల్లి "నాకో జెండాయియ్యవా" అని అడిగాను. "అయిపోనాయిరా...ఆగాగు..." అంటూ లోపలికి వెళ్ళి కాయితం తెచ్చి రంగు బిల్లలు నీల్లలో కరగబెట్టి, కుంచెతో జెండాబొమ్మ ఏసి దాన్ని ఓ పుల్లకి అంటించి సేతిలో పెట్టేసినాడు. జేబులో సిన్నజెండానేకపోయినా ఇప్పుడు నా సేతిలో పెద్ద జెండాయే ఉన్నాది.

బల్లోకెల్లిన పిల్లలు లడ్డూలు, బిల్లలు తింటూ జెండా ఎగరేసి వత్తున్నారు. గవర్న కుర్రోడు నా సేతిలో సిన్నపిసరెట్టినాడు. ఆకలేసి ఇంటికెల్లేసరికి మాయమ్మ పనులు ముగించుకొచ్చినాది.

"నిన్న రెక్కలు గుంజీసినాపనిసేయించుకున్నా ఆకలెరిగిన దొయిలు నీకూ నాకు పంచ బిచ్చపరమాన్నాలెట్టార్రా" అంది మాయమ్మ. మాయమ్మ ముకం జెండాలా ఎలిగిపోతా ఉన్నాది.

అదిగో అన్నాగ ఆ సొంతంతరదినం నానీనాటికి మర్సిపోనేదు.

నాకు సొతంతరం వచ్చినాది కదా! నా నూరుకోనేదు. అమ్మతో నా నాది బాబుకొట్లో సేరనని సెప్పి మా సిన్నాయన్ని నన్ను బల్లో సేర్సమన్నాను. మా సిన్నాయన, బాగుమల్లు సావుకారిల్లు దాటి మాంసం కొట్ల మీదుగా నన్నుతోలుకెల్లి, దుంపలబల్లో సేర్పించినాడు. దుంపలబడిలో తిండానికి మునిసిపాలిటీవోల్లు దుంపలిచ్చేవోరు. అయ్యారోజుల్లో ఒవరూ తినడం లేదుకానీ మా సిన్నప్పుడు సానామంది తినేటోల్లు. మా రుసిగా ఉంటాయి, సవగ్గా ఉంటాయి. అయికూడా ఉత్తినే, బల్లో ఇచ్చినట్టు, బయటొచ్చీరుకదా! దుంపల్తింటూ సదువుకోటం మొదలెట్టినాను. ఇంతలో బల్లకి దసరా సెలవలు ఆపైన దీపావలి సెలవలు, ఆపైన సంకురేతిరి సెలవలు అంటూ బడి సానా దినాలు సెలవలొచ్చేసినాయి. మళ్ళీ బడి తెరిసేనేదో దాసు, "చోదర చోదరీమణులారా! సున్నప్పిడతల్నారా! కొళాయి మూతుల్నారా! సోక వోర్త. గాందీగోర్ని గుండేసి కాల్చేసినారు" అన్నాడో సాయంతరం. దురగమ్మగోరు ఆ బాబుని సెడతిట్టారు. "నోటికి సుద్దీ బద్దీ ఉండాలి. గాందీబాబు నెవరు సంపుత్రారా. ఆయన దరమరాజు. స్రెత్రూలునేరు ఆయనకెవరు" అంది.

దాసు లోపలికెల్లి వోలిండియా రేడియో గట్టిగా పెట్టేసినాడు. అందులో సన్నాయిలు, పిడేల్లు కుక్కలు కూస్తున్నట్టు వోయిత్తున్నారు. మద్దెమద్దెలో ఇంగిలీసులో, ఇందీలో పెద్దోరు ఏదో అంటున్నారు.

"నిజమేరా దాసు. కలికాలం. మనోల్లేట కాల్చేసింది. తురకోల్లు కాదుట. చాంతంగా ఉండమంటున్నాది పెబుత్వం " అంది దురగమ్మ.

ఊరంతా ఎవరికి మటుకు వారింట్లోనే సెవం నెగిసినట్టు సోకాలెట్టేవోరు. కూడొండుకుని తినినోల్లు, మాకాలు ముడిసేసుకున్నోల్లు అయిపోనారు. ఇయ్యాల సాయింతరందాకా దర్జాగా కొయ్య సివర ఎగిరిన జండాలు మద్దెకి దిగిపోనాయి.

సాన్నాల్లు బల్లు మూసిసారు. సాపులు మూసేసినారు. ఏ కాంగిరేసోడు క్రరలుబిచ్చుకొని మూయించనేదు! మినర్వాటాకీసునో గాందీగోరిని ఊరేగించి బూడిద చేసినప్పుడు తీసిన సినిమా, డబ్బు తీసుకోకుండా సూపించినారు. నానూ అమ్మా సూసాం. ఏం జనం! ఏం ఊరేగింపు. ఎల్లిపోనాడూ పెదబాబు సొరగానికెల్లిపోనాడు.

మళ్ళీ బల్లు తెరిసారో నేదో అమ్మకి ఊష్టం వొచ్చింది. వొంటిమీద గేనం నేదు. బడిమానేసి అమ్మని సూసుకుంటూ ఉండిపోనాను. మా సిన్నాయన మంచోడు. అన్నం, సారు అన్ని దినాలు మా సిన్నమ్మ సేత పంపించినాడు నా సదువు సంకనాకిపోనాది. నన్ను అదే తరగతిలో ఉంచేసినాడు పెద్దపంతులు.

"నేను సచ్చిపోయినా బావుండేది. మీ సిన్నాయన నిన్ను సూసుకునేవోడు" అని అమ్మ ఆ రోజు సోకాలెట్టింది.

"వొద్దే నాకు బడొద్దే. నువ్వేకావాలే" అంటూ మర్నాడే నా అంతట నానే పోయి ఆదిబాబు కొట్లోసేరిపోనాను.

నాలుగేళ్ళు గడిసినట్టున్నాయి పొట్టిసీరాములు బాబు అన్నం నీల్లూ ముట్టుకోకుండా ఉపవాసం సేసి తెలుగు రాస్టం కోసం సచ్చిపోనాడు. రాజాజీ, నెహురూ కలిసి సంపేసారుట. గాంధీగోరు ఉపవాసం సేత్తే ఆయనకోరిందల్లా ఒప్పేసుకొనేవారుట, ఆ బాబులిద్దరు. అదే సీరాములు బాబిసయంలో ససేమిరా అంటూ మొండికేసేసారు. దాంతో తెలుగోల్లు రెచ్చిపోనారు. కుర్రోల్లు స్టైయికులు సేసేసినారు.

"రాజాజీ పిలక ఆరనాల పరక" అంటూ అరుసుకుంటా రోడ్నంబటి పోనారు. ఏమాట కామాటే సెప్పుకోవాల మాయమ్మనో నన్నో దురగమ్మగోరు రూపాయి పావలా ఇచ్చి పోలీసోల్ల ఇల్లకి పంపేది. హెడ్డుగోరి బార్య ఒక సేరు బియ్యమిచ్చేది. తెచ్చి ఆయమ్మ ఇంట్లోనే పడేసేవోల్లం. రాజాజీబాబు ముక్కెమంత్రయినాక ఈజెస్ట్ల, రేగును ఎత్తి పారేసినాడు. దాంతో బియ్యం సేరు ముచ్చేకయి నెలతిరక్కుండా ఆరణాలపరకైంది. పూర్నా మార్కెట్టు నో అడిగినోడికి అడిగినంత బియ్యం. అంతమంచి రాజాజీ బాబు పొట్టి సీరాములు

సచ్చి పోడనుకున్నాడో ఏటో. అంతకు ముందు సామీ సీతారాము ఇంకా ఎక్కువ దినాలుపవాసం సేసి బతికినాడు కదా! అన్నానే ఇది తుస్సుమని పోతాది అనుకున్నాడు. అవనేదు. మలబారు పోలీసుల్ని దింపినాడు. ఆల్ల ఇనపటోపీలు సూస్తుంటే బయం యేసిపోనాది కానీ సూడెంట్లు దిగిరానేదు. ఆల్లు కాల్సకమాన్లేదు. ఆల్లు కాలిస్తే ఈల్లు మరింత పేట్రేగిపోనారు. సివరికి నెహూరూబాబు దిగొచ్చినాడు. రాజాజీబాబు లొంగొచ్చినాడు.

తెలుగు రాస్టం సీరామనవమి సంబరాలంత. పందిళ్ళతో ఎల్లమ్మ జాతరంత సంబరంతో వచ్చింది.

"మా తెనుగు తల్లికి మల్లెపూదండ" అన్న పాట సెవులు రింగుమని మారుమోగేలా, మైకులెట్టి ఊరంతా పాడేసింది. కాని మా సిన్నాయన ఆ తరువాత సెప్పాడు ఆపాట రాసినాయన్ని సబలోకి రానీకుండా "నువ్వెవడవేస్" అంటూ పోలీసులు రెక్కట్టుకు ఈదిలోకీడ్చేసినప్పుడు, ఆ పాటరాసినోడు ఓడు బతికుండాల, అంతగోడిని మనం ఓ దండేసి గౌరవించాల అని వోరూ గుర్తెట్టుకోలేదుట.

తెలుగుతల్లి ఆ దినం సంతోసించిందా? నేక సనిపోయిన సీరాములు బాబుకోసం కాలిపోయిన కుర్రోల్లకోసం కన్నీరెట్టుకుందా? తెలీదు. ఆ దినం మర్సిపోనేక పోనాను.

ఆ తరువాత సానా జరిగాయి. తెనుగు రాస్టం వొచ్చాక తెలుగు సిఃవంపెకాసెంపంతుల్ని గద్దెదింపేసినారు. ఇస్సినాదంగోరు ఏటో అయిపోనారు. బానోజీరావు సెయిర్‌మనే అయిపోనారు. ఆపైన ఆరెవరండి బెజవాడ.. ఆయన ఆయన్దసలు నెల్లూరుట ఆయన మూన్నాల్లు రాజ్జెం ఏలాడు. బెజవాడని ఇసాక పట్టనం కాదని, రాజదానిని కర్నూలట్టుకుపోయి నోయినే గద్దెక్కేసినాడు. నాకు గానం అప్పటికి కూసింత వత్తా ఉండాది.

ఆ తరువాత సాన్నాల్లకి "ఊగరా! ఊగరా! ఉరికొయ్య కూగరా" అంటూ సిన్నకుర్రనాయాల్ల ఉద్దిరేకం కలిగించే పాటలు "బద్రం కొడుకో" అంటూ ఆల్ల జీవితాలకి బద్రతనేకుండా సేసేపాటలొచ్చాయి. ఆదిబొట్ల కైలాసాలు, వెంపటాపు సత్తాలు పోనారు. సాంబసివరావు, బూసనం మేస్టర్లు ఎటోపోనారు. మా అప్పల కొండ సిన్నాయన ఆల్లకి కబుర్లు సేరేసేవోడని నీటుగాంకెరుకైంది. ఎరుకయ్యేసరికేటి మిగిలింది!

మా అప్పలకొండ సిన్నాయన రిటేరయినాక కనపడకుండాపోనాడు. మా మోహనదాసు కరమ సెందరగాందీ తుపాకీగొట్టాన్నముకుని అడవుల్నోకి ఎల్లిపోనాడాదినాల్లోనే.

మాసినమ్మ, నా తమ్ముల్ల నీ సెల్లెల్లనీ వోటేసుకుని బెంగటిల్లిపోనాది. మాయమ్మది జాలిగుండె "ఓసిసెల్లా!నా కొడుకు. నీ కొడుక్కాదుటే! నీకేరే ఇల్లెందుకే. వచ్చేసి మా దగ్గరే ఉండిపో! ఆడు, నాతోపాటు, ఆడిపెల్లాం పిల్లతోపాటు నిన్నూ నీ పిల్లల్నీ సూసుకుంతాడు. మనాడోల్లకి పాసిపనులు ఒప్పుడూ ఉంతాయి. అని తీసుకొచ్చేసినాది. నానప్పుడు మునిసిపాలిటీలో మా సిన్నాయనేయించిన సీపరుద్యోగంలో సీనియర్ని. మా సిన్నాయన పెద్దకొడుక్కి నా పరపతిలో సీపరుద్యోగం ఏయించాను.

దాసు బాబు కాటికెళ్ళిన దినం సచ్చిపోయిన దినానికి నాలుగో దినం. రెండోరోజున అడవుల్లో ఎదురు కాల్పుల్లో సనిపోయినోల్ల సెవాల్ని టీ.వీ.లో సూపించారు. రత్తం గడ్డకట్టి ఈగలు ముసురుతున్న సెవంగాందన్నారు. ఆ దినం దురగమ్మగోరిని పట్టడం మాతరంకానేదు. పెద్దోల్లు, బాలగోపాలబాబు, వరవరరావు బాబు, గద్దరు బాబు, సెలసాని పెసాదు బాబు, కిస్నాబోయమ్మ ముక్కలుగా కోసి పట్టేసిన దాసుబాబుని, గిల్లింటికి సేర్సినారు. ఈ దినం దాసుబాబుని సావులమందుం మీదుగా ఊరేగించి కాటికట్టికెల్లినారు.

దురమ్మగోరింటి దగ్గర జనాలు పోటీలు పడి దండలేసారు. పై ఊళ్లజనాలు రాకుండా పోలీసులు సేసిన ప్రెయిత్నాలు పలించనేదు. జనం అమాసనాడు సొముద్రం పొంగినట్టు పొంగిపోనారు. అతడింత జనం నడిసారు.

కట్టెలమీద బాబు నుంచారు. ఆ బాబు పెదాలు "చోదర చోదరీమనుల్నారా! కొళాయి మూతుల్నారా! సున్నప్పిడతల్నారా! నా సెవంతో మీదారి నెవరూ మూయనేరు. ఏడవకండేడవకండి." అంతున్నాయని నాకనిపించింది.

దూరంగా మైకులో"తెలుగు వీరనేవరా!" అని పాటేస్తున్నారెవరో.

అక్కడో దిమ్మమీద మా అప్పల కొండ సిన్నాయన కూరుని ఊసులాడ్తున్నాడు. సుట్టూసేరిన కుర్రోల్లతో. సెప్పట్టం మర్సిపోనాను. మాసిన్నాయన పోలీసులకి కిందటేడు నొంగిపోనాడు. టి.వి.లో సూపించారు. మేం సిన్నాయన బతికున్నందుకు సంతోసించా. అయితే పెద్దోల్లు నొంగిపోతే మెచ్చి మేకతోలు కప్పినట్టు, మా సిన్నాయనకి కప్పనేదు. పైగా కోర్టుల్లో సిన్నాసితకా కేసులు ఓ అయిదింకా నడుస్తాఉన్నాయి.

"ఈ నోకంనో పవరెప్పుడు డబ్బున్నోడితే. అందుసేత, పెబుత్వం నడుపుతున్నది కాంగిరేసోల్లా, తెలుగు దేసం వోల్లా, బి.జె,పి. వోల్లా అన్నదికాదు. అల్లలో ఓర్రైనా ఆ గాందీ బాబైనా ఈ గాందీ బాబైనా మరో గాందీబాబైనా తుపాకీన్నమ్మినా, అయిపనే నమ్మినా, సంపకమానరు. ఎందుకంటే ఆల్లు బీదోల్ల తరపున నిలబడ్తారు. నోర్నేని వోల్ల తరపున వోదిస్తారు.

రేపటి దినం, ఉత్తి ఆంధ్రవొచ్చినా, ఉత్తరాంద్రావొచ్చినా, తెలంగానా వొచ్చినా వాల్లదే రాజ్జెం. వాల్లమాటే సెల్లుది. వాల్ల బాసే సెబాస్. మన బతుకులు బాగుపడితే నా సెవులు తెగ్గోయండి"

మా అప్పలకొండ సిన్నాయన సీకిస్నపరమాత్మ నాగా గేనం బోదిస్తా ఉన్నాడు.

దాసుబాబు పేదోడి బతుకునాగా కాలి బుగ్గవుతున్నాడు. ఆ బుగ్గాడవటానికి సీపురట్టుకునినాను నిలబడిపోనాను.

## పరమార్థం

- సునీల్ గూరి

**నేను చనిపోయి నాలుగు రోజులైంది.** నా పెద్దకొడుకు రెండురోజులక్రిందటే అస్థికలు తీసుకెళ్ళాడు. నాది సాధారణ మరణమే. డెబ్బై రెండేళ్ళ మీద నూట పదహారు రోజులు బ్రతికాను. ఆరోజు సాయంత్రం మా కాలనీ సంక్షేమ గ్రంధాలయం నుండీ తిరిగి వస్తుండగా శ్వాస బరువుగా అనిపించింది. ఇంట్లో నా పెద్ద కోడలు నేను పడుతున్న అవస్థను చూసి దగ్గరలోని ఆసుపత్రిలో చేర్పించగా అక్కడి వైద్యుడు పరీక్షిస్తుండగానే నా శరీరంతో నేను వేరయ్యాను.

✷✷✷✷

భగవంతుడు మానవ జన్మను ఎందుకు సృష్టించాడు అన్న సంశయం నేను బ్రతికున్నంత కాలం నాకు రాలేదు. ఇప్పుడు నాకో జవాబు తోస్తోంది. భగవంతుడు తనని తాను ఆనంద స్వరూపునిగా ప్రకటించుకున్నాడంటే అతని స్వరూపం దుఃఖం కాదు, భయం కాదు, బాధకాదు అనేకదా అర్థం. ఆ ఆనంద స్వరూపం అనేదానికి రూపం లేదు. ఆ స్వరూపం అనేది ఒక ఆత్మ అయితే ఈ సృష్టిలోని సమస్త జీవుల్లోని ఆత్మలూ ఆ పరమాత్మకి ప్రతిబింబాలేకదా. తను ఆనందంగా ఉండటానికి తన ఆత్మని ఇన్ని కోట్ల భాగాలుగా విభజించుకున్న ఆ పరమాత్మ నిత్యం ఆనందాన్నే కాంక్షిస్తాడనడంలో ఎంతో పరమార్థం ఉంది.

వేదాలూ, ఉపనిషత్తులు, మహాకావ్యాలు అన్నీ 'ఆత్మానందం' గురించే చర్చించాయి. మరి నేను నా జీవితంలో ఆ అనంతానందాన్ని పొందానా? ఆ క్షణాల్ని నేను ఆస్వాదించానా? ఆ పరమాత్మని సంతోషపెట్టానా?

సంతోషపెట్టాను.

వేరొక ఆత్మకి కూడా ఆ సంతోషంలో భాగం ఉంది. ఆ ఆత్మ కలిగిన తనువు పేరు సత్యవతి.

నేను ప్రేమించిన స్త్రీ.

నన్ను ప్రేమించిన స్త్రీ.

✷✷✷✷

మనిషిని, ఆనందం అనే గమ్యానికి చేర్చడం - లో 'ప్రేమ' ముఖ్య పాత్రను పోషిస్తుంది. మనిషికి మనిషి మాత్రమే ఇవ్వగలిగే గొప్పవరం ఈ ప్రేమ. ఆ ప్రేమను నేను సత్యవతిలో దర్శించాను.

✷✷✷✷

స్వాతంత్ర్య సంగ్రామం ఉధృతంగా జరుగుతున్న రోజులవి. నేను విశాఖపట్నంలో మా పెదనాన్న ఇంట్లో ఉంటూ ఇంటర్ వరకూ చదివాను. అక్కడ పిల్లల అల్లరి పడలేక నాన్నని, పెదనాన్నని ఒప్పించి నేనే ఓ ఇల్లు వెతుక్కున్నాను. ఊరి పొలిమేరల్లో పెదనాన్నకి ఓ రైసుమిల్లు ఉండేది. అందులో పనిచేస్తున్న - గుమస్తాకి సహాయకుడిగా ఉండమని పెదనాన్న నన్ను ఒప్పించాడు. రెండు రోజులు వెతగ్గా ఇల్లు దొరికింది. ఆ ఇంటి యజమాని గాంధేయవాది. వృత్తిరీత్యా దర్జీ. ఖద్దరు బట్టలే కుట్టేవారు. రోజూ ఏవో సమావేశాలనీ, ధర్నాలనీ వెళ్ళేవాడు. నేను ప్రొద్దున్నే ఎనిమిదిగంటలకల్లా వచ్చేవాణ్ణి. ఇంటికి ఒకే గేటు. ఒకే ప్రాంగణంలో రెండిళ్ళు. ఈ రెండిళ్ళనీ విడదీస్తూ ఒక పెద్ద జామచెట్టు. మా యజమాని ఏకైక కూతురే సత్యవతి. ప్రతి రోజూ ఉదయాన్నే వాళ్ళ ఇంటి ముందరున్న చిన్న తులసి మొక్కకి నీరుపోసి శ్రద్ధగా దణ్ణం పెట్టేది.

సత్యవతిని పలకరించడానికి నాకు నాలుగు నెలలు పట్టింది. తనకి చదువురాదు. రాదు అనడం కంటే నేర్చుకోలేదు అనడం సబబు. ఆరోజుల్లో అది ఓ విషయమే కాదు. సత్యవతి చిన్నప్పుడే వాళ్ళమ్మ క్షయతో మరణించింది. అప్పుడప్పుడూ సాయంత్రం నేను ఇంటికిరాగానే టీ కాచి నా రూమ్‌కి తెచ్చేది. నేనడిగే చాలా ప్రశ్నలకి ముసిముసి నవ్వులు నవ్వేది. వాళ్ళ నాన్న ఇంట్లో ఉన్నప్పుడు మాత్రం అస్సలు చూసేది కాదు.

"ముదురాకుపచ్చ ఓణీ ఎప్పుడు వేసుకుంటారు?" ఓ రోజు ధైర్యం చేసి అడిగాను. కళ్ళల్లోకి తేరిపార చూసి ఇంట్లోకి పరిగెట్టింది. ఆ మరుసటి ఉదయం నేను ఆఫీసుకు బయలుదేరుతుండగా ముదురాకుపచ్చ ఓణీతో తులసి మొక్కకి దణ్ణం పెడుతూ కనిపించింది. ఈ మౌనంతో సావాసం మొదట్లో బానే ఉండేది. నాకు తనంటే ఇష్టం అని నాకు తెలుసు. ఇన్ని తెలిసాక కూడా మా ఇద్దరి మధ్యా 'మాట' అనే వారధి అవసరమా?

మేమూ సంభాషించుకునేవాళ్ళం, శబ్దం రాని మాటలతో హృదయాదరాలతో....

ఒకరోజు నాన్ననుండీ ఉత్తరం వచ్చింది. ఊరి పాఠశాలలోనే ఉద్యోగం చూశాను రమ్మన్నారు. ఉద్యోగంలో చేరి సత్యవతిని గూర్చి చెబుదామనుకున్నాను. తీరా ఊరెళ్ళేసరికి అక్కడి పరిస్థితులు వేరుగా ఉన్నాయి. మా ఊరి స్కూలు ప్రధానోపాధ్యాయుడి కూతురిని నాకు ఇస్తానని నాన్న మాటిచ్చాడంట. నేను సత్యవతి విషయం తీస్తే అందరూ విస్తుపోయారు. అమ్మ నుండీ మిగతా బంధు గణం నుండీ ఒత్తిడి ఎక్కువైంది. చివరికి బలవంతంగా పెళ్ళికి ఒప్పించారు.

ఓ నెలరోజుల వ్యవధిలో నేనో ఇంటివాణ్ణి అయ్యాను. జీవితంలో మొదటిసారి నన్ను నేను మోసం చేసుకున్నాను. నా హృదయమనే సత్యవతినీ మోసం చేశాను.

✷✷✷✷

సత్యవతిని అంత తేలికగా ఎలా మర్చిపోగలను?

ఆ చూపుల్ని, ఆ మాటల్ని మొత్తంగా అప్పటి సమయాన్ని.... సత్యవతితో నేను మాట్లాడిన మాటలు తక్కువేకానీ ఆమె అందం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ఆమెతో నాకు కలిగిన ఆరునెలల పరిచయం పెళ్ళయ్యాక కూడా నన్ను చాలా రోజులు వెంటాడింది.

నా భార్య వ్యక్తిత్వం నాకు వ్యతిరేకం. ఆమెకి ఎవరినీ గౌరవించాలన్న గుణం లేదు. మనిషికి సంస్కారం అనే కవచం తప్పకుండా ఉండాలి అది ఆమెకి కొరవడింది. మరి నా భార్యను నేను ప్రేమించానా? ప్రేమించాను. బలవంతంగా ప్రేమించడం అలవాటు చేసుకున్నాననే భావనని మరచిపోవడం అలవాటు చేసుకున్నాను.

✷✷✷✷

స్కూలు నన్నో గురువుని చేసింది. పిల్లలకి తెలుగు పాఠాలు చెప్పేవాణ్ణి. పెళ్ళయిన రెండవ సంవత్సరం మాకో బాబు పుట్టాడు. ఆ మరుసటి సంవత్సరం రెండోవాడు. ఓ వర్షాకాలం పని నిమిత్తం విశాఖపట్నం వెళ్ళినప్పుడు నేను అద్దెకున్న ఇంటికెళ్ళి ఆరా తీస్తే సత్యవతికి పెళ్ళయ్యిందని చెప్పారు.

"నీ గురించి చాలా సార్లు అడిగేదయ్యా... మంచి స్నేహితులయ్యారు కదా... మరీ చెప్పా పెట్టకుండా వెళ్ళడం కూడా ఏం బాగోలేదు" అని తన పనిలో లీనమైపోయారు వాళ్ళ నాన్నగారు. ప్రస్తుతం కుట్టుపని ఇంట్లోనే చేస్తున్నారనిపించింది.

నా గదిలోకి వెళ్ళేసరికి పెరట్లోని బాత్‌రూం, తలుపు తీస్తున్న శబ్దం వినిపించింది. ఎవరో కొత్త కుర్రాడు. అప్పుడే స్నానం చేసి పక్కనే ఉన్న తులసి చెట్టుకి దణ్ణం పెడుతున్నాడు. సత్యవతి భక్తితో పెంచిన చెట్టది. ఆమె ఎక్కడున్నా సంతోషంగా ఉండాలని మనసులోనే దేవునికి మొక్కుకుని బయలుదేరాను.

✷✷✷✷

ఓ ఇరవై సంవత్సరాలు గడిచాయి. నా పెద్ద కొడుకు హైదరాబాదు సిటీలో వెటర్నటీ డాక్టరుగా స్థిరపడ్డాడు. చిన్నవాడు ఏదో వస్తువుల ఉత్పాదక కంపెనీలో మేనేజరు. ఇద్దరి పెళ్ళిళ్ళూ ఘనంగా చేశాను.

ఓ రోజు వంటింట్లోనుండి పెరట్లోకి బిందెలో నీళ్ళు తీసుకు వెళుతుండగా కళ్ళు తిరిగి పడిపోయింది మా ఆవిడ. ఆసుపత్రిలో చేర్పితే వారం రోజులపాటు రకరకాల పరీక్షలు చేసి 'హృద్రోగం' అని నిర్ధారించారు. రక్తనాళాల్లో ఏదో తేడా ఉందన్నారు. శ్వాస కూడా ఇబ్బంది అయ్యేసరికి ఆక్సిజన్ పైపులు అమర్చారు. రెండు వారాలకు పైగా ఆ స్థితిలో ఉన్న మా ఆవిడను చూడలేకపోయాను. ఓ రోజు ఆమె సమక్షంలోనే ఏడ్చాను. "ఈమెను ఇన్నాళ్ళూ నేను మనఃస్ఫూర్తిగా ఇష్టపడలేదు. ఇప్పుడు విధి ఇష్టపడట్లేదు" అని చింతించాను.

ఈమెకు ఎవరు విధించిన శిక్ష ఇది.... నేనా? ఆమె నన్ను గౌరవించట్లేదు అని నేను ఆమెని గౌరవించకపోవడం ధర్మమా.... ఆమెని నాలో ఐక్యం చేసుకుంటే ఆమె మారకపోయి ఉండేదా? ఆసుపత్రి నుండీ ఇంటికి తీసుకొచ్చిన ఎనిమిదవరోజు మా ఆవిడ శారీరకంగా నన్ను వదిలిపోయింది. "మళ్ళీ కనిపించను" అని నన్ను హేళన చేస్తూ వెళ్ళిపోయింది. ఆమె చనిపోయాకే ఆమె హృదయంతో నాకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం నన్ను మానసికంగా ఆమెకు దగ్గర చేసింది.

✷✷✷✷

నా భార్య మరణానంతరం హైదరాబాదులో స్థిరపడ్డ నా పెద్దకొడుకు ఇంట్లోకి మారాను. పల్లె వాతావరణానికి అలవాటు పడిన నాకు ఇక్కడ ఏమీ తోచేది కాదు. టీవీ చూడటం నాకు సుతారమూ ఇష్టం లేకపోయేది. భార్య రూపంలో సహచరణి లేదు. మెదడు శూన్యం అయ్యేది. ఈ సమయంలో నా జీవితంపై అంతర్మథనం నాకు తెలియకుండానే ప్రారంభమయ్యింది. బ్రతికి నేనేం సాధించాను...

అసలు నేను జన్మించకపోయ్యుంటే ఏమై ఉండేది.... అన్న ప్రశ్నలు మెదడుని తొలచసాగాయి. ఇలా సాగుతున్న నా ఆందోళని ఓ రోజు మా పెద్దబ్బాయి స్నేహితుడైన ఓ సీనియర్ డాక్టర్‌తో పంచుకున్నాను.

"మీ ప్రశ్నలకు జవాబులు దొరక్కపోవచ్చు కానీ ఎంతో కొంత అవసరమైన సమాచారం మాత్రం మంచి ఆధ్యాత్మిక పుస్తకాల్లో దొరకవచ్చు"అని ఓ చీటీలో కొన్ని పుస్తకాల పేర్లు రాసి ఇచ్చాడు. ఆయనే మా ఇంటికి దగ్గరలోని సంక్షేమ గ్రంధాలయాన్ని నాకు పరిచయం చేశాడు. అలా మొదలైన నా పఠనాభిలాష నేను మరణించే రోజువరకూ నన్ను వీడలేదు.

ఆధ్యాత్మిక చింతనలో ఆత్మని గురించి నేను చదివిన విషయాలు నాకు ఈ జీవితాన్ని కొత్త కోణంలోచూపాయి. సృష్టిలోని అన్ని భావనలూ, ఉద్వేగాలూ, సంతోషాలూ మనిషి శరీరంలో నుండే జన్మిస్తూ ఉన్నాయి. ఓ మనిషి మరణించినా కూడా ఆ వ్యక్తిని మనం జ్ఞాపకం చేసుకుంటున్నామంటే... ఆ వ్యక్తి రూపాన్ని మనలో నిక్షిప్తం చేసుకుంటున్నామంటే... దానర్థం ఏంటి...?

ఇంకా ఆత్మజ్ఞానానికి సంబంధించి ఎన్నో పుస్తకాలు చదవాలనుకున్నాను, కానీ చదవలేకపోయాను... నా భార్య చనిపోయిన ఆరో సంవత్సరం నేనూ మరణించాను.

✷✷✷✷

సత్యవతిని నా భార్య స్థానంలో చూడాలనుకోవడం నా ఊహ, చూడలేకపోవడం వాస్తవం. నా జీవితంలో వాస్తవానికి నా భార్య రూపాన్నిచ్చింది. సత్యవతి ఊహలాగే మిగిలిపోయింది. ఊహకి రూపం ఉండదు కదా...? భగవంతునిలాగా... మరి ప్రస్తుతం నేనెవరిని...?

ఆ భగవత్ స్వరూపంలో భాగాన్నా?

నా వల్ల భగవంతుడు ఆనందాన్ని పొందాడా?

సత్యవతిపై నా ప్రేమ ఆయనకి ఆనందానిచ్చిందా? నా భార్య మరణానంతరం ఆమెపై నాకు ఏర్పడ్డ జాలి ఆయనకు ఆనందాన్ని ఇచ్చిందా?

ఇచ్చుండాలి....

ఇచ్చేవుండాలి....

ఎందుకంటే నా 'ఆత్మ'ను నేను సృష్టించలేదు....

✷✷✷✷

## కనువిప్పు

- అన్నపూర్ణ

"**ఈవిడ** నాతో పనిచేసే యామిని.. ". భర్తకి పరిచయం చేసింది రేణు.

"మీరు ఎక్కడ్నుంచీ వచ్చారు. మీ ఇంటి పేరు? " అంటూ, వివరాలన్నీ తెలుసుకుని కబుర్లు మొదలు పెట్టాడు శరత్.

అలా గంటసేపు యామిని, శరత్ మాట్లాడుకుంటుంటే రేఖ ఇంటిపని, వంట పని పూర్తి చేసింది.

"చీకటి పడిపోయింది... ఇక వెడతానండీ" అని లేచింది యామిని. "సారీ రేణూ మీ వారితో మాట్లాడుతుంటే టైమే తెలియలేదు" నొచ్చుకుంటూ చెప్పింది.

''నాకిది అలవాటే! నా పని కూడా పూర్తయిందిలే... '' అంటూ గేటుదాకా వచ్చింది రేణు.

అలా రేణుతో కంపెనీలో పనిచేసే ఆరుగురూ ఇంటికి రావడం, శరత్ కబుర్ల మాయాజాలంలో పడి, రేణూని మరచిపోవడం మామూలే! వాళ్ళకి రోజూ రేణూ ఇంటికి వచ్చి, శరత్‌తో మాట్లాడాలని ఉండేది కానీ వీలు పడదు. ఇల్లు, పిల్లలూ బాధ్యతలూ ఉంటాయి కనుక అంతటితో ఆగిపోయేవారు.

శరత్ మాటకారి. అతనికి తెలియని విషయాలు లేవు. ఇంట్రెస్ట్ లేని సబ్జెక్ట్ అంటూ ఉండదు. అన్నిటిలో ప్రవేశం ఉంది. అనర్గళంగా మాట్లాడటంలో అతనికి సాటిరారు ఎవరూ. అందువలన ఎలాంటి ముఖావస్తులూ శరత్ మాటలంటే ముగ్ధులవుతారు. కానీ రేణూతో మాట్లాడటానికి ఏమీ విషయాలే కనపడవు. బహుశా రోజూ కళ్ళ ఎదుట ఉండే మనిషి కావడం, అతనికి తెలిసిన విషయాలు చాలా వరకూ రేణుకి తెలిసినవే కావడం, అయ్యుండచ్చు.

అయితే రేణూకి రాను రాను శరత్ వాగ్ధోరణి విసుగు కలిగించేది. చేసేది ఏమీ లేక ఊరుకుంది. అతిగా మాట్లాడే శరత్ మాటల్లో ఎన్నో ఇబ్బందికరమైన వ్యాఖ్యలూ ఉండేవి. అవి అతను గుర్తించకపోవడం రేణుకి చిరాగ్గా అనిపించింది. 'మీరు అలా కాకుండా ఇలా ఉంటే బాగుండేది... ' అని సరిచేస్తే అతనికి విపరీతంగా కోపం వచ్చేది.

'మహా తెలివి నీకే ఉందిలే... ' అని విసుక్కునేవాడు. ఇవన్నీ పడలేక అతనితో గొడవపడటం దేనికని ఎవరినీ ఇంటికి పిలిచేది కాదు.

ఒకసారి యామిని కూతురు బర్త్‌డే పార్టీకి రేణూనీ, శరత్‌ని పిలిచింది. పార్టీకి వెళ్ళకపోతే యామినికి కోపం వస్తుంది. వెళ్ళిన తర్వాత అంతమంది జనాన్ని చూసేసరికి శరత్‌ని పట్టుకోవడం సాధ్యం కాదు. మూడు గంటలు మూడు నిముషాల్లా గడిచిపోతాయి అతడికి. ఈ యామిని ఫ్యామిలీతో పిలవకపోతే బాగుండేది అనుకుంది రేణు.

శరత్‌కి పార్టీలన్నా ఫంక్షన్స్ అన్నా పదిమంది కలిసే సమావేశాలన్నా ఎంతో ఇష్టం. కారణం తన చాకచక్యం ప్రదర్శించే అవకాశం ఉండటమే అయితే రేణూకి మాత్రం ప్రాణసంకటం.

రేణు భార్య అనీ, ఆమెతో పాటే ఉండటం కర్టెసీ అనీ మరచిపోతాడు. తిరిగి ఇంటికి వెళ్ళేప్పుడే రేణు గుర్తు వస్తుంది. అదీ ఆమె వచ్చి పిలిస్తే! పార్టీకి వెళ్ళడం కొత్తవాళ్ళ పరిచయాలతో బాటు పాతవాళ్ళ పలకరింపులు యధాప్రకారం కొనసాగిన తర్వాత వెళ్ళలేక వెళ్ళలేక అందరూ ఇంటి ముఖం పట్టాక.. అప్పుడు.. రేణు వచ్చి, 'పదండి మనమూ వెడదాం అప్పుడే రాత్రి ఒంటిగంట అయింద'ని లాక్కువస్తే... తప్పనిసరిగా బయలుదేరతాడు.

మర్నాడు ఆదివారం కాబట్టి ఆలస్యంగా లేచినా ఇబ్బందిలేదు. ఇప్పటిరోజుల్లో అదీ సిటీల్లో దూరాన ఉంటారు రావడం కష్టం కాబట్టి అసలు పుట్టినరోజు అకేషన్ ఇంట్లో అయిందనిపించి పార్టీలు డిన్నర్లు శనివారం చేస్తున్నారు, ఆదివారం శలవు రోజు కలిసి వచ్చేలా.

''రేణూ! నిన్న పార్టీకి వచ్చిన రాహుల్ వైఫ్ ఎవరో తెలుసా? పిజీలో నా క్లాస్‌మేట్ భారతని ఉండేది ఆవిడ కూతురే! ఈ పార్టీమూలంగా కలవడం, భారతి ఫోన్ నంబర్ తీసుకోవడం కుదిరింది...'' అన్నాడు ఉత్సాహంగా శరత్ ఆదివారం ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేస్తూ.

రేణూ గతుక్కుమంది. చచ్చాం. మరో మీటింగ్ తప్పదన్నమాట అనుకుని. పైకి మాత్రం నవ్వు తెచ్చుకుని, ''అలాగా; ఈ పార్టీ మీకు పాతపరిచయాలను పునరుద్ధరించడానికి ఉపయోగపడిందన్నమాట!'' అంది.

"అంతేకాదు, బొద్దుగా, తెల్లగా మోడ్రన్ డ్రస్ వేసుకున్న దీపిక సిస్టర్ వసంత కూడా నా కొలీగ్. నేను ఉద్యోగంలో చేరిన రోజుల్లో! ఆ తరువాత జాబ్ వదిలేసి అమెరికా వెళ్ళిపోయింది. వసంత ఫోన్ నంబర్ కూడా తెలుసుకున్నాను." మరింత ఉత్సాహంగా చెప్పాడు శరత్.

"మరి, నాకు వాళ్ళని పరిచయం చేయనేలేదేం? ఇప్పుడు రాహుల్ వైఫ్, బొద్దుగా ముద్దుగా ఉన్న దీపికా ఎవరో నాకెలా తెలుస్తుంది చెప్పండి!" నిష్టూరంగా అంది రేణు.

"అదీ.. అదీ... నువ్వెక్కడో దూరంగా ఎవరితోనో మాట్లాడుతూ ఉంటావు..." సరైన సమాధానం దొరక్క తడబాటుతో అన్నాడు శరత్.

"అసలు విషయం నాకు తెలుసు శరత్! మీకు భార్య అనే మనిషి గుర్తు ఉండదు. మిమ్మల్ని మీరే మరచిపోతారు పదిమందిలోకి వెడితే! మీకు ఇలాంటి పార్టీలు ఎంతో సంతోషం కలిగిస్తాయి. నాకు మాత్రం... బాధకలిగిస్తాయి. మీరు నా భర్త అని - పరిచయం చేద్దామంటే ఎక్కడో కబుర్లలో నేను పిలిచినా వినిపించుకోని స్థితిలో ఉంటారు. అదే ఇద్దరం ఒకేచోట ఉంటే మీకు తెలిసిన వారు నాకు, నాకు తెలిసిన వారు మీకూ పరిచయం చేసుకునే అవకాశం ఉంటుంది. నేను ఎన్నిసార్లు చెప్పినా మీకే విషయాలు గుర్తుండవు. మీదారి మీదే! " బాధగా అంది రేణు.

"నేను స్నానం చేసి వస్తాను. భార్గవ వస్తానన్నాడు..." అంటూ లేచి వెళ్ళాడు శరత్.

రేణూ ఏది చెప్పాలన్నా అతడి వరస ఇలా ఉంటుంది. ఏం చెప్పినా నోరు నెప్పికాని. అది తప్పని తనలోపం సరిదిద్దుకోవాలనీ అనుకోడు. చాలా మంది అంతేనేమో!

భార్యా భర్తలు అన్నాక సర్దుకుపోవాలి లోపాలు అందరిలోనూ ఉంటాయి, నీకు కరక్ట్‌గా తోచింది ఎదుటివారికి కరక్ట్ అనిపిస్తుంది అంటూ వంచన చేసుకోడం తప్పు. లోపాలను ఎవరూ సరిదిద్దుకోలేరు విచిత్రం. ఫలితం ఆవేదన తప్పదు.

శరత్ ఫ్రెండ్ భార్గవ చాలా మంచివాడు. అప్పుడప్పుడు శరత్ తప్పుఒప్పులను నిస్సంకోచంగా చెప్పగలవాడు.

రేణూకి భార్గవంటే గౌరవం. అతని భార్య వాహిని అంటే ఇష్టం. అరె! మరచిపోయాను. ఇద్దర్నీ ఈ ఈరోజు లంచ్‌కి పిలిచాను కదూ! కట్ చేసిన వెజిటబుల్స్, రెండురకాల చట్నీలు రెడిగానే ఉన్నాయి. వాహినికి నేను చేసే బెండకాయ స్టఫ్డ్ కర్రీ చాలా ఇష్టం. భార్గవ్‌కి సాంబార్, కాబేజీ శనగపప్పు కొబ్బరి వేసి మరో కూర చేసి, పాపడ్ వేయిస్తాను. ఫ్రైడ్ రైస్ చేయనా పులిహోర చేయనా? శరత్‌కి ఫ్రైడ్ రైస్ ఇష్టం అదే చేస్తాను... అనుకుంటూ గంటన్నరలో రెడీ చేసింది రేణూ.

మరో పదినిముషాల్లో భార్గవ్, వాహినీ వచ్చారు.

"ఈ రోజు కూడా నందిని రాలేదా? " ఇద్దర్నీ ఆహ్వానిస్తూ అడిగింది రేణూ.

"నందిని ఫ్రెండ్ తుషార వస్తుందంటే వాళ్ళిద్దరికీ పాస్తా, పులిహోర చేసి పెట్టి ఉంచాను. పోనిద్దూ, వాళ్ళకి మన కంపెనీ బోర్. మనకా పిల్లల ఎదుట ఫ్రీగా మాట్లాడుకోవడం కుదరదు." అంది వాహిని.

"అంతేలే! మా సంజయ్ కూడా నేను ఉదయం లేచేసరికే టెన్నిస్ టోర్నమెంట్‌కి వెడుతున్నాను సాయంకాలం వరకూ రానని, ఫ్రిజ్‌కి స్లిప్ అతికించి పెట్టేసి వెళ్ళిపోయాడు. టీనేజ్ పిల్లలకి వాళ్ళ ఏజ్ గ్రూప్ ఫ్రెండ్స్ ఉండాలి. ఇంకా నయం మనవాళ్ళు వారానికోరోజు మనకి కేటాయిస్తున్నారు ఆ రోజే మనం వాళ్ళకి ఏం చెప్పాలన్నా వింటారు." అంది రేణు నాలుగు గాజుగ్లాసుల్లో యాపిల్ జ్యూస్ తెచ్చి ఇస్తూ.

"నిన్న పార్టీ బాగా జరిగిందా? రాత్రి ఇంటికి వచ్చేసరికి లేట్ అయిందేమో వద్దంటే వినకుండా ఈ రోజు లంచ్‌కి పిలిచావు" ఆప్యాయంగా అంది వాహిని.

"భలేదానివి. ఆ పార్టీలు ఫంక్షన్స్ నగలు, కొత్త రకాల డ్రస్‌లు, చీరల రిచ్ షోలు. నాజూకు తిళ్ళూను. ఇలా మనం నలుగురం మనకి ఇష్టమైనవి వండుకుని తిన్నరోజే నిజమైన సంతోషం కలుగుతుంది నాకు. రేపటికి లంచ్ కూడా తయారుగా ఉంటుంది." అంది రేణూ తృప్తిగా.

"ఇంతకీ నిన్నటి పార్టీ విశేషాలు ఏమిటో చెప్పు. "

"ఆ విశేషాలు శరత్ చెపుతాడు. చెప్పు శరత్" అన్నాడు భార్గవ్. అంతే శరత్ అత్యంత ఆనందంగా చెప్పడం మొదలుపెట్టాడు. అన్నీ వింటున్న వాహిని అతనికి వినిపించకుండా మెల్లగా అంది, "అయితే రేణూ, శరత్‌కి పాత ఫ్రెండ్స్ ఆచూకీ తెలిసిందన్నమాట అని!

నవ్వేసి ఊరుకుంది రేణు.

"ఇలాంటి పార్టీలు ఒక్కటీ నాకు తగలవ్. అదేం దురదృష్టమో" అన్నాడు భార్గవ, హాస్యంగా.

"పక్కన నేనొకత్తిని ఉంటానుగా. పాపం తెలిసిన వాళ్ళు కూడా చెప్పుకునే ధైర్యం లేక తప్పుకుంటారేమో!" అంది వాహిని.

"వాళ్ళెందుకు తప్పుకుంటారో నాకు తెలియదు కానీ నిజంగా వాళ్ళని తప్పించుకోడానికే నీ చేయి వదలను. నీకు విసుగనిపించినా, పాపం నీతో పరిచయం పెంచుకోవాలనుకునే వాళ్ళు బాధపడినా!" అన్నాడు భార్గవ్.

"అంటే... నాకు చాలా మంది మగఫ్రెండ్స్ ఉన్నారని నీ ఉద్దేశ్యమా? " రోషంగా అంది వాహిని.

"ఏమో ఉన్నారో లేదో నాకు తెలియదు. ఇక ముందు నువ్వు, నన్ను మరచిపోకుండా ఉండటం కోసం నా జాగ్రత్తలో నేను ఉన్నానని చెబుతున్నానంతే" అన్నాడు చిలిపిగా భార్గవ్.

"చూడు రేణూ... భార్గవ్ అల్లరి" మురిపెంగా చెప్పింది వాహిని. వాళ్ళ చిలిపి తగువు చూసిన రేణూకి ముచ్చటగా అనిపించింది. శరత్‌కి అర్థం తెలియక అయోమయంగా చూస్తున్నాడు.

"ఏమిరా శరత్! ఫ్రెండ్‌వి కదా, నన్ను సపోర్ట్ చేయవేం! పోనీ రేణూ పార్షియాలిటీ లేకుండా నువ్వైనా చెప్పు!"

"...మీరిద్దరూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'" ఆహ్లాదకరంగా చెప్పింది రేణూ.

భార్గవ్ చటుక్కున వాహిని చెంపమీద ముద్దు పెట్టుకున్నాడు తన ప్రేమను వ్యక్తం చేస్తూ. వాళ్ళిద్దరికీ ఇది మామూలే! అరమరికలు లేని స్నేహితులు కనుక శరత్, రేణూల ఎదుట ఎలాంటి సంకోచమూ ఉండదు వాళ్ళకి. శరత్ పడగ్గదిలో అయినా రేణూని ముద్దుపెట్టుకోడానికి సంకోచిస్తాడు అందుకే సిగ్గుపడిపోతూ, 'రేణూ, ప్లేట్స్ సర్దుతాను. భోజనం చేద్దామా' అంటూ లేచి ఆ పని మొదలు పెట్టాడు.

రేణూకూడా లేచింది.

వాహిని మంచినీళ్ళు గ్లాసుల్లో పోసింది.

భార్గవ్ వండిన పదార్థాలను టేబుల్ మీద పెట్టాడు.

"రేణూ! ఈ రోజు బెండకాయ కర్రీ మరీ బాగుందే.. " వట్టిదే తినేస్తూ అంది వాహిని.

భార్గవ్ అప్పటికే తన కూర తినేశాడు.

తన ఇల్లే అయినా, రేణూ చేసిన వంట అయినా, తనకిష్టమైన ఫ్రైడ్‌రైస్ తినడానికి ఆలోచిస్తున్నాడు శరత్.

"రేణూ! మా ముగ్గురికీ ఇష్టమైనవన్నీ చేశావ్. మరి నీకు ఇష్టం అయిందేమీ చెయలేదా? " అభిమానంగా అడిగాడు భార్గవ్.

"మీరిలా ఇష్టంగా తినడమే నాకు ఇష్టం. ఇవన్నీ నాకూ ఇష్టమైనవే కదూ శరత్?" అంది భర్త వైపు చూస్తూ.

"ఏమో! నీకేమిష్టమో నాకు తెలియదు." అన్నాడు శరత్.

"అవును అని ఒక్కమాట అనకూడదూ, తెలియదు అనకపోతే..... మీ సంగతి కొత్తకాదు కానీ... ఏదో ఆశపడటం మాత్రం అనవసరం!" అనుకుంది రేణు.

సంబాషణ మరోవేపు మళ్ళించింది వాహిని.

సాయంత్రం దాకా భార్యా భర్తలు సంతోషంగా గడిపారు.

సోమవారం నుంచీ మళ్ళీ ఉదయాన్నే లేవడం పరుగులూ ఉరకలూను. ఒకే ఒక్కరోజు వారానికి ఒకరోజు వచ్చే శెలవు కోసం ఎదురుచూడటం. తీరా చేసి ఆ రోజు ఎలా గడుస్తుందో తెలియదు కానీ.... యామిని కూతురు పుట్టినరోజు పార్టీలో కలసిన పరిచయస్తులలో రాహుల్ ఓ ఆదివారం రేణూని, శరత్‌ని డిన్నర్‌కి పిలిచాడు. వాళ్ళ పేరెంట్స్‌కి షష్టిపూర్తి చేస్తున్నానని. ఉన్నవి చాలక కొత్త పార్టీలు, పరిచయాల మాట ఎలా ఉన్నా ఈ పార్టీలకు డిన్నర్లకు వెళ్ళడం అనేది ఒక ఫ్యాషన్ అయిపోయింది. మానవ సంబంధాలు కొనసాగించాలంటే తప్పవు మరి. ప్రతి పనికీ అర్ధం పరమార్ధం కలిపించుకోవటం అన్నింటికీ వర్తించదు. అని సరిపుచ్చుకుని బయలుదేరింది రేణు.

యామినితోపాటు కంపెనీలో వర్క్ చేసే స్టాఫ్ చాలామంది వచ్చారు. 'ఈ డిన్నర్ పరమార్ధం ఏమంటే రాహుల్ చెల్లాయికి పెళ్ళికొడుకుని వెదకడం. అదెంత వరకూ సాధ్యపడిందో తెలియదు కానీ, అబ్బాయిలు చాలామంది వచ్చారు' అని, యామిని చెప్పేవరకూ రేణూకి తోచలేదు.

"ఇంత ఖర్చు చేసి వెదకడం కంటే ఏ ఫ్రెండ్స్‌కో, రెలిటివ్స్‌కో చెబితే చాలదూ" అంది రేణూ.

"అలా అయితే పరిచయాలకు అబ్బాయికీ, అమ్మాయికీ టైమ్ తీసుకుంటుంది ఇలా అయితే మనిషినీ చూడచ్చు, ఇష్టం అయితే పరిచయాలు కొనసాగుతాయ్. లేదా ఇంతటితో ఆగిపోతాయ్!" అంది యామిని.

శరత్ ఎప్పటిలా చొరవగా కలయ తిరుగుతూ అందరినీ పలకరిస్తున్నాడు చాలా పొద్దుపోయి ఇంటికి చేరుకున్నారు.

ఎందుకోగానీ శరత్ ఈసారి కొత్త పరిచయాలు, తెలిసిన వాళ్ళ గురించీ చెప్పలేదు. వెంటనే డ్రస్ ఛేంజ్ చేసుకుని నిద్రపోయాడు. ఆదివారం కూడా రాత్రి డిన్నర్ విషయాలు మాట్లాడనూ లేదు. రేణూకి చాలా ఆశ్చర్యం అనిపించింది.

అసలు విషయం మరో పరిచయస్తుడు ప్రవీణ్ పార్టీకి పిలిచినప్పుడు తెలిసింది.

రేణు శుక్రవారం రాత్రి గుర్తు చేసింది.

"శరత్ రేపు మనం పార్టీకి వెళ్ళాలనుకుంటాను... ప్రవీణ్ పిలిచాడు కదూ"?

"ఇదేమంత ఇంపార్టెంట్ పార్టీ కాదులే రేణూ. మనం వెళ్ళడంలేదు."

"మనం పార్టీని దృష్టిలో పెట్టుకుని వెళ్ళం కదా! పిలిచినవాడు ప్రవీణ్. అదీ మీ చెల్లాయ్ మరిది. బంధువు తప్పదేమో. వెళ్ళకపోతే అతను ఫీలవ్వచ్చు!"

"నువ్వు ఒకోసారి అంటుంటావ్ చూడు ఈ పార్టీలు, డిన్నర్లూ చైన్ లింక్స్‌లాంటివి. ఒకో పార్టీలో కొత్తవాళ్ళు, బంధువులో, తెలిసినవారో కలవడం, వాళ్ళు మళ్ళీ పార్టీలకు పిలవడం... అలా.. అలా అంతులేకుండా పోతోంది. నాకూ విసుగ్గా అనిపిస్తోంది!"

"మరి... ప్రవీణ్ బంధువు... "

"అయినా సరే ఇక మెల్లిగా అవాయిడ్ చేయదల్చుకున్నాను. నీ వర్క్‌లో నా వర్క్‌లో కొలీగ్స్ ఆఫీసర్స్, మేనేజర్స్ పార్టీలు ఇస్తే అవి భవిష్యత్ మీద ఆధారపడేవి కనుక వెళ్ళాలి మిగిలిన వాటికి అవసరం లేదు!"

రేణూకి ఇంకా నమ్మ బుద్ధి కావడంలేదు. శరత్‌లో ఇంతటి మార్పురావడానికి ఏదో కారణం ఉండి ఉండాలి. లేకపోతే అతనింత సులువుగా పరిచయస్తులను వదులుకోడు అనుకుంది.

"వాహినీ, శరత్‌లో ఈ మార్పు విచిత్రంగా ఉంది నాకు. భార్గవ్‌కి తెలుసునా కారణం ఏమిటో?"

"తెలుసు. కాబట్టి నేను నీకు చెబుతాను. ఎక్కడ, ఎప్పుడు, ఎవరిచేత పరాభవం జరిగిందో మాత్రం చెప్పను కానీ, జరిగింది చెబుతాను. ఒకసారి మనమంతా వెళ్ళిన పార్టీలో ఒకామె శరత్ మాటల తూటాలకి ఎలా బలి అయిందో నలుగురు ఫ్రెండ్స్‌కి చెప్పి విరగబడి నవ్వి, 'శరత్‌లో స్త్రీ లక్షణాలున్నాయి, అందుకే మగవాళ్ళతో కలవడం కన్నా, ఎక్కడ నలుగురు ఆడవాళ్ళుంటే అక్కడికి వెళ్ళి, వాళ్ళతో మాట్లాడడం, పరిచయాలు పెంచుకోవడం, అంతేకాక వాళ్ళని తాకుతూ నిలబడడం చేస్తాడు. అది దురుద్దేశం కాదనుకోండి. సహజాతి లక్షణం అంటూ కామెంట్ చేసింది. అది విన్నవారిలో ఒకావిడ 'గే' ...కాదుకదా అని హేళన చేసింది. ఇదంతా నాకు తెలుసు. పరిసరాల్లో శరత్‌ని చూశాను. తర్వాత భార్గవతో ఈ విషయం చెప్పి, బాధపడి, ఇక తప్పుదిద్దుకుంటాను అన్నాట్ట! అదీ విషయం" అంది వాహిని.

❋❋❋



హైదరాబాదు వాస్తవ్యులైన శ్రీమతి బులుసు అన్నపూర్ణ గారు లోక్ సత్తా పార్టీలో క్రియాశీలక కార్యకర్త. 1994 నుంచీ కథలు వ్రాస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని అన్ని ప్రముఖ పత్రికల్లోనూ వీరి కథలు ప్రచురించబడ్డాయి.



# వేయుపృయుగు

ఎమ్వీ రామిరెడ్డి

**"అన్నా, సీసాల శేషు దొరికాడట!"**

ఫోన్లో ఆ మాట విని ఉలిక్కిపడ్డాను.

"ఏమిటి, నిజమేనా నువ్వు చెప్పేది?"

"నిజమేనని కచ్చితంగా తెలియదుగానీ నాకైతే ఉప్పందింది. నువ్వు రంగంలోకి దిగితే తేల్చుకోవచ్చు."

"వేరే ఛానల్ వాళ్ళకెవరికైనా తెలిసిందా?"

"ఛాన్సే లేదన్నా. డిపార్ట్‌మెంట్‌లో కూడా సీక్రెట్‌గా ఉంచారట."

"థాంక్ గాడ్ నేను అయిదు నిముషాల్లో ఆఫీసు దగ్గరుంటాను. నువ్వు కెమేరా రడీ చేసుకో.

ఫోన్ పెట్టేసి, రెండు నిమిషాల్లో బయల్దేరి బండి స్టార్ట్ చేశాను.

రమేష్ అంటే నాకందుకే చాలా ఇష్టం. కెమేరామేన్‌గా పనిచేస్తున్నా సిసలైన జర్నలిస్టులా ఉంటాడు.

దూసుకుపోతున్న బైక్‌తో నా ఆలోచనలు పోటీపడుతున్నాయి.

'సీసాల శేషు'

మోస్ట్ వాంటెడ్ క్రిమినల్. పదేళ్ళుగా పోలీసు రికార్డుల్లో కేసుల చిట్టా పేరుకుపోయినా, ఆర్నెల్ల క్రితం ప్రతిపక్ష ఎమ్మెల్యేని హతమార్చిన దగ్గరనుంచీ పత్రికల్లో, టీవీలో అతని పేరు మార్మోగిపోతుంది.

అతనికి అధికార పార్టీ అండ పుష్కలంగా ఉందనీ అందుకే అతనెక్కడ ఉన్నాడో తెలిసినా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనీ ప్రతిపక్ష నేత విమర్శించడం..ప్రభుత్వం ఖండిస్తూ ప్రకటనలివ్వడం రివాజుగా మారింది.

శేషు బెంగుళూరులో ఉన్నాడనీ ఢిల్లీలో మకాం వేశాడనీ విదేశాల్లో ఉన్నాడనీ రకరకాల వదంతులు వచ్చాయే తప్ప అతని ఆచూకీ దొరకలేదు.

'మోస్ట్ వాంటెడ్' లిస్టులో పెట్టడం మినహా పోలీసులు కూడా చిత్తశుద్ధితో ప్రయత్నించిన దాఖలాల్లేవంటూ వారం క్రితమే మా ఛానల్లో టెలికాస్ట్ అయిన నా స్పెషల్ స్టోరీతో కొద్దిగా కదలిక వచ్చినట్లే వచ్చి మళ్ళీ చప్పబడిపోయింది.

అధికార పార్టీ అండ ఉంటుంది కాబట్టి అతన్ని అర్జెంటుగా అండర్‌గ్రౌండ్‌కు తరలించే అవకాశముంది. మీడియా కళ్ళు కప్పగలిగితే చాలు - అత్యంత చాకచక్యంగా అతన్ని తప్పించేస్తారు.

'అలా జరగడానికి వీల్లేదు. ఎలాగైనా గుట్టు రట్టు చేయాల్సిందే!'

నాలో తపన.

ఆఫీసు ముందు బైక్ ఆపి, హారన్ కొట్టాను. రమేశ్ గబగబా వచ్చి బండిమీద కూచున్నాడు.

పంజాగుట్ట పోలీసుస్టేషన్‌కు కొంచెం దూరంలో బండి ఆపి, రమేశ్‌ను అక్కడే ఉంచి, నేనొక్కణ్ణే స్టేషన్లోకి వెళ్ళాను. ఇద్దరు కానిస్టేబుళ్ళు బాతాఖానీలో మునిగిపోయి ఉన్నారు. సీఐ గురించి అడిగితే తమకు తెలియదని చెప్పారు. రెండు మూడు ప్రశ్నలు వేసినా వాళ్ళు తాపీగా జవాబిచ్చారే తప్ప తడుముకోలేదు. అక్కడి వాతావరణాన్ని చూస్తే ఇన్సిడెంట్స్ ఏమీ ఉన్నట్లు కనిపించలేదు.

బయటికి వస్తూ గేటు దగ్గర సెంట్రీ మొహంలోకి తొంగి చూశాను. ఏదో ఆందోళన. అడిగితే ఏమీలేదన్నాడు.

నిరాశగా రోడ్డు మీదకు వస్తూ కిందకి చూసిన నాకు ఏదో క్లూ దొరికినట్లయింది.

గభాల్న మళ్ళీ నాలుగడుగులు వెనక్కి వేసి సెంట్రీతో "ఎందుకు సార్ దాస్తారు? మీరు చెప్పకపోయినా ఆ రక్తపుమరకలు చెబుతూనే ఉన్నాయి" అన్నాను.

అతడి నుంచీ స్పందన లేదు.

నేను మరింత దగ్గరగా వెళ్ళి "సరే, వస్తా సార్" అంటూ కరచాలనం చేశాను. నా వ్యూహం ఫలించింది.

"శేషు... నిమ్స్..." అన్నాడు నాకు మాత్రమే వినిపించేంత మెల్లగా - తన చేతిలో పడిన అయిదొందల నోటును ఎవ్వరూ చూడకుండా జేబులో పెట్టుకుంటూ.

"థాంక్స్".

రెండు నిమిషాలు నిమ్స్‌కు చేరుకున్నాం.

నాలుగు నిమిషాలు ప్రశాంతంగా ఆలోచించాను.

ఓ నెంబరుకు రింగ్‌చేసి "హలో కిరణ్, డాక్టర్లు వేసుకునే వైట్‌కోటుతో నువ్వు అయిదు నిమిషాల్లో నిమ్స్‌కు వచ్చెయ్" అని చెప్పి పెట్టేశాను.

కిరణ్ వచ్చేలోగా ఎమర్జెన్సీ వార్డులోకి వెళ్ళి శేషును అక్కడికి తీసుకొచ్చినట్లు అతికష్టం మీద నిర్ధారించుకున్నాను.

వెంటనే ఆఫీసుకు ఫోన్ చేసి "సర్, వెరీ ఇంపార్టెంట్ న్యూస్. అర్జెంటుగా స్క్రోల్ వేయాలి" అన్నాను.

"ఏమిటది" - ఇలాంటివి తనకు మామూలే కాబట్టి తాపీగా అడిగాడు ఇన్‌ఛార్జి.

"సీసాల శేషును పోలీసులు అరెస్టు చేశారు."

"అవునా..." ఆయన ఒక్కసారిగా అలర్టయ్యాడు.

"ఇమీడియేట్‌గా స్క్రోల్ వేయండి. మనకు రేరేస్ట్ విజువల్స్ సేకరించే ప్రయత్నంలో ఉన్నాను."

కిరణ్ వచ్చాడు తెల్లకోటుతో.

"రమేశ్, ఈ ఆసుపత్రిలో బోల్డంత మంది డాక్టర్లుంటారు. ఎవర్ని ఎవరూ గుర్తించలేరు. నువ్వీ తెల్లకోటు వేసుకుని డాక్టర్‌లా లోపలికెళ్ళు. కోటులోపల పెన్‌కెమేరా ఉంచుకో. బాంబుదాడిలో గాయపడ్డ శేషుకు ఆపరేషన్ పూర్తికాగానే థియేటర్లోంచి బయటకు తీసుకొస్తారు. ఆ క్షణం నుంచే చిత్రీకరణ మొదలుకావాలి. ఇది నేను చెప్పినంత తేలిగ్గాదు. కానీ రిస్కు తీసుకోక తప్పదు."

"ఏం ఫర్వాలేదన్నా. ఆ మాత్రం థ్రిల్ ఉంటేనే మజా వస్తది."

మా స్క్రోల్‌న్యూస్ బాంబులా పేలింది. అన్ని ఛానల్లూ పత్రికలూ క్షణాలమీద రంగంలోకి దిగాయి. వాళ్ళెవరికీ దొరకని అద్భుతమైన విజువల్స్ మాకు దక్కాయి, రమేశ్ సాహసంతో!

అయిదు రోజుల తర్వత పూర్తిగా కోలుకున్న శేషును విలేఖరుల ముందు నిలబెట్టారు.

పోలీసులు, ఎప్పుడూ చెప్పే కథలే చెప్పారు.

శేషు, పెద్దలు చెప్పమన్నట్లే చెప్పాడు.

అతని మొహంలో ఎక్కడా పశ్చాత్తాప ఛాయల్లేవు. ఆందోళన లేదు. ఎందుకో... చాలాసేపు అతని మొహంలోకి అలా చూస్తుండిపోయాను.

ప్రెస్‌మీట్ అయిపోయింది. బయటికొచ్చి బండి స్టార్ట్ చేయబోతుండగా ఓ కానిస్టేబుల్ వచ్చి "మిమ్మల్ని సార్ పిలుస్తున్నాడు" అని చెప్పాడు.

వెళ్ళాను.

"శేషు మీతో ఏదో మాట్లాడతాడట" సీఐ చెప్పాడు.

నాతోనే ఎందుకు మాట్లాడతానన్నాడనే సంగతి అలా ఉంచితే, నాకు ఏదో ఒక ఎక్స్‌క్లూజివ్ సమాచారం రాబోతుందన్న ఆనందం నన్ను చుట్టేసింది. ఎందుకైనా మంచిదని రమేష్‌ని రమ్మని పిలవబోతుంటే "ఆ.. ఆ.. కెమేరాల్తో పనిలేదు. పర్సనల్‌గా ఒక్క మాట మాట్లాడతానంటే సరేనన్నా" చెప్పాడు సీఐ.

స్టేషన్ ఆవరణలో పూలమొక్కల పక్కనే నిలబడ్డాం - శేషూ, అతనితో బేడీల జత పంచుకున్న కానిస్టేబులూ, నేనూ.

"మాస్టారూ... నన్ను గుర్తుపట్టలేదా? నేను, శేషేంద్రని" - శేషు అడుగుతుంటే నా నొసలు ముడతలు పడ్డాయి.

"గుర్తు రాలేదా సార్. మేం ట్యూషన్‌కు వచ్చేవాళ్ళం... మీరు మాకు లెక్కలు చెప్పేవారు... అమ్మగారు బాగున్నారా..."

అప్పటికి గుర్తొచ్చాడతను. వెంటనే భారతమ్మ రూపం కళ్ళముందు మెదిలింది.

"శేషేంద్రా... నువ్వు... నువ్విలా...నమ్మలేకపోతున్నారా..."

తెగిన జ్ఞాపకాలు అతుక్కోకముందే సీఐ కేకేశాడు. కానిస్టేబుల్ శేషును తీసుకెళ్ళిపోయాడు.

రాత్రి పదకొండు -

గదిలో ఒంటరిగా నేను, ఎదురుగా డైరీ. కలం కదలడం లేదు. ఉదయం నుంచీ శేషు జ్ఞాపకాలే! అవి నా వేలు పుచ్చుకుని గుంటూరుకు ఇరవై కిలోమీటర్ల దూరంలోని మా గ్రామానికి లాక్కెళుతున్నాయి.

నేనప్పుడు డిగ్రీ మొదటి సంవత్సరం. కాలేజీకి రోజూ గుంటూరు వెళ్ళేవాణ్ణి. అప్పటికే అక్క పెళ్ళికి చేసిన అప్పులింకా తీరలేదు. చిన్నప్పుడే నాన్న పోయినా మా బాగుకోసం శ్రమిస్తున్న అమ్మకు ఎంతో కొంత అండగా నిలవాలన్న ఉద్దేశంతో కోటేశ్వరరావు గారి కాన్వెంటులో రోజూ సాయంత్రం పూట రెండూ గంటలసేపు లెక్కలు చెప్పేవాణ్ణి. ట్యూషన్ మొత్తానికి - ఎనిమిది చదువుతున్న శేషేంద్ర, ఏడోతరగతి చదువుతున్న శ్రావణ్‌లు కేంద్ర బిందువులు. వాళ్ళిద్దరూ అన్నదమ్ములు.

కాస్త ఖాళీ దొరికితే చాలు - నా చుట్టూ చేరి కబుర్లు చెప్పేవాళ్ళు. మిగతా పిల్లలకీ వాళ్ళకీ నడవడిలో, మాటతీరులో ఎంతో తేడా కనిపించేది.

అప్పుడప్పుడూ మా ఇంటికి వస్తుండేవాళ్ళు. వాళ్ళ మాటలకు అమ్మ, అమ్మమ్మ ముచ్చటపడేవాళ్ళు. ఏదో ఒక తాయిలం పెట్టేవాళ్ళు.

ఆరోజు క్లాస్ చెప్పి, నేను ఆఫీస్ రూంలోకి వెళ్ళాను. నా వెనుకే వచ్చారు అన్నదమ్ములు.

"బాబూ మేష్టారుగారూ, రేపట్నుంచీ మేము ట్యూషన్‌కు రావడం లేదండీ" అన్నారు.

"ఎందుకనీ?" అడిగను.

"ఈ నెల ట్యూషన్ ఫీజు కట్టలేదు. పోయిన్నెలదే ఇంకా కట్టలేదు. ఇందాక కోటేశ్వరరావు మేష్టారు వచ్చి తిట్టారు. రేపు డబ్బులు తీసుకురాకపోతే ట్యూషన్‌కు రావద్దన్నారు".

నాకెందుకో బాధగా అనిపించింది.

"వర్రీ కాకండి. రేపు పగలు ఓసారి మా ఇంటికి రండి" చెప్పాను.

అమ్మ ద్వారా వాళ్ళ రెండు నెలల ట్యూషన్ డబ్బులు నేనే చెల్లించాను. వాళ్ళిద్దరి మొహాల్లో కాంతి వలయాలు!

ఆ రోజు మామయ్య ఊళ్ళో లేకపోవడంతో పొలం నుంచీ పత్తి గోతాము తీసుకొచ్చే డ్యూటీ నాకు పడింది.

సైకిల్ని డొంకలోనే పెట్టి పత్తి చేనులోకి నడిచాను.

"అయినంతవరకూ తీసుకెళ్తావా, మొత్తం అయిపోయిందాకా ఉంటావా?" అడిగింది అత్తయ్య.

"ఇంకా ఎంతసేపు పడుతుంది?"

"ఈ మునుం అయితే అయిపోయినట్టే"

"సరే, ఉంటాలే"

వాళ్ళతో పాటు నేనూ మునుం పట్టాను.

"బాబూ, మా పిల్లలు ఎలా చదువుతున్నారు?" అడిగిందామె ఒలిచిన పత్తిని ఒడిలో వేసుకుంటూ.

నల్లగా కమిలిపోయిన మొహం.... కళ్ళల్లో వింత కాంతి.... బక్కపలచగా ఉన్న ఆమె ఎవరో తెలియక అయోమయంగా చూస్తున్న నాకు అత్తయ్య మాటసాయం చేసింది.

"అదేనబ్బాయ్ - శేషేంద్ర, శ్రావణ్‌లున్నార్రే, వాళ్ళమ్మ ఈమె"

ఆమెనలా కలవడం చిత్రంగా అనిపించింది.

"వాళ్ళకేం, బ్రహ్మాండంగా చదువుతున్నారు" చెప్పాను.

ఆరోజు రాత్రి - ట్యూషన్లో - "మాస్టారూ, మీరు మా అమ్మతో మాట్లాడారంటగా" ఇద్దరూ నా చుట్టూ చేరి ఆనందంగా అడిగారు.

"అవునోయ్"

ఇద్దరి మొహాల్లోనూ చిరునవ్వు విరిసింది. శ్రావణ్ మొహంలో అది వేగంగా మాయమై, దిగులు మేఘం కమ్ముకుంది.

"సార్, మా అమ్మ నల్లగా ఉంటుంది కదూ!" విచారంగా అన్నాడు.

"అదేం లేదే, చాలా చక్కగా ఉందామె"

శ్రావణ్ అనుమానంగా చూశాడు నావంక.

"అలా అనకూడదు శ్రావణ్. అమ్మను మించిన సౌందర్యమూర్తి ఈ ప్రపంచంలోనే లేదు. నిన్ను బుజ్జగించడానికి కాదు. నిజంగానే చెబుతున్నాను. ఆమె అచ్చం మా అమ్మలాగే కనిపించింది నాకు."

శ్రావణ్ మొహంలో ఆనందం కొలువు తీరింది. శేషేంద్ర కూడా సంతృప్తిగా చూశాడు.

రాత్రి ట్యూషన్ నుంచీ ఇంటికొచ్చాక, అన్నం వడ్డిస్తుండగా అమ్మకు ఈ విషయాలు చెబితే ఆమె మరికొంత సమాచారమిచ్చింది.

ఆమె పేరు భారతమ్మ. గుంటూరులో పుట్టి పెరిగింది. కుటుంబం చితికిపోవడంతో ఆమెను మా ఊరి కృష్ణారావుకిచ్చి పెళ్ళి చేశారు. అతను తాగడం, తిరగడం తప్ప అటు పుల్ల తీసి ఇటు పెట్టడు. అతనితో విసిగిపోయిన భారతమ్మ భర్తతో సహా పుట్టింటికి చేరుకుంది. కృష్ణారావుకు మిర్చియార్డులో ఉద్యోగం ఇప్పించింది, ఆమె తండ్రి తనవంతు సాయం అందించాడు. సంసారం సాగింది. శేషేంద్ర, శ్రావణ్ అక్కడే పుట్టి పెరిగారు. పదేళ్ళు గడిచిపోయాయి. కృష్ణారావుకు గుంటూరులోని వీధిరౌడీలతో పరిచయాలు పెరిగాయి. వాళ్ళమీదా వీళ్ళమీదా దౌర్జన్యాలు చేయడం అలవాటయింది. ఆ అలవాటు ముదిరిపోకముందే జాగ్రత్తపడాలన్న ఉద్దేశంతో భర్త, పిల్లలతో కలిసి మళ్ళీ మా ఊరికి చేరుకుంది భారతమ్మ. చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని కూలికి వెళుతూ కుటుంబాన్ని పోషిస్తుంది. అది తెలుసుకున్నాక, ఆమె పిల్లలిద్దరికీ నాకు తోచిన సాయమల్లా చేశాను.

మరుసటి ఏడాది నాకు ఆంధ్రా విశ్వవిద్యాలయంలో సీటొచ్చి, వైజాగ్ వెళ్ళడం, అది పూర్తికాగానే జర్నలిజంలో పీజీ డిప్లొమా, వెంటనే ఉద్యోగం - ఫలితం ఊరికి దూరమయ్యాను.

అయిదేళ్ళ తర్వాత, ఓ టీవీ ఛానల్లో రిపోర్టర్గా గుంటూర్లో ఉద్యోగంలో చేరిన కొత్తలో ఓ రోజు విద్యానగర్లోంచి వెళుతున్నాను.

"బాబూ... బాబూ"..." మట్టిరోడ్డు పక్కన ఉన్న ఇంటిముందు నిలబడి నన్నే పిలుస్తోందామె.

దగ్గరగా వెళ్ళాను. ఎవరో గుర్తుపట్టలేకపోయాను.

"నేను... భారతమ్మని. బాగున్నావా? ఇప్పుడెక్కడుంటున్నారు? ఉద్యోగమా? పెళ్ళయిందా? రా... రా.. బయటే నిలబెట్టి మాట్లాడుతున్నాను, లోపలికి రా."

ఓ కుర్చీ తెచ్చి వేసింది. నా వివరాలు చెప్పాను.

"శేషేంద్ర, శ్రావణ్ బాగున్నారా? ఇప్పుడేం చేస్తున్నారు?"

ఆమె ముఖంలో వేగంగా రంగులు మారాయి.

"బాగున్నారా అంటే ఏమని చెప్పాలో అర్థం కావటం లేదు బాబూ. వాళ్ళమటుకు వాళ్ళు బాగానే ఉన్నామనుకుంటున్నారు. లేచిన దగ్గరనుంచీ నాయకులూ గొడవలూ కత్తులూ బెదిరింపులూ... అదే వాళ్ళ లోకం! నాలుగురోజులలో అయిదురోజులకో బుద్ధి పుడితే ఓసారి ఇంటికొచ్చి రెండు ముద్దలు తినిపోతారు. ఈయనకేమో తాగుడూ పేకాటా. ఇంట్లోకి పావుకిలో చింతపండు తెచ్చిన పాపాన పోలేదు. నాకు తప్పదుగా. అందుకే, ఇదిగో ఈ ఇంట్లోనే చిన్న హోటల్ నడుపుతున్నాను."

నాతో మాట్లాడుతూనే ఆమె పొయ్యి మీద ఇడ్లీపాత్ర పెట్టింది.

"అదేమిటి, వాళ్ళు చదువుకోలేదా?"

"చదువా, పాడా? కూలీ, నాలీ చేసైనా వాళ్ళను చదివించాలనుకున్నా. నా ఆశలన్నీ బుగ్గిపాలు చేశారు. ఊళ్ళో రౌడీల్లా తయారయ్యారని గుంటూరు తీసుకొచ్చాను. వాతావరణం మారి, ఏదో ఒకపని చూసుకుంటారనుకున్నా. ప్చ్... వాళ్ళ తలరాత అలా ఉంది, ఏం చేస్తా."

బెస్ట్ స్టూడెంట్స్‌గా అవార్డులందుకున్న వాళ్ళిద్దరూ అలా మారారంటే నాకు ఓ పట్టాన నమ్మబుద్ధికాలేదు.

ఓ ప్లేటులో వేడివేడి ఇడ్లీ, కారప్పొడి, నెయ్యి వేసి తెచ్చిందామె.

తిని, ఓ పదినిమిషాలు కూర్చుని వచ్చేశాను.

మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయానికి వెళుతుంటే మున్నంగి శీను కలిశాడు. హైస్కూల్లో అతను నాకు సీనియర్. ఇద్దరం హోటల్లోకి నడిచాం. శేషేంద్ర, శ్రావణ్‌ల గురించి అతన్ని అడిగాను.

"నిజానికి వాళ్ళిద్దరూ మంచి స్టూడెంట్లే. కానీ ఎండమావుల వెంట పరుగులు తీశారు. ఇంటర్లో చేరాక విద్యార్థినాయకులుగా మారారు. కాలేజీలో వర్గాలు తయారయ్యాయి. వీళ్ళు కత్తులూ కటార్లూ పట్టారు. ఓసారి వినాయక చవితి రోజు గుడిదగ్గర జనమంతా పూజలు చేస్తుండగా శేషేంద్ర, శ్రావణ్‌లు అక్కడికొచ్చారు. వస్తూనే నారాయణగారబ్బాయి రంగారావు మీద దాడిచేశారు. జనం అడ్డం పోబోతే, కత్తుల్తో బెదిరించారు. రంగరావును చావబాది, వెళ్ళిపోయారు. మనూరి సర్పంచి తమ్ముడే ఈ పని చేయించాడని తర్వాత తెలిసింది. మూడురోజుల తర్వాత రంగారావు శవం పత్తిచేలో పడి ఉంది. శేషేంద్ర, శ్రావణ్‌లే చంపేశారని ఊరంతా అనుకున్నారు. పోలీసులొచ్చి వాళ్ళనే పట్టుకుపోయారు. రెండేళ్ళ తర్వాత సర్పంచి తమ్ముడే ఏదో కిందా మీదా చేసి వాళ్ళను బయటకు తీసుకొచ్చాడు."

శేషు కేసును సీబీఐకి అప్పగించింది ప్రభుత్వం. అతన్ని తరచి తరచి ప్రశ్నించడం, ఎమ్మెల్యే హత్య వెనక ఇంకా ఎవరి ప్రమేయముందో బయటికి లాగేందుకు ప్రయత్నించడం, శేషు రోజుకో విధంగా మాట్లాడటం, కావాలనే కేసును నీరుగారుస్తున్నారని ప్రతిపక్షనేతలు ఆరోపించడం... ఈ దినుసులన్నీ దట్టించి మేం స్పెషల్ స్టోరీలు వండుకోవడం నిత్యకృత్యంగా మారింది.

కోర్టు తీర్పులు, పోలీసుల సమాచారంపైనే ఆధారపడకుండా వ్యక్తిగత ఆసక్తితో నేను కసరత్తు చేసి శేషు గతాన్ని పసిగట్టేందుకు ప్రయత్నించాను.

శేషు గుంటూరు చేరుకున్నా, సర్పంచి తమ్ముడు వదిలిపెట్టలేదు. గుంటూరులోనే తమ పార్టీ ఎమ్మెల్యేకి పరిచయం చేశాడు. ఆయన శేషునీ, శ్రావణ్‌నీ చేరదీశాడు. దౌర్జన్య కార్యకలాపాలకు వాడుకున్నాడు. డబ్బు, మందు, విందులతో వాళ్ళను సంతోషపెడుతూ తన కాంట్రాక్టుల్నీ, వ్యాపారాల్నీ పెంచి పోషించుకున్నాడు. వీళ్ళు క్రమంగా పెద్ద రౌడీల జాబితాలో చేరిపోయారు.

భూ ఆక్రమణలు, వివాదాల పరిష్కారం, జూదగృహాల నిర్వహణ వంటి పనులతో బిజీ అయిపోయారు. ఎప్పుడైనా పోలీసులు పట్టుకుంటే నాలుగురోజులు జైల్లో ఉండటం... ఎమ్మెల్యే చొరవతో బయటికి రావడం అలవాటుగా మారింది. వాళ్ళ సామ్రాజ్యం అక్కడితో

ఆగిపోలేదు. ఎమ్మెల్యేకు సన్నిహితుడైన రాయలసీమ రాజకీయ నేత ఆహ్వానం మేరకు ఆ ప్రాంతానికి రాకపోకలు సాగించారు. అక్కడి విధ్వంసంలోనూ పాలుపంచుకున్నారు. ఆ క్రమంలో చాలామంది నేతలు వీళ్ళకు పరిచయమయ్యారు.

వివరాలన్నీ ఒకచోట పేర్చినా ఎక్కడో లింకు కలవడం లేదు. అది కలవాలంటే నేను శేషును కలవాలి. ఏకాంతంగా మాట్లాడాలి.

ఎస్పీకి రోజుకి నాలుగు సార్లు ఫోన్జెయ్యడం మొదలుపెట్టాను.

"నిజానికి రంగారావు ఎలా చనిపోయాడో నాకు తెలియదు మాస్టారూ. వినాయకచవితి రోజు ఊరికే అతన్ని బెదిరిస్తే చాలన్నాడు సర్పంచి తమ్ముడు."

జైలు ఆవరణలో ఓ మూలగా చెట్టుకింద నిలబడి చెబుతున్నాడు శేషు. నేను నిశ్శబ్దంగా వింటున్నాను.

"అసలెందుకిలా మారావు?"

"చాలా కారణాలున్నాయి మాస్టారూ. ముఖ్యకారణం మాత్రం పేదరికం. అదంటే నాకు అసహ్యం. అమ్మ బియ్యం కోసం పక్కింటికెళ్ళిన ప్రతిసారీ నామీద నాకే అసహ్యం వేసేది. డబ్బులేని బతుకు వ్యర్థమనిపించేది. కాలేజీలో కిరణ్ అనేవాడు ఫ్రెండయ్యాడు. వాడు మనూరి సర్పంచి తమ్ముడికి మేనల్లుడు. ఇద్దరం కలిసి తిరిగేవాళ్ళం. సినిమాలకూ షికార్లకూ హోటళ్ళకూ... ఎక్కడికెళ్ళినా వాడే ఖర్చుపెట్టేవాడు. నాకు తెలియకుండానే ఓ రకమయిన జల్సా జీవితానికి అలవాటుపడిపోయాను. నా బలహీనతను పసిగట్టి కిరణ్ నన్ను వాళ్ళ మామయ్య దగ్గరకు తీసుకెళ్ళాడు. ఆయన తియ్యటి మాటలు చెప్పాడు. డిగ్రీ పూర్తవగానే ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. ఏచిన్న అవసరం వచ్చినా అండగా ఉంటానన్నాడు. మెల్లగా ఆయనకు నమ్మిన బంటునయ్యాను. రంగారావును బెదిరిస్తే చాలన్నాడు. అలాగే చేశాను. కానీ అతన్ని సర్పంచి తమ్ముడే చంపేసి, నేరాన్ని మామీదకు నెట్టాడు. ఆ తర్వాత తనే బెయిలిచ్చి బయటికి తీసుకొచ్చాడు. అప్పటికే నేను ఊబిలో కూరుకుపోయాను. దిగబడటం తప్ప గత్యంతరం లేకపోయింది..."

ఆ క్షణంలో... నా చొక్కా, బన్నీ విప్పి, లోపల దాచుకున్న స్పై కెమేరాను లాగేసుకున్న ఎస్పీని తిట్టుకోకుండా ఉండలేకపోయాను.

"రాయలసీమలోనూ యాక్టివిటీస్ మొదలెట్టాక కొన్ని రోజుల తర్వాత నాకో డౌటొచ్చింది - అంతదూరం నుంచీ నన్ను పిలిపించడానికి కారణమేమిటా అని! ఆలోచిస్తే అర్థమయింది... సీమలో నాలాంటి రౌడీలు లేకకాదు. దూరాభారాన్ని సాకుగా చూపి నాయకులకు తప్పించుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని. ప్చ్.... ఏమైతేనేం... ముఠాకక్షల్లో నా తమ్ముణ్ణి పోగొట్టుకున్నాను. అమ్మకు అండగా నిలువలేకపోగా కడుపుకోత మిగిల్చాను...."

శేషు కళ్ళల్లో నీటిపొరలు...

"ఎలాగూ పోలీసులకు చిక్కావుకదా! నీవెనక ఉన్న నాయకుల పేర్లు చెప్పెయ్యొచ్చుగా..." అడిగాను.

"అదంత తేలిగ్గాదు మాస్టారూ, సవాలక్ష మెలికలుంటాయి. చెప్పినా మీకర్థంకావులే..." నిర్వేదంగా నిట్టూర్చాడు శేషు.

రేపే తీర్పు. బలమైన సాక్ష్యాధారాలతో నేరం బుజువైనందున శేషుకి హైకోర్టు ఉరిశిక్ష విధించడం ఖాయమని తేలింది.

ఉదయం ఆఫీసులో కూచున్నాను. రేపు తీర్పు వెలువడగానే ఎడాపెడా స్పెషల్ స్టోరీలివ్వాలని ఛానళ్ళు పోటీ పడుతున్నాయి.

మా ఛానల్ ప్రత్యేకత నిలుపుకునేలా శేషుగురించి నాకు మాత్రమే తెలిసిన చాలా విషయాలతో స్క్రిప్టు రాశాను.

ఎదురుగా నా టేబుల్ మీద ఫ్యాను గాలికి స్క్రిప్టు కాగితాలు రెపరెపలాడుతున్నాయి.

"ఏ ముహూర్తాన గాల్లో కెగరేసి సీసాలు పగలగొట్టే విద్య నేర్చుకున్నానో గానీ, ఆ క్షణం నుంచే నా ఇంటి పేరు మర్చిపోయాను. డబ్బు పలుకుబడీ దండిగా ఉన్నా క్షణక్షణం చస్తూ బతికాను. ప్రాణాలకు తెగించే మనిషిగా పేరు తెచ్చుకున్నా ప్రతిక్షణం భయంభయంగానే గడిపాను. దాడులకు వ్యూహాలు పన్నిన పెద్దోళ్ళు మాత్రం ఆనాడూ ఈనాడూ కడుపులో చల్ల కదలకుండా ఏసీ గదుల్లో సేదదీరుతున్నారు. వద్దు మాస్టారూ... ఈ దౌర్భాగ్యపు బతుకు పగవాడిక్కూడా వద్దు..."

శేషు మాటలు గుర్తొస్తుంటే ఏదో తెలియని బాధ.

ఇన్‌ఛార్జిగారు స్క్రిప్టు చదివాక "అంతా బానే ఉందిగానీ, సపోర్టింగ్ విజువల్స్ బలంగా లేవు. శేషు స్నేహితులుగానీ, బంధువులుగానీ ఎవరైనా దొరికితే బావుణ్ణు" అన్నారు.

అప్పుడు గుర్తొచ్చింది... భారతమ్మ!

ఇంతవరకూ ఆమెనెవ్వరూ ట్రేస్ చేయలేదు.

ఇన్‌ఛార్జ్‌తో చెప్పాను.

"ఆమె ఇప్పటికీ అక్కడే ఉంటుందంటావా?"

"ఔటేసార్. ఓ పనిచేద్దాం. మన గుంటూరు రిపోర్టర్ని అక్కడికి పంపించి, కనుక్కోమని చెబుదాం."

"గుడ్ అయిడియా".

అరగంట తర్వాత గుంటూరు నుంచీ మెస్సేజ్ - ఆమె అక్కడే ఉందని!

"కమాన్, నువ్వు కారు తీసుకుని వెంటనే బయల్దేరు. ఎలా నచ్చజెబుతావో ఏమో, ఆమె తెల్లారేపాటికి మన స్టూడియోలో ఉండాలి."

ఉదయం ఏడుకల్లా హైదరాబాద్ చేరుకుని, భారతమ్మను మా ఇంటికి తీసుకెళ్ళాను. నా శ్రీమతి ఆమెను ఆదరంగా చూసింది. స్నానానికి ఏర్పాట్లు చేసింది.

ఆమెను ఒప్పించి తీసుకురావడం ఓ పట్టాన సాధ్యం కాలేదు.

"వాడి తల్లినన్న విషయం నేనెప్పుడో మర్చిపోయాను. ఏం మాట్లాడమంటావు టీవీలో నిలబడి..." అంటూ ఆమె రకరకాలుగా ప్రశ్నించింది. నేను పట్టు వదల్లేదు. ఎన్నో విధాల నచ్చజెప్పి, ఎలాగో ఒప్పించాను. పదిగంటలకు స్టూడియోకు చేరుకున్నాం. మా ఇన్‌ఛార్జి సంతోషానికి అవధుల్లేవు.

'హైకోర్టు తీర్పుపై శేషు కన్నతల్లి ప్రతిస్పందన - మధ్యాహ్నం పన్నెండు గంటలకు లైవ్ ప్రోగ్రామ్' - పదిగంటలనుంచీ స్క్రోల్ ఇవ్వడం ప్రారంభించాం.

పదకొండున్నరకు హైకోర్టు తీర్పు వెలవడింది.

ఊహించినట్లే ఉరిశిక్ష పడింది.

భారతమ్మకు మా ఇన్‌ఛార్జి కొన్ని సూచనలిచ్చాడు. ఎలా మాట్లాడాలో చెప్పే బాధ్యత నాకప్పగించాడు.

నాకు తోచింది చెప్పి, "మీరు మాట్లాడబోయేది కాగితం మీద రాసుకుంటే బెటర్" అంటూ కలం, కాగితం అందించాను. ఆమె పొడిపొడిగా నాలుగైదు పాయింట్లు రాసుకుంది.

పన్నెండు గంటలు...

వ్యాఖ్యాత పరిచయ వాక్యాలు పూర్తికాగానే భారతమ్మ టీవీ తెరపై ప్రత్యక్షమైంది.

మా సిబ్బంది అలర్టయ్యారు. ఎలాంటి అంతరాయం కలిగినా సరిదిద్దుకునేందుకు సమాయత్తంగా నిలబడ్డారు.

భారతమ్మ నోరు విప్పింది....

"నమస్కారం. నా పేరు భారతమ్మ. మీకందరికీ సీసాల శేషుగా పరిచయమైన గీసుపల్లి శేషేంద్ర కన్నతల్లిని. సాధారణంగా ఒక వ్యక్తి నలుగురికీ ఉపయోగపడే పని చేసినప్పుడో, నలుగురూ సాధించలేని విజయాన్ని సాధించగలిగినప్పుడో అతడి తల్లిదండ్రులు ఇలా అందరిముందూ గర్వంగా నిలబడతారు. కానీ దురదృష్టవశాత్తు ఒక హంతకుడి తల్లిగా నేనీ స్థానంలో నిలబడాల్సివచ్చింది. అరగంట క్రితమే ఉరిశిక్ష ఖాయమైన నేరస్థుడికి జన్మనిచ్చిన నిర్భాగ్యురాలిగా ఇలా కనపడాల్సివచ్చింది. ఒక వ్యక్తి పక్కదారి పట్టాడంటే తల్లితండ్రుల పెంపకంలో లోపం ఉందంటారు. శేషును పెంచి పెద్ద చేసిన వ్యక్తిగా వాడి తరపున సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన బాధ్యత నామీద ఉంది. కటిక దారిద్ర్యం వెంటాడినా కూలీనాలీ చేసి వాణ్ణి చదివించాను. మంచి మాటలు చెప్పాను. మంచి భవిష్యత్తు గురించి కలలు కనేలా చేశాను. కానీ ఎక్కడో లయ తప్పింది. వాడు రౌడీ అవతారమెత్తాడు. వాడు చేసిన నేరాల గురించి చెబుతూంటే నాకే రక్తం మరిగిపోయింది. అందుకే... వాణ్ణి ఉరితీయాల్సిందే.. ఊపిరి ఆగిపోయేదాకా ఉరికంబానికి వేలాడదీయాల్సిందే కానీ వాడొక ఎండుకట్టె. వాణ్ణి ఉరితీస్తే ఎండిన కొమ్మను నరికినట్లు. అంతే. నిజానికి వృక్షాన్ని చెరుస్తున్న వేరుపురుగు వేరే ఉంది. అది... ఇప్పుడు ఎమ్మెల్యేగా కులుకుతున్న ఒకప్పటి సర్పంచి తమ్ముడి రూపంలో ఉంది. వాడి గురువైన కేంద్రమంత్రి రూపంలో ఉంది. ఎండుకట్టెల్ని సమిధలుగా చేసుకుని ఎందరో శేషుల్ని బలిపశువులుగా మారుస్తున్న రాజకీయం రూపంలో ఉంది. వీళ్ళందరికీ కొమ్ముకాస్తున్న అధికారం రూపంలో ఉంది. తీయండి... ఉరితీయండి... శేషుతో పాటు వేరుపురుగును కూడా ఉరితీయండి..."

భారతమ్మ కుప్పకూలిపోయింది.



# పున్నమి చందురుడు

ఎం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి

"యాదమ్మా, ఓ యాదమ్మా! రేపైనా పనిలోకి వస్తావా...?"

గౌరమ్మ పిలుపుకి బయటకు వచ్చిన యాదమ్మ గౌరమ్మని చెయ్యిపట్టుకుని పాక బయట నున్న నులకమంచం మీద కూర్చోబెట్టింది.

"రాంపండుకి జొరం వచ్చింది వదినా. అందుకని ఈ రోజు రాలేకపోయాను. రేపు తప్పకుండా వస్తాను. ఇప్పుడే వాడికి కొంచెం తగ్గింది. రేపు వాడిని సూరమ్మవ్వకు అప్పజెప్పి పనిలోకి వస్తాను. నన్ను వదిలెయ్యకు వదినా. "కళ్ళమ్మట నీళ్ళు బొట బొటా కారుస్తూ చెప్పింది యాదమ్మ.

ఆమె ముఖం చూసి చలించిపోయింది గౌరమ్మ. అనునయంగా ఆమె భుజం మీద చెయ్యివేసి "నా జట్టు లోంచీ నిన్ను తీసెయ్యను. నీకు పని చూపిస్తూనే ఉంటాను. దిగులుపడకు." అని ఓదార్చింది.

"కన్నబిడ్డ కాకపోయినా కంటికి రెప్పలా చూసుకుంటున్నావు. ఏనాటి బంధమో ఇది. నిజంగా రాంపండు చాలా అదృష్టవంతుడు. నీకు కాకుండా వేరెవరికైనా దొరికితే వాడు చాలా ఇబ్బందులు పాలయ్యేవాడు. వాడి గురించి అందరూ కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. అసలు వాడు నీకు ఎలా దొరికాడో చెప్పు" ఆతృతగా అడిగిందింది గౌరమ్మ.

పమిట చెంగుతో కళ్ళు తుడుచుకుని చెప్పింది యాదమ్మ.

"వినాయక నిమజ్జనం సంబరం చూద్దామని నేనూ, మా ఆయనా నిరుడు తణుకు వెళ్ళాం. నరేంద్ర సెంటరులో నిలబడి సంబరం చూస్తున్నాం, బుట్టబొమ్మలు, శక్తివేషాలు, డాన్సులు, రెండెడ్ల బండి మీద దేవుడి వేషాలు వేసుకుని ఊరేగుతున్న వాళ్ళను ఎంతో ఆనందంగా చూసాం. ఊరేగింపు సెంటరు దాటి ముందుకు వెళ్ళడానికి గంట సమయం పట్టింది. అప్పుడు మా కంట పడ్డాడు రాంపండు.

'అమ్మా' అంటూ గుక్కపట్టి ఏడుస్తున్నాడు. జనం ఎవరి హడావిడిలో వాళ్ళు వెళ్ళిపోతున్నారు. ఒకరిద్దరు చూసి "పాపం పిల్లాడు తప్పిపోయినట్టున్నాడు" అని అన్నారేగానీ ఒక్కరూ వాడి దగ్గరకు వచ్చిన వారే లేరు. నేనే ఉండబట్టలేక వాడిని తీసుకుని సముదాయించి బెల్లం జీడి చేతిలో పెట్టాను. జీడి తీసుకున్నా ఏడుపు మాత్రం ఆపలేదు. రాజయ్య ప్లాస్టిక్ గిలక్కాయ తీసుకువచ్చి వాయించి వాడి రెండో చేతిలో పెట్టాడు. అప్పుడు ఏడుపు ఆపి జీడి తినడం మొదలు పెట్టాడు. కాసేపయ్యాక వాడి అమ్మ గుర్తు వచ్చినట్టుంది మళ్ళీ ఏడవడం ప్రారంభించాడు.

వాడిని చంకనేసుకుని పక్కనే ఉన్న షోడా షాపు ఓ కూల్‌డ్రింక్ తీసుకుని వాడికిచ్చాం. అది తాగేసి అలసటగా నా భుజం మీదే నిద్రపోయాడు. ఆ సెంటరులో ఇంకో గంటసేపు ఉన్నాం. ఎవరైనా ఈ పిల్లాడి కోసం వస్తారేమోనని. ఎవరూ రాలేదు. ఏం చేద్దామని అడిగాను రాజయ్యని. పోలీస్ స్టేషన్ కెళదాం పదమన్నాడు. నడుచుకుంటూ పోలీస్ స్టేషన్‌కెళ్ళి, విషయం చెప్పి, ఈ బాబుని మీ దగ్గరుంచుకోండి. ఎవరైనా వాళ్ళ బంధువులొస్తే అప్పగించండి అని చెప్పాం. వాళ్ళు ససేమిరా వల్ల కాదన్నారు. ఈ కుర్రాడిని ఎవరు కాపలా కాస్తారు? నీ అడ్రసు ఇచ్చి వెళ్ళు. ఎవరైనా పిల్లాడి తప్పిపోయాడని వస్తే నీ దగ్గరకు పంపిస్తామని చెప్పారు. మా అడ్రసు ఇచ్చి రాంపండుని ఇంటికి తీసుకు వచ్చాం. తర్వాత వారం గడిచాక పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి అడిగితే పిల్లాడి కోసం ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

పెంచడానికి నీకు ఇబ్బందైతే చెప్పు. వాడిని ఏదో చోట చేర్పిద్దాం అన్నాడు హెడ్డుగారు. ఈ వారం రోజుల్లోనూ రాంపండు మా పిల్లలతో బాగా కలిసిపోయాడు. మా పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా వాడిని వేరేచోట ఉంచడం మాకిష్టంలేకపోయింది. "మేమే పెంచుతాం వీడిని ఎవరైనా వస్తే మాత్రం మా దగ్గరకు పంపించండి. వాళ్ళ బిడ్డను వారికప్పగించి వేస్తాం" అని చెప్పి రాంపండుని ఇంటికి తెచ్చేసుకున్నాం. ఇంతవరకూ ఎవరూ వాడికోసం రాలేదు. పాపం వాడి అమ్మ ఎంత దుఃఖపడుతుందో వాడి గురించి."

"అయితే వాడి పేరు రాంపండుని ఎవరు చెప్పారు యాదమ్మా?"

"ఎవరూ చెప్పలేదు. నేనే వాడిని రాంపండని పిలుచుకుంటున్నాను. కానీ ఈ ఏడాదిలో 'అమ్మ' అన్నమాట తప్పితే ఇంకోమాట వాడినోట రాలేదు. పిల్లాడు ఎదుగుతున్నాడు గానీ వాడికి మాటలు రావడం లేదు. పై వారంలో ఇటువంటి పిల్లల్ని చూడటానికి హైదరాబాద్ నుండి పెద్ద డాక్టరు వస్తారని సుబ్రమణ్యం మాష్టారు చెప్పరు. అప్పుడు రాంపండుని తీసుకెళ్ళి చూపించాలనుకుంటున్నాం."

"నీ ఇద్దరు పిల్లలతోకుటుంబాన్ని భారంగా నెట్టుకొస్తున్న నువ్వు రాంపండు బాధ్యతని కూడా తీసుకోవడం నిజంగా చాలా గొప్ప విషయం. నీది చాలా దొడ్డమనసు. అందుకే నువ్వంటే నాకభిమానం. వాడికి జ్వరం కొంచెం తగ్గిందంటున్నారు కదా, రేపు పనిలో కొచ్చేయ్! సుబ్బరాజుగారి పొలంలోనాట్లు వేయాలి. ఎనభైరూపాయలు కూలీ. ఎంతోమంది పని ఇప్పించమని నా చుట్టూ తిరుగుతున్నారు. వాళ్ళని కాదని నీకేఇస్తున్నానంటే నువ్వు నన్ను అర్థం చేసుకోవాలి మరి."

"నా కష్టం, సుఖం తెలిసిన మనిషివి.నువ్వే వదినా. నిన్ను భగవంతుడు చల్లగా చూస్తాడు."

"సరేలే! మన ముచ్చట్లు ఎప్పుడూ ఉండేవే! నేను వెళతాను మరి " అని ఇంటి ముఖం పట్టింది గౌరమ్మ.

✡✡✡

వారం రోజులు గడిచాకా రాంపండుని హైదరాబాద్ నుండి వచ్చిన పెద్ద డాక్టరుకి చూపించారు రాజయ్య, యాదమ్మ. డాక్టరు పావుగంటసేపు పరీక్షించి "ఈ అబ్బాయికి మిగతా లక్షణాలన్నీ బాగున్నాయి. ఒక్క "మాట" విషయంలోనే తేడా వచ్చింది. ఇతనికి ముందు పుట్టిన పిల్లలు మాట్లాడుతున్నారా?" అని అడిగారు.

"మాకు తెలియదండి."

"అదేమిటి? ఇతను మీ అబ్బాయి కాడా...?

"కాదండి. గత ఏడాది ఈ టౌన్‌లోనే దొరికాడండి. పోలీసులకు తెలియపరచి మేమే పెంచుకుంటున్నామండి."

వారి మాటలకు డాక్టరు ఆశ్చర్యపోయాడు. ఈ సమాజంలో మానవత్వం ఇంకా మిగిలేఉందని గ్రహించి ఆనందపడ్డాడు కూడా.

"చూడండి. మీరు పేదవారిలా ఉన్నారు. హైదరాబాదులో ఇటువంటి పిల్లలను చూసేందుకు సంస్థలున్నాయి. అందులో ఈ అబ్బాయిని చేర్పించడానికి నేను సహకరిస్తాను. ఆలోచించుకోండి.

రాంపండుని వదిలి ఉండటానికి యాదమ్మ ఇష్టపడలేదు.

"డాక్టరుబాబూ! ఎంతకష్టమైనా మేం పడతాం. మా రాంపండుకి మాట రావాలి. వాడు బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేసి పేదలకు ఉపయోగపడాలి. వాడిని ఏదో చోట వదిలేసి చేతులు దులుపుకోలేం. ఈ రోజుల్లో మీ డాక్టర్లు కుదర్చని రోగాలు లేవు కదా! ఆ రకంగా మీరు ఈ పిల్లాడికి సాయం చేయండి. భగవంతుడు మీలాంటి మంచోళ్ళని చల్లగా చూస్తాడు."

యాదమ్మ మాటలకు చిరునవ్వు నవ్వాడు డాక్టరు.

"సరేనమ్మా! నాకు తెలిసిన సంస్థ ఒకటి ఈ ఊళ్ళోనే ఉంది. వారికి ఉత్తరం రాసి ఇస్తాను. మీకు సహాయం చేస్తారు." అని స్పీచింగ్ ఇనిస్టిట్యూట్ వారికి ఉత్తరం రాసి రాజయ్యకిచ్చాడు డాక్టర్. ఆయనకు కృతజ్ఞతలు తెలిపి బయటకు వచ్చారు యాదమ్మ, రాజయ్య.

రాజయ్య తన రిక్షాలోనే రాంపండుని, యాదమ్మని ఎక్కించుకుని కాలేజ్‌గ్రౌండుకి తీసుకువచ్చాడు. ఇంటిదగ్గర నుండీ తెచ్చుకున్న అన్నం తిన్నాక మళ్ళీ రిక్షా ఎక్కి పాలిటెక్నిక్ కాలేజీ పక్కనున్న స్పీచింగ్ ఇనిస్టిట్యూట్‌కి వాళ్ళిద్దర్నీ తీసుకువెళ్ళాడు రాజయ్య.

ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు జోగారావు రాంపండుని పరీక్షించి ఆరునెలలు క్రమం తప్పకుండా బాబుని తీసుకు వస్తే ఫలితం ఉంటుందని చెప్పాడు.

"మరి నెలకు ఫీజు ఎంతవుతుందంటారు?" అడిగాడు రాజయ్య.

అతని ప్రశ్నకు జవాబుగా అక్కడున్న పిల్లలను చూపించి "వీరంతా నెలకు రెండువేలు కడుతున్నారు. పెద్ద డాక్టరుగారు చెప్పారు కనుక మీకు నెలకు వెయ్యిరూపాయలు తగ్గిస్తున్నాం." అన్నాడు జోగారావు.

"బాబూ! మేం చాలా పేదవాళ్ళం మీరు మరికొంచెం దయ చూపించాలి." రాజయ్య ప్రాధేయపడ్డాడు.

"చూడు రాజయ్యా, ఈ ఇంటికి ఐదువేలు అద్దె ఇవ్వాలి. ఇద్దరు టీచర్లకు జీతాలు ఇవ్వాలి. ఫర్నిచరు, పిల్లల సామగ్రికి పెట్టుబడి చాలా అయ్యింది. మాకు గ్రాంట్సు ఏమీ ఉండవు. మా కృషి చూసి, ఇక్కడి పిల్లల పరిస్థితి చూసి ఎవరైనా సహాయం చేస్తేనే మాకు మిగులుతుంది. లేకుంటే లోటు బడ్జెట్లోనే నడపవలసి వస్తుంది."

"సరేనండి. కానీ మీరు ఒక అవకాశం ఇవ్వాలి. నెల పూర్తయ్యాక మేం ఫీజు చెల్లించే విధంగా మమ్మల్ని ఆదుకోవాలి."

జోగారావుకి వారి పరిస్థితి పూర్తిగా అర్థం అయ్యింది.

"అలాగే! నెల పూర్తయ్యాకనే ఫీజు ఇవ్వండని' అన్నాడు

ఇంటికి వచ్చాక రాంపండుని ఆడుకోమని చెప్పి భార్యా, భర్తలిద్దరూ ఆలోచించసాగారు. రోజూ రాంపండుని తణుకు తీసుకువెళ్ళాలి. ముక్కామల నుండీ తణుకు తొమ్మిది కిలోమీటర్లు. బస్ అయినా ఆటో అయినా ఐదురూపాయలు తీసుకుంటారు. రానూ, పోనూ పదిరూపాయలవుతుంది. రాంపండు చిన్నపిల్లాడు కనుక వాడికి టిక్కెట్టు ఉండదు.

ఆ పదిరూపాయలూ ఉంటే కుటుంబానికి ఒక పూటకి సరిపడా బియ్యం వస్తాయి.

యాదమ్మ ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి. భర్తతో తన నిర్ణయం చెప్పింది.

"రోజూ తొమ్మిదిగంటలకు నన్నూ, రాంపండుని తణుకులో దింపి నీ డ్యూటీకెళ్ళిపో. నేను వాడిని ఆ స్కూలుకి తీసుకెళ్ళి మాష్టారితో ఒక గంట పాఠాలు చెప్పించి ఇంటికి తీసుకువస్తాను. నువ్వు ఆ టైంకి ఖాళీగా ఉంటే మమ్మల్ని ఇంటి దగ్గర దింపుదువుగాని. లేకపోతే నేనే వాడిని చంకనేసుకుని నడుచుకుంటూ వచ్చేస్తాను.

"తొమ్మిది కిలోమీటర్లు నడిచి వస్తావా...?" ఆశ్చర్యంగాఅడిగాడు రాజయ్య.

"ఆ! నడిచే వస్తాను. నా రాంపండుకి మాటలు రావడం కోసం తొమ్మిది వేల కిలోమీటర్లయినా నడుస్తాను." స్థిరంగా చెప్పింది యాదమ్మ.

ఆమె ఆత్మ విశ్వాసానికి, రాంపండు మీద ఆమెకున్న అవ్యాజమైన మాతృప్రేమకు ముగ్ధుడయ్యాడు రాజయ్య.

"అమ్మీ! నువ్వు చెప్పినట్లే చేద్దాం. ఇంటిదగ్గర మన పిల్లల్ని కనిపెట్టుకొని ఉండమని సూరమ్మవ్వకు చెబుదాం. ఏ తల్లి కన్నబిడ్డడో! మనకు దొరికాడు. వాడిని మాటలురాని మూగాడిగా.. ".

"వద్దయ్యా! అట్టా అనమాకు. కలలో కూడా వాడు "మూగాడని" అనమాకు నా బంగారు తండ్రి సక్కగా మాటాడుతాడు. పెద్ద పెద్ద చదువులు చదివి గొప్ప ఉద్యోగం చేస్తాడయ్యా. నాకా నమ్మకం ఉంది" కళ్ళమ్మట నీరు కారుస్తూ గద్గదస్వరంతో అంది యాదమ్మ.

ఆమె కన్నీళ్ళు తుడిచాడు రాజయ్య తన తుండుగుడ్డతో.

"అమ్మీ! నువ్వు మరీ దిగాలు పడుతున్నావు. ఇలాగే ఉంటే నీ ఆరోగ్యం సెడుద్ది. అప్పుడు ఆడిని ఎవరు చూస్తారు. ఆ... " అని కూకలేసాడు రాజయ్య. చీర చెంగుతో కళ్ళు పూర్తిగా తుడుచుకుని ఇంట్లోకి వెళ్ళి వంట ప్రయత్నం మొదలెట్టింది.

రాజయ్య, యాదమ్మలకి ఇద్దరు మగపిల్లలు రాజు, రవి. పెద్దాడు రెండవతరగతి, చిన్నాడు ఒకటవతరగతి చదువుతున్నారు. పొద్దున్న, రాత్రి ఇంట్లో తింటారు. మధ్యాహ్నం స్కూల్లోనే భోజనం పెడతారు. రాజయ్య రిక్షామీద వచ్చే డబ్బులన్నీ యాదమ్మకే ఇస్తాడు. అతనికి దురలవాట్లు ఏంలేవు. ప్రొద్దున్న ఒకసారి, రాత్రి ఒకసారి చుట్టమాత్రం కాలుస్తాడు.

యాదమ్మ కూలిపనికి వెళ్ళి డబ్బులు తెస్తుంది. పిల్లలిద్దరి పేరు మీదా ఆర్.డి.ఎక్కౌంట్లు ప్రారంభించి నెలనెలా ఏభైరూపాయలు పోస్టాఫీసులో వేస్తోంది. సాఫీగా సాగిపోతున్న వారి కుటుంబంలో అకస్మాత్తుగా వచ్చి చేరాడు రాంపండు. ఒక్కనిముషం కూడా వదలకుండా తన వెంట తిరిగే రాంపండు అంటే యాదమ్మకు వల్లమాలిన ప్రేమ. ఎవరైనా రాంపండుకి "ఇంకా మాటలు రావా" అని అడిగితే "ఈ మధ్యన చాలా మందికి ఆరేళ్ళు వస్తేగానీ మాటలు రావడం లేదంట" మా తమ్ముడు చెప్పాడు అని దబాయించేది.

పంతులుగారి చేత ముహూర్తం పెట్టించి రాంపండుని తీసుకెళ్ళి స్పీచింగ్ ఇనిస్టిట్యూట్‌లో చేర్పించింది యాదమ్మ. రెండురోజులు రాంపండు ఎవరిదగ్గరకూ వెళ్ళలేదు. యాదమ్మ కొంగుపట్టుకునే ఉండేవాడు.అతనికి బొమ్మలు ఇచ్చి రకరకాల జోక్స్ చెప్పి తనవద్దకు వచ్చేటట్లు చేసుకున్నాడు జోగారావు.

పూసలు దండలా గుచ్చడం, గోధుమపిండితో ఉండలు చేయించడం అగ్గిపెట్టెలోని పుల్లలన్నీ కిందవేసి మరలా వాటిని పెట్టెలో పెట్టించడం వంటివి రాంపండుతో చేయించేవాడు జోగారావు. రోజూ ఆయుర్వేద తైలనాన్ని రాంపండు గొంతుకి రాసి 'మసాజ్' చేసేవాడు. తేనె వాడి నాలుకపై వేసి యాదమ్మ చేత నాలుకంతా రాయించేవాడు.

రోజూ ఉదయాన్నే ఉత్తరేణి పుల్లలతో పళ్ళుతోముకుని రాంపండుకి చెప్పి, గరుకుగా ఉన్న గచ్చుమీద సుద్దముక్కతో అక్షరాలు రాసి రాంపండు చేతివేలిని గట్టిగా పట్టుకుని దిద్దించమని యాదమ్మకి చెప్పాడు జోగారావు.

రాంపండు ఇనిస్టిట్యూట్లో చేసేపనులన్నీ మళ్ళీ ఇంటిదగ్గర రాంపండు చేత చేయించేది యాదమ్మ. రాజయ్య రిక్షా కిరాయి డబ్బుల్లోంచి రోజూ ముప్ఫై ఐదురూపాయలు తీసి ఒక డబ్బాలో దాచేది. నెలాఖరున వాడి ఫీజు కట్టడానికి తేలికగా ఉంటుందని.

రోజూ ప్రొద్దున్నే రిక్షాలో యాదమ్మని, రాంపండుని తణుకు తీసుకువచ్చి దింపేవాడు రాజయ్య పదకొండు గంటలు దాటాక కిరాయి లేకపోతే స్పీచింగ్ ఇనిస్టిట్యూట్‌కి వచ్చి వాళ్ళిద్దర్నీ తీసుకుని ఇంటికి వచ్చేవాడు. భోంచేసి మళ్ళీ తణుకు వెళ్ళిపోయేవాడు.

రాజయ్యకు ఏదైనా కిరాయి దొరికి పదకొండు దాటాకా రాకపోతే యాదమ్మే రాంపండుకి చంకనేసుకుని తొమ్మిది కిలోమీటర్లు నడిచి వచ్చేది. ముక్కామల వచ్చే ఆటోల్లో ఖాళీఉంటే ఎవరైనా ఆగి వాళ్ళిద్దర్నీ ఎక్కించుకునేవారు. లేకపోతే నడిచి ఇంటికి వచ్చేది.

రాంపండు కోసం యాదమ్మ పడుతున్న శ్రమని చూసి ఊరంతా ఆశ్చర్యపోయేవారు. కడుపున పుట్టిన బిడ్డల్ని డబ్బులకోసం కాఫీహోటళ్ళలో షాపుల్లో పనులకు పంపే తల్లితండ్రులున్న ఈ సమాజంలో, పేగు తెంచుకు పుట్టకపోయినా, దేవుడిచ్చిన పెన్నిధిగా భావించి రాంపండుకోసం రెక్కలు ముక్కలు చేసుకుంటున్న యాదమ్మ విశాలహృదయాన్ని అందరూ అభినందించేవారు.

రెండు నెలలు గడిచేసరికి రాంపండు రాజయ్యని 'నాన్నా' అని, సూరమ్మవ్వని 'మామ్మా' అని పిలవసాగాడు. జోగారావు కూడా రాంపండు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించేవాడు. చెన్నయ్ నుండీ వచ్చిన డాక్టర్ మధుస్మిత రాంపండుని పరీక్షించి జోగారావుకి మరికొన్ని సూచనలు చెప్పింది.

ఆరునెలలు తిరిగేసరికి రాంపండు సంఖ్యలు చెప్పడం, తెలుగులో అమ్మ,ఆవు, వంటి రెండక్షరాల పదాల్ని చెప్పడమే గాక పలకపై రాసి చూపించాడు.

ఒకరోజు జోగారావు యాదమ్మని ఆఫీసులోకి పిలిచాడు.

"చూడమ్మా! రాంపండు నెమ్మది, నెమ్మదిగా పుంజుకుంటున్నాడు. వాడు మిగతా పిల్లల్లా రాణించాలంటే మీరు ఇంకొక ఏడాది ఇక్కడికి రావలసి ఉంటుంది. మీ ఆర్థిక పరిస్థితి చూస్తే నాకు జాలేస్తోంది. మా ఇనిస్టిట్యూట్‌లో కూడా పిల్లలు ఎక్కువగా చేరడంలేదు. నా పరిస్థితీ అంతంత మాత్రంగానే ఉంది. డాక్టర్ మధుస్మిత చెన్నయ్‌లోని వారి ఇనిస్టిట్యూట్‌కి వచ్చేయమంటున్నారు. ఇరవైవేలు జీతం ఇస్తామంటున్నారు. రాంపండు కోసం నువ్వుపడుతున్న కష్టాలు చూస్తుంటే నేను కూడా నా వంతు సాయం చేయాలనిపిస్తోంది.

ఈ దశలో రాంపండుకి ట్రీట్‌మెంట్ ఆపేస్తే వాడిస్థితి స్థితికి దాటి ముందుకుపోదు. అందుకే నేను నా ప్రయాణం విరమించుకుంటున్నాను. రాంపండుకి మాటలు పూర్తిగా వచ్చాకా, ఆరోగ్యవంతుడయ్యాకనే నేనూ నా ప్రయాణం సంగతి ఆలోచిస్తాను. ఈ కేసుని నేను ఛాలెంజింగ్‌గా తీసుకున్నాను."

ఊపిరి తీసుకోవడానికి ఒక్క నిముషం ఆగాడు జోగారావు.

యాదమ్మ చటుక్కుని వంగుని అతని కాళ్ళకు మొక్కింది.

"అయ్యయ్యో! ఇదేమిటమ్మా! నువ్వు చేస్తున్న త్యాగంలో నేను చేస్తున్నదెంత? అవునూ మొన్న వర్షాలొచ్చిన నాలుగురోజులూ నువ్వే రాంపండుని రిక్షాలో తీసుకొచ్చావన్నారు. నిజమేనా ?"

"అవును అయ్యగారూ! రాజయ్యకి జ్వరం వచ్చింది. మూసిన కన్ను తెరవకుండా పడుకున్నాడు. ఎవర్ని బతిమాలతాను చెప్పండి. అందుకని నేనే రిక్షా తొక్కుకుంటూ ఆ నాలుగురోజులూ రాంపండుని మీ దగ్గరకు తీసుకొచ్చాను. పెళ్ళైన కొత్తలో సరదాగా నేర్చుకున్నాను రిక్షా తొక్కడం అది ఈ విధంగా ఉపయోగపడింది."

మాతృత్వ మహోన్నత శిఖరంపై నిలిచిన యాదమ్మకు మనసులోనే జోహార్లు చేసాడు జోగారావు.

✡✡✡

కాలచక్రంలో రెండు సంవత్సరాలు గిర్రున తిరిగాయి. యాదమ్మ కృషి ఫలించింది. జోగారావు అకుంఠిత దీక్ష. రాంపండులోని పట్టుదలకుతోడై నిలిచి రాంపండు మామూలు పిల్లాడిలా ధారాళంగా మాట్లాడుతున్నాడు. గ్రామంలోని అందరూ యాదమ్మకు తోడుగా నిలిచారు.

రాంపండు స్కూలులో చేరి పాఠాలు నేర్చుకోవడమే కాదు మాష్టారు చెప్పిన పాఠాన్ని పుస్తకం చూడకుండా తిరిగి అప్పచెప్పుతున్నాడు. తొమ్మిదవ ఏటనే ఏడవ తరగతి పరీక్ష రాసి రికార్డు నెలకొల్పిన రాంపండు పదకొండవ ఏట ప్రభుత్వం ప్రత్యేక అనుమతితో పదవతరగతి పరీక్షలకు హాజరై జిల్లా ప్రధముడిగా విజయం సాధించాడు.

టి.వి.ఛానల్సు రాంపండుని ఇంటర్వ్యూ చేసి విశేషప్రచారం చేసాయి.

"మీ ముగ్గురు పిల్లల్లో పెద్దవాళ్ళిద్దరూ సామాన్య తెలివితేటలతో ఉండగా ఆఖరి పిల్లాడు ఇంత చురుగ్గా ఎలా ఉన్నాడని...?" యాదమ్మని టీ.వి యాంకరు ప్రశ్నించింది.

"రాంపండు నా కడుపున పుట్టిన బిడ్డకాదమ్మా. ఆ దేవుడు నాకిచ్చిన బిడ్డ. ఎనిమిది సంవత్సరాలక్రితం తణుకులో గణపతి సంబరాలకు వెళ్ళినప్పుడు, తల్లిదండ్రుల నుండి తప్పిపోయి ఏడుస్తున్న రాంపండు కనిపించాడు. రెండుగంటలకు పైగా చూసాం, ఎవరైనా పిల్లవాడికోసం వస్తారేమోనని. ఎవరూ రాలేదు. పోలీసుల అనుమతితో మా ఊరు తీసుకొచ్చాం. అప్పటినుండీ మా దగ్గరే పెరుగుతున్నాడు. ఏ బంగారు తల్లి కన్నబిడ్డ ఈ రాంపండు. ఏ పుణ్యదంపతుల బిడ్డనీ, నీ బిడ్డగా చెప్పుకుని నేను వారికి అన్యాయం చేయలేను. ఈ అపురూపమైన మొక్కని పెంచుతున్న తోటమాలిని మాత్రమే నేను. రాంపండు మా ఇంట్లో ఉండడం వలన మాకందరికీ పేరు వచ్చింది. గౌరవం పెరిగింది."

యాదమ్మ నిజాయితీకి, మానవత్వానికి టీ.వి.ఛానలువారుకూడా హృదయపూర్వకంగా అభినందించారు. స్థానికంగా ఉన్న రోటరీక్లబ్ రాంపండు ఉన్నత చదువుని స్పాన్సర్ చేయడానికి ముందుకు వచ్చింది.

వారం రోజులు గడిచాకా యాదమ్మ ఇంటిముందు ఖరీదైన కారు వచ్చి ఆగింది. అందులో నుండి బ్యాంక్ ఆఫీసరు రాజారావు, అతని భార్య లక్ష్మి, ఎస్.ఐ. సుధీర్ దిగారు.

ఎస్.ఐ.ని చూడగానే యాదమ్మ, రాజయ్య కంగారు పడ్డారు. ఎస్.ఐ. రాజయ్య దగ్గర కొచ్చి "బాగున్నావా?" అని అడిగాడు. మౌనంగా తలూపాడు రాజయ్య

"రాజయ్యా! నువ్వు పెంచుకుంటున్న రాంపండు తల్లీతండ్రీ వీళ్ళిద్దరూ. ఈయన బాంక్ ఆఫీసరు రాజారావు, ఈమె ఆయన భార్య లక్ష్మి. టీ.వీలో మీ రాంపండు ఇంటర్వ్యూ చూసి నిన్న వచ్చి నన్ను కలిసారు. పిల్లవాడి చిన్నప్పటి ఫొటోలు, బర్త్ సర్టిఫికెట్ అన్ని ఆధారాలతో వచ్చారు. వాళ్ళ అబ్బాయిని వాళ్ళు తీసికెళ్తారట. ఇన్నాళ్ళూ మీరు వాడిని పెంచినందుకు లక్షరూపాయలు చెక్కుకూడా మీకు ఇస్తామన్నారు."

యాదమ్మకి ఎస్.ఐ చెబుతున్న మిగతా మాటలు వినిపించలేదు. 'వాళ్ళ అబ్బాయిని వాళ్ళు తీసుకెళతారట' అనే విషయం బోధపడగానే ఆమె తలలో పెద్దహోరు మొదలయ్యింది. ఒక్కసారిగా నేలమీద కూలబడిపోయి కళ్ళమ్మట జలజలా కన్నీరు కార్చింది. రాజయ్య ఆమెను ఓదార్చసాగాడు.

✡✡✡

"అమ్మీ! మనది కాని వస్తువు మీద మనకు హక్కు లేనట్లే, మన బిడ్డ కాని బిడ్డపై మనకు ఏం హక్కు ఉంటుంది?"

రాంపండు దగ్గరకు వచ్చారు రాజారావు, లక్ష్మి.

'బాబూ! నేను మీ అమ్మనిరా' అని లక్ష్మి అంటే 'నేను మీ నాన్ననురా' అని రాజారావు రాంపండు రెండు చేతులూ పట్టుకున్నారు. వాళ్ళని విసిరి కొట్టి యాదమ్మ దగ్గరకు వెళ్ళిపోయాడు రాంపండు.

రాజారావు నెమ్మదిగా రాంపండు దగ్గరకు చేరి అనునయించబోయాడు. రాంపండు తీక్షణంగా రాజారావుకేసి చూసాడు.

"ఇన్ని సంవత్సరాలలో నేను మీకెప్పుడూ గుర్తుకురాలేదా"

రాంపండు ప్రశ్నకు ఒక్కసారిగా నివ్వెరపోయాడు రాజారావు. అంతలోనే సర్దుకున్నాడు.

"నిన్ను మరిచిపోతే కదా బాబూ, గుర్తులేకపోవడానికి"

"మరి ఆ రోజు నన్నెందుకు వదిలించుకున్నారు?"

రాంపండు మాటలకు అందరూ అవాక్కయ్యారు ఒక్కసారిగా.

"ఏమిటి బాబూ, నువ్వు మాట్లాడేది....?"

"అవును. ఇది పచ్చి నిజం. ఆరోజు సంబరంలో బుట్టబొమ్మల్ని చూస్తున్న నన్ను హఠాత్తుగా వదిలేసి మీరు వెళ్ళిపోవడం నాకింకా గుర్తుంది. నేను మాటలురాని మూగవాడిగా ఉంటే మీ స్టేటస్‌కి భంగమని నన్ను వదిలించుకున్నారు. చొక్కా మీద పడిన పురుగును దులిపేసినట్లు, నన్ను నడివీధిలో వదిలేసి, తండ్రి బాధ్యతను దులిపేసుకున్నారు. ఆ భగవంతుడు పంపిన దేవదూతల్లా యాదమ్మా, రాజయ్య నన్ను అక్కున చేర్చుకున్నారు. లేకపోతే నా పరిస్థితి ఏమిటి? ఏ గుడి మెట్ల మీదో, ఏ బస్టాండులోనో అడుక్కుంటూ జీవించవలసి వచ్చేది."

"బాబూ! మా మాట విను" అభ్యర్థించాడు రాజారావు

"వద్దు. నన్ను ఆపకండి. నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. మాటలు రాని నన్ను కన్నబిడ్డకంటే ఎక్కువగా ఆదరించారు వీళ్ళు. నాకు మాటలు రావాలని దేవుళ్ళకు మొక్కుకున్నారు. డాక్టర్ల కాళ్ళు పట్టుకున్నారు. నాకు మాట వస్తుందని కొండంత ఆశతో పీర్లపంజా వద్ద నిప్పుల గుండంలో నడిచిందీ, నాకోసం వర్షంలో తొమ్మిది కిలోమీటర్లు రిక్షా తొక్కి, నన్ను కడుపులో దాచుకుని పెంచిందీ... ఈ అమ్మే..

ఈమె యాదమ్మ కాదు. వేదమ్మ. నాకు జీవన వేదం బోధించిన మహోన్నత మూర్తి. నేను ఒక్కో అక్షరం పలుకుతుంటే ఒక్కో లోకాన్ని జయించినంత ఆనందం ఆమె కళ్ళల్లో నాకు కనిపించేది. తను కడుపుని మాడ్చుకుని నా కడుపు నింపేది. తన రక్తాన్ని ధారపోసి నాకు పునర్జన్మ నిచ్చింది.

మీరు ఎలా చూసారు నన్ను? ఈ మూగవెధవ దాపురించాడేమిటే మనకు" అని ఈసడించుకునేవారు.

త్యాగ బుద్ధితో, మానవత్వంతో నన్ను మనిషిని చేసిన ఈ మహనీయుల సరసన నిలబడటానికి కూడా మీకు అర్హత లేదు. దయచేసి వెళ్ళిపొండి. వీళ్ళు నావాళ్ళు. వీరినుండి నన్ను వేరు చేసే ప్రయత్నాలు మానుకోండి. తెలివైన బిడ్డకు తల్లిదండ్రులం మేమేనని ప్రచారం చేసుకోవడానికి చాలా శ్రమపడి వచ్చారు.

ఎస్.ఐగారూ! నేను మనస్ఫూర్తిగా చెపుతున్నాను. నేను ఈ ఊళ్ళోనే ఉంటాను. వీళ్ళదగ్గరే ఉంటాను. మీరు తీసుకొచ్చిన వారి వెంట వెళ్ళను. ఇది నా నిర్ణయం."

ఎస్.ఐ సుధీర్ సలహా మేరకు రాజారావు, లక్ష్మి భారంగా వెనుతిరిగారు.

రాజయ్య, యాదమ్మ రాంపండుని కౌగలించుకుని ఆనందంతో ఉప్పొంగిపొయ్యారు. చేతికర్ర ఆసరాతో వచ్చి సూరమ్మవ్వ కూడా రాంపండుని మనసారా దీవించింది.

✡✡✡

## మీ వాళ్ళే — గుండు నారాయణరావు



నాకు ప్రొద్దుట లేచిన దగ్గర నుండీ అసహనంగా ఉంది. పిల్లలు స్కూలు బస్‌స్టాప్ దగ్గర దింపమన్నందుకు కాదు ఉదయం వాళ్ళు రానందుకు కాదు. హైదరాబాదులో నీళ్ళ కొరత కొత్తదేమీ కాదు. మాకు ఉన్న అన్ని అపార్ట్‌మెంట్స్‌కు బోర్ నీళ్ళు సరిపోవు. టాంకర్ల ద్వారా తెప్పించవల్సిందే ఒక్కొక్క రోజు సంప్ నుండీ వాచ్‌మేన్ పంప్ ఆన్ చెయ్యడు అందువలన వాడిని అరిచి పంప్ ఆన్ చేయించవలసి వచ్చింది. అది కూడా నన్ను అంతగా అప్‌సెట్ చెయ్యలేదు. వాడిని అలా అరవటం నెలకు రెండుమూడు సార్లయినా అవుతుంది. ఆ ముసలి వాచ్‌మేన్‌కు మతిమరుపు ఎక్కువ. అతను అతని కూతురుతో బేస్‌మెంటులోని చిన్న రూములో ఉంటాడు. తిట్టినా అతను ముఖం మాడ్చుకోడు. అతనిలో ఆ రియాక్షన్ లేకపోవటానికి జీవితాంతం కలిగిన ఆటుపోట్లు కావచ్చు. భర్త వదిలేసిన అతని కూతురు అతనికి వండిపెడుతూ ఉంటుంది.

బేస్‌మెంట్ నుండీ పైకి రావటానికి ఎలివేటర్ పని చెయ్యలేదు. ఎంతో డబ్బు పోసి పంజా గుట్ట దగ్గర కొనుక్కున్న అపార్ట్‌మెంట్ అది. ఈ ఎలివేటర్ అప్పుడప్పుడు పనిచెయ్యదు. అదికూడా నన్ను బాధించలేదు. ఫిజికల్‌గా నేను చాలా ఫిట్‌గా ఉంటాను. సునాయాసంగా పైకి వచ్చాను. ఆ మూర్తి మాటలే నన్ను బాధిస్తూ ఉన్నాయి.

మూర్తి కాలిఫోర్నియా సన్నీవేల్‌లో పనిచేస్తుంటారు. పిల్లలను దింపి వచ్చిన తర్వాత మూర్తికి కాల్‌చేసాను. మూర్తి సన్నీవేల్‌లో ఒక పెద్ద కంపెనీకి వైస్‌ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థికంగా బాగా గడించాడు. అక్కడ ఉన్న దేవాలయాల్లో కొన్నిట్లో ట్రస్టీగానూ, ఉన్న చాలా తెలుగు సంఘాల్లో వేరు వేరు పదవుల్లో ఉన్నాడు. ఆర్థికంగా డొనేషన్స్ వాటికి ఇస్తుంటాడు. నేను నా కంపెనీ తరపున సన్నీవేల్‌లో రెండు నెలలు పనిచేయవలసి వచ్చింది. అప్పుడు అక్కడ పరిచయం అయింది. మా ఊరు వాళ్ళ అత్తగారి ఊరి దగ్గర అవడం వల్లనో లేక ఇద్దరిదీ ఇండియాలో చదివింది ఒకే కాలేజీ అవటం వల్లనో మా పరిచయం త్వరలోనే ఫ్రెండ్‌షిప్‌గా మారింది. అందువలన అప్పుడప్పుడు నేను కాల్ చెయ్యడమే లేక అతను నాకు కాల్ చెయ్యడమో అవుతూ ఉంది. అక్కడ అయిన మిగిలిన ఫ్రెండ్స్ ఈమెయిల్ చేసుకుంటూ ఉంటాము. మొదట్లో వాళ్ళు ఫోన్ చేసి మాట్లాడుతుండేవాళ్ళు. తర్వాత ఈమెయిల్స్‌తో కాంటాక్ట్ పెట్టుకున్నారు.

నేను ఎప్పటిలాగానే మూర్తికి ఈ రోజు ఫోన్ చేసాను. అతను యధాలాపంగా మాట్లాడుతూ అతనికి పరిచయమైన ఒక ఫ్యామిలీ గురించి మాట్లాడాడు. 'వాళ్ళు మావాళ్ళేనోయ్' అన్నాడు. తర్వాత ఏదో మాట్లాడాడు. వాటన్నింటి మీదా ధ్యాస పెట్టలేకపోయాను.

పైకి రాగానే మా ఆవిడ పిల్లల చదువు గురించి కంప్లైంట్ ఇస్తున్నది. అమ్మాయి బాగానే చదువుతుంది కానీ అబ్బాయి గురించి సంతృప్తి లేదు ట్యూషన్ పెట్టించాలని అంటుంది. 'నీవు కనుక్కో' అన్నాను. ఒక్కసారిగా ఆవిడ గొంతు లేపింది. 'నేనా! నీకు తెలుసుగా నేను ఈ ప్రాజెక్టు మీద ఎంతో టైం వెచ్చించాల్సి వస్తున్నది. మీ ఫ్రెండ్స్ ద్వారా కనుక్కోవచ్చుగా మంచి ట్యూషన్ మాస్టర్స్ ఎక్కడ ఉన్నారో' అన్నది.

నేను స్కూల్లో చదువుకునే రోజుల్లో ఇంత స్ట్రెస్ లేదు. ఆడుతూ పాడుతూ చదువుకున్నాను. ఇంజినీరింగ్‌లో సీటు సునాయాసంగానే వచ్చింది. ఇంజినీరింగ్ జాగ్రత్తగా చదివాను. జాబ్‌లో ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఉన్నాను. కానీ ఇప్పటి పిల్లలకు చాలా పుస్తకాలతో, చాలా హోంవర్క్‌లతో ప్రెషర్ ఎక్కువగా ఉంటున్నది. మా ఆవిడ తీరికగా ఉన్నప్పుడు శ్రద్ధతీసుకుంటుంది. ఇప్పటి ప్రపంచంలో ఇమడాలంటే అవన్నీ తప్పవు కాబోలు. పిల్లలు ఆడుకోవటానికి జాగా లేదు వీడియో గేమ్స్‌తోనే ఆడుకోవలసివస్తున్నది. ఎప్పుడైనా వస్తే నా చెల్లెలు పిల్లలతో కూడా ఇలాంటి వీడియో గేమ్స్ మాత్రమే ఆడతారు. కాంప్లెక్సులోని ఇతర పిల్లల పరిస్థితి కూడా ఇదే అనుకుంటాను "సరేలే నేను చూస్తాను" అన్నాను.

నా కంప్యూటర్ ఈమెయిల్ ఫ్లాష్ అయింది. అంటే ఆఫీస్‌లో ఎవరో కాంటాక్ట్ చేస్తున్నారు. వెళ్ళి దానికి రిప్లై ఇచ్చాను. నేను కంప్యూటర్ కంపెనీలో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నప్పటికీ, ఈ యంత్రాల పరిభాష మనిషి జీవితాన్ని నిర్దేశించడం నాకు సహించటం లేదు. సెల్‌ఫోన్‌తో కార్ డ్రైవ్ చేస్తూ ఎప్పుడో నాకు మిగిలిన కొద్ది ఫ్రెండ్స్‌తో మాట్లాడగలుగుతున్నాను. చాలా మందితో ఈ మెయిల్స్‌తో మాత్రమే కాంటాక్ట్‌లో ఉన్నాను. బంధువులను ఏదో పెళ్ళిళ్ళలో మాత్రమే కలుసుకుంటాను. జీవితాలలో పెరిగిన వేగం అవసరమనిపిస్తుంది. మా నాన్నగారి రోజులలో జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలు ఇప్పుడు లేవు. మనస్సు విప్పి మంచిగా వ్రాసిన ఉత్తరాలు ఇప్పుడు మచ్చుకైనా కనిపించవు. నేను సన్నీవేల్‌ల్లో ఉన్న రెండూనెలల్లో మా ఆవిడకు ఒక్క ఉత్తరం మాత్రమే వ్రాసింది. ఈమెయిల్స్, ఫోన్స్ మాత్రమే మమ్మల్ని కలిపేవి. ఆ వ్రాసిన ఉత్తరం అపురూపం అనిపించింది.

త్వరగా తయారై కారులో నా ఆఫీస్‌కు బయలుదేరాను. ఇందాక వచ్చిన ఈ మెయిల్ గురించి కాసేపు ఆలోచించాను. దానిలో వ్రాసిన ప్రోబ్లమ్‌కు సొల్యూషన్ దొరికినట్లనిపించింది. మరల మూర్తి మాటలు చికాకు పరుస్తున్నాయి. అమీర్‌పేటలో ఉదయం 9గంటలకే కార్లు, ఇతర వాహనాలతో కిటకిటలాడుతూ ఉంది. కార్ల హారన్ మోతలతో హోరెత్తిపోతున్నది. ట్రాఫిక్ పోలీస్ హడావిడి, అతని విజిల్ మోతలు ఇంకా చికాకు కలిగిస్తున్నది. కార్ విండోస్ మూసి ఉన్నా ఆ సౌండ్స్ తలనొప్పి తెప్పిస్తున్నాయి. ఆటోవాళ్ళు, ఇతర కార్లు వాళ్ళ సైడ్ నుండీ ఈ సైడ్‌కు రావటం వలన నా వైపు ట్రాఫిక్ మూవ్ కావటం లేదు. అరగంటలో వంద మీటర్లు మాత్రమే పోయి ఉండవచ్చు. ఎవరో మోటర్ బైక్ వాడు నా కారును గుద్దేసి పోతున్నాడు. కారు విండోస్‌ను దింపి వాడిని ఆగమని అరిచాను. ఈలోపులో వాడు గుంపులో కలిసిపోయాడు. తప్పకుండా కారుకు డెంట్ పడిఉంటుంది. వాడి బండి నెంబర్ నోట్ చేసుకోలేదు. ఫ్రెండ్సంతా హోండా సిటీ కొనమంటే ఎక్కువ డబ్బు పెట్టి కొన్నాను. దానికి డెంట్ అంటే చాలా ఖర్చు అవుతుంది. గొంతు పచ్చిగా అనిపించింది. ఇందాక కిటికీ తెరిచినప్పుడు బయట గాలిలోని దుమ్ము పొగ నోట్లోకి వచ్చింది. నా వైఫ్ హోండా కారుకు కూడా కొన్ని డెంట్స్ పడ్డాయి. కాని వాటిని సరిచేయించలేదు. ఇద్దరం ఇంజినీర్లు అయినా డబ్బు బానే వస్తున్నప్పటికీ కార్లు, అపార్ట్‌మెంట్ పేమెంట్స్‌కి సరిపోతున్నాయి. కొంచెం గొప్పో మిగిలితే సంవత్సరానికి ఒకసారి వెకేషన్‌కు వెళ్ళిరావటానికి సరిపోతున్నాయి.

మా స్వగ్రామం రాజమండ్రిలో మా అమ్మానాన్న ఉంటున్నారు. కొద్దిగా ఉన్న పొలంలోని ఆదాయం, పెన్షన్ వాళ్ళకు సరిపోతున్నాయి. నా చెల్లెలకు డబ్బు సర్దమని మా అమ్మ చెపుతూ ఉంటుంది. మా బావ కాలేజ్‌లో లెక్చరర్‌గా స్కూటర్‌మీద వెళతాడు. కారు కొనడానికి డబ్బులు సర్దమని మా చెల్లెలుతో చెప్పిస్తూ ఉంటాడు. వంటరిగా ఉన్నప్పుడు డబ్బులు అప్పుడప్పుడూ ఇస్తూ ఉండేవాడిని. పెళ్ళి అయిన తర్వాత ఖర్చులు ఎక్కువయి ఇవ్వడం తగ్గించాను. పిల్లలు పుట్టిన తర్వాత మొత్తం తగ్గించాను. ఇదివరిలో ఉన్న

ఆప్యాయత చెల్లెలి గొంతులో కనిపించదు. ‘మీరు అపార్ట్‌మెంట్ కొన్నారటకదా, క్రొత్తకారు కొన్నారట కదా‘ అని యధాలాపంగా అడిగినా అందులో ఏదో దెప్పిపొడుపు కనిపిస్తూ ఉంటుంది. హైదరాబాద్‌నుండీ దాని పిల్లలు అవీ ఇవీ తెమ్మంటూ ఉంటుంది. డబ్బులే కాకుండా ఈ షాపింగ్ తలనొప్పుల గురించి అన్నిసార్లు పట్టించుకోను. ఆప్యాయతలు అన్నీ డబ్బులో ఉన్నాయా! డబ్బు ప్రమేయం లేకుండా మనుష్యులు కలిసికట్టుగా ఉండలేరా అనిపిస్తుంది.

నేను వరంగల్‌లో ఇంజినీరింగ్ చదివేటప్పుడు అద్దె ఇంట్లో అన్నం వండుకుంటూ ఫ్రెండ్స్‌తో కలిసి తిరగటంలో ఉన్న ఆనందం ఇప్పుడు కార్లు, ఫ్లాట్‌లో ఉంటున్నప్పటికీ లేదు. అప్పుడు స్నేహితుల మధ్య స్నేహం డబ్బుతో ముడిపడిలేదనిపించింది. నా పరిస్థితి మారిందా, నేను మారానా లేక కాలం మారిందా? అర్ధం కావడం లేదు. మనుషుల మధ్య అంతరం పెరుగుతూ ఉంది. దానికి కారణం ఎలక్ట్రానిక్ కమ్యునికేషనా  లేక ఆర్థిక సంస్కరణలా? నా ఫ్రెండ్ ఒకడు అన్నట్లు అందరం ఒంటరిగా కలిసి బ్రతుకుతున్నాం.

ట్రాఫిక్ కొంచెం కదిలి 200 మీటర్లు స్లోగా వెళ్ళింది వెంటనే మరల ఆగిపోయింది. ఇంతమంది జనం ఎక్కడ నుండీ వచ్చారనిపిస్తుంది. జనసమూహంలో అంతా హడావిడిగా వెళుతున్నారు. ఇంతమందికి ఇన్ని పనులున్నాయా అనిపిస్తుంది. ఊళ్ళో చిన్నప్పుడు ఉన్న జీవితంలోని ప్రశాంతత,  హాయి ఇందులో ఎక్కడుంది?. నా ఫ్రెండ్స్ ఊళ్ళో వ్యవసాయం చేసుకుంటూ హైదరాబాద్‌లో ఉంటానని వాళ్ళు నా గురించి గొప్పగా మాట్లాడుకుంటూ ఉంటే నాకు నవ్వు వస్తుంది.

మొన్న ఇంటి దగ్గర నాకు, మా నాన్నకు మధ్య జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది.

మా నాన్న పెన్షన్ కు సంబంధించిన పనిమీద ఇంటికి వచ్చాడు. ఆయన టీచర్‌గా రిటైర్ అయ్యాడు. మేము స్థిరపడ్డ ఊర్లోనే ఉద్యోగం చేసేవాడు. ఉదయం నడుచుకుంటూ వెళ్ళేవాడు. మధ్యాహ్నం భోజనానికి వచ్చేవాడు. సాయంత్రాలు కబుర్లు, కాలక్షేపాలతో మంచిగా స్నేహితులతో గడిపేవాడు. ట్యూషన్స్ చెప్పేవాడు కాదు. ఎక్కువగా సంపాదించుకోలేదు పెద్దల ఆస్థిని హరింపచేయలేదు. స్కాలర్షిప్పులతో గవర్నమెంట్ కాలేజీలో ఇంజినీరింగ్ నేను చేయడం వలన అతనికి ఆర్థిక భారం పడలేదు. కొద్దిపాటి సేవింగ్స్‌తో మా చెల్లెలి పెళ్ళి చేయగలిగాడు. నా చెల్లెలు అందంగా ఉండటంతో కట్నం లేకుండా పెళ్ళి అయింది. మా అమ్మా నాన్నలది చాలా రిలాక్స్‌డ్ లైఫ్. తీరిగ్గా లేవడం, పేపర్‌ను రెండుగంటలసేపు చదవడం, కబుర్లు కాలక్షేపాలతో వాళ్ళకు బాగానే పొద్దుపోయింది. వాళ్ళు అప్పుడప్పుడు రెండు మూడు నెలల కోసం వచ్చినా వేరే పనులు పెద్దగా పట్టించుకోరు. నేను రోజూ రెండొందల ఈమెయిల్స్‌కు జవాబు వ్రాయాలి. ఇంకో వైపు ఫోన్ కాల్స్ ఆన్సర్ చెయ్యాలి. ప్రాజెక్ట్ గురించి, మా సహచరుల సహకారం గురించి ఎన్నో చర్చలు చేస్తుండాలి. డ్రైవ్ చేస్తున్నప్పుడు కూడా ఆఫీసుకు సంబందించిన కాల్స్ ఆన్సర్ చెయ్యాలి. రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత అప్పుడప్పుడు ఆఫీసుకు సంబంధించిన, అమెరికా నుండీ వచ్చే బిజినెస్ కాల్స్‌కు ఆన్సర్ చెయ్యాలి. జీతాలు పెరిగినప్పటికీ అంతకు మించిన బాధ్యతలు పెరిగాయి.

రోజులూ, వారాలూ, నెలలు ఎంత త్వరగా గడిచిపోతాయో అర్ధం కాదు. మా ఆవిడ పరిస్థితీ అంతే. తను ఐ.ఐ.టీలో ఇంజినీరింగ్ చేసింది. మధ్య తరగతి కుటుంబం నుండీ వచ్చిన అమ్మాయి. ఒకే కులం కావడం, మా తల్లిదండ్రులకు నచ్చిన అమ్మాయి అవ్వడంతో పెళ్ళి కుదిరింది. నాలుగు సంవత్సరాల క్రితం పెళ్ళి అయినప్పుడు ఉన్న ఉత్సాహం, కళ తగ్గిపోయాయి. నేనంటే తనకు ప్రేమే. క్రొత్తలో ఉన్నంతగా దానిని ప్రకటించటం తగ్గింది. నేను విసుక్కున్నా తను నవ్వుతూ దాన్ని సరిదిద్దేది. తర్వాత మౌనంగా ఉండటం మొదలయింది. ఇప్పుడు నేను ఏదైనా విషయంలో విసుక్కుంటే దానికి డబుల్ విసుక్కోవడం మొదలయ్యింది. దాని పర్యాయసానమే ఇవ్వాళ్టి ఉదయం మా మధ్య జరిగిన సంభాషణ. మా అమ్మా నాన్నల ప్రవర్తన తనకు నచ్చదు కానీ దానిని రాద్ధాంతం చెయ్యదు. మా అమ్మ టీ.వీ దగ్గర చాలాసేపు గడపడం తనకు నచ్చదు. ఇంట్లో పనులు అందుకోవచ్చు కదా అంటుంది. ఆమెకు మా తల్లితండ్రుల మీద ప్రేమకానీ, ద్వేషం కానీ ఏమీ లేవు.

మొన్న ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్నప్పుడు నాన్న సడెన్‌గా అడిగాడు 'బావ అడుగుతున్న రెండు లక్షలు ఏమి నిర్ణయించావు'. నాన్న బావ కారు గురించి అడుగుతున్నాడని తెలుసు. 'నాకు ఇప్పుడు చాలా టైట్‌గా ఉంది ఆలోచించాలి. కారు కొనడానికి అంత తొందరేముంది? ' ఆ మాటలు నాన్నకు రుచించలేదని అర్థమైంది. ముఖం ఎలాగో పెట్టాడు. 'ఒక్కతే చెల్లెలు కదా! అడిగింది ఇస్తే సంతోషిస్తుంది. మీరు తలుచుకుంటే రెండు లక్షలు ఎక్కువేమీ కాదు. మన ఇల్లును డాబా చేద్దామని ఉంది. క్యాష్ లేక ఆగాను.'

"కరక్టే మా సంపాదన బాగానే ఉంది.. కానీ ఖర్చులు కూడా దాని తగినట్లుగానే ఉన్నాయి. నేను ఇప్పట్లో సర్దలేను" అని ఖచ్చితంగా చెప్పాను.

ఆ రోజు సాయంత్రం ఇంటికి వచ్చేటప్పటికి నాన్న ఊరెళ్ళిపోయాడు. ఇద్దరం ఎంత కష్టపడితేనో ఈ డబ్బు వస్తుంది. అది కూడా అపార్ట్‌మెంట్ లోన్ పేమెంట్, కార్ లోన్ పేమెంట్స్, పిల్లల ఖర్చులు పోగా చాలా తక్కువగా మిగులుతాయి. మా చెల్లెలుతో మాట్లాడినప్పుడు ఇదివరకటి ఆప్యాయత లేదు మాటల్లో. తల్లిదండ్రుల ప్రేమ, తోడబుట్టిన వాళ్ళ ఆప్యాయత డబ్బుతో ఇంత ముడిపడి ఉందా! ఎన్ని విషయాలలో ఎంతో త్యాగం చేస్తే తప్ప ఈ మాత్రం డబ్బు రాదు. చాలాసార్లు పని నుండీ ఇంటికి వచ్చేటప్పటికి పిల్లలు నిద్రపోతూ ఉంటారు. దాంపత్య జీవితం అంత రుచికరంగా కూడా లేదు.

ఎదురుగా ఏదో ఊరేగింపు పోతూ ఉంది. దాని వలన కూడా ట్రాఫిక్ స్థంబించిపోయింది

రోజూ ప్రతివాళ్ళు దేనికో దానికి తమ నిరసన తెలియచేస్తూనే ఉంటారు. ఎందుకో ఈవేళ వాళ్ళు ఈ ఆందోళన ఎందుకు చేస్తున్నారో తెలుసుకోవాలనిపించింది. వాళ్ళ అభిమాన హీరో నటించిన 'వెధవనాయాల' అనే సినిమా రిలీజ్ ఆలస్యం అయిందట. దానికి ఎందుకు ఆందోళన చేపట్టారో అర్థం కావటం లేదు. నటులు ఈ అభిమాన సంఘాలకు డబ్బిచ్చి పోషించి ఒకళ్ళ నొకళ్ళు కొట్టుకునేలా చేస్తే ఫరవాలేదు. చేతిలోని డబ్బు ఖర్చుపెట్టుకుని వాళ్ళ విలువైన కాలాన్ని వృధాచేస్తున్నందుకు జాలి వేస్తున్నది. పౌర జీవితాన్ని అస్తవ్యస్తంగా చేస్తున్నందుకు విపరీతమైన కోపమూ, జాలీ కలిగాయి. కరుడుగట్టి కుయుక్తులతో దేశాన్ని కుదువబెట్టి రాజకీయం పేరుతో అందిన కాడికి దోచుకునే ఈ నాయకులు, ఇటువంటి అమాయకులు సమకాలంలో ఈ దేశంలో పరస్పరం నివసిస్తూ ఉన్నారని ఆశ్చర్యం వేస్తుంది.

ఇక్కడ నాయకులు ప్రజలను వర్గాలుగా విడగొట్టి మతాలతో రెచ్చగొట్టి పబ్బం గడుపుతూ ఉంటే చూస్తూ అలవాటు అయిపోయి నేను చేసేది ఏమీలేదని గ్రహించి సరిపెట్టుకుని ఉన్నాము. కానీ అత్యంత విద్యావంతులు, మేధావులున్న సిలికాన్‌వ్యాలీలో ప్రముఖుడైన మూర్తి మాటలు నన్ను పదే పదే ఇబ్బంది పెడుతున్నాయి. కులం, రంగు, వర్ణవిభేదాలు లేకుండా అందరినీ సమానంగా చూసే అమెరికాలో ఎంతో కాలంగా ఉంటూ మూర్తి, అందరి కులాల గురించీ ఆరా తీస్తున్నాడంటే బాధగా ఉంది. ఇండియన్ ఆదర్శ సమాజం సిలికాన్‌వ్యాలీలో మొదలవ్వాలన్నదే నా ఉద్దేశ్యం. మన స్వాతంత్ర సమరం గాంధీగారి ద్వారా దక్షిణ ఆఫ్రికాలోనే మొదలయింది. గాంధీగారు టాల్‌స్టాయ్ ఫాం ద్వారా నూతన సమాజం ప్రారంభించారు. అదేవిధంగా మనవాళ్ళు ఈ వసుధైక కుటుంబం, గ్లోబల్ విలేజ్ స్ఫూర్తితో అత్యంత ఆధునిక సమాజాన్ని మన మరియు ఇతర విలువలను స్ఫూర్తిగా తీసుకుని మొదలు పెట్టాలని నేను ఆశిస్తున్నాను. అందువలననే మూర్తి మాటలు అంతగా బాధిస్తున్నాయనుకుంటాను. డబ్బుకు, కులానికీ అతీతమైన సౌందర్య జీవితం ఈ 21వ శతాబ్దంలో నెరవేరదా?

ట్రాఫిక్ కొంచెం కదిలింది. ఈలోపల ఆఫీసుకి ఫోన్ చేసి నా సహచరులకు ఎప్పుడు నడుస్తున్న ప్రాజెక్టు విషయమై కొన్ని సూచనలు ఇవ్వడం జరిగింది. అప్పుడే వాళ్ళకు చెప్పాను నేను ట్రాఫిక్‌లో ఇరుక్కున్నానని. నాకు ఈ జనారణ్యం నుండీ అతి దూరంగా పారిపోవాలనిపిస్తుంది. రాజకీయాలు, డబ్బు ప్రమేయం లేని సెల్‌ఫోన్లు, పేజర్స్ లేని ప్రదేశం దొరుకుతుందా! ఈమెయిల్స్ చెక్ చెయ్యాల్సిన అవసరం అస్సలు ఉండకూడదు. పరస్పర గౌరవం, ప్రేమ ఆప్యాయతలు మాత్రమే ఉండాలి. అసలు అటువంటి ప్రదేశం

ఉంటుందా? సడెన్‌గా సెల్‌ఫోన్ మ్రోగింది. ఉలిక్కిపడి సెల్ అందుకున్నాను. "మీట్ మి నౌ" అని టెక్స్ట్ మెసేజ్ ఉంది అది ఎక్కడ నుండీ వచ్చిందో నాకు తెలుసు. ఆఫీస్‌కు ఫోన్ చేసి నేను రావడం లేదని చెప్పి కారును లకడీకపూల్ వైపు తిప్పాను.

అపర్ణా ఎపార్ట్‌మెంట్స్ దగ్గరలో కారు పార్క్ చేసాను. అపార్ట్‌మెంట్ 202 బి వైపు నడవసాగాను. ఎస్.ఎమ్.ఎస్ చేసింది దీపిక. ఆమె నార్త్ ఇండియన్ అమ్మాయి. నా క్లాస్‌మేట్. చాలా అందంగా ఉంటుంది. నా పెళ్ళి అయిన తర్వాతే మా ఇద్దరికీ అనుబంధం ఏర్పడింది. ఇన్ని ఆదర్శ భావాలు కలిగిన నాకు ఈ సంబంధాన్ని అనైతికం అని ఎంత ఆలోచించినా అనిపించదు. నా భార్యను ప్రేమించడం లేదా అంటే అదేమీ కాదు. నా భార్యను మోసగిస్తున్నానని గిల్టీగా అప్పుడప్పుడు అనిపిస్తుంది. ఈ టెన్షన్స్‌తో నిండిన బిజీలైఫ్‌కు నాకు ఇది కొంత ఊరటగా అనిపిస్తున్నది. ఇది ఇంత ఆనందం ఇవ్వడానికి కారణం సమాజం విధించిన నియమ నిబంధనలకు లోబడకుండా ఉండటం వలన కావచ్చు లేక ఈ సమాజం మీద వ్యక్తం చేసే వ్యతిరేకత కావచ్చు. ఇన్ని ఆదర్శాలు వల్లించినా దీనినుండీ తప్పించుకోలేకపోతున్నాను.

202 బి అపార్ట్‌మెంట్‌కు వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాను. తలుపు తీయగానే చాలా అందమైనా నైటీలో వయ్యారంగా నిలబడి ఉంది. 'కాఫీ తాగుతావా' అంది. 'ఇది కాఫీ టైమా'! అన్నాను. నీకు ఏంకావాలో తెలుసు అంది. బెడ్‌రూంలోకి వెళ్ళాం.

అర్థగంట తర్వాత కాఫీ, సమోసాలు తెచ్చింది. టీ.వీ ఆన్ చేసాను. అసెంబ్లీలో విపరీతంగా ఒకళ్ళనొకళ్ళు తిట్టుకుంటున్నారు వాకౌట్ చేస్తున్నారు. ఎన్నివందల కోట్లు ప్రజాధనం దుర్వినియోగం అవుతుందో పనికిమాలిన విషయాల మీద చర్చించడం వలన, క్రమశిక్షణ లేకపోవడం వలన లోపల ఇంత కొట్టుకున్నా బయట అక్రమ ధనార్జలో అంతా సమానమే.

'మేము పెద్ద టీ.వీ కొనాలనుకుంటున్నాము.'

'ఇది బాగానే ఉందిగా.'

'అందరూ బిగ్ స్క్రీన్ ప్లాస్మా టీ.వీ కొంటున్నారు. నాకు కూడా కావాలని ఉంది'

'ఊహూ' అన్నాను.

'మా తమ్ముడికి మీరు ఉద్యోగం ఇప్పించాలి.'

'మాది కంప్యూటర్ కంపెనీ ... మీ తమ్ముడు ఏదో కాలేజీలో లెక్చరర్ కదా!'

'లెక్చరర్ కంటే కంప్యూటర్ ఫీల్డ్‌లో బాగా జీతాలున్నాయని కంప్యూటర్ కోర్సులు చేసాడు. కారు అదీ కొనుక్కోవాలంటే డబ్బు కావాలి కదా! '

'సరే చూస్తాలే' అని బయలుదేరాను.

'మీ కంపెనీ ప్రెసిడెంట్ మీ వాళ్ళే కదా!'

నాకు ఎక్కడలేని కోపం వచ్చింది. దాదాపు పరిగెత్తాను బయటకి!!

జీవిత ఆదర్శం కార్లు ఫ్లాట్లు, బిగ్ స్క్రీన్ టీ.వీలా! అవి అన్నీ ఉన్న నేను అంత సంతోషంగా ఉన్నానా! వాటిని సాధించడానికి జీవితంలో ఇంకా ఎన్నో విలువైనవి కోల్పోతున్నామని స్పష్టంగా అర్థమవుతుంది.

కారు దగ్గరకు వడివడిగా నడుస్తుంటే "Fine art of happy living" advertisement board కనిపించింది. వాళ్ళ కాంటాక్ట్ నంబర్‌కు కాల్ చేసాను. అవతలి గొంతు నా వివరాలు చాలాసేపు తీసుకున్నాడు. ఏ కంపెనీ, ఏ ఉద్యోగం, సెల్ ఫోన్ నెంబరు అంతా తీసుకున్న తర్వాత ఫీజ్ అమౌంట్ చెప్పాడు. డబ్బు కోసమే పెట్టిన సంస్థ అనిపించింది.

కారు ఎక్కాను. స్టార్ట్ చేసిన తర్వాత ఎటు వెళ్ళాలో అర్థం కాలేదు. కానీ నాకు తెలియకుండానే కారు మా ఊరు రాజమండ్రి వైపు వెళుతోంది.

## ఊర్వశి..పాలసీ..! - డా. గాయత్రీ దేవి

స్వర్గలోకంలో దేవతలంతా సమావేశం అయ్యారు. అందరి మొహాలలోనూ కలవరం కనబడుతోంది.. ఆరోగ్యంగా ఉండవలసిన భూదేవి కళారహితంగా అనారోగ్యంగా కనబడడమే వారి కలవరానికి కారణం. భూదేవిలో కళ తప్పడానికి గల కారణాలు కనిపెట్టి ఆవిడలో పూర్వకళని తీసుకురావాలన్నది సమావేశ లక్ష్యం.

సభాసదులంతా ఆశీనులయ్యాక, ఇంద్రుడు వచ్చి సింహాసనాన్ని అధిష్టించాడు, భూదేవిని సభికులలోనుండి వచ్చి వేదిక మీద ఉన్న ప్రత్యేక సింహాసనాన్ని అలంకరించమని ఆహ్వానించాడు. అడుగు తీసి అడుగు వెయ్యడానికి కష్టపడుతూ, ఆయాస పడుతూ , అతిప్రయాస మీద వేదికని చేరి సింహాసనంలో ఇరుక్కుని కూర్చుంది భూదేవి. భూదేవి పడుతున్న బాధని చూసి భరించలేకపోయారు సభికులు..

"భూదేవీ, నీకు వచ్చిన కష్టం ఏమిటి, నీ అనారోగ్యానికి కారణం ఏమిటి, నీ ఆరోగ్యం కోసం మమ్మల్ని ఏం చెయ్యమంటావో తెలియజెయ్యి" అని తన సహస్రాక్షాలలోనూ, స్వరంలోనూ బాధని వ్యక్తం చేస్తూ ప్రశ్నించాడు ఇంద్రుడు..

భూదేవి ఇంకా ఆయాస పడుతూనే ఉంది. ముక్కుతో ఊపిరి అందక నోటితో గాలి పీల్చుకుంటోంది. ఆవిడ నోట మాట రావడం లేదు.

"వెంటనే అశ్వనీ దేవతల్ని పిలిపించండి" ఆజ్ఞాపించాడు ఇంద్రుడు.

అశ్వనీ దేవతలు ప్రత్యక్షం అయ్యారు. భూదేవిని ఆయుర్వేద వైద్యానుసారం అష్టవిధ పరీక్షలూ చేశారు.

"కారణం కని పెట్టారా?" అన్నాడు ఇంద్రుడు ఆదుర్దాగా.

"ఇతర కారణాలేమీ లేవు. కళ్ళకి కనబడుతున్న కారణమే"

"ఏమిటది?"

"భూదేవి భారం విపరీతంగా పెరిగిపోయింది మహేంద్రా. ఈ భారం ఇంకా పెరిగే సూచనలు కనబడుతున్నాయి. అదే ఆవిడ అనారోగ్యానికి కారణం. ఈ భారం ఇలాగే ఉంటే అది మరిన్ని వ్యాధులకి దారితీస్తుంది."

"వెంటనే చికిత్స ప్రారంభించండి. "

"నిదాన పరివర్జనం చెయ్యాలి"

"మీ వైద్యుల భాషలో కాకుండా మాకు అర్థం అయ్యేలా చెప్పండి"

"కారణాన్ని తీసెయ్యాలి. అనారోగ్యానికి కారణం, పెరిగిన భూభారం. భారాన్ని తగ్గించాలి." అన్నారు అశ్వనీ దేవతలు.

"మన శరీరాలు బరువు పెరిగితే ఆహారం తగ్గించుకునో, వ్యాయామంచేసో తగ్గించుకుంటాం. భూదేవి విషయం అలా కాదు కదా" అని సందేహం వెలిబుచ్చాడు ఇంద్రుడు.

"ఆవిడ 'మోసే' భారం తగ్గాలి. "

"భూమాత భారాన్ని తగ్గించే బాధ్యతని ఎవరు తీసుకుంటారు?" అన్న ఇంద్రుడి ప్రశ్నకి జవాబుగా నేనంటే నేనని చాలా మందే చేతులు ఎత్తారు. వారిలో నుండి నలుగుర్ని ఎంపిక చేసి "మీ నలుగురు దిక్పాలకులూ భూభారాన్ని తగ్గించాలి. అందుకు మీకు ఎంత సమయం కావాలి?" అన్నాడు ఇంద్రుడు.

"మహేంద్రా, నా శక్తి తెలిసి నన్నిలా ప్రశ్నించడం....అవమానకరం. క్షణాలలో భూభారం తగ్గించేసి వస్తాను" మీసాలని చేత్తో దువ్వుతూ, దున్నపోతు వాహనాన్ని ఎక్కి ప్రయాణానికి సిద్ధం అయిపోతూ అన్నాడు దక్షిణ దిక్పాలకుడు. దువ్వుకుందుకి తనకి మీసాలు లేకపోవడంతో (మరి సినిమా డైరెక్టర్లూ, చిత్రకారులూ పెట్టలేదు కదా) ఇంద్రుడి మనసు చివుక్కుమంది, అహం దెబ్బ తింది.

" ఒక్క సారిగా క్షణాలలో బరువు తగ్గించెయ్యకూడదు, అదీ అనారోగ్యమే" అన్న అశ్వనీదేవతల మాటలతో 'నీకు మీసాలే కానీబుర్ర లేదు ' అని స్ఫురించేలా ఓ చూపు విసిరాడు ఇంద్రుడు యముడి మీదకి.

యముడి మాటలే తామూ పలుకుదామని నోళ్ళు తెరిచిన అగ్ని, వరుణ, వాయువులు ముగ్గురూ, పలక కుండా మూసేశారు తమ నోళ్ళని.

"అశ్వనీ దేవతల మాట విన్నారుగా ఒక్క సారిగా కాకుండా , కొంత నిదానంగా భూభారాన్ని తగ్గించి రండి. బయలు దేరండి" అంటూ ఆజ్ఞాపించాడు ఇంద్రుడు.

✷✷✷✷

కాల చక్రంలో ఆరునెలలు గడిచాయి. దేవతలంతా స్వర్గలోకంలో సమావేశం అయ్యారు. భూదేవిని వేదిక మీదకి చేర్చారు. ఆవిడ ముఖం మరింత కళా విహీనంగా, దీనంగా, అనారోగ్యంగా ఉంది.

ఇంద్రుడు నలుగురు దిక్పాలకుల్ని వేదిక మీదకి పిలిచి "మీరు మీ విధిని సక్రమంగా నిర్వహించినట్లు లేరు, భూదేవి ఆరోగ్యం మెరుగుపడలేదు సరికదా, మరింత దిగజారింది" అన్నాడు.

"కార్యాన్ని చూసి కారణాన్ని ఊహించకు ఇంద్రా, నాటి నుండి నేటి వరకుఉ అవిశ్రాంతంగా సముద్రాలలో వాయుగుండాలు సృష్టించాను - వేల కొద్దీ మనుషులు మరణించారు, కొన్ని వేల జంతువులు చచ్చిపోయాయి, పెద్ద పెద్ద వృక్షాలు కూకటి వేళ్ళతో కూలిపోయాయి. ఎడారుల్లో ఇసుక తుఫానులు సృష్టించి అక్కడ కూడా మారణ కాండ సాగించాను. గనుల్లో పని చేస్తున్న వారికి గాలి అందకుండాచేసి వారి భారం తగ్గించాను. ఇంకా..." అంటూ సుదీర్ఘమయిన తన కార్య నివేదికని సమర్పించాడు, వాయువు.

ఇంద్రుడు వరుణుడి వైపు తిరిగాడు. " మహేంద్రా నేను కూడా శక్తిని మించి కార్యనిర్వహణ చేశాను. కొన్ని ప్రాంతాలలో అతివృష్టి సృష్టించాను. నీళ్ళలో వేల కొద్దీ మనుషులూ, జంతువులూ , చెట్లూ, ఇళ్ళూ ఒకటేమిటి అన్నీ సర్వనాశనం అయిపోయేలా చేశాను. మరి కొన్ని చోట్ల నీళ్ళ చుక్క దొరక కుండా అనావృష్టి సృష్టించాను, తిండీ నీరూ లేక మరణాలు సంభవించేలా చేశాను" అని జావాబిచ్చాడు వరుణుడు.

వరుణుడి నివేదిక పూర్తి అవుతూనే అతడికి దూరంగా నిలుచున్న అగ్ని తన నివేదిక మొదలెట్టాడు- " మహేంద్రా, అడవుల్నీ తగల బెట్టాను, పూరి గుడిసెల్నీ తగలబెట్టాను,పెద్దపెద్ద భవనాలలో విద్యుచ్ఛక్తి ద్వారా మంటలు సృష్టించి- వాటిలోని ప్రాణికోటి దహనమయ్యేలా చేశాను. గ్యాసు సిలిండర్లు బద్దలై మంటలు పుట్టి ప్రజలు మరణించేలా చేశాను. నా శక్తి వంచన లేకుండా ఆహుతి తీసుకున్నాను, దాంతో నాకు అజీర్తి కూడా పట్టుకుంది, ఇప్పుడు అశ్వనీ దేవతల దగ్గర నేను వైద్యంచేయించుకోవాలి" అంటూ పెద్దపెద్దగా పదేపదే త్రేన్పడం మొదలుపెట్టాడు...

తనని ప్రశ్నించేలోపే యముడు దున్నపోతు మీద నుండి దిగి, దాని వీపు మీద విలాసంగా చేయి ఆన్చుకుని నిలబడి-"భూభారాన్ని తగ్గించడంలో నా కృషే ఎక్కువ మహేంద్రా. వీరి ముగ్గురి ప్రయత్నాలూ సఫలమయ్యేలా నేను తోడ్పడ్డాను. భూమీద తీవ్రవాదులనే ఒక జాతి వారు రకరకాల బాంబులనే మారణాయుధాల తోనూ, పెద్ద పెద్ద విమానాలని ఎతైన భవనాలకి ఢీ కొట్టించి మనుషులని అంతం చెయ్యడానికి ప్రయత్నిస్తూంటే వారికి సహకరించి భూభారాన్ని తగ్గించడంలో నా భాగం కర్తవ్యాన్ని నేను నిర్వహించాను. ఎన్ని వేల మంది భూమి మీద నుండి తొలగి పోయారో చిత్రగుప్తుడి దగ్గర చిట్టా ఉంది , చదివి వినిపించమంటావా మహేంద్రా?" అన్నాడు ఉత్సాహంగా

'అమ్మో ఇప్పుడా చిట్టా అంతా వినాలా' అని సభికులు కలవరపడుతూటే, ఇంద్రుడు " అక్కర్లేదు" అని అందరికీ ఊరట కలిగించి, "అశ్వనీ దేవతలారా మీ వైద్యం వికటించింది,భూ భారం తగ్గించినా ఆమె ఆరోగ్యం బాగుపడలేదు" అంటూ ఆరోపించాడు.

"మా శక్తిని శంకించడానికి వీలు లేదు. ఎక్కడో ఎదో లోపం జరిగింది" అని ఇంద్రుడితో అని,

"భూమాతా, నీ భారం తగ్గినా నీ ఆరోగ్యం బాగుపడలేదంటే ఆకేదో మానసికమయిన బాధ ఉండి ఉండాలి. మనోవ్యాధికి మందు లేదు. నీ బాధేమిటో చెప్పు " అని ప్రశ్నించారు.

"దేవ వైద్యుల శక్తిని శంకించనవసరంలేదు దేవేంద్రా. అధికమయిన భూభారమే నా అనారోగ్యానికి కారణం. నా భారం తగ్గిన మాటకూడా వాస్తవమే. నా ఆరోగ్యం కోసం -తీవ్రవాదంతో, వరదలతో, తుఫానులతో, కరువు కాటకాలతో నా బిడ్డలు అల్పాయుష్కులై అర్థాంతరంగా నా మీద నుండి వెళ్ళిపోతే నేను తట్టుకోలేకపోతున్నాను. పిల్లల్ని పోగొట్టుకున్న కన్నవారూ, కన్నవారిని పోగొట్టుకుని అనాథలయిన చిన్నారులూ, భర్తలు పోయిన భార్యలూ, భార్యలు పోయిన భర్తలూ-దుఃఖంతో రోదిస్తూంటే నాకు మనశ్శాం తి ఎలా లభిస్తుం ది? ఈ క్షోభని నేను తట్టుకోలేక పోతున్నాను" అంటూ తన వేదనని వ్యక్తం చేసింది భూదేవి.

"మనసు ఆనందంగా లేకపోతే శరీరం ఆరోగ్యంగా ఉండదు" అన్నారు అశ్వనీ దేవతలు.

"భూమి భారం తగ్గిస్తేనే కానీ ఆవిడ ఆరోగ్యం బాగుపడదు, భారం తగ్గిస్తే ఆవిడ మానసికారోగ్యం దెబ్బతింటోంది. ఏమిటీ సమస్యకి పరిష్కారం?" అంటూ వేయి కళ్ళూ మూసుకుని తల పట్టుకున్నాడు ఇంద్రుడు. .

"ప్రభూ నాకు ఒక్క అవకాశం ఇస్తే ఈ సమస్యని నేను పరిష్కరిస్తాను" అంది ఉందో లేదో అన్నట్లున్న నడుము మీద చెయ్యి వేసుకుని వయ్యారంగా నిలబడిన ఊర్వశి.

"దిక్పాలకులే ఏమీ చెయ్యలేక పోయారు, నువ్వేం చేస్తావు, నీకు చేతనయిన నాట్యం చేసి కాస్సేపు భూదేవి మనసు రంజింపచేస్తావు. దానితో ఈ సమస్య పరిష్కారం కాదు" అన్నాడు ఇంద్రుడు వెటకారంగా.

ఆ వెటకారానికి ఊర్వశి మనసు చివుక్కుమన్నా, ఈ పురుషాధిక్య సమాజం ఇంతేలే అని తనకి తాను సర్ది చెప్పుకుని, 'దేవేంద్రా ఏదో ఆడదాన్ని , చిన్న ప్రయత్నం చేస్తాను. నలుగురు మహామహుల ప్రయత్నాలు అయిపోయాయి, నా ప్రయత్నం వలన కొత్తగా చెడేది ఏమీలేదు" అంది తన మనసులో ఉన్న వెటకారం గొంతులో ధ్వనించకుండా ప్రయత్నిస్తూ.

"ఒక స్త్రీ మనసు మరో స్త్రీకే బాగా అర్థం అవుతుంది. ఆమెని ఒక ప్రయత్నం చేయనియ్యి ఇంద్రా" అంటూ భూదేవి ఊర్వశి మాటని బలపరిచింది.

"నీకెంత సమయం కావాలి, మరో ఆరు నెలలా" అన్నాడు ఇంద్రుడు వ్యగ్యంగానే

"రెండు నెలలు చాలు" ఆత్మస్థైర్యంతో ఇంద్రుడికి జవాబిచ్చి, భూదేవి వైపు ఆత్మీయంగా చూసింది ఊర్వశి. ఆ చూపులోతన సమస్యని ఊర్వశి పరిష్కరించగలదన్న విశ్వాసం కనబడింది భూదేవికి.

✷✷✷✷

ఆనాటి సమావేశానికి ఏ నాడూ హాజరు కాని దేవతలంతా కూడా విచ్చేశారు. భూదేవి ఆరోగ్యం బాగుపడి ఉంటుందా లేదా అని తర్జన భర్జనలు పడుతున్నారు అందరూ. ఫలితం మీద పందాలు కడుతున్నారు కొందరు. సభాసమయం అయ్యింది. ఇంద్రుడు వచ్చాడు. భూదేవిని ప్రవేశపెట్టమని ఆదేశించాడు.

అందంగా, ఆరోగ్యంగా, నాజూకుగా ఉన్న ఊర్వశి ముందు ఉండి తోడ్కొని వస్తుంటే, ఆమె వెనుకే మరో ఊర్వశిలా భూదేవి వయ్యారంగా ప్రవేశించింది సభలోకి. ఆమె ముఖం కళకళలాడిపోతోంది.

ఆశ్చర్యంతో సభికుల నోట మాట రాలేదు.

మహామహులనిపించుకున్న నలుగురు దిక్పాలకులు ఆరు నెలలు నిర్విరామంగా ప్రజలని అష్టకష్టాలు పెట్టి అధ్వాన్నంగా తయారుచేసిన భూదేవి ఆరోగ్యాన్ని ఒక స్త్రీ, ఒంటరిగా, కేవలం రెండునెలల్లో ,ఎలా మెరుగుపరిచిందో తెలుసుకోవాలని ఉత్సాహం వ్యక్తపరిచారు సభికులంతా.

ఇంద్రుడు అనుమతి సూచకంగా ఊర్వశి వైపు చుఊశాడు.

"మా చిత్రగుప్తుడి చిట్టాలోకి కొత్త పేర్లేమీ నమోదు కాలేదు. మరి భూభారం ఎలా తగ్గిందో నాకు అర్ధం కావడం లేదు. ఊర్వశీ నువ్వేమయినా ఇంద్రజాలం చేశావా?" అని యముడు ప్రశ్నిస్తుంటే, ఊర్వశి విజయంలో తనపేరు చోటు చేసుకుంటోందని మొహాన చిరునవ్వు పులుముకున్నాడు ఇంద్రుడు.

ఊర్వశి ఇంద్రుడికీ, సభాసదులకీ నమస్కరించి, భూదేవి వైపు ప్రేమగా చూసి, " ఇందులో ఇంద్రజాలాలూ, మహేంద్రజాలాలూ ఏమీలేవు" అనగానే ఇంద్రుడి ఆనందం మాయమయ్యింది.

"భూభారం తగ్గిం చడానికి జనసంఖ్యని తగ్గించడమే మార్గం కాదు, జనాభాని అలాగే ఉంచి వారి బరువుల్ని తగ్గిస్తే సరిపోతుంది.పది మంది బక్కప్రాణులని చంపినా , ఇరవై మంది లావుగా ఉన్న వారి బరువు తగ్గించినా భూభారం ఒకేలా తగ్గుతుంది. కదా...?" అంటూ ఓరకంట ఇంద్రుణ్ణి , దిక్పాలకుల్ని చూస్తూ, వయ్యారం ఒలకబోస్తూ అంది ఊర్వశి.

ఈ మాత్రం ఆలోచన తమకి తట్టలేదే అని వెర్రి మొహాలేసి బుర్రలు గోక్కున్నారు మగ దేవతలు. 'హా! ఓహో !' అంటూ అభినందించారు ఆడదేవతలు.

కాస్తంత నిభాయించుకుని, " వాళ్ళందరి బరువు తగ్గించడం మనకెలా సాధ్యం?" అని డంభంగా ధర్మ సందేహం వ్యక్త పరిచాడు యమధర్మ రాజు.

'అదెంతపని' అన్నట్లు ఓ చూపు చూసి," నేను కార్యరంగం లోకి దిగే ముందు, ఈ పనిని ఎలా సాధించాలో ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నాను, ప్రణాళిక విజయవంత కావడానికి బ్రహ్మ సరస్వతిల అనుగ్రహం పొంది భూమి మీదకి వెళ్ళాను. భూమి మీద కొందరు సౌందర్యప్రియులున్నారు, కొందరు ఆరోగ్యప్రియులున్నారు, కొందరు మానసికంగా బాధలు పడుతున్నవారు, పడుతున్నామని అనుకునే వారూ ఉన్నారు. వారి వారి మనసులకి అనుగుణంగా బరువు తగ్గాలనే కోరికని పుట్టించాలి, అనుకున్నాను.

బరువు తగ్గితే ఎంత అందంగా కనబడచ్చో చెప్పాలనే ఆలోచనని కొంతమంది బుర్రలలోకి ఎక్కించాను, వారు ఈ విషయం గురించి భూమ్మీద ఉన్న ప్రసార మాధ్యమాల ద్వారా నిత్యం ఊదరగొట్టేశారు, ఇంకా ఊదరగొడుతున్నారు, దాంతో సౌందర్యపిపాసకులంతా బరువుతగ్గించుకునే దీక్షలో పడ్డారు.

ఆరోగ్యానికి బరువు తగ్గడం ఎంత అవసరమో చెప్పాలనే ఆలోచనని రకరకాల వైద్యరంగాల వారి బుర్రలలోకి ఎక్కించాను --వారు అదేపనిగా పత్రికల్లోనూ, టీ.వీల్లోనూ ఈ విషయమే హోరెత్తించేశారు.

గురువులూ బాబాల మీద గురి ఉన్న వారి కోసం అటువంటి వారి చేత టీ.వీల్లో చెప్పించాను.

మానసిక అశాంతి తగ్గడానికి, ఆత్మ జ్ఞానానికి రకరకాల ప్రాణాయామాలు, ఆహార నియామాలు చెప్పే ఆధునిక గురువులని తయారు చేశా. వారు ప్రపంచ వ్యాప్తంగా శిష్యులని తయారు చేసుకుని నా లక్ష్య సాధనలో సాయ పడుతున్నారు.

అందం కోసం, ఆరోగ్యం కోసం బరువు తగ్గించే మార్గాల కోసం వెదకడం మొదలు పెట్టారు జనం.

అటు చూడండి, యావత్భూప్రపంచం మీద ప్రజలు ఏం చేస్తున్నారో......" అని ఊర్వశి అనగానే

ఇంద్రభవనంలో ఉన్న దేవతలంతా మేఘమండలంలోకి ప్రవేశించి, భూమి మీదకి తొంగి చూడ్డం మొదలు పెట్టారు.-

అక్కడ కొందరు అదే పనిగా నడిచిన చోటే నడుస్తున్నారు. కొందరు పరుగులు తీస్తున్నారు. రకరకాల వ్యాయామాలు చేస్తున్నారు కొందరు. దీర్ఘంగా గాలి పీల్చి రకరకాలుగా వదులుతున్నారు కొందరు. యోగా కేంద్రాలలో కిటకిటలాడుతూ జనం యోగాసనాలు వేస్తున్నారు వయో భేదం లేకుండా. పెద్దపెద్ద యంత్రాల సాయంతో వ్యాయామం చేస్తున్నారు మరి కొందరు. శస్త్ర వైద్యుల చేత కొవ్వుని కోయించుకుంటున్నారు కొందరు. కొవ్వు కరిగించే మాత్రలు మింగుతున్నారు కొందరు, కోయవారిచ్చే మూలికలు పుచ్చుకుంటున్నారు కొందరు. విందు భోజనాలు మానేసి పచ్చికూరలు, మంచినీళ్ళతో కడుపు నింపుకుంటున్నారు కొందరు.

ఏ ఇంట చూసినా, ఏ ఊళ్ళో చూసినా, ఏ దేశంలో చూసినా, ఏ ఖండంలో చూసినా--ఇవే దృశ్యాలు..భిన్నత్వంలో ఏకత్వం ....

గగన వీధి నుండి దీక్షగా మానవులనే చూస్తున్న దేవతలతో

"ఇప్పుడు ప్రజలందరికీ ఒకటే లక్ష్యం, ఒకటే దీక్ష, ఒకటే మంత్రం-'బరువు తగ్గాలి బరువు తగ్గాలి'-- రెండు నెలల్లో ఈ విధానం ద్వారా-ఒక కోటి కిలోల భూభారం తగ్గింది, అదీ ఇతర సమస్యల బాధ లేకుండా. ఒక పక్క భూమి బరువు తగ్గడం, మరో వైపు తన బిడ్డలంతా ఆనందంగా ఉండడం వలన కలిగే మానసిక ఆనందం- ఇదే భూమాత ఆరోగ్య రహస్యం" అని ఆనందంగా ముగించింది ఊర్వశి.

దేవతలంతా కరతాళ ధ్వనులతో ఆమెని అభినందించారు.

వెంటనే వారంతా పక్కనే సిద్ధంగా ఉన్న పంచ భక్ష్యాల వైపు చూడడం మానేసి, భూమి మీదకి దృష్టి సారించి మానవులు చేస్తున్న ప్రాణాయామాలూ, యోగాసనాలూ, వ్యాయామాలూ వగైరా యథాశక్తి అనుకరించి చేయడం మొదలు పెట్టారు. ప్రశ్నార్థకంగా చూసిన ఊర్వశికి, 'స్వర్గలోకం బరువు పెరిగిపోకుండా ముందు జాగ్రత్త పడదామనీ....' అని నీళ్ళు నములుతున్నట్లు జవాబిచ్చారు,

కానీ మానవులంతా బరువుతగ్గి అందంగా తయారయిపోతే తమ సౌందర్యానికి విలువ తగ్గి పోతుందేమోననే భయం వారి మనసులలో చోటు చేసుకున్నదనే విషయం అర్థమయిన ఊర్వశి తనలో తానే నవ్వుకుంది గర్వంగా.



డాక్టర్ గాయత్రీదేవి గారికి ఆయుర్వేదంలో రెండు దశాబ్దాల అనుభవం, పత్రికలు, రేడియో, టీవీ మాధ్యమాల ద్వారా అందరికి ఆరోగ్యాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నారు. **"why of Herbs", An Institute Of Ayurveda"**,"పుట్టబోయే బుజ్జాయి కోసం" రచనలకి జాతీయ బహుమతులు పొందారు. 2007 లో భరతముని ఆర్ట్స్ అకాడమీ వారి - "ఆదర్శ వనితా పురస్కారం" అందుకున్నారు




ఎన్నో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌ల కాపీరైటు రాఘవులకి ఉంది. బిల్‌గేట్స్ అంత సంపాదన పరుడు కాకపోయినా భారత దేశంలో ధనవంతుల జాబితాలో మొదటి పదిమందిలో ఒకడని చెప్పొచ్చు. మనిషి మెదడు కన్న కంప్యూటర్ మెదడుకే అగ్రస్థానం అవుతోందిప్పుడు. మనిషి మేధస్సు సన్నగిల్లి హార్డ్‌వేర్‌దే పై చేయికాగా, ఆ చేతికి ఏమైనా అయితే మనిషి గతి, విద్యుత్తు సరఫరా పోతే కళ్ళుండి గుడ్డి అయినట్టు, మెదడుండి జడ్డితనమే.

పూర్వాపరాల్లో ఎటువంటి జీవితం గడిపినా ఇప్పుడు మాత్రం విలాసపురుషుడు రాఘవులు. దానికి తగ్గట్టు అతని భార్య సుందరి డబ్బున్న ఇంటి నుండి వచ్చింది. రోజులో పావువంతు సమయం బ్యూటీపార్లర్‌లో ఆమె ఉంటుంది. శరీర సౌందర్యం ఇనుమడించుకునేందుకు శక్తి వంచన లేకుండ, ధన వంచన లేకుండ కష్టపడుతుంది. నాజూకు వ్యాయామాలు, లేపనాలు, తిండి అలవాట్లు ఎన్నో.

వాళ్ళ ఇంట్లో ఎంతమందో పనిమనుషుల్లో కామాక్షి ఒకర్తి. పొట్టి కాదు, పొడువు కాదు అన్నట్టు, మొగానికి జిడ్డుకారుతున్నా నిగనిగలు బాగానే ఉన్నాయి.

ఆడవాళ్ళతో కలిసి మెలిసి తిరిగే రాఘవులు విచిత్రంగా ఏకపత్నీవ్రతుడే సుందరికి భర్తపైన అపారమైన నమ్మకం ఉంది.

ఒకటేమిటి, రెండూ, మూడు కాదు ఐదేళ్ళు గడిచిపోయాయి. సుందరి, రాఘవుల వివాహమై సంతానం గురించి ఇటు కన్నవారు అటు అత్తవారూ తపన పడ్డం మొదలయింది. కానీ సుందరి, రాఘవులు ఆ విషయమే తలచడంతలచడం లేదు. ఇద్దరూ కొత్త పెళ్ళికూతురు, పెళ్ళికొడుకూ అన్నట్టున్నారు.

కామాక్షి పని మనిషైనా అలా కనిపించదు. రాఘవులు ఇంటిలో ఉన్నంత వరకు రాత్రి అతగాడు పడగ్గదిలోకి వెళ్ళినపుడూ, తెల్లారగట్ట మినహాయిస్తే అతడి సుశ్రూషలు తానే స్వయంగా చూస్తుంది. సుందరి పడకగదిలో సమయమే సమయమే భర్తతో గడిపేది.

రానురాను సుందరికి తన శరీరం సౌందర్యం పట్ల మగ్గర్త పెరుగుతునే ఉంది. రాఘువులు భార్యని ప్రతిదానికి సమర్ధిస్తాడు.

ఇటు కన్నవారు అటు అత్తవారింట్లో ఇద్దరు వారసుల్నిమ్మని ఒత్తిడి చేస్తున్నారు. సుందరి ఏమీ పట్టించుకోదు. రాఘువులు దొందుకి దొందు.

కామాక్షి అకస్మాత్తుగా యజమాని ఇంటినుండి వెళ్ళడం జరిగింది. ఎటు వెళ్ళిందో ఎవరికి తెలియదు. అది పదిహేను రోజుల సెలవులో వెళ్ళిందనుకుంటే ఆ పదిహేను రోజులు దాటినా తిరుగు ముఖం పట్టలేదు. కామాక్షికి పెళ్ళయిపోయి ఉండవచ్చునని అనుకోవడానికి ఆస్కారం ఉంది.

అయితే సరిగా తొమ్మిది నెలల తర్వాత పదో మాసం పసికందుని ఎత్తుకుని తిరిగి వచ్చింది.

రాఘువులది ఇల్లు అనేకన్నా బంగ్లా అంటే బాగుంటుంది. పెద్ద కాంపౌండ్. ఇంటి చుట్టూ బయట గేటు నుండి ఇంటి ముఖద్వారం చేరుకోవాలంటే ఫర్లాంగు దూరం నడవాల్సిందే

ఆ రోజు ఆదివారం, కామాక్షి కొడుకుని సుందరి, రాఘువులు దత్తత తీసుకుంటున్న వేళ పురోహితుడి మంత్ర పఠనం సాగింది. కామాక్షి కొడుకు ఒడి మారాడు. ఇప్పుడు సుందరి సొంతం ఆ బిడ్డ.

మునుపటిలా కామాక్షి యజమాని ఇంట్లో ఉండడం లేదిప్పుడు. దాని తలితండ్రులు రాఘువులు తలిదండ్రుల కాలంలో ఈ ఇంటి పనిమనుషులే. కామాక్షి తన చిన్నతనంలోనే ఈ ఇంటి పనిమనిషిగా చలామణీ కావడం మొదలయింది.

ఉన్నట్టుండి ఎదురు ఖాళీ జాగా రాఘువులు కొనేసి ఈ తొమ్మిది నెలల్లో పెద్ద ఇల్లు కట్టించడం జరిగిపోయింది.

ముక్కుమీద వేలేసుకున్నవారు ఏవో ఊహించుకున్నారు. గొప్పింళ్ళలో ఏదీ తప్పిదం కానట్టు ఉంటారని, కానీ ఏదో జరిగిందని మిన్నకున్నారు. అసలు ఇంటి ఇల్లాలు సుందరికి లేని అనుమానం మనకేల, అని గుసగుసలాడుకోవడం తప్పించి చేసిందేమి లేదు.

ఇటు కామాక్షి ఎదురింట్లో ముసలి తలితండ్రులు ఒక తమ్ముడితో ఉంటోంది. రాజ భోగాలు జరుగుతున్నాయి. కామాక్షి పుట్టుకకి బాగా ఆలస్యంగా పుట్టిన తమ్ముడు కాన్వెంటులో చదువును ఆరంభించాడు. అయితే కామాక్షి మొగుడేమయినట్టు? అసలు పెళ్ళయిందా? అంతా ప్రశ్నార్ధకమే. రాఘువులు ఇంట్లో పనిమనుషులతో కూడా కామాక్షి ఏమీ నోరు విప్పి రహస్యం చెప్పలేదు.

వేలెత్తి చూపించడానికి ఒక అమాయకపు ప్రాణి కావాలి లోకులకి. కామాక్షి బేషుగ్గా దొరికింది. చిన్న వాళ్ళింట్లో జల్లిడికి రెండు కన్నాలయితే, నిండా కన్నాల్లాగ కనిపిస్తుంది. అదే పెద్దవారింట్లో అయితే నిండా కన్నాలున్నా జల్లిడికి రెండు కన్నాలంటారు.

కాకులు పొడవడం మొదలు పెట్టాయి. కామాక్షిలో మనస్సుకి చలనం కనిపించింది. దాపరికం ఇంక పనికిరాదనుకుంది. ప్రెస్‌మీట్ పిలిచినట్టు రాఘువులు ఇంట్లో పూర్వపరాల్లో తోటి పనిమనుషుల్ని పిలిచి నిజం కుండ బద్దలు కొట్టి చెప్పినట్టు కాక నిదానంగా చెప్పేసింది. వాళ్ళందరికీ విందు కూడా ఇచ్చింది.

అంతా విడ్డూరంగా ఉంది. యజమానురాలు సుందరి అండంతో యజమాని రాఘువులు బీజాన్ని టెస్ట్‌ట్యూబ్‌లో జతకట్టించి వైద్యనిపుణులు ఎంబ్రియోని కామాక్షి గర్భంలోకి ప్రవేశ పెట్టారు.

కూటికోసం కోటి విద్యలన్నట్టు జారత్వం, చోరత్వం, మోసం దగా చేసి నల్ల సంపాదనలయితే, రక్తం, మూత్రపిండం అమ్ముకొని తెలుపు సంపాదనలు.

వేరే దంపతుల జీవం పంచుకొన్న పిండం స్త్రీ గర్భంలో తొమ్మిది నెలలపాటు పెరిగి సర్వాంగాలు దిద్దుకున్న తర్వాత ఒడి మారడం న్యాయ సంపాదనగా తోచింది కామాక్షికి. అందాన్ని కాపాడుకోవాలన్న తనువుతో కొంత మంది తల్లుల బీద బాలింతరాలు చనుబాలు పట్టించడం లేక ఆరంభంలోనే పసివాళ్ళకి డబ్బాపాలు పట్టే ఉదంతాలయితే ఉన్నాయి.

ఏది ఎలా ఉన్నా కామాక్షికి కాలం సాఫీగా వెళ్ళబుచ్చడం కుదరలేదు. తగిన వరునితో పెళ్ళి జరగాలన్నా ఆటంకాలు వస్తున్నాయి. సంబంధాలు రావడం లేదు. కామాక్షి తలిదండ్రులు మదన పడ్డారు.

కామాక్షి బాగా ఆలోచించింది. ఇంటి గుమ్మంకి బోర్డు వేలాడదీసింది.

అద్దెకు గర్భం..

సరే మరో సంతానం ఆడపిల్లని కని ఇచ్చింది ఇంకో దంపతులకి. కాన్పునొప్పులతో కన్న ఆడవారిని చూచి తనకా నొప్పులు వద్దనుకుంది ఆ ఇంటి ఇల్లాలు. మగని మద్దత్తు అత్తమామల అంగీకారం ఉంది.

మరీ, జోగారావు, జయమాల దంపతులు ఒక ఉద్యమం తట్టారు. సరే అద్దెకివ్వదల్చుకుంది గర్భాన్ని. తనకి కావలసినంత ఓపిక ఉంది బిడ్డల్ని కని ఇవ్వడానికి. ఇదే బాగుందనిపించింది. పెళ్ళి ప్రసక్తి మానుకుంది.

ఈసారి కవల పిల్లల్ని కన్నది కామాక్షి. ఒక మగ, ఒక ఆడ ఈసారి కన్న పిల్లల్ని డబ్బుతో తూచలేక పోయింది. జెనిటిక్ పరమైన తలిదండ్రులకి బిడ్డల్ని అప్పజెప్పాలన్న తలంపుకే గుండె విలవిలలాడింది. వారు రానే వచ్చారు. కామాక్షి గుండెనే పీకి, వారు తీసుకుపోయినట్టు బాధ అనుభవించింది.

కామాక్షి తమ్ముడు సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పట్టా పుచ్చుకున్న తడువు రాఘవులు కంపెనీలో ఉద్యోగం వేయించేసింది. ఇంక చీకు చింత లేదనుకుంటే కామాక్షి తలిదండ్రులు కాలం చేశారు.

రాఘవులు కామాక్షి తమ్ముణ్ణి దేశంలో మరో యూనిట్‌కి బదిలీ చేశాడు పదివి స్థాయిని పెంచి.

కామాక్షి పూర్తిగా ఒంటరిదయింది. ఆ భావన ఇప్పుడు అనుభవానికి వస్తోంది. కాని తనిప్పుడు లాభం బాటలో నడుస్తున్న ఎన్నో కంపెనీల షేర్లకు అధిపతి. ఇంట్లో నౌకర్లు, చాకర్లు విలాసంగా ఉంది. ఇంక గర్భం అద్దెకివ్వాల్సిన పనిలేదు. అంతటితో తృప్తి పడదామనుకుంది. తీరా మళ్ళా కాని, ఏ సంతానం ఈసారి చేయిజార్చుకోవటం తన వల్ల కాదనిపించింది.

మరైతే టెలీట్యూబ్ పారిశ్రామికవేత్త ఒకడు నూరు కోట్లు విలువ చేసే తన ఒక యూనిట్‌ని రాసిస్తానన్నాడు తన సంతానం కనిపెడితే. ఇంత డబ్బుకి మరొక ఆడది దొరక్కపోదు. అతనికి కామాక్షి పైనే గురి. ఆమె కన్న సంతానం శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులు. మంచి వర్చస్సు కూడ కలిగి ఉన్నారు. కామాక్షి వైద్యపరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది. మనస్సు నిర్మలంగా ఉంచుతుంది.. ఏది ఏమైనా కామాక్షి గర్భానికి తుది అద్దె, పూర్తిగా నిర్ణయించుకుంది. బీద ఆడపడుచులెంతో మంది కామాక్షి నడిచిన బాటలో నడవడం మొదలు కావడంతో తనే అని లేదు. చట్టపరమైన ప్రభుత్వ ఆమోద ముద్ర కూడా పడుతుంది. అయితే ఆంక్షలు పెట్టవచ్చు మహిళ సంక్షేమం కోసం, మరో ప్రక్క కొన్ని వ్యతిరేక ధోరణులు కనిపిస్తున్నాయి. ఉదాహరణకి వివాహం కాకుండా పిల్లల్ని కనడం, వారసుల మధ్య ఆస్తి పంపకాలు, బిడ్డల కులగోత్రాలు ఏ విధంగా నిర్ణయించేది, ఇంకా మరికొన్ని.

నెలలునిండకుండా పుట్టే శిశువుల్ని ఇన్‌క్యుబేటర్‌లో పెట్టి బ్రతికించే వైద్య కుశలత వచ్చింది. రోబట్ గర్భాలు నవమాసాలు పిండాల్ని మోసి, పిల్లల్ని సంపూర్ణంగా ఎదిగే అవయవాలతో ఇచ్చేటివిగా సైన్సు ఫిక్షన్ రచయితల ఊహాకందనిది కాదు.

కామాక్షి గర్భసంచి నీళ్ళ తొట్టెలో ఒళ్ళు కందిపోనీకుండా మాంసపు ముద్దని ఎదగనిచ్చింది. తామరతూడుమల్లే బొడ్డునాడితో అద్దెకయితేనేం తల్లి అనుబంధం దృఢమయిందే

ఈసారి కామాక్షికి ముందు లేని అనుభుతి కలగసాగింది. కాళ్ళు మొలిచి, చేతులు మొలిచి, ముక్కు, చెవులు, నోరు, కళ్ళు భగవంతుడు ముందస్తం చేసి పెట్టిన సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌కి అనుగుణంగా పెరగసాగాయి. ఒళ్ళు రూపు దిద్దుకుంది పిండం కామాక్షి గర్భం

హార్డ్‌వేర్‌లో. బాహ్యంగానైనా చేత్తో తడిమే కొద్ది కామాక్షికి నెల తర్వాత నెల వింతగా తోచింది. అనుబంధం ఇనుమడిస్తోంది. బిడ్డ పూర్తి ఆకారం కడుపులో సంద్రం వటపత్రశాయిగా కామాక్షికి తోచింది.

కామాక్షికిపుడు దిగులుగా ఉంది. వెనుకటి గుండె నిబ్బరం కలగడంలేదు. కాన్పు అయిన వెంటనే బిడ్డని దూరం చేసుకోవాలని మదనపడుతోంది. రొమ్ములో పాలూరేది బిడ్డ కోసమే కదా! ఆర్నెల్లయినా బిడ్డకి తన పాలు పెట్టలేని దుస్థితికి దుఃఖించాల్సిన హక్కు ఉందో లేదో మారిన సమాజం. మారిన విలువలు విజ్ఞానం ప్రగతి. రాతియుగం నుండి అణుయుగం వరకు మనిషిదదే మనస్సు. అప్పటిలాగే ఆనందం. అప్పటిలాగే దుఃఖం. మనిషి బుద్ధికే విలువలు పలవలగా ఎదుగుదల. పెరుగుట విరుగుట కొరకే అన్నట్టు ఆఖరికి ఏమి కానుందో.

కామాక్షికి వేదాంతం అబ్బలేదు. వైరాగ్యం అసలే కలగలేదు. కడుపులో బిడ్డ కదలికకి ఈ భూమితో బంధం ఇంకా పెరుగుతుంది. చిన్నగా నొప్పులప్పుడప్పుడు కితకితలులాగ అనిపించాయి. బిడ్డ కాళ్ళతో తంతున్నట్టుంది. లోపల ఎందుకు గాలి వెలుతురు లేకుండ బంధించేశారన్నట్టు. పిడికెడు గుండె తన చోటు చేసుకుంది. పదిలం, పదిలంగా ఉంది అది చిట్టి దేహంలో!

బిడ్డ గుండె సవ్వడి చేయడం ఆరంభించింది. తల్లికి వినబడకపోతేనేం. కాళ్ళు చేతులు విసురుతున్నట్టు ఆ పురిటి నొప్పులు చెపుతున్నాయి. బందిఖానా నుండి విడుదలవ్వాలంటే మరొకరికి నొప్పులని బిడ్డకేం తెలుసు. తన సంబరం తనది బాహ్య ప్రపంచాన్ని చూడాలని, అనుభవించాలని.

ఎంత అద్దెకు గర్భమైతే మాత్రం కొన్ని నెలలు ఉండి ప్రాణం పోసుకుని వెళ్ళిపోతే తన బంధం ఎక్కడికీ పోదు. వెన్నంటి ఉండనే ఉంటుంది, పెరుగుతూ తరుగుతూ నీడలాగ, భానుడి చూపు ఒరుగుతూ వచ్చి, నడినెత్తికెక్కి, తిరిగి ఒరుగుతు పోయినపుడల్లా.

అండం, బీజం హక్కుదార్లు కాచుకుని ఉన్నారు. వాటి కలయిక ఒక ఆకారానికి ఎదుగుదల, పూర్తయిందని వారికి తెలుసు. పుట్టుక తల్లికి వింతకాదు.

కామాక్షి గర్భం కిరాయికి తీసుకున్నవారు వచ్చారు. బిడ్డను చూచి అవాక్కయ్యారు. మాటామంతీ లేకుండా వెనుదిరిగారు, బిడ్డను వదిలేసారు.

అవిటివాడైతే మాత్రం కామాక్షికి మట్టుకు బిడ్డలేచి పరుగెడుతున్నట్టనిపించింది.

ఆమె ఆనందానికి అవధులు లేవు.

✷✷✷

# మన్నించవా... చిన్నా...

యం.ఆర్. అరుణ కుమారి



నా చిన్నా!

'ఎలా ఉన్నావ'ని ఎలా అడగను? నువ్వెక్కడున్నా, ఎలా ఉన్నా... నాకోసమే పరితపిస్తుంటావని తెలిసీ అడగకుండా ఎలా ఉండగలను? చిన్ని రంధ్రం నుండే పుట్టినా వేలాది మైళ్ళు ప్రవహించేనదిలా.. ఈ చిన్ని గుండెలోని ఆర్తి, ఆవేదన.. నిను అన్వేషిస్తూ. అలమటిస్తున్నదని నీకు మాత్రం తెలీదా?

చిన్నా!

బతుకు బుద్బుధమని తెలిసినా... అనురాగాలు, అనుబంధాలు నియంత్రించుకునే ప్రజ్ఞత అందరికీ సాధ్యమేనా? ఐనా ఐహిక వాంఛలు అణుచుకున్నవారు, భవబంధాలు త్యజించినవారు ఉన్నారేమో గానీ.. మనసులో చెలరేగే భావపరంపరలనాపగల శక్తి ఎవరికుందని? ఆ భావాల పుట్టినిల్లు మనసే ఐతే, శరీరాన్ని నడిపే 'కీ' మనసే ఐతే... నా మనసు నిండా నువ్వే నిండి నాకు వెయ్యేనుగుల బలం ఇస్తుంటే... ఆ బలంతో నేనీ జీవన పోరాటం ఒంటరిగానే చేసెయ్యలేనూ?

నిజం చిన్నా!

ఒక ప్రభాత రేఖ పద్మాన్ని వికసించేట్లు, ఒక చంద్రకిరణం ఎలాగ కలువను వికసించేట్లు చేస్తుందో.... అలాగే నా మనోసుమం నీ ప్రేమ వీక్షణంతోనే విప్పారిందంటే నువు నమ్మాలి మరి! స్త్రీలకు శరీరంతోపాటు మనసు కూడా ఉంటుందని తెలీని పితృ స్వామ్య సమాజంలో... ఆధిపత్య, అహంకార ఉక్కు పాదాల కింద అణచివేయబడుతున్న ఎన్నో శరీరాలలో నా శరీరమూ ఒకటి కదా మరి!

ఆఁ! శరీరాలుగా తప్ప....మనసున మనుషులుగా... అసలు మనుషులుగా మమ్మల్ని ఎవరు గుర్తిస్తున్నారు? గౌరవిస్తున్నారు? అమ్మగా... జవసత్వాలు దిగేదాకా.. సేవలన్నీ అందుకుని సేవ చేసే వయసులో అనాదరింపబడి. బతికుండగనే మరుభూముల పాలవుతున్న అమ్మలం! కొండకచో.. సజీవ ఖననమవుతున్న తల్లులం!

గర్భంలో పడీపడగానే చావు భయం! స్కానింగులు, అబార్షన్లు తప్పించుకుని భూమి మీద పడ్డాక... ఊహ తెలిసీ తెలియని వయసునుండే.. నాన్నలు, అన్నలు, మామలు, బాబాయిలు, పక్కింటోడు, ఎదురింటోడు, ఉపాధ్యాయుడు..... వావి వరుసల్లేని కీచక కంటకాల మధ్య మా బాల్య సుమం వికసిస్తుందో... ఛిద్రమవుతుందో విధాతకైనా తెలుసా? కట్టుకున్నవాడు ప్రేమించక పోయినా, సాటి మనిషిగా గౌరవించకపోయినా, ... కనీసం నూరేళ్ళాయుస్సునిస్తాడన్న నమ్మకం దినదిన.. కాదు.. కాదు... అడుగడుగూ గండానికేదీ?

చిన్నా! ఎందుకింత అమానుషత్వం? ‘అర్ధాంగి‘ అంటూనే అల్పాయుష్కులను చేయటం ఎంత దారుణం? జీవితం అశాశ్వతమని తెలిసీ జీవన కాలాన్ని ఆనందించకుండా నలిపివేయడం క్రూరత్వం కాదా? కరుణశ్రీ ‘పుష్పవిలాపం‘ చదివి కన్నీరు కార్చే గుండెలు ఈ పూ‘బాల‘ల మేధానికి స్పందించవెందుకు?

త్రికరణశుద్ధిగా... మీరే రూపంలోఉన్నా (తాత, తండ్రి, సోదరుడు, ప్రియుడు, కొడుకు భర్త, మనవడు) మిమ్మల్నే ప్రేమించే ఈ సుకుమార, సున్నిత సుమాలను కర్కశంగా కాలరాచేందుకు మీ మనస్సెలా ఒప్పుతుంది?

"నిజమే! అసలు మాకు మనసంటూ ఉంటే కదా... ఉన్నా దానికి స్వార్ధం తప్ప స్పందన ఎక్కడుంది?" అన్నావోసారి భారంగా నిట్టూరుస్తూ!

చిన్నా! నీకు తెలుసా? స్త్రీలు చాలా అల్ప సంతోషులు. భర్తలు ఎన్ని బాధలు పెట్టినా .. ఓ మూరెడు మల్లెపూవులు తెచ్చివ్వగానే అన్నీ మర్చిపోయి సంతోష పడిపోతారు. సంతోషపెడతారు. అలా కాకుండా భర్తల దౌర్జన్యాలను ఎదిరించాలంటూ ఒకావిడ "ద ఫ్లవర్స్ ఆర్ నాట్ ఎనఫ్" అనే ఏక పాత్ర నాటిక ప్రదర్శనలిస్తోందని పేపర్లో చదివాను. నిజమే చిన్నా! అలా ఎదిరించకపోవటం వల్లనే కదా... ఎంతోమంది స్త్రీలు.. తమకు కాక.. తమ భౌతిక కాయాలకు పూలు కానుకగా పొందుతున్నారు? రోజూ టీవీల్లో . కాళ్ళ పారాణి ఆరకముందే కాటికి తరలించబడుతున్న నవవధువులు, బిడ్డల్తో సహా కడతేరి ‘పోతున్న‘ స్త్రీల దైన్య స్థితికి నాకళ్ళల్లోంచి జాలువారే దుఃఖాశ్రువుల్లో ‘నా చిన్నా అలాంటివాడు కాద‘న్న సంతోషం, ఓ మానవీయ వ్యక్తి సాన్నిహిత్యాన్ని పొందిన అదృష్టం కల్సి... ఆనందబాష్పాలుగా మారి... నా గుండెపై పడి... మనసులోకే ఇంకిపోయాయి.

‘ఈ మనసనేదే లేకపోతే బాధే తెల్సేది కాదుగదా‘అనుకొనే నేను ఆక్షణంలో ఆ అభిప్రాయాన్ని మార్చుకున్నాను. ఎందుకో తెలుసా? నాకో మనసుంటేనే కదా... దాన్నో గుడి చేసి నీ రూపు నిలుపుకున్నాను. ఆ రూపునే కదా నా కన్నీళ్ళు అభిషేకించాయి అనుకుంటుంటే! ఐనా... నాకో మనసుందని... అది ప్రేమ కోసం తపిస్తుందని.. నీ పరిచయమయేదాకా నాకే తెలియదంటే ఆశ్చర్యంగా లేదూ?

చిన్నా! ఎండావానల అపురూప సంగమంలో వెల్లివిరిసే అద్భుతం.... ‘హరివిల్లు‘లా కష్టాలు, కన్నీళ్ళు... మిగిల్చిన చీకటిలో కునారిల్లుతున్న నా జీవన ఆకాశంలో మెరిశావు. నవరసాల్లో నేననుభవించని ఆనందాన్ని నీ ప్రేమ పాత్రతో తాగించిన ‘మధువని‘వి నీవు. ఆశ్చర్యంగా లేదూ.... సుమ సుమాన్ని అన్వేషిస్తూ.... అమృతం జుర్రే మధుపం... పువ్వుకే సుధ గ్రోలించడం?

చిన్నా! జీవన భీబత్స తుఫాను తాకిడికి అల్లాడుతున్న విరజాజిని చూసి మకరందం గ్రోల వచ్చిన భ్రమరం తానే ఆలంబనగా నిలవడం అబ్బురంగా లేదూ?

"జీవితాన్ని, మనుషులను ఇంత చక్కగా అర్థం చేసుకున్నదానివి. ఏం చదువుకున్నావు?" గుర్తుందా ... ఓరోజు నీ ప్రశ్నలోని ఆశ్చర్యం! "డిగ్రీలతో కొలిచే చదువులు చదవాలని ఎంత ఉబలాట పడ్డానో! చివరకు జీవితాలు, మనసుల్ని చదివే అనుభవాలే మిగిలాయి" చదువు కోలేక వదిలిన నిట్టూర్పు.

"అనుభవాలకు మించిన పాఠాలేముంటాయి గనుక! మరి అన్నీ తెలిసి నువీ... వృత్తిలోకి... అంటే ...తప్పు..."

"తప్పా?" మధ్యలోనే అడ్డుకున్నానేను నీ భావం గ్రహించి. "'పని' చెయడం తప్పా? భలేవాడివే! మరి తప్పనుకుంటే పెద్ద చదువులు చదివి, పే...ద్ద ఉద్యోగం చేస్తున్నవాడివి నువ్వెందుకీ తప్పు పని చేస్తున్నావు?" నేను సూటిగా అడిగేసరికి బిత్తరపోయావు.

నిజం చెప్పొద్దూ! అప్పుడు నీ మొహం.. ముఖ్యంగా.. ప్రేమ, దయలతో ఉండే నీకళ్ళు.. అశాంతిగా, అసహనంగా చికిలించుకుపోవడం చూసి నిజంగా నేను బాధపడ్డాను. కానీ.. మరో గత్యంతరం లేని పరిస్థితిలోకి బలవంతంగా నెట్టివేయబడిన ఎందరో నిర్భాగ్య సింధువులో బిందువును. నా వేదన ఎవరికి నివేదించను? గాయం చేసినవారికి నొప్పి గురించి చెప్పినా ఏం లాభం? నా గాయం 'నీ' వల్లకాకపోవచ్చు కానీ... నీ జాతి వల్లే కదా!

"సారీ! నేను. నాకు.." నువు తడబడుతుంటే నేను నిర్వేదంగా నవ్వేశాను. బయలాజికల్ నీడ్స్! శారీరక అవసరాలు... ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అవసరం... వారి చేత ఎన్నో పనులు చేయిస్తుంటుంది. మనిద్దరి చేత ఓ 'పని' చేయిస్తున అవసరం...'ఆకలి'. ఐతే నీ ఆకలి వేరు. నా ఆకలి వేరు. చిత్రం చూడు. ఒక పనిని ఆడా మగా 'కలిసే' చేసినా మగాడికి అహం తృప్తి, గౌరవ మర్యాదలు. ఆడదానికి మాత్రం అగౌరవం, అసహ్యాలు..."

"ఐయాం రియల్లీ సారీ!" మనస్ఫూర్తిగా నువ్వు.

"వ్యవస్థ కుళ్ళుకు ఒక్క వ్యక్తే బాధ్యత వహించాలన్న మూర్ఖత్వం నాకు లేదు."

"కానీ.. ఆ వ్యవస్థలో నేనూ ఒక భాగమే కదా!"

"జాతిపరంగా కావచ్చు కానీ వ్యక్తిగా కాదుగా!"

"ఎందుకనో?" నువు చిలిపిగా చూశావు.

"ఎందుకంటే.." నేను నీ గుండె మీద తలాన్చి చెప్పాను" నీలో ప్రేమించే హృదయం... అందులోనూ నిస్వార్ధంగా.. ఉంది గనుక!"

"నిస్వార్ధంగా.. అతిశయోక్తి కాదూ?"

"కానే కాదు. ఐతే.. నీకు నాకు మధ్య వ్యాపార వినిమయ... విలోమ సంబంధమే ఉండాలిగానీ... ఈ ప్రేమ బంధానికి మూలమేమిటి మరి?" సూటిగా ప్రశ్నించాను.

"అవును... మరి.... ఏమిటో...."? అమాయకంగా చూశావు.

"మానవసంబంధాలన్నీ ఆర్ధిక బంధాలైపోయిన ఈ రోజుల్లో మనుషుల్ని మనుషులుగా గుర్తించి, గౌరవించి, ప్రేమించే నీ వ్యక్తిత్వం!"

"నువ్వు నన్ను మరీ మునగ చెట్టు ఎక్కించేస్తున్నావు" మొహమాట పడిపోయావు.

"పడితే పట్టుకుంటాలే!" అల్లరిగా నవ్వాను.

"ఆహా! మహా ఉంటే యాభై కేజీలుంటావేమో! ఎనభై కేజీలు ఎలా మోస్తావు?"

"ఏయ్!" నా కొంటెతనాన్ని... నీ చిలిపితనం మురిపెంగా మొట్టింది. నీ బలమైన బాహుబంధంలో ఇష్టంగా ఇరుక్కుపోయిన పూదండలా నేను.

"నిజంగా నువు నాకు ముందే దొరికి ఉండే నా జీవితం నందనవనంలా ఉండేది" కన్నీళ్ళతో కారిన కోరిక వేదనగా వగచింది.

"బెటర్ లేట్ దెన్ నెవర్ కదా!" నీ మాటల్లో, నా కళ్ళుతుడుస్తున్న నీ వేళ్ళల్లో ప్రవహించిన ఆర్తి, నమ్మకాల స్పర్శ..... నిజంగా నన్ను నివ్వెరపరచింది.

"మనిషికి ఆశ ఉండొచ్చు గానీ.. అత్యాశ కూడదు." నిజాయితీగా నేను.

"నిజమే! ఈ తిరుగుబోతుకు ఆ అర్హత కూడా లేదు."

"ఛ! ఛ! నేను నా గురించి అన్నాను." నేను కంగారు పడ్డాను. చిన్నబోయిన నీ మొహం చూసి.

"పిచ్చీ! ఇందాక నువ్వే అడిగావు... ఒకేపని ఆడామగా కలిసి చేసినపుడు మగకు వర్తించని తప్పు ఆడదానికి మాత్రం ఎందుకని! సో! నువ్వన్నట్లు కారణాలు ఏవైనా... మనిద్దరం ఒకే పడవ ప్రయాణీకులం! కలిసి జీవితాంతం ప్రయాణించటంలో తప్పేమిటి?"

"అలా అనటం నీ సంస్కారం.. కానీ... సమాజం....."

"ఎట్లో దూకనీ! ఐకేరేపినే!" నిర్లక్ష్యంగా చూశావు." నీకేమన్నా అభ్యంతరం"....

"అయ్యో! నీ కన్నా గొప్ప వరం నాకు ఇంకేముంటుంది?" నా కళ్ళల్లో ఆనంద బాష్పాలు చంద్ర కిరణంతో చిట్లి... ఇంద్రధనస్సు సంతోష రంగులు చిమ్ముతూ ... నీ చెంపలు చిత్తడి చేస్తున్నాయి.

"ఇంకో రెండేళ్ళకు కాంట్రాక్టు పూర్తవుతుంది. వచ్చేస్తా. అంతదాకా ప్రతినెలా డబ్బు పంపుతాను. నువ్వే పనీ చెయ్యనక్కర్లేదు. ఈ నెలగానే కాదు ఇకమీద... నువ్వు నాదానివి. నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను. "

స్థిర గంభీరంగా ఉన్న మాటలు, నీ సాహచర్యంలా నేను నిశ్చింతగా ఉండగలనన్న భరోసా, ధీమా, నమ్మకం కలిగించే నీ గాఢకౌగిలి... నాలో సునామీ సంద్రంలా దుఃఖాన్ని ఉవ్వెత్త పరచాయి.

ఏ డబ్బు కోసం కన్న తండ్రే నన్ను అమ్మేశాడో, ఏ డబ్బులేనిదాన్నని హాస్టల్లో వాచ్‌మెన్లు, వార్డెన్ల అఘాయిత్య వాత పడ్డానో, ఏ డబ్బులేకపోవటం వల్ల ట్యూషన్ మాష్టారికి లొంగానో, ఏ డబ్బాశ ప్రియుడిని, మొగుడిని కూడా తార్పుడు గాళ్ళుగా మార్చిందో, రావణకాష్టం లాంటి ఆకలి మంటలు చల్లార్చే ఏ డబ్బు కోసం నేనో పడుపుకత్తెగా మారానో... ఆ డబ్బు .. ఆ డబ్బును నువ్వు నాకు నెలనెలా పంపుతానంటే నేను కరిగి కన్నీరవకుండా ఎలా ఉండగలను

"పిచ్చీ... ఎందుకురా!" కళ్ళు తుడుస్తూ ఆప్యాయంగా నువ్వు

"ప్రతిఫలాపేక్ష లేని నీ ఆపేక్ష..... "మాటలు వెక్కిళ్ళలో చిక్కుపడ్డాయి.

"లేదని ఎందుకనుకొంటునావు? త్రికరణ శుద్ధిగా నీ ప్రేమ నాకిస్తున్న ఆనందం అమూల్యమైనది కాదూ!"

"చిన్నా! సమాజం చూసేది, గౌరవించేది మనిషిని... మనసును కాదు."

"నాక్కావల్సింది నీ స్వచ్ఛమైన మనసు"

"చిన్నా!" నీ ప్రేమ నాకళ్ళలో నీళ్ళు సుడులు తిప్పింది గుండెతోబాటు.

"పిచ్చీ!" ముద్దుగా చెప్పావు. "కన్నీళ్ళన్నీ వృధా చేస్తే ఎలా? అవసరానికో కన్నీటి చుక్క రిజర్వ్ చేసుకోవాలి."

"నువుండగా నాకిహ ఆ అవసరమే రాదులే!"

"నే లేకపోయినా నువ్వు ఏడవకూడదు. కానీ... పన్చేసేది సరిహద్దు కాపలా జవానుగా కదా! ఎప్పుడు ఎటునుంచీ కాల్పుల్లో..ఎప్పుడో ప్రాణహంస ఎగిరిపోతుందో.. ఆరోజు.. ఆ వార్త తెలిస్తే... నాకోసమో కన్నీటి బొట్టు.." "చిన్నా!" నీ నోరు మూస్తూ... నిన్నల్లుకుపోయాను. నాకళ్ళు నీ గుండెను తడిచేస్తున్నాయో, నీ గుండెలోని ఆర్ద్రతను పీల్చుకుంటున్నాయో మరి!

"చిన్నతనంలోనే ఆత్మీయులందరినీ పోగొట్టుకున్న అనాథను నీకన్నా నాకాత్మీయులెవరున్నారు మరి!" నీ గొంతులోని ఆర్తి, అమాయక స్వచ్ఛత.. బిగించిన కౌగిలిలో కాలం కరిగిందో... స్థంభించిందో గుర్తించే గడియారమేది?

చిన్నా! శరీరంతో తప్ప మనసుతో పన్లేని పనులు చేసుకు బతుకుతున్న దాని జీవన తోటలోకి ఎందుకొచ్చావు? పూల గురించే ఆలోచించని క్రోటనుమొక్కకు పండ్ల ఆశలెందుకు కల్పించావు? ఎదురు చూస్తే నువ్వొస్తావు? ఏ జన్మలో మళ్ళీ మనం కలుసుకుంటాం? చెప్పు చిన్నా! మన ప్రేమఫలాలు దేశసేవకే అంకితమవ్వాలన్న నీ కోరికే నాకు శిరోధార్యం! పుట్టబోయే మనబిడ్డను నీలా ఉన్నత వ్యక్తిగా తీర్చిదిద్దటమే నా ముందున్న కర్తవ్యం!

చిన్నా! కడుపులో బిడ్డతో బాటు... ఇంతటి బాధ్యతా భారం మోయవలసినదాన్ని! మరి 'చావైనా... బతుకైనా... ఇహ నీతోనే!' అన్న నా వాగ్దాన భంగం చేస్తున్నందుకు నన్ను మన్నించవా.. చిన్నా!

చిన్నా! నీ భౌతిక ఖాయం అగ్గిలో బుగ్గయిందో, మన్నుతో మన్నయిందో, గాలిలో పరిమళమైందో, ప్రవాహంలో నీటి చుక్కయిందో, నింగిలో నక్షత్రమైందో... తెలిసినవి... పంచభూతాలే కదా! అందుకే... పంచభూతాల సాక్షిగా... పంచభూతాలకే నివేదిస్తున్నా... నా వేదనను! వింటున్నావా చిన్నా!

నేను... నన్నుగా ప్రేమించిన నా చిన్నా! నేను.. నీ బతుకులో బతుకు కాలేకపోయినా... నీ మనసున మనసై.. నీ (బిడ్డ) కోసమే బతికే భాగ్యాన్నిచ్చిన నా చిన్నా.. మనసారా నన్ను మన్నించావా?!?



## రాజూ - ఏడుగురు కొడుకులూ

జె. యు. బి. వి. ప్రసాద్

**అనగా అనగా ఒక రాజున్నాడు.** 'అనగా' అని అనకపోయినా వున్నాడు లెండి. ఎక్కడకి పోతాడూ వుండక? అప్పుడేమో, రాజుకి ఏడుగురు కొడుకులున్నారు. మరి కూతుళ్ళు ఎందుకు లేరో? అంత మంది కొడుకులున్న రాజుకు కూతుళ్ళు లేరంటే ఏం నమ్మ బుద్దేస్తుందీ? ఉండే వుంటారు. అయినా కొడుకుల కున్న 'గొప్ప' కూతుళ్ళ కుండదు కదా? అందుకని, కూతుళ్ళున్నా లేనట్టే లెక్క. వాళ్ళ గురించి చెప్పుకోనక్కర లేదు. అదన్న మాట సంగతి. అప్పుడు ఏడుగురు కొడుకులూ కలిసి వేటకు వెళ్ళారు. రాజులు వేటకు ముఖ్యంగా మూడు కారణాల వల్ల వెళతారు అని చెబుతారు. మొదటిది క్రూర మృగాల నించీ ప్రజలని కాపాడ్డం కోసం. ఒక్కోసారి పులి లాంటి క్రూర మృగాలు అడవికి దగ్గరలో నున్న గ్రామాల మీద దాడి చేసి, మనుషులకీ, పెంపుడు జంతువులకీ హాని చేస్తాయి. రాజులు వేటకి వెళ్ళి, వాటిని వేటాడి, హత మారుస్తారు. రెండో కారణం లేళ్ళూ, దుప్పిలూ, వగైరా వాటిని వేటాడి, ఆహారం కోసం తెచ్చు

కుంటారు. మూడో కారణం వినోదం కోసం. ఈ కారణం రాక్షసత్వం. జంతువులని హింసిస్తే రాజులకి వినోదం మరి. సరే! మన కథలో రాజు కొడుకులు కూడా వేట కెళ్ళారు. వెళ్ళి వాళ్ళేం చేశారూ?

ఏడు చేపలు తెచ్చారు! అంటే రాజు కొడుకులు వేట కోసం అడవికి వెళ్ళ లేదన్న మాట! వార్నీ! కాస్త మంచి వాళ్ళ లాగానే వున్నారు. రాజు కొడుకులు మంచి వాళ్ళవటం ఏమిటీ, నీ మొహం అంటారా? కానీయండి. మీరే కరెక్టు. తాము శ్రమ చెయ్యకుండా, ఇంకోళ్ళ శ్రమల మీద బతికే రాజు కొడుకుల్లో మంచి తనం ఏం చూస్తాం లెండి! చేపల వేట కోసం ఏదో నది కెళ్ళారన్న మాట. చేపల పులుసు తినాలని కోరిక వచ్చి నట్టుంది వాళ్ళకి. మొత్తానికి మన రాజు కొడుకులు వీరోచితంగా చేపలని వేటాడి, ఏడు చేపలు ఇంటికి తెచ్చారు.

ఏడేనా? ఉత్త ఏడేనా? అంత మందికి ఏడు చేపలు ఏం సరిపోతాయి? వీళ్ళే కాకుండా, రాజూ, రాణీ కూడా వుంటారు కదా? అయినా వేటకయిన ఖర్చు పెడితే, బోలెడు చేపలూ వచ్చేవి, టైమూ మిగిలేది. రాజు కొడుకులు వేట కెళ్ళేరంటే, అదే చేపల వేట కెళ్ళేరంటే, మామూలుగా వెళ్ళరు కదా? మందీ, మార్బలంతో వెళ్తారు. గుర్రాలెక్కీ, రథాలెక్కీ వెళ్తారు. దార్లో వాళ్ళ దాహాలకి పానీయాలూ, ఆకలికి తిళ్ళూ, గుర్రాలకి దాణాలూ, ఇలా బోలెడు సరుకులు ఖర్చవుతాయి వుత్త ఏడు చేపల కోసం.

పోనీ ఖర్చు అయితే అయింది గానీ, ఏడు చేపలు మాత్రమే తెచ్చారేం అన్న ప్రశ్న మాత్రం వదలడం లేదు. ఎందుకేమిటీ? సూఫీయిజం కారణంగా! అంటే సూఫీయిజంలో వున్న కమ్యూనిజం కారణంగా! వరవరరావు గారు మధ్య "ఈవారం జనవార్త"లో ఏం చెప్పారూ? సూఫీయిజంలో ఫకీర్లు వాళ్ళకి ఆ రోజుకు కావల్సిన తిండి మాత్రమే అడుక్కుంటారూ, బోల్డంత అడుక్కుని స్వంత ముష్టిని దాచుకోరూ, అందువల్ల వాళ్ళు పాటించేది స్వంతాస్తి లేని కమ్యూనిజం అని గట్టిగా, నొక్కి వక్కాణించి చెప్పేరు కదా? అలాగే, మన రాజు కొడుకులు కూడా ఎక్కువ చేపలు తెచ్చుకుని, స్వంతాస్తి పెంచుకోకుండా, ఫకీర్లలా ఆ రోజు కవసరమైన ఏడు చేపలు మాత్రమే తెచ్చుకున్నారన్న మాట, సూఫీయిజంలో వున్న కమ్యూనిజాన్ని ప్రదర్శిస్తూ. ఇది అర్థం కాని వాళ్ళందరూ మూర్ఖులని అర్థం.

రాజు కొడుకుల్లో వున్న సూఫీయిజపు కమ్యూనిజం అక్కడతో ఆగలేదు మరి. వాళ్ళు తెచ్చుకున్న చేపల్ని వాళ్ళే ఎండ బెట్టుకున్నారు పాపం! తరువాత వాటిని వాళ్ళే వండు కుంటారేమో కూడా! దీన్ని బట్టి ఎంత ఖర్చు పెట్టినా, ఎంత ఇతరుల శ్రమ మీద బతికినా, పాపం రాజు కొడుకులు కూడా చేపలు ఎండ బెట్టే పని చేస్తారన్న మాట. బాగుంది, బాగుంది.

చేపల్లో ఒక చేప ఎండలేదు. ఎండ వున్న చోట పెడితే ఎండుతుంది. ఏ గడ్డి దుబ్బులో అడ్డంగా వున్న చోట, నీడలో చేపని పెడితే, అదేం ఎండి ఛస్తుందీ? అంత తెలివి తక్కువ వాళ్ళన్న మాట రాజు కొడుకులు. ఎండ వున్న చోటనే ఎండ బెట్టాలన్న ఇంగిత జ్ఞానం లేని వాళ్ళు తెలివి తక్కువ వాళ్ళు కాక మరేం అవుతారూ? అప్పుడు వాళ్ళు పోయి, "చేపా, చేపా ఎందుకు ఎండలేదూ?" అని వెర్రి మొహాల్లా అడిగారు.

హవ్వ! చేపలెక్కడన్నా మాట్లాడుతాయా? నిజానికి మాట్లాడవు. కానీ మన కథలో మాట్లాడుతాయి మరి. మాట్లాడే చేపలు, నదిలో రాజు కొడుకులు తమని వేటాడినపుడు తప్పించు కోలేక పోయాయి తెలివిగా. తెలివి తక్కువ వాళ్ళయిన రాజు కొడుకుల్ని బోల్తా కొట్టించడం ఎంత సేపూ మాట్లాడే చేపలకి? అయినా మన చేపలు అలాంటివి కావు. మనుషుల కోసం తమని తాము అర్పించుకునే త్యాగ మూర్తులు. చేపలు మాట్లాడుతాయే అనుకోండి. నది లోంచి బయటికి వచ్చిన చేపలు ఇంకేం బతుకుతాయి? నీళ్ళలో మాత్రమే బతికుంటాయి కదా? సరే లెండి! మాట్లాడే చేపలు, నీళ్ళ లోంచి బయటికి వచ్చినా బతికే వుంటాయని అర్థం చేసుకోవాలి కథలో.

అలా ఎండని చేప, "గడ్డి దుబ్బు అడ్డం వచ్చిందీ" అని జవాబిచ్చింది. ఎండిన చేపలు నోరెత్త లేదు మరి. అంటే అవి బతికి లేవో, బతికున్నా తాము ఎండి పోయేయి కాబట్టి, ఆ ప్రశ్నకి తాము జవాబు చెప్పక్కర్లేదనో అనుకుని వుంటాయి. మొత్తానికి తెలివి తక్కువ చేపలు కావు మరి.

ఎండని చేప అలా ఎండక పోవడానికి కారణం చెప్పేస్తే, రాజు కొడుకులు ఆ కారణాన్ని పరిష్కరించేసి, చేపని ఎండ గట్టేస్తారు కదా? ఇదేదో త్యాగం చేసే చేప లాగానే వుంది. అసలు రహస్యం చెప్పేసింది. అదీ రాజు కొడుకులకి తెలియని విషయం. "ఏమో, నేనెందుకు ఎండ లేదో నాకేం తెల్సా?" అని హాయిగా గడ్డి దుబ్బు నీడన సుఖంగా వుండొచ్చు కదా? ప్రాణాల మీద కొచ్చి నప్పుడు కూడా నిజాలు చెప్పి, ప్రాణాల మీదకు తెచ్చుకోవాలా? దశరథుడి కున్న సత్యవ్రత పాలన లాంటిది ఈ చేపకి కూడా వున్నట్టుంది! అలా నిజం చెప్పేసి, ప్రాణాల మీదకి తెచ్చుకుంది ఆ చేప.

అప్పుడు రాజు కొడుకులు, "గడ్డి దుబ్బా, గడ్డి దుబ్బా, ఎందుకు అడ్డం వచ్చేవూ?" అని గడ్డి దుబ్బుని అడిగేరు. హవిటి? ప్రాణం లేని గడ్డి దుబ్బు కూడా మాట్టాడు తుందా? "చేప మాట్టాడగా లేనిది, గడ్డి దుబ్బు మాట్టాడితే కష్టం వచ్చిందా?" అనంటారా? మరేం! చేప అంటే సజీవ పదార్థం. గడ్డి దుబ్బు అంటే నిర్జీవ పదార్థం. రెంటినీ ఒకే గాటన కట్టేస్తే, ఎలాగమ్మా వేగేదీ? పోనీలెండి! కథ కోసం ఏవి మాట్టాడినా ఒప్పేసుకుందాం! సరేనా?

గడ్డి దుబ్బు, "ఆవు నన్ను మేయలేదూ" అని నిజం చెప్పేసింది. ఈ గడ్డి దుబ్బు కూడా దశరథుడి మేనత్త కూతురై వుంటుంది. అందరికీ, అన్నింటికీ సత్యవ్రత పరి పాలనే మరి! తమ ప్రాణాల మీదకి వచ్చినా సరే! ఒకటే త్యాగం! అదీ మనుషుల కోసం. ఇవన్నీ తప్పకుండా స్వర్గానికే వెళతాయి. వెళ్ళి అక్కడ దశరథుడితో ఆడుకుంటాయి. ఒకే రకమయిన జంతువు అదే రకమయిన జంతువుని వేటాడదు. కానీ మనిషి మాత్రం సుబ్బరంగా ఇంకో మనిషిని 'వేటాడి', ఆ మనిషి శ్రమని దోచుకుని 'సుఖం'గా బతికేస్తాడు.

రాజు కొడుకులు కాస్తా, గడ్డి దుబ్బు నొదిలేసి, ఆవుని పట్టుకున్నారు. అది కూడా తప్పకుండా మాట్టాడే ఆవే అయి వుంటుంది ఈ కథలో. "ఏవమ్మా ఆవూ! రోజూ హాయిగా గడ్డి దుబ్బుని మేసే దానివి, ఈ రోజెందుకు మేయ లేదూ? నీకేమన్నా కోపం వచ్చిందా? నిన్నెవరన్నా ఏమన్నా అన్నారా లేక బద్దకమా? నిన్న రాత్రి తిండెక్కువయిందా? ఏమిటో, అసలు విషయం చెప్పక పోతే, మాకెలా తెలుస్తుందమ్మా? నువ్వు నీ పని చెయ్యక పోవడం వల్ల, మాకు బోలెడు కష్టాలు వచ్చాయి. మా చేప ఎండనే లేదు. చెప్పమ్మా కారణం, చెప్పు" అని రాజు కొడుకులు నిష్టూర పోయారు. ఆవుతో అలా మర్యాదగా మాట్టాడక పోతే, అది కొమ్ముల్తో పొడుస్తుందని భయం వాళ్ళకి.

ఆవు కాస్తా పకా, పకా నవ్వింది. కళ్ళలో నీళ్ళు తిరిగే వరకూ నవ్వింది. "ఓరి వెర్రి మొహం రాజ కొడకల్లారా! నన్ను చూస్తే తెలియటం లేదా మీ మొహాలకి? నా మెడలో పలుపు తాడు గుంజకి కట్టినట్టు కనబడ్డం లేదా? మీరు తెలివి తక్కువ వాళ్ళని తెలుసు గానీ, గుడ్డి వాళ్ళని తెలియదు. గొల్లబ్బాయికి పాలు పితుక్కోడం తెలుసు గానీ, వేళకి నన్ను విప్పాలని తెలిసి చావదు. నిన్ననగా మేసిన మేత. ఎంతాకలిగా వుందో! పొద్దుణ్ణించీ గుంజు కుంటున్నాను కట్టు తెంచు కుందామని. మాయదారి గొల్లబ్బాయి. గట్టిగా కట్టేశాడు. బాబ్బాబు! మీకు పుణ్యం వుంటుంది. కాస్త నా కట్టు విప్పండి బాబూ! నేవెళ్ళి గడ్డి దుబ్బుని మేసి, నా క్షుద్బాధ తీర్చుకుంటాను. దాంతో మీ చేప కూడా ఎండ పొడ తగిలి ఎండుతుంది. అందరి సమస్యలూ తీరుతాయి" అంటూ బతిమాలింది.

బండ మనుషులైన రాజు కొడుకులకి, "గొల్లబ్బాయి ఆవుని విప్పలేదన్న" కారణం తప్ప, ఏమీ అర్థం కాలేదు. ఆవు అన్నవన్నీ గాలికి వదిలేసి, గొల్లబ్బాయి దగ్గరకి వెళ్ళిపోయారు. వెనక నించీ ఆవు పెడుతున్న శాపనార్థాలు వాళ్ళకి వినిపించనంత దూరం వెళ్ళిపోయారు. లేకపోతే రాజు కొడుకులు ఆవుని కట్టు విప్పే శ్రమ చేస్తారా, వెళ్ళి గొల్లబ్బాయిని విచారిస్తారు గానీ!

దూరం నించీ గంతు లేసుకుంటూ వస్తున్న రాజు కొడుకుల్ని చూడగానే, గొల్లబ్బాయికి విషయం అర్థం అయిపోయింది. వీళ్ళని సంభాళించక పోతే, తనకి ముప్పొస్తుందని గొల్లబ్బాయికి అర్థం అయిపోయింది. అయినా, ఏమీ ఎరగనట్టు, "ఏంటి బాబులూ? పొద్దుగాల్నే ఇటొచ్చారేం?" అనడిగాడు అమాయకంగా.

"ఏమయ్యా గొల్లబ్బాయీ, గొల్లబ్బాయీ! నీకేవన్నా బుద్ధుందా? ఆవుని కట్టు విప్పక పోతే, ఎలా వెళ్ళి మేస్తుందనుకున్నావూ గడ్డి దుబ్బుని? ఎవళ్ళ పని వాళ్ళు చేసుకోవాలి కదా?" అని కేకలేశారు వాళ్ళు.

"అలా అనకండి బాబులూ! అలా అనకండి! పొద్దుగాల లేసి నప్పట్నించీ పని లోకెల్దామనే సూత్తన్నాను. ఏడా? అవ్వేమన్నా బువ్వెడితేగా? ఏదీ, కాసింత బువ్వ బొజ్జలో కెల్లగానే, పన్లోకి లగెత్తనూ?" అన్నాడు సంజాయిషీగా చెబుతూ.

వాళ్ళకి గొల్లబ్బాయి చెప్పింది సబబుగానే తోచింది. సూఫీయిజం లోంచి కమ్యూనిజం నేర్చుకున్న వాళ్ళా, మరొకరా? పక్కనే వున్న అవ్వ వేపు తిరిగారు. అవ్వ ఏదో అనబోయే లోపలే, "అవ్వా, అవ్వా! గొల్లబ్బాయికి బువ్వెందుకు పెట్ట లేదూ?" అని కాస్త మర్యాదగా అడిగారు.

అసలే అవ్వకి రాజు కొడుకులంటే ఒళ్ళు మంట. వీళ్ళెప్పుడూ తమ సంగతి పట్టించుకుందే లేదని ఆవిడకి కోపం. పన్నులు మాత్రం సుబ్బరంగా దండుకుంటారు. పైపెచ్చు వాళ్ళొట్టి వెర్రి మొహాలవడం చేత, రాజు కొడుకులంటే భయం కూడా లేదావిడకి.

"ఏం సెయ్యమంటారు నాయనల్లారా? నాకాడున్నయీ రెండే సేతులు. నా మొగుడు సచ్చినోడు లేసిన కాడ్నించీ, ఒక్క పనీ సెయ్యకుండా, సద్దెప్పుడెడతానా అని సూత్తా, సుట్ట కాలుత్తా కూసుంటాడు. దాన్కి తోడు పొద్దుగాల్నించీ, పిల్లోడు ఒకటే యేడుపు. సంక దిగితేగా ఇంకో పని సెయ్యడానికి? తవరే సెప్పండి నాయం" అంది గట్టిగా.

అవ్వ ధాటికి రాజు కొడుకులు కాస్త దడుచుకున్నారు. అయినా తమ ప్రశ్నకి సమాధానం దొరికిందని సంతసించారు. ఏడుస్తున్న పిల్లాడి వేపు తిరిగి, "పిల్లవాడూ, పిల్లవాడూ ఎందుకేడుస్తున్నావూ?" అని చాలా ముద్దుగా అడిగారు. చంకలో కూర్చున్న పిల్లాడికి కూడా మాటలొచ్చే వుంటాయి మరి. అయినా వాడు తన ఏడుపు గోలలో, రాజు కొడుకులడిగిన ప్రశ్నని పట్టించు కోకుండా, దగ్గరగా వచ్చిన ఓ రాజు కొడుకు డొక్కలో తన్నాడు ఏడుపాపకుండా! "పిల్లాడు చిన్నయినా, తన్నిన తన్ను గట్టిగానే వుంద"నుకుంటూ, రాజు కొడుకు పిల్లాడికి దూరంగా గెంతాడు. అంత పెద్ద వాడు అలా గెంతడం చూసి, పిల్లాడు ఏడుపాపి, కిసుక్కున నవ్వాడు.

దొరికిందే ఛాన్సని, ఈసారి రాజు కొడుకుందరూ కలిసి, తమ ప్రశ్నని ముక్త కంఠంతో అడిగారు. దానికి పిల్లాడు, "సీమ కుట్టింది" అని చెప్పి, అసలు విషయం గుర్తొచ్చి, మళ్ళీ ఏడుపు లంకించు కున్నాడు. అప్పటికే వాడి గట్టి ఏడుపుకి సున్నిత రాజ కుమారుల కర్ణ భేరీలు చిట్లుతున్నాయి. సమాధానం దొరికిందని సంతోషంతో, గెంతుకుంటూ బయట పడ్డారు. మళ్ళీ వాళ్ళ గెంతుల్ని చూసి పిల్లాడు పక పకా నవ్వాడు.

ఇంటి బయట చూస్తే, అక్కడ బోల్డు చీమలున్నాయి. అందులో పిల్లాడ్ని కుట్టిన చీమ ఏదో తెలియలేదు వాళ్ళకి. కాస్సేపు పరిశీలిస్తే, ఓ పక్కగా పని చేసుకుంటూ, సగర్వంగా తలెత్తుకుని వున్న ఓ శ్రామిక చీమని చూశారు. దాని 'పొగరుమోత్తనం' చూసి, అదే 'అఘాయిత్యం' చేసిందనుకుని, "చీమా, చీమా పిల్లాడి నెందుకు కుట్టావూ?" అని అడిగారు చీమని.

"ఇన్ని చీమలిక్కడుంటే, వాటిలో పిల్లాడిని కుట్టింది నేనే అని ఎందుకనుకున్నారూ?" అని ధాటీగా ప్రశ్నించింది చీమ.

"నీ పొగరుమోత్తనం చూసి" అని అనడానికి ధైర్యం లేక నీళ్ళు నమిలారు వాళ్ళు. మళ్ళీ అదే ప్రశ్న అడిగారు వాళ్ళు.

"అసలే పనిలో వున్నాను. మీలా తిని కూర్చుంటే కుదరదు నాకు. పిల్లాడిని కుట్టింది నేనే! పనీ, పాటా లేకుండా తీరిగ్గా కూర్చుని కుట్టాననుకున్నారా? నా నూగ్గింజ నేను సంపాదించు కుంటుంటే, పిల్లాడొచ్చి నా బంగారు కన్నంలో వేలెట్టాడు. అప్పుడు కుట్టకుండా, ముద్దెట్టుకుంటానా? ఎళ్ళండెళ్ళండి!" అంది చీమ ఝుమాయిస్తూ.

తెల్ల మొహాలు వేశారు రాజు కొడుకులు చీమ ధాటికి. చేప ఎండని రాజ కొడుక్కి బుర్రలో ఓ ఆలోచన తట్టింది.

"మరేం, మరేం, చీమ గారూ, చీమ గారూ! మరేం మీ కన్నం చాలా చిన్నది కదా? పిల్లాడి వేలు మీ కన్నం కన్నా చాలా పెద్దది కదా? మరెలా మీ బంగారు కన్నంలో వేలెట్టాడండీ?" అని లా పాయింటు తీస్తూ, చాలా మర్యాదగా అడిగాడు.

"ఓరి వెర్రి సన్నాసుల్లారా! మాట్లాడే చేపలూ, గడ్డి దుబ్బులూ, ఆవులూ, చీమలూ వున్న కథలో కూడా చీమ కన్నం చిన్నగా వుంటుందా ఎక్కడన్నా? పిల్లాడి వేలే కాదు, మీ కాళ్ళు కూడా పడతాయి. మా పని పాడు చేస్తూ, ఇంకా ఇక్కడే వుండి ప్రశ్నల్తో విసిగిస్తే, మీ కాళ్ళని కూడా కుట్టేస్తాము, నేనూ, మా తోటి శ్రామికులూ. వెళ్ళి రండి ఇక!" అని తిట్టింది చీమ.

దడుచుకున్న రాజు కొడుకులందరూ, "బతుకు జీవుడా" అనుకుంటూ, అక్కణ్ణించీ ఒక్కసారిగా పరిగెత్తుకుని పారిపోయారు.




# అమ్మ కోరిక

- డొక్కా ఫణికుమార్

*తెలుగు జ్యోతి రచనపోటీలో ప్రధమ బహుమతి పొందిన కథ*
*పురస్కార ప్రదాత: శ్రీమతి ప్రభా రఘునాథన్, బెడ్మినిష్టర్, న్యూజెర్సీ*



మాటల మధ్యలో నాన్న "ఒరేయ్, ఇదిగో మీ అమ్మేదో అడుగుతుందిట" అంటూ ఫోను అమ్మకిచ్చారు. "చెప్పమ్మా, ఏంకావాలి?" అన్నాన్నేను. "ఏమీలేదురా చిన్నా, పిల్లలందర్నీ ఓ మాటు చూడాలనుందిరా, వచ్చే వారం దీపావళి కదా, నీకేవైనా ఓ వారం సెలవలు దొరుకుతాయాంటావా?..." అంది అమ్మ తట పటాయిస్తూ. "సెలవలు దొరుకుతాయి, టిక్కట్లే చూసుకోవాలి" అంటుంటే అమ్మ అందుకుని "అందరూ వద్దులేరా. ఇప్పటికిప్పుడు అన్ని టిక్కెట్లు దొరకడం కష్టమే, పోనీ నువ్వొక్కడివైనా..." అంతలో వెనకనుంచీ నాన్న అందుకున్నారు "నీ లౌక్యం మండినట్టే ఉంది, వాడికి నేను చెబుతానుగానీ, నువ్వు కిందకెళ్ళి పాలు పోయించుకో, పాలవాడిందాకణ్ణించీ అరుస్తున్నాడు కాకిలాగా" అని ఫోను తీసుకుని, కాస్త గొంతు తగ్గించి "ఒరేయ్ చిన్నా, మనమంతా పది పన్నెండేళ్ళ క్రితం దీపావళి ఎల్లా జరుపుకున్నామో, ఈ సారి దీపావళి అచ్చం అల్లాగే జరుపుకోవాలని మీ అమ్మేదో పిచ్చికోరిక కోరిందిరా. పాపం

వెర్రిది, ఎప్పుడూ ఏదీ కావాలని అడగదు, ఏ కళనుందో, అడిగింది కదా అని నేనూ సరేనన్నాను. లండన్ నుంచీ బాబిగాడు, ఆస్ట్రేలియా నుంచీ అమ్మలూ వచ్చే శనివారం వస్తున్నామని నిన్ననే కన్ఫర్మ్ చేసేసారు. ఇహ నువ్వు అమెరికానుంచీ ఈ ఆదివారం దిగడం, పై ఆదివారం వెళ్ళిపోవడం. మనం ఐదుగురమే ఉండాలిట, అదీ విషయం. మళ్ళా ఈ మాటలన్నీ కోడలు దగ్గర అనకు, పాపం బాధపడుతుంది."

"సరే నాన్నా, నేను మేనేజ్ చేస్తాను. ఇవాళే టిక్కెట్టు బుక్ చేసి, రేపు కన్ఫర్మ్ చేస్తాను మీకు. ఈ కోరికేదో బానే ఉంది." అన్నాను నవ్వుతూ.

"అప్పుడే ఏం చూసావు. ఇక్కడ దిగాక చూద్దురుగాని తమాషా. సరే నువ్వు టిక్కెట్టు సంగతి చూసి ఫోను చెయ్యి, ఉంటాను" అంటూ ఫోను పెట్టేసారు నాన్న...

✷✷✷

విమానం కుదుపుకి మళ్ళీ ఈ లోకంలోకొచ్చాను. అప్పుడే హైదరాబాదులో దిగిపోతోంది విమానం. అరగంటలో లగేజీ తీసుకుని బైట కొచ్చేసరికి, దూరంగా చెయ్యూపేస్తూ పట్టుచీర కట్టుకుని అమ్మ, పక్కనే నాన్న. బయట బాబిగాడు అప్పటికే టాక్సీ మాట్లాడేసి ఎదురుచూస్తున్నాడు. "ఎందుకే అమ్మా ఇంత అర్ధరాత్రి నువ్వు రావడం నాకేవైనా కొత్తేవిటే?" అన్నాను.

"మీకు పాతైనా, మిమ్మల్ని రిసీవ్ చేసుకోవడం మాకెప్పుడూ కొత్తేరా బడుద్దాయి" అంది అమ్మ.

నాన్నతోటీ, అమ్మతోటీ కబుర్లు చెబుతూ "పాపం, అమ్మల్నొదిలేసారేం, దాన్ని కూడా తోలుకొచ్చేయాల్సింది" అన్నాను నవ్వుతూ. అందరం ఇల్లు చేరాం. కబుర్లు చెప్పుకుని పడుకునే సరికి ఏ ఐదో అయ్యింది. మర్నాడందరూ తెమిలేసరికి అపరాహ్ణమైంది. నాన్న చెప్పడం మొదలు పెట్టారు.

"సరే, ఇంక మిగిలిన తమాషా వినండి. రేపట్నించీ మన దినచర్య ఇది. తొమ్మిదిగంటలకల్లా బాబిగాడు సూటూ, బూటూ తొడుక్కుని ఆఫీసుకెళ్ళిపోవాలి. తొమ్మిదింపావుకి... ఒరేయ్ చిన్నా, నువ్వు బేగ్ తగిలించుకుని, ఇంజినీరింగు కాలేజీకెళ్ళిపోవాలి. తొమ్మిదిన్నరకి నేను స్కూటరు మీద అమ్మలునెక్కించుకుని వెళ్ళి, దాన్ని కాలేజీలో దింపేసి, ఆఫీసుకెళ్ళిపోవాలి. అందరికీ అమ్మ లంచ్ బాక్సులిస్తుంది, తీసుకుని వెళ్ళాలి. మళ్ళీ నాలుగింటికి చిన్నా, ఐదింటికి అమ్మలూ, ఆరింటికి బాబీ వెనక్కి రావాలి."

"బావుంది, బావుంది, కానీ అంత సేపు మనం బైట ఏం చెద్దాం?" అన్నాడు బాబి.

"నువ్వు ముందెళ్ళి ఆ మొగలో ఇరానీ హోటలు దగ్గర ఉండు. కాసేపయ్యాకా చిన్నా వస్తాడు కదా, ఇద్దరూ కలిసి ఏ విశాలాంధ్రకో, సంగీత్ సాగర్కో పోయి మీక్కావలసిన పుస్తకాలూ, డీవీడీలూ కొనుక్కోండి. నేనూ, అమ్మలూ షాపింగుకి పోతాం. ఎంతా... సోమ, మంగళ, బుధ.. మూడ్రోజులే. గురువారం దీపావళి, బెంగుళూరులో ఇండియా ఆస్ట్రేలియా క్రికెట్టు మాచ్చీని. శనాదివారాలు మళ్ళీ ప్రయాణాల హడావిడే." అన్నారు నాన్న.

మర్నాడు సోమవారం ఉదయం నేనూ, బాబీ హోటలు దగ్గర కలుసుకున్నాం. "నాన్న శుక్రవారం గురించి చెప్పలేదు, ఎందుకు?" అడిగాన్నేను. "నాకూ అదే అర్థంకావట్లేదు" అన్నాడు చిన్నా. శుక్రవారం గురించి ఎవరు చెప్పగలరో ఆయన దగ్గరికెళ్ళాం. విషయం అర్థమైంది. ఆ తరువాత మూడు రోజులు ఎల్లా గడిచాయో తెలియదు. గురువారం పగలంతా క్రికెట్టు చూస్తూ, గోలచేస్తూ గడిపేసాం అందరం. టీవీ సౌండులో ఒకళ్ళ మాట ఇంకొకళ్ళకి వినపడటమే కష్టంగా ఉంది. అమ్మ అరగంటకోసారి టీ, గంటకోసారి తాయిలాలూ తెచ్చి ఇచ్చింది. మేం వస్తున్నామని స్వయంగా చిచ్చుబుడ్లూ, మతాబులూ, జువ్వలూ కట్టి ఉంచారు నాన్న. రాత్రి మేము అవన్నీ కాలుస్తుంటే, ఇంటిముందు ప్రమిదల్లో దీపాలు వెలిగించారు అమ్మా, అమ్మలూ. ఒక్కసారి అందరం నిజంగానే పదేళ్ళు వెనక్కెళ్ళిపోయాం. ఏదో కాలయంత్రంలో ఎక్కేసి వెనక్కెళ్ళిపోయిన అనుభూతి. అమ్మ కళ్ళలో మెరుపు ముందు దీపాలూ, దివిటీలూ వెలవెలబోయాయి.

శుక్రవారం వచ్చేసింది. పదిగంటలకల్లా మామయ్య కారు సిద్ధంగా ఉంది. "ఏమీ లేదురా, మామూలు చెకప్పే, మధ్యానానికల్లా వచ్చేస్తాను" అంటూ బాబిగాణ్ణీ, నన్నూ, అమ్మలునీ ముద్దుపెట్టుకుని కారెక్కింది అమ్మ. పక్కనే నాన్న కూర్చున్నారు. కారు వెళ్ళిపోయింది. వెంటనే అందరం ఫోను దగ్గరికి పరిగెత్తాం. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఫోను చేసి స్పెషలిస్టు డాక్టరుగారితో మాట్లాడాం. 'మీకు తెలుసును కదా, ఈ ఓపెను హార్టు సర్జరీలు మేము ప్రతిరోజూ చేస్తుంటాం. ఏమీ భయపడాల్సిన పనేలేదు. జస్ట్ కొన్ని గంటల్లో పూర్తైపోతుంది. వాల్వ్ కొద్దిగా బ్లా కయ్యాయి, సోమవారం చెప్పాను కదా, డోంట్ వర్రీ, ఉయ్ విల్ టేక్‌కేర్." అన్నారు మా వీధిలో కాపురముండే డాక్టర్ కృష్ణారావుగారు. ఆపరేషన్ పూర్తైంది. శనివారం ఉదయానికల్లా అమ్మ మాట్లాడగలిగింది.

"ఏరా చిన్నా, మీకు ముందే తెలుసునా?" అంది అమ్మ అనుమానంగా.

"లేదే, తెలియదు" అన్నాన్నేను,

"ఉత్త వెధవలు మీరిద్దరూ తోడు దొంగలు, మీకు తెలిసే ఉంటుంది..." అంది నవ్వుతూ.

రాత్రైంది. నాన్నా, అమ్మలూ ఇంటికెళ్ళారు. బాబిగాడు కాఫీ తీసుకురావటనికి కిందకెళ్ళాడు. అమ్మ పక్కనే నేనున్నాను.

"చిన్నా.. మీరంతా అమ్మ ఇలా ఎందుకు చేసింది? అనుకుంటున్నారు కదా. చెబుతా విను. మొన్న దసరా రోజున గుళ్ళో లలితా సహస్రం చదివొస్తుంటే ఉన్నట్టుండి ఆయాసమొచ్చేసి, ఊపిరందకపోతే, నాన్న మన కృష్ణారావుగారికి చూపించారు. ఆయనేమో రెండురోజులు పరీక్షలన్నీ చేసి, ఆపరేషనన్నాడు. గుండె ఆపరేషనంటే ఏవైనా జరగచ్చును కదా, అప్పుడు నా కనిపించింది - నేను చచ్చిపోతే ఎలాగా? అని. చావందరికి వస్తుంది, కానీ, అదీ ప్రశాంతంగా, కోరికలు తీరినవాడికొస్తే అందరికీ హాయి - అనుకున్నాను. నాకింకా తీరని కోరికలేమిటా అని చాలా ఆలోచించ్చానా. ఏమీ తట్టలేదు. నాకన్నింటికన్నా నచ్చిన పనేదైనా చెయ్యాలనిపించింది. అదేమిటో తెలుసా, మా నాన్న గుండెలమీదెక్కి ఆయనతో ఆడుకోవడం. ఇప్పుడు నేను ఆయన దగ్గరకెళ్ళే వయసే గానీ, ఆయన రాలేరుగా, అందుకే దాని తరువాత ఇంకేమిటిష్టమా అని ఆలోచించాను. మీతోటీ, నాన్నతోటీ సమయం గడపడం ఇష్టమనిపించింది. అందునా బాబిగాడికి ఉద్యోగం వచ్చేసి, నీ ఇంజినీరింగు పూర్తైపోతున్న రోజులు తిరిగి ఒక్కసారి గడపాలనిపించింది. ఎందుకంటే, - వాడు సెటిలైపోయాడు, నువ్వింజినీరైపోయి సెటిలైపోతావనే ధైర్యం, అమ్మల్ని చూసుకోవడానికి నాన్న, అందొచ్చిన ఇద్దరు అన్నలూ ఉన్నారనే ధైర్యం, ఒక భద్రతా భావం. దేనికీ లోటులేని ఒకగొప్ప జీవితాన్ని నాకిచ్చాడురా దేవుడు. దేవుడులాంటి మీ నాన్ననీ, దేశాల్లేలే బిడ్డల్నీ - బంగారమంటి కుటుంబాన్నిచ్చాడు దేవుడు. అందుకే ఆయనకి కృతజ్ఞత చెప్పుకోని రోజు లేదు. ఈ ఆపరేషను పుణ్యమా అని నాకేదైనా అయితే, అయ్యో అమ్మని చూడలేకపోయామేనని మీరంతా బాధపడతారని రమ్మన్నానా. అందరినీ ఇబ్బంది పెట్టడం ఇష్టం లేకే, మిమ్మల్ని మాత్రమే రమ్మన్నది. మరేం కాదురా. మిమ్మల్ని పొద్దున్నే బయటకి పంపేయడం, సాయంత్రం రమ్మనడం, లంచిబాక్సులివ్వడం ఇవ్వన్నీ పిచ్చి పనులే. కానీ ఆ పనులు ఎం...త ఆనందాన్నిచ్చాయో మీకు తెలీదురా. ఈ నాలుగురోజుల్లోనూ నేను జీవితంలో ఆనందాన్నంతా అనుభవించేసానా. ఇహ ఇప్పుడూ ఆ పైవాడు ఎప్పుడు రమ్మంటే అప్పుడు రెడీ... సరే, కొంచెం నిద్దరొస్తోంది, బాబిగాడొస్తే ఇద్దరూ కాస్త కాఫీ తాగి, అలా బైట తిరిగిరండి, ఇంకేం భయంలేదులే" అంటూ నిద్రలోకి జారుకుంది అమ్మ. అమ్మ ఎంత పిచ్చిది!!

ఈ ప్రపంచమంతా అల్లాంటి పిచ్చివాళ్ళతో నిండిపోతే ఎం...త బాగుండును!!

✷✷✷



*శ్రీనివాస ఫణికుమార్ స్వస్థలం అమలాపురం. హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ నుంచి* M.S. Solid State Physics, SPSU(Atlalanta) *నుంచి* M.S.Computer Science *చేశారు. ప్రస్తుత నివాసం అట్లాంటా. ఇ-మెయిల్* phanidokka@yahoo.com




# బంధం

- వడ్లమాని పద్మావతి

*తెలుగు జ్యోతి రచన పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ*

*పురస్కార ప్రదాత: రామకృష్ణ ఏలేశ్వరపు, ఈస్ట్‌బ్రన్స్‌విక్, న్యూజెర్సీ*

సిటీ నుంచి గంటన్నర బస్సు ప్రయాణం చేస్తే వస్తుంది 'పూర్ణమ్మపాలెం' అనే చిన్న పల్లెటూరు. కాలువగట్టునే ఉన్న ఆ ఊరు పచ్చని పొలాలతో, కొబ్బరిచెట్లతో సస్యశ్యామలంగా అందంగా ఉండి ఊరువాళ్ళకే కాదు ఎవరికైనా నచ్చుతుంది. అన్నపూర్ణాదేవి విగ్రహం వెలిసిందని 'పూర్ణమ్మపాలెం' అనే పేరు పెట్టుకుని అమ్మవారి ఆలయం కట్టించారు ఆ ఊరు పెద్దలు. ఆలయానికి కొద్ది దూరంలో చిన్న ఎలిమెంటరీ స్కూలు, పక్కనే జమిందారు రామయ్యగారిల్లు. పేరుకి తగ్గట్టు రామయ్యగారు రాముడే ఆ ఊరి ప్రజలకి సర్పంచి సత్యమూర్తిగారు, స్కూలు మాస్టర్ విశ్వనాథంగారు అందరూ కలిసి మెలిసి మంచితనంతో పల్లెటూరి పడుచుదనాన్ని, పంట పొలాల్ని కాపాడుకుంటూ ఊరుని అభివృద్ధిలోకి తెచ్చారు.

ఎర్రమట్టి రేపుకుంటూ గతుకుల రోడ్డు మీద ఒకే ఒక్క బస్సు జనాన్ని ఉయ్యాలలూపుకుంటూ రోజుకి రెండుసార్లు అతిభారంగా వచ్చేది ఆ రోజుల్లో! ఇప్పుడు నల్లని తారు రోడ్డు మీద దర్జాగా విమానంలా వెళుతోంది బస్సు. అక్కడక్కడ ఆటోలు కూడా కనిపిస్తున్నాయి. బస్సులు కూడా పెంచినట్టున్నారు. రోడ్డు మారినా రోడ్డు ప్రక్కన కాలువ, కాలువగట్టున పంట పొలాలు మార్పేమీ లేదు. మరి ఊరు ఎలా ఉందో, ఊళ్ళో అంతా ఎలా ఉన్నారో, తననెవరైనా గుర్తుపడతారో లేదోనని అనుకుంటున్న 'పూర్ణ' ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ 'పూర్ణమ్మపాలెం.. 'రండమ్మా, దిగండి' అంటూ అరిచాడు బస్సు కండక్టర్.

కాలువ గట్టున చింతచెట్టు దగ్గర అదే బస్‌స్టాప్‌లో ఆగింది బస్సు. ఆలోచనలని అవతలకి నెట్టి ఎంతో ఉద్వేగంతో బస్సు దిగింది పూర్ణ. "పదిహేను సంవత్సరాల తర్వాత మళ్ళీ మా ఊరు వచ్చాను. నేను పుట్టి పెరిగిన 'పూర్ణమ్మపాలెం'లో అడుగుపెట్టాను. ఎంతో ఆనందం, ఏదో తెలియని ఉత్సాహం, ఏమిటీ వింత అనుభూతి" అణవణువు కంపిస్తూవుంటే మెలమెల్లగా నడుస్తూ స్వగతంలో అనుకుంది పూర్ణ.

చింతచెట్టు నుంచీ నాలుగైదు అడుగులు ముందుకి వేయగానే కాలువమీద చిన్న వంతెన. వంతెన దాటగానే ఊరు... అన్నీ అలాగే ఉన్నాయి. పెద్ద మార్పులేం లేవు పదిహేనేళ్ళు పట్నంలో వాహనాల ధ్వని కాలుష్యంలో గళ్ళువిడి ప్రశాంతంగా ఉన్నాయి. అన్నపూర్ణాదేవి ఆలయం నుంచీ విన్పిస్తున్న మంగళవాయిద్యాలు హృదయాన్ని సున్నితంగా మీటుతున్నాయి. పట్నంలో పచ్చదనం మచ్చుకైనా చూడని తన కళ్ళు, సిమెంట్ కట్టడాలు చూసి చూసి రాళ్ళైపోయిన తన కళ్ళు పంటపొలాల హరితవనం చూసి ఆనందంతో సెలయేళ్ళు ఎలా ఉండగలిగాను? ఉద్యోగరీత్యా తప్పదు. కనీసం పెద్దవయసు వచ్చాక అయినా తిరిగి మళ్ళీ ఇక్కడికే రావాలి. మిగిలిన జీవితం ఇక్కడే గడపాలి అంతే!" ఇలా నిశ్చయించుకుని ఊళ్ళోకి  అడుగు పెట్టింది పూర్ణ.

"ఊరికి కొత్తా అమ్మగారు! బండి కట్టమంటారా? ఎవరింటికి?" అని అడిగిన బండివాడితో "వద్దు బాబు, విశ్వం మాష్టారి ఇంటికి నడిచే వెళతాను" అన్న సంధానం విని ఊళ్ళో కొత్తగా కనిపించిన ఆవిడ ఊరుకి కొత్తకాదని అర్ధం చేసుకుని వెళ్ళిపోయాడు బండివాడు.

"విశ్వం మాష్టారింటికా? ఎవరది?" ఒకింత ఆశ్చర్యంగా అడిగారు ప్రక్కగా నడిచి వెళుతున్న ఓ పెద్దాయన. అవును మరి విశ్వం మాష్టారు చిన్నవయసులో ఆ ఊళ్ళోకి వచ్చింది మొదలు ఇంతవరకు అంటే దాదాపు 25, 30 సంవత్సరాలుగా ఆయన ఇంటికి బంధువులు, స్నేహితులు ఎవరూ రాలేదు. అందుకే పెద్దాయనకి అంత ఆశ్చర్యం.

అడిగిన ప్రశ్నకి తలెత్తి చూసిన పూర్ణ "సర్పంచ్ మామయ్యా! నేను, పూర్ణని గుర్తుపట్టలేదా?" ఎదురు ప్రశ్నించింది.

"పూర్ణా! ఎవరూ రాజయ్య కూతురు పూర్ణవా? ఎంత పెద్ద దానివయ్యావు. బాగున్నావా అమ్మా!" ఆప్యాయంగా పలకరించారు సత్యమూర్తిగారు.

"బాగున్నాను మామయ్యా! మీరెలా ఉన్నారు? మన ఊరు వాళ్ళంతా ఎలా ఉన్నారు? జమిందారు మామయ్య ఎలా ఉన్నారు? మన ఊరు వాళ్ళంతా ఎలా ఉన్నారు?" అంటూ, అన్ని సంవత్సరాల తర్వాత కూడా తనని వెంటనే గుర్తుపట్టి ఆప్యాయంగా పలకరించిన సర్పంచిగారి మీద ప్రశ్నల వర్షం కురిపించింది పూర్ణ.

"అందరూ బాగున్నారమ్మా! మీ ఆయన ఎలావున్నారు? పిల్లలెంతమంది?"

"ఇద్దరు మగపిల్లలు, పెద్దవాడు 8 వతరగతి, చిన్నవాడు 5 వతరగతి చదువుతున్నారు" అంది పూర్ణ సర్పంచిగారి ప్రశ్నలకు సమాధానంగా.

"పిల్లల్ని బాగా చదివించు. వాళ్ళని కూడా నీ అంతవాళ్ళని చెయ్యి" అన్నారుఆయన.

"అలాగే! మామయ్యా! ఆ చదువుకోసమే కదా నేను మన ఊరు వదిలి వెళ్ళాను. చదువే నన్నీ రోజు ఇంత స్థితికి తెచ్చింది. ఇదంతా విశ్వం మాష్టారి చలవే! మాష్టారు ఎలా ఉన్నారు? ఎన్నో ఉత్తరాలు రాశాను. ఒక్కదానికీ జావాబు లేదు. అందుకే ఇంక నేనే వచ్చాను" అంది పూర్ణ.

"మంచి పని చేశావమ్మా! మాష్టారి గురించి నీకు తెలియనిదేముంది? ఒంటరిగా ఈ ఊళ్ళో అడుగుపెట్టిన మాష్టారూ ఈ రోజుకీ అలా ఒంటరిగానే ఉన్నారు. తనకంటూ ఏమీ మిగుల్చుకోకుండా ఊరుకోసం, ఊళ్ళో అందరూ చదువుకోవాలని పాటుపడిన నిస్వార్ధ శ్రమ జీవి ఆయన. మన స్కూల్ని కూడా హైస్కూల్ చేశారంటే అదంతా మాష్టారి చలవే!" అన్నారు సర్పంచ్‌గారు.

"ఔను! మాష్టారు లేకపోతే మన ఊరు ఎలా ఉండేదో? సరే మామయ్యా! నేను అమ్మవారి దర్శనం చేసుకుని మాష్టారి ఇంటికి వెళతాను. సాయంత్రం అందర్నీ కలుస్తాను."

"సరే! తల్లీ, నేను రామయ్యగారింటికి వెళుతున్నాను. సాయంత్రం మేము మాష్టారిగారింటికే వస్తాము ఉంటానమ్మా!" అన్న సర్పంచిగారితో సరేనని చెప్పి ఆలయంలో అమ్మవారి దర్శనం చేసుకుని బయటకి వచ్చింది పూర్ణ.

మాష్టారు విశ్వనాధంగారింటివైపు నడుస్తూ ఆ ఆలయంతో తనకున్న అనుబంధం, మాష్టారితో తనకున్న అనుబంధం అన్నీ జ్ఞాపకం చేసుకుంటోన్న పూర్ణకి గతం కళ్ళముందు కదిలింది.

***

"రండి బాబుగారు! తమరు ఈ ఊరుకి కొత్తా బాబయ్యా! అన్నపూర్ణమ్మ తల్లి వెలసిన కాడినుంచీ ఇక్కడే పూలు, టెంకాయలు అమ్ముకుంటు బతుకుతున్నామయ్యా! మిమ్మల్ని మాత్రం ఈ యేల మొదటిసారి సూస్తున్నా!"

"అవును, నా పేరు విశ్వనాధం, ఈ ఊరు స్కూలు మాష్టర్‌గా వచ్చాను. మరి నీ పేరేమిటి?"

"నా పేరు రాజయ్య బాబుగారు. ఇగో ఈ పూలు, టెంకాయలు తీసుకోండి బాబు! పూర్ణా! ఈ బుట్టబాబుగారికి ఇచ్చి, చెప్పులు ఆడపెట్టి, ఆయనగోరి కాళ్ళకి దణ్ణమెట్టు" అన్నాడూ రాజయ్య.

"సరే అయ్యా!" అంటూ పరిగెత్తుకు వచ్చి, విశ్వనాథం గారి చెప్పులు తియ్యబోయింది ఐదేళ్ళ పూర్ణ.

"అయ్యయ్యో! చిన్నపిల్లతో ఇలాంటి పన్లు చేయిస్తావా? ఇంతకీ ఈ అమ్మాయి నీ కూతురా?" అడిగారు విశ్వనాథంగారు.

"అవును బాబయ్యా! దీన్ని కని వాళ్ళమ్మ ఆ తల్లిని చేరుకుంది. అన్నపూర్ణమ్మ తల్లి పేరెట్టుకుని సాకుతున్నానయ్యా! ఆ తల్లే దీన్ని కన్నతల్లిలా కాపాడుద్దని, గుడికాడే ఇద్దరం కాలక్షేపం చేస్తున్నాం" అన్నాడు రాజయ్య.

"అయ్యో! అలాగా! ఈ పూర్ణని ఆ పూర్ణమ్మ తల్లి చల్లగా కాపాడుతుంది. ఏం పాపా నాతో పాటు గుడికి వస్తావా?" అడిగారు మాష్టారు.

"నా పేరు పాపకాదు పూర్ణ. నేను బడికి వస్తా!" అంటూ ముద్దుముద్దుగా పలికింది పూర్ణ.

'ఓ అలాగే తప్పకుండా వద్దువుగాని' అని చెప్పి ఆలయంలోకి వెళ్ళారు విశ్వనాధంగారు.

దర్శనానికి వెళ్ళేవారు అడపాదడపా పూలు కొనుక్కెళ్ళతం తప్ప తనతో ఇలా ఎవరూ ఎప్పుడూ మాట్లాడటం ఎరగని రాజయ్య మాష్టారి మాటల్లో ఆదరణకి, ఆప్యాయతకీ పొంగిపోయాడు.

ఆ రోజు మొదలుకొని ప్రతిరోజు విశ్వం మాష్టారు దర్శనానికి రావటం, రాజయ్యని పూర్ణని పలకరించటం అలవాటుగా మారింది. ఓ రోజు పూర్ణ బడికి వెళ్తానని మారాం చెయ్యటం, రాజయ్య వద్దని వారించటం చూసిన మాష్టారు "ఏం రాజయ్యా! నీ కూతురెందుకో మారాం చేస్తున్నట్టుంది?" అన్నారు.

"ఏం లేదు బాబయ్యా! బడికి పోయి సదువుకుంటానంటది. మా బోటి పేదోళ్ళకి సదువంటే మాటలా? మీరే సెప్పండి? ఓ సారి మీరు ఆ బడికాడికి తీసుకెళ్ళండి బాబు. బడి సూసి వత్తే దాని ఉబలాటం తీరుద్ది."

అన్న రాజయ్యతో "అలాగే తప్పకుండా తీసుకెళతాను. అయినా చదువుకోవడానికి పేదా గొప్పా తేడా ఏముంది? చదువుకోవాలనే ఆసక్తి ఉండాలి అంతే! ఏం పూర్ణా ఇప్పుడూ నాతో వస్తావా?" అని అడిగారు మాష్టారు.

"ఓ వస్తా! వచ్చి బడి సూస్త" అంది పూర్ణ.

అది మొదలు బడి విడిచిపెట్టాకా పూర్ణా రోజూ బడి దగ్గరకి వెళ్ళటం, బడి ఆవరణలో ఉండే నల్లబోర్డు మీద రాసి ఉన్న నీతివాక్యాలు చూసి అక్కడే మట్టిలోనూ, ఇసుకలోనూ వేలితో రాసి నేర్చుకోవటం, అది మళ్ళీ గుడి దగ్గర మట్టిలో రాసి మననం చేసుకోవటం చేసేది.

ఒకరోజు అలాగే బుట్టలో ఉన్న రంగురంగుల పూలని 'నీతివాక్యాలు' అనే మాటగా పేర్చి ఉండటం చూసిన మాష్టారు రాజయ్యతో "ఏం రాజయ్యా! ఇది ఎవరు పేర్చారు?" అని అడిగారు.

"నా కూతురు బాబు. రోజూ బడిదాకా పోయి వచ్చి ఇట్టాగే ఏంటో మట్టిలో రాస్తుంది. ఈ ఏల ఇట్టా పూలతో పేర్చింది" అన్నాడు రాజయ్య.

'ఆఁ ..అలాగా!' అని ఆశ్చర్యపోయిన మాష్టారు మర్నాడే పూర్ణకి పలక బలపాలు తెచ్చి ఇచ్చారు.

పలక చూసిన పూర్ణ చిన్ని ముఖం అందుకోలేనిదేదో అందినంత సంబరంతో వెలిగిపోయింది. పలక అందుకని వెంటనే తను అంతవరకు బడి బయట బోర్డు మీద చూసి నేర్చుకున్న నీతి వాక్యాలన్నీ పలక రెండువైపులా రాసి మాష్టారు బయటికి రాగానే పరుగెత్తి కెళ్ళి ఆయనకి చూపించింది పూర్ణ.

ముత్యాల్లాంటి అక్షరాలతో కేవలం 5, 10 నిముషాల సమయంలో అన్ని నీతి వాక్యాలు గుర్తుపెట్టుకుని రాసిన పూర్ణ అఖండమైన తెలివితేటల్ని మనసులోనే ప్రశంసించి, "రాజయ్యా! అమ్మాయికి అక్షరాలు దిద్దటం ఎవరు నేర్పించారు?" అని అడిగారు.

"ఎవరూ నేర్పలేదు బాబుగారు, బడి కాడ చూసి మట్టిలో రాసి నేర్చుకున్నట్టుంది బాబు, ఏవో పిచ్చిరాతలు" అన్న రాజయ్యతో, విశ్వనాథంగారు

"భలేవాడివే! ఇవి పిచ్చిరాతలేంటి?" అని "పూర్ణా! ఇలా రామ్మా! ఈ రాసినవన్నీ చదువు" అన్నారు పూర్ణకి పలక చూపించి.

"నాకు రాదు మాష్టారూ!" అని అమాయకంగా చెప్పిన పూర్ణతో "చూడమ్మా ఇవాల్టి నుంచీ నీకు అక్షరాలు నేను నేర్పుతాను. సరేనా! అయితే ఇవాల్టికి ఈ పలక ఒకసారి నాకు ఇయ్యి. నీకు నేను మళ్ళీ రేపు ఇచ్చేస్తాను" అన్నారు మాష్టారు.

"సరే మాష్టారూ తీసుకోండి" అంటూ ఆకాశాన్నందుకున్న ఆనందంతో పలక ఆయన చేతికిచ్చింది పూర్ణ.

పలక తీసుకుని తిన్నగా రామయ్యగారింటికి వెళ్ళారు విశ్వనాథం మాష్టారు.

"రండి మాష్టారూ! కూర్చోండి! ఏమిటీ ఇలా వచ్చారు?" అడిగారు రామయ్యగారు.

"ఏం లేదు జమిందారుగారు. ఈ పలక మీద ఉన్నవి చదవండి" అని పలక ఆయన చేతికిచ్చారు మాష్టారు.

"దురాశ దుఃఖమునకు చేటు," "విద్యలేనివాడు వింత పశువు," "సర్వేజనాః సుఖినోభవంతు", "పరోపకారం మిదం శరీరమ్" ఇలా అన్నీ చదివిన రామయ్యగారు "ఇదేమిటి మాష్టారు? పలక నిండా నీతివాక్యాలు రాసి చదవమని నాకిచ్చారు? నాకు ఇవన్నీ తెలియవనా? లేక వీటిలో నేనేదైనా తప్పాననా?" అన్నారు.

"అయ్యయ్యో! అదేం కాదండి. ఇవన్నీ చదవంటే తెలియని ఒక ఐదేళ్ళ పాప చూసి రాసినవంటే నమ్ముతారా?" అని అడిగారు మాష్టారు.

"నిజంగానా? ఎవరా అమ్మాయి?" అని ప్రశ్నించిన రామయ్యగారితో, "అది చెప్పాలనే వచ్చాను. గుడి దగ్గర పూలు అమ్ముకునే రాజయ్య కూతురు పూర్ణ. పలకా బలపం కూడా కొనలేని పేదవాడు. ఫీజులు కట్టలేడు. మీరు అనుమతిస్తే ఆ అమ్మాయిని స్కూల్లో చేర్పించి చదువు చెప్పాలని అనుకుంటున్నాను, పూలు అమ్ముకునే పిల్లని ఊళ్ళో పిల్లలందరితో కలిపానని ఈ ఊరు పెద్దలు ఆక్షేపిస్తారేమోనని ఆలోచిస్తున్నాను" అన్నారు విశ్వనాథంగారు.

"ఎవరో ఆక్షేపిస్తారన్న మాట పక్కన పెడితే అసలు ఆడపిల్లకి అందులోనూ పేద పిల్లకి చదువెందుకయ్యా!" అన్న సర్పంచి మాటలు విని అటు చూశారు వాళ్ళిద్దరూ!

"రావయ్యా! సత్యమూర్తి! విన్నావు కదా మాష్టారు చెప్పింది. కానీ ఆ పాప రాసినవి చూస్తే చదువంటే మంచి ఆసక్తి కనపడుతోందయ్యా!" అన్నారు రామయ్యగారు.

"అంతేకాదు సత్యమూర్తిగారూ ఇంత ఆసక్తి ఉన్న పిల్లల్ని చదివిస్తే వాళ్ళ వల్ల మన స్కూల్‌కి కాదు గ్రామానికి కూడా మంచి పేరు వస్తుంది. రాష్ట్ర స్థాయిలో ఒక గుర్తింపు కూడా రావచ్చు. మీరంతా ఒప్పుకుంటే ఆ అమ్మాయిని నేను చదివిస్తాను" అన్నారు విశ్వనాథంగారు.

"సరే! మాష్టారూ మీరు మా ఊరు వచ్చినప్పట్నించీ స్కూలు ఎంతో అభివృద్ధిలోకి తెచ్చారు. మాలో ఒకరై ఈ గ్రామం కోసం ఎంతో సహాయం చేశారు. ఎన్నో మంచి సలహాలిచ్చారు. ఈ సారికి మీ మాట ప్రకారమే కానిద్దాం" అన్నారు జమిందారు రామయ్యగారు.

"మీరు సరేనంటే నేను కూడా మీమాటే! ఎంతవరకు చదువుతానంటే అంతవరకు అందరం కలిసే చదివిద్దాం. వెంటనే ఆ అమ్మాయిని స్కూల్లో చేర్పించండి మాష్టారూ!" అన్నారు సర్పంచి సత్యమూర్తిగారు.

"ఈ మాట చాలండి! కానీ ఈ రెండూ నెలల్లో అక్షరాలు చదవటం అంకెలు మొదలైనవి నేర్పిస్తాను. వేసవి సెలవలు కాగానే స్కూల్‌కి రమ్మంటాను. సరే ఇంక నేను వెళ్ళొస్తాను" అని చెప్పి బయటికి వచ్చి ఒక నోట్‌బుక్, పెన్సిలు కొని పూర్ణకి ఇచ్చి అ,ఆలు నేర్పించారు మాష్టారు..

అక్షరాలన్నీ ముందే రాయటం నేర్చుకున్న పూర్ణకి అవి గుర్తుపట్టి చదవటానికి ఎంతో సమయం పట్టలేదు. నెలలోనే అక్షరాలు, గుణింతాలు, వత్తులు, అంకెలు, ఎక్కాలు మొదలైనవన్నీ నేర్చుకుని మాష్టార్నే అబ్బురపరచింది.

అంతేకాదు, గుళ్ళో వినిపించే భక్తి పాటలు, స్తోత్రాలు విని అవి కూడా రాసి చూపించేది మాష్టారుకి. పూర్ణ మేధాశక్తికి ఆశ్చర్యపోయి సాక్షాత్తూ సరస్వతీ అనుగ్రహంతో పుట్టిన ఈ అమ్మాయి అపర సరస్వతే అవుతుందనుకుని స్కూలు తెరవగానే నేరుగా 3వతరగతిలో కూర్చోబెట్టారు విశ్వం మాష్టారు.

అది మొదలు ఇంక తిరుగులేకుండా 6 వ తరగతి వరకు ఆ ఊళ్ళో చదివి 7 వతరగతి నుంచి ప్రక్క సిటీకి వెళ్ళి చదువుకుని పదవ తరగతిలో స్టేట్‌ఫస్ట్‌లో పాస్ అయ్యింది పూర్ణ.

పరీక్షా ఫలితాలు వచ్చిన రోజు గ్రామస్థులందరికీ సంతోషమే కాకుండా స్టేట్‌ఫస్ట్ తెచ్చుకుని ఊరుపేరు నిలబెట్టిన పూర్ణంటే ఒక ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది వారందరికి.

"ఏం రాజయ్యా! పట్నం తీస్కెళ్ళి చదివించటానికి అంతగా ఆలోచిస్తున్నావు? మేమంతా లేమా? డబ్బు గురించి నీవేమీ దిగులుపడకు. స్టేట్ ఫస్ట్ వచ్చిన పూర్ణకి ఎక్కడైనా ఫ్రీ చదువే! మా మాట విను. మంచి భవిష్యత్తు వున్న పిల్ల. బాగా వృద్ధిలోకి వస్తుంది."

"పూర్ణకి అన్నపూర్ణమ్మ తల్లి అనుగ్రహంతో పాటు సరస్వతీదేవి కటాక్షం కూడా ఉంది రాజయ్యా! ఆ తల్లి ఆశీర్వాదం ఎప్పుడూ ఉంటుంది. ఆలోచించక పట్నం తీసుకెళ్ళి చదివిందు" అన్నారు పూజారి మాధవశర్మగారు.

"సరే బాబు! ఇంతమంది పెద్దవారి మాట కాదనలేను. పుట్టి పెరిగిన పల్లెటూరు వదిలి ఏమీతెలియని పట్నంలో ఎలాగుండాలోనని దిగులు బాబు" అన్నాడు రాజయ్య.

"దిగులేం లేదు. నేను వచ్చి మీకు అన్ని ఏర్పాట్లు చేస్తాను" అన్నారు విశ్వం మాష్టారు.

అంతే! ఇంటర్మీడియట్‌లో చేరాలని పట్నం వెళ్ళిన ఇన్నేళ్ళ తర్వాత 'జిల్లా కలెక్టర్' అయి మళ్ళీ 'పూర్ణమ్మపాలెం'లో అడుగు పెట్టింది.

***

విశ్వనాధంగారి ఇల్లు చేరగానే గతస్మృతులలోంచి బయటకి వచ్చి గుమ్మంలో నించుని "మాష్టారూ!" అని పిలిచింది పూర్ణ.

గొంతులో ఆప్యాయతని, పిలుపులో తియ్యదనాన్ని వెంటనే పోల్చుకున్నారు విశ్వనాథంగారు.

"రా తల్లీ! ఎన్నేళ్ళైందమ్మా నిన్ను చూసి, ఎలా వున్నావు?"

"నేను బాగానే ఉన్నాను. మీరే నన్ను మర్చిపోయారు. ఎన్ని ఉత్తరాలు రాశాను. ఒక్కదానికీ జవాబు రాయలేదు. అందుకే నేను 'జిల్లా కలెక్టర్'ని అయ్యాననే శుభవార్త చెప్పి దగ్గరుండి మిమ్మల్ని నా వెంట తీసుకెళ్ళాలని వచ్చాను" అంది పూర్ణ.

"చాలా సంతోషం అమ్మా! ఇంత శుభవార్త ఇంత నెమ్మదిగానా చెప్పేది?"

"నాదేముంది మాష్టారూ! అంతా మీ చలవే! ఒక గడ్డిపూవును పరిమళింపచేసిన ఘనత మీదే!"

"అదేం కాదమ్మా! పరిమళిస్తున్నానని ఎగిరి పడకుండా గడ్డిపువ్వుననే భావంతో నేలమీదే ఉండి ఎంతో ఎత్తుకు ఎదిగావు. అందువల్లే అతి తక్కువ టైములో పి.హెచ్.డి పూర్తి చేసుకుని ఐ.ఎ.ఎస్ ఆఫీసర్‌వి, కలెక్టర్‌వి అయ్యావు. నీలో ఉన్న అణుకువ, పట్టుదల నిన్నీరోజు ఈ స్థాయిలో నిలబెట్టాయి. చాలా సంతోషం తల్లీ!"

"అందుకే మాష్టారూ! ఈ సంతోషం మీతో కలిసి పంచుకోవాలని ఇంట్లో ఆయన, పిల్లలు కూడా ఎదురుచూస్తున్నారు. మా పెళ్ళికి వచ్చినప్పుడే ఇంక మా దగ్గరకి వచ్చేయండి. అంటే కాదన్నారు. మీ ఓపిక ఉన్నంత వరకు ఈ ఊరొదిలి రానన్నారు. సరే అన్నాం. నాన్న పోయినప్పుడు కూడా మీరు రాలేదు. వస్తే నేను ఉండిపొమ్మంటానని, అందుకే మీరు రాలేదనుకున్నాను. ఇదంతా జరిగి పది సంవత్సరాలు కావస్తోంది. ఎన్నో ఉత్తరాలు రాసాను మిమ్మల్ని రమ్మని. ఇంకా ఎంతకాలం ఇలా ఒంటరిగా ఉంటారు? ఏమైనా సరే, ఈసారి మిమ్మల్ని తీసుకునే వస్తానని ఆయనకి, పిల్లలకి చెప్పివచ్చాను. అసలు ఆయనే వద్దామనుకున్నారు. కానీ మీరు కాదంటే బలవంతపెట్టలేరు. అందుకే నేను చెప్పి వచ్చాను" అంది పూర్ణ.

"నిజమే! మాష్టారు అమ్మాయి చెప్పింది బాగుంది. ఇక్కడ మేము ఎంతమంది ఉన్నా మీరు ఒక్కపూట కూడా మా ఇళ్ళకి రాలేదు. ఎప్పుడూ స్కూలు, పిల్లలూ అంటూ అదే లోకంగా బతికారు. ఇప్పుడు స్కూలు పెద్దదైంది. మీరూ పెద్దవారయ్యారని ప్రభుత్వం చెప్పింది. రిటైర్ అయ్యి కూడా ఎంతో శ్రమపడ్డారు. ఇక్కడ చెప్పే ట్యూషన్స్ అక్కడే చెప్పుకోవచ్చు. అయినా మీలాంటివారు ఎక్కడ ఉన్నా ఖాళీగా కూర్చోరు. కానీ ఇక్కడ ఒంటరిగా ఉండే కన్నా అమ్మాయితో వెళ్ళడమే సరైన పని. కాకపోతే మీలాంటి మంచి మనిషి ఊరొదిలి వెళితే మాఅందరికీ బాధే! అయినా మీరు ఒంటరిగా ఇక్కడ ఉండేకన్నా అదే మంచిది, " అన్నారు అంతా విన్న రామయ్య సత్యమూర్తిగార్లు...

"నేనూ అదే చెపుతున్నాను మామయ్యా! అంతేకాదు, మన ఊళ్ళో ఒక ఆసుపత్రి మా వారితో పెట్టించాలనే ఆశ ఉంది. దేవుడి దయవల్ల అది నెరవేరితే మళ్ళీ అందరం ఇక్కడికే రావచ్చు" అంది పూర్ణ.

"ఇంకేం! మాష్టారూ! అల్లుడు డాక్టరు, అమ్మాయి కలెక్టర్, ఇన్నాళ్ళూ ఇంతమంది విద్యార్థులకి సేవ చేసినందుకు ఆ సరస్వతీదేవి కటాక్షించి మీకు ఈ అపర సరస్వతిని కూతురుగా ప్రసాదించింది అనుకోండి. హాయిగా వెళ్ళిరండి" అన్నారు పూజారి మాధవశర్మగారు.

ఏ బంధంలేని తనకి కూతురు, అల్లుడు అనే కొత్త బంధం అనిర్వచనీయమైన అనుభూతి కలిగించింది విశ్వనాధంగారికి.

రెండురోజుల తర్వాత ఊళ్ళో ఉన్న పెద్దలకి, పిల్లలికి పేరు పేరునా అందరికీ వెళ్ళొస్తానని చెప్పి వదిలి వెళ్ళలేక పూర్ణవెంట నడిచారు విశ్వం మాష్టారు.

ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ, ప్రతి కుటుంబంలోనూ ఒక సభ్యుడిగా 30 సంవత్సరాలుగా అందరితోనూ కలిసిపోయిన విశ్వం మాష్టారుకి ఊరంతా కన్నీళ్ళతో వీడ్కోలు పలికారు.

✡✡✡✡

ట్రైన్ వైజాగ్ స్టేషన్‌లో ఆగగానే పూలదండలతో ఎదురు వచ్చి విశ్వం మాష్టారుకి స్వాగతం పలికారు పూర్ణ భర్త సతీష్, పిల్లలు.

"రండి మామయ్యగారూ! ఎన్నెళ్ళుగానో మీ రాకకోసం ఎదురు చూస్తున్నాం" అన్నాడు సతీష్.

"తాతయ్యా! నేను నవీన్, వీడు తమ్ముడు కళ్యాణ్. ఇవాల్టి నుంచీ మేము మీ దగ్గరే చదువుకుంటాం" అన్నారు పిల్లలిద్దరూ.

మాష్టారూ! అని తప్ప వేరే పిలుపే తెలియని విశ్వనాథంగారు 'మామయ్యగారు', 'తాతయ్యా' అన్న పిలుపులు విని పులకరించిపోయారు.

"అవును నాన్నగారూ! 'నాన్న' నన్ను 'కన్న' తండ్రి అయితే మీరు నాకు బ్రతుకునిచ్చిన తండ్రి. మీకు అభ్యంతరం లేకపోతే ఇవాల్టినుంచీ మిమ్మల్ని నేను 'నాన్నా!' అని పిలుస్తాను" ఆర్ద్రంగా అంది పూర్ణ.

"అలాగేనమ్మా! తనకు తానుగా ఇంతటి అదృష్టం వస్తే ఎలా కాదనగలను తల్లీ! మీ ప్రేమాభిమానాల్ని, ఆప్యాయతని చూస్తే నేను పోగొట్టుకున్నదేదో నాకు దొరికినట్టుందమ్మా!" అంటూ పిల్లలిద్దర్ని అక్కున చేర్చుకున్నారు విశ్వం మాష్టారు.

✡✡✡✡



*వడ్లమాని పద్మావతి పుట్టింది పెరిగింది హైదరాబాదులో. వృత్తిరీత్యా ఆర్కిటెక్ట్, ప్రస్తుతం వివాహానంతరం గృహిణిగా ఉన్నారు.*




## చిన్నమ్మ

- మంథా భానుమతి

*తెలుగు జ్యోతి రచనపోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ*
*పురస్కార ప్రదాత: శ్రీమతి శ్యామలా దేవి, శ్రీరామకృష్ణ దశిక, నార్త్‌బన్స్‌విక్, న్యూజెర్సీ*

**షికాగో ఎయిర్ పోర్ట్‌లో...** కదలనీయకుండా కాళ్ళు పట్టేసుకున్న నాలుగేళ్ళ రాజాని ఎనిమిదేళ్ళ పప్పీని విడిపించుకుని తలదించుకుని సెక్యూరిటీ కేసి నడిచింది చిన్నమ్మ.

'ఇన్నాళ్ళూ ఇంత చేశాం కదా... ఆ విశ్వాసమన్నా లేకుండా ఎలా వెళ్ళిపోతోందో! కనీసం పిల్లలకి బై చెప్పవచ్చుకదా!" చిన్నమ్మకి వినిపించేలాగ ఇంగ్లీష్‌లో శివరాంతో అంది మేఘన.

"అలా మాట్లాడకు మేఘూ!" మేఘనతో మెల్లిగా అన్నాడు శివరాం.

సరిగ్గా అప్పుడే వెనక్కి తిరిగి, నీళ్ళు నిండిన కళ్ళల్లో మిల మిలా మెరుస్తున్న కనుపాపల్తో మేఘనని చూసి, అమాయకంగా, ఆర్నెల్ల పాపాయిలా నవ్వింది చిన్నమ్మ. గాజు తలుపుల్లోంచి చిన్నమ్మ మీద పడిన సంధ్యకాంతులు, చిరునవ్వుతో మెరుస్తున్న ఆమె మొహంలో అవధుల్లేని ఆప్యాయతని ప్రతిబింబిస్తున్నాయి.

వెళ్ళిపోతున్న చిన్నమ్మని చూసి గడ్డకట్టిన హృదయంలో ఎక్కడో చిన్నగా కంపన కలిగి, వణుకుతున్న చేతుల్తో శివరాం చెయ్యి పట్టుకుంది మేఘన.

"అమ్మా! నీకో సంగతి తెలుసా? చిన్నమ్మకి ఇంగ్లీష్ బాగా వచ్చు. మూవీస్ కూడా బాగా అర్థం అవుతాయి". పప్పీ మాటలకి స్థాణువులా నిలబడి చిన్నమ్మని చూసింది మేఘన. అప్పుడు సెక్యూరిటీ లోంచీ లోపలికి వెళ్ళిపోయి అందర్నీ చూసి చెయ్యూపింది చిన్నమ్మ. అసూయా ద్వేషాలకి అతీతమైన అదే నవ్వుతో!

ఇంట్లోకి అడుగు పెడుతూనే సోఫా మీదకి ఒరిగిపోయింది మేఘన. ఇల్లంతా ఒకసారి పరికించింది. ఇద్దరూ డాక్టర్లు కదా... ఇంద్రభవనంలా ఉంది. ఎక్కడి వస్తువులక్కడ అమరి ఉన్నాయి. అన్నీ అద్దంలా మెరిసిపోతున్నాయి. సోఫాల మీద, బల్లల మీద... ఎక్కడ చెయ్యి వేస్తే అక్కడ జర్రున జారిపోయేట్లు నిగనిగలాడుతూ నున్నగా ఉన్నాయి. అంతా పదిహేనురోజులకోసారి వచ్చే మెయిడ్ ప్రతిభేనా? వీపు మీద ఎవరో ఛళ్ళున చరిచినట్లయి ఉలిక్కిపడింది.

పిల్లలు ఎక్కడివక్కడ పడేస్తే అనుకోవచ్చు... తనూ శివరాం కూడా... ఇంటికి రాగానే తలుపు దగ్గరే విసిరేసే షూస్ దగ్గర్నుంచీ, మర్నాడూ ప్రొద్దున్నే హాస్పటల్‌కి వెళ్ళేవరకూ వాడిన అన్ని వస్తువులూ మూలమూలల దగ్గరనుంచీ వెతికి ఎక్కడివక్కడ సర్దేసే చిన్నమ్మ నవ్వు మొహం గుర్తుకొచ్చింది. ఆఖరుకి తీసిన అల్మారు తలుపులు కూడా వెయ్యఖర్లేకుండా నడిచిందిన్నాళ్ళూ.

అరగంట పైగా సోఫాలో నీరసంగా పడిపోయిన మేఘన లేచి ఫ్రిజ్ దగ్గరకి వచ్చింది. గొంతుక పొడారిపోగా గ్లాసులో నీళ్ళు వంపుతూ తలుపుకి అంటించి ఉన్న కాగితం తీసింది.

"నీకు తీరికున్నప్పుడు ఫ్రిజ్ మీది ఉత్తరం చదువు." స్పెల్లింగులు అటూ ఇటూ అయినా చక్కని ఇంగ్లీషులో చిన్నమ్మ రాసిన చీటీ చూసి ఆశ్చర్యంతో ఫ్రిజ్ మీదికి చెయ్యి చాపింది.

అందమైన పువ్వులగుత్తి అందిస్తున్న రెండుచేతులు పైకాగితం మీద. "చిన్నపాపకి" అంటూ పిల్లలు వాడే క్రేయాన్ రంగులతో చెయ్యి తిరిగిన చిత్రకారుడు వేసినట్లున్న ఆ బొమ్మకేసి చూస్తూ ఉండిపోయింది. అద్భుతమైన రంగుల కలయిక.

కాగితాలు తిరగేస్తూ మెట్లు ఎక్కి అసంకల్పితంగా చిన్నమ్మ గదిలోకి వెళ్ళింది. చిన్నమ్మకి ఆ గది చూపించాక అందులోకి అడుగు పెట్టలేదు మేఘన... ఎప్పుడూ అవసరం రాలేదు, తీరికా లేదు.

గదిలోకి వెళ్ళగానే కళ్ళు పెద్దవి చేసి నమ్మలేనట్లు నాలుగుప్రక్కలా చూసింది. పేరుపొందిన ఇంటీరియర్ డెకొరేటర్‌కి తీసిపోనట్లు ఉంది అలంకరణ. ఆప్లిక్‌వర్క్ చేసిన దుప్పటీ, దిండుగలీబులూ.. రకరకాల కుచ్చిళ్ళతో కిటికీలకి తెరలు... అన్నీ కంటికి ఆహ్లాదమైన రంగులతో చేసి ఉన్నాయి. గోడలకి ఉన్న పెయింటింగ్స్ చూడగానే మేఘన చెయ్యి నోటిమీదకి వెళ్ళింది.

ఒక గోడ మీద గూటిలో ఉన్న పిల్లలకి ఆహారం అందిస్తున్న పక్షి, ఇంకో గోడ మీద తెల్లటి ఆవు... పొదుగు మీదకి ఆత్రంగా ఎగబడుతున్న మచ్చల దూడ, కిటికీ ప్రక్కగా మదర్ థెరిసా. ప్రతి పెయింటింగూ స్పష్టంగా ప్రతి చిన్న విషయం జాగ్రత్తగా గమనించి శ్రద్ధతో వేసినట్లుంది. ఒక మూల బొమ్మలో భాగం అనిపించేట్లు చిన్నమ్మ సంతకం.

కాళ్ళలో శక్తి పోయినట్లు మంచంమీద కూలబడింది మేఘన. దిండుగోడకి ఆనించి కూర్చుని చేతిలో ఉన్న కాగితాలు చదవడం మొదలు పెట్టింది.

"చిన్నపాపా! నా తర్వాత పదిహేనేళ్ళకి మన ఇంట్లో పుట్టిన పాపవని నేనే అలా పిలిచేదాన్ని. నువ్వు పసిదానివిగా ఉన్నప్పుడే అమ్మ కీళ్ళవాతంతో మంచం పట్టింది. నిన్ను నేనే కన్న తల్లిలా పెంచాను. కొంచెం పెద్ద అయ్యేదాకా నువ్వుకూడా నాతో అలాగే ప్రేమగా ఉండేదానివి. ఈ సోదంతా ఎందుకనుకుంటున్నావా? నా మనసులో మాట ఇంతవరకూ ఎవరికీ చెప్పలేదు. నోటితో కానీ చేతితో కానీ భావాన్ని చెప్పే శక్తి భగవంతుడు నాకివ్వలేదు. ఇది రాయడానికి కూడా మూడు నెలలు పట్టింది. ఇప్పుడు నీకు చెప్పకపోతే నేనేమిటో ఎవ్వరికీ తెలియదు.

నేను స్కూల్లో చేరే వరకూ నాలో లోపం ఉందని ఎవ్వరూ కనిపెట్టలేదు. ప్లీడర్‌గారి అమ్మాయి చాలా నెమ్మది... ఎక్కువ మాట్లాడదు.. కానీ మిగతా వాటిల్లో చురుకుగా ఉంటుంది అనే అనుకున్నారు. నా తర్వాత వరుసగా ముగ్గురు తమ్ముళ్ళు. ఇంటికి ఎప్పుడూ వచ్చే వాళ్ళూ వెళ్ళే వాళ్ళూ.. అమ్మకి నన్ను అందంగా అలంకరించడం తప్ప ఇంకేం పట్టేది కాదు... లోకం తెలియని అమాయకురాలు. మీరందరూ చదివిన కాన్వెంటులోనే నన్ను వేశారు. కానీ అక్షరాలూ, అంకెలూ రావడానికి రెండేళ్ళు పట్టింది. వచ్చాక మాటలు రాయడానికి రాలేదు... అన్నీ స్పెల్లింగ్ తప్పులే. లెఖ్ఖలు సరేసరి... నాన్నగారి పరపతికి ఐదోక్లాస్ వరకూ నెట్టారు కానీ ఆ తర్వాత వీలుకాదనేసింది ప్రిన్సిపాల్. నన్ను మానసికంగా ఎదగని దాని కింద జమకట్టేశారు. అప్పట్లో మన ఊళ్ళో సైకియాట్రిస్టు కూడా లేరు. నాన్నగారు చేసిన మంచిపనేమిటంటే జానకి టీచర్ని ఇంటికి పిలిచి నన్ను అప్పచెప్పడం. ఆవిడ నాలో ఉన్న ప్రతిభని బయటికి తీసుకొచ్చారు. నాకు రాయడం రాలేదు కానీ, పెయింటింగులు వెయ్యడం, కుట్లు కుట్టడం, వంట బాగా చెయ్యడం, ఇంటిని దిద్దడం, పిల్లల్ని చూసుకోవడం లాంటివి బాగా వచ్చాయి.

జానకీ టీచరే నన్ను పెయింటింగ్, కుట్టు స్కల్ప్చర్ క్లాసులకి తీసుకెళ్ళేవారు. ఎవ్వరూ నాతో మాట్లాడరు... నా అవసరం ఎవరికీ లేదు అని బాధపడుతుంటే ఎంతో ఓదార్చేవారు. నువ్వు పెద్ద క్లాస్‌లకి వచ్చాక, ముఖ్యంగా మెడికల్ కాలేజీలో చేరాక మరీ ఒంటరిదాన్నయిపోయాను. నన్ను నీ స్నేహితులకి పరిచయం చెయ్యడం కూడా నీకు ఇష్టం లేదని దూరంగా ఉండిపోయేదాన్ని. గట్టిగా రెండూమాటలు మాట్లాడితే నత్తి వచ్చేది. అది నీకు నచ్చేది కాదు. రాయలేకపోవడం సరే, మాటలు కూడా తిన్నగా రానీయలేదే అని రోజూ దేముడిని అడిగేదాన్ని. కానీ ఎదుటివారి మనసులోని భావాల్ని గ్రహించే నేర్పు ఇచ్చాడు భగవంతుడు. అందుకే నీకూ తమ్ముళ్ళకీ దూరంగా ఉండిపోయాను, మీకు నా ఉనికి చిన్నతనంగా ఉంటోందని గ్రహించి.

జానకి టీచర్ ఎప్పుడూ ఒక కథ చెప్పేవారు. పూర్వం ఒక రైతు చెరువు నుంచీ కావడిలో రెండుకుండలతో నీళ్ళు తెస్తుండేవాడు. అందులో ఒక కుండకి పగులు ఉంది. తెచ్చేటప్పుడు సగం పైగా నీళ్ళు వలికి పోతుండేవి. దాంతో ఎక్కువసార్లు తిరగవలసి వచ్చేది. పగులున్న కుండ బాధతో ఒకసారి అడిగింది. "ఇంత కష్టపడకపోతే నన్ను మార్చి మంచి కుండని తీసుకోవచ్చు కదా!"

"చెరువు నుంచీ వచ్చేటప్పుడు నీ ప్రక్కకి ఉన్న నేలని గమనించు." అని రైతు సమాధానమిచ్చాడు. అలాగే నీళ్ళు చిందిస్తూనే ఆ కుండ నేలని చూసింది. రకరకాల రంగుల పూల మొక్కలతో నేలంతా పులకరించి పోతోంది. కుండని చూసి పూలన్నీ సంతోషంగా ఊగాయి. కుండ ఆశ్చర్యంగా అటుప్రక్కకి తిరిగి చూసింది. మంచి కుండ ఉన్న ప్రక్క నేలంతా బీటలు బారి ఉంది.

అప్పుడు రైతు అన్నాడు. "మంచి కుండ ఒక్క మా ఇంటి అవసరాలే తీరుస్తోంది. నువ్వు అందరికీ ఆహ్లాదాన్ని కలిగిస్తున్నావు. రోజూ కొన్ని పూలు దేముడికి పెడతాను. కొన్ని ఇంట్లో ఆడవాళ్ళు అలంకరించుకుంటారు. అందుకని నువ్వు నాకు కష్టం కలిగిస్తున్నావని బాధపడకు." అప్పుడు పగులున్న కుండ ఆనందంతో మరిన్ని నీళ్ళని చిలకరించింది." ఈ కథ చెప్పి "నిష్కల్మషమైన మనసుతో నువ్వు చూపించే ప్రేమ నీ వాళ్ళందరూ ఎప్పటికైనా తెలుసుకుంటారు. నువ్వు సమాధానమివ్వలేవని ఎవరూ నీతో మాట్లాడట్లేదు. అంతే కానీ నువ్వు అక్కర్లేక కాదు." అని ఓదార్చేవారు.

నేను చాలా రోజులు అలాగే అనుకునేదాన్ని. నువ్వు అమెరికా తీసుకొస్తున్నప్పుడు కూడా నా మీద అభిమానంతో అనుకున్నాను. "అమ్మ కదల్లేని స్థితిలో ఉంది... నీకు ఉపయోగపడుతున్నాను.. నాతో చిన్నప్పటిలాగా ప్రేమగా ఉంటావు." అనుకున్నాను. యుయస్‌యం యల్‌ఇకి చదువుకునేటప్పుడు నువ్వు ఎప్పుడు ఏది కావాలంటావోనని నువ్వు నిద్రపోయేవరకూ నేను కూడా తెలివిగా ఉండేదాన్ని. ఇద్దరు పిల్లలు పుట్టినప్పుడూ నువ్వు ఇంకా రెసిడెన్సీలోనే ఉన్నావు. రాత్రీ, పగలూ డ్యూటీలు. పిల్లల్ని పూర్తిగా నేనే పెంచాను. ఇదంతా నీకు తెలీదని కాదు. నీకు తెలియనిదల్లా నా మీద పిల్లలకి సహజంగా ప్రేమ ఉంటుందని. నాలాంటి దానిమీద ఎక్కువ ఉంటుంది. ఎందుకంటే నేను వాళ్ళతోపాటే ఆడేదాన్ని. చదువునేర్చుకున్నా... వాళ్ళ స్కూల్లో ఏది నేర్చుకుంటే నేను అది ఇంట్లో నేర్చుకున్నా.

ఒక్కోసారి పప్పీ నాకు పాఠాలు నేర్పించేది. కంప్యూటర్ వాడడం కూడా అదే చూపించింది. అది త్వరగానే వచ్చింది. ఏమీ రాయక్కర్లేదుకదా!

నువ్వు ఫెల్లోషిప్ అయి, ప్రాక్టీస్ మొదలుపెట్టాక ఇంటి విషయాలు పట్టించుకోడానికి తీరిక దొరికింది. అప్పుడు పిల్లలు నాకు చేరికయ్యారని బాధపడ్డం మొదలు పెట్టావు. అప్పుడే నేను కూడా ఆలోచించాను... నాకంటూ ఏదో చేసుకోవాలని.

అసలు నువ్వు మెడిసన్‌లో చేరగానే ఎంతో సంబరపడ్డాను. నా లోపం పోగొట్టగలుగుతావని. నా గురించి ఒక్కసారైనా ఆలోచించావా? మానసిక లోపాల గురించి కంప్యూటర్‌లో వెతుకుతుంటే కనిపించింది. నాకు డిస్లెక్సియా ఉందని... అది లోపమే కాదని. ప్రఖ్యాత నటుడు టాంక్రూస్‌కి కూడా ఉందట. ఇంటికొచ్చిన మీ స్నేహితులకి కూడా నన్ను పరిచయం చెయ్యలేదు ఎప్పుడూ. నేను కూడా నీకు ఇష్టం ఉండదని వంటంతా చేసి గదిలోకి వెళ్ళిపోయేదాన్ని. అయినా నీ మీద నాకు కోపం లేదు పాపా! ఇన్నాళ్ళు పిల్లలతో గడపడానికి నాకు అవకాశం కల్పించావు.

ఇప్పుడు ఇండియాలో డిస్లెక్సియా పిల్లలకి చాలా స్కూల్స్ వచ్చాయి. ఒక స్కూల్లో పెయింటింగ్ నేర్పించడానికి నాకు అవకాశం వచ్చింది. ఇదంతా కంప్యూటర్ ద్వారానే పప్పీ సహాయంతో. ఇంక నేను మళ్ళీ రాలేను. ఇన్నాళ్ళు ఇల్లీగల్‌గా ఉన్నా కదా! నాకు బ్రతికున్నంతకాలం డబ్బు సరిపోయేలాగ నాన్నగారు ఏర్పాటు చేశారు. నాలా ఒంటరితనం అనుభవించే పిల్లలకి నేను ఓదార్పు ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. ఆ డబ్బు వాడి, ఆ పిల్లలకి స్పీచ్ థెరపీలు చేయిస్తాను. వాళ్ళకి ఎందులో ప్రతిభ ఉందో అందులో రాణించేలా చూస్తాను. పగులున్న కుండని కదా! వీలయినంత మందికి ఆహ్లాదాన్ని కలిగిస్తాను. ఇట్లు - ప్రేమతో నీ అక్క."

ఆ ఉత్తరం చదివాక చల్లని గాలి సోకిన మేఘంలాగా మేఘన "అక్కా" అంటూ కదిలి కదిలి ఏడ్చింది.



*మంథా భానుమతి ప్రస్తుత నివాసం హైదరాబాదు. కెమిస్ట్రీ లెక్చరర్‌గా రిటైర్ అయ్యారు. వివిధ పత్రికలలో కథలు వ్రాస్తూ ఉంటారు. రచన, స్వాతి, ఆంధ్రభూమి నవలల పోటీలలో బహుమతులు గెలుచుకున్నారు.*






# ప్రవల్లిక

- భాను

*తెలుగు జ్యోతి రచన పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ*

*పురస్కార ప్రదాత: శ్రీమతి భావరాజు భారతి, బ్రిడ్జివాటర్, న్యూజెర్సీ*

చేస్తున్న పని ఆపి ఒకసారి గడియారం వంక చూసాడు అభిజిత్. సాయంత్రం 5 గంటలయ్యింది. ఇక ఆ రోజుకి పని ముగించి బయలు దేరాడు. అభిజిత్ ఒక ప్రముఖ అడ్వర్టైజింగ్ కంపెనీకి అధిపతి. తన తెలివితేటలతో, శక్తిసామర్ధ్యాలతో తన కంపెనీని చిన్నస్థాయి నుండి ఎన్నో శాఖలున్న కంపెనీగా తీర్చిదిద్దాడు.

అభిజిత్ ఆఫీస్ నుంచి బయటకు వస్తుంటే మేనేజర్ ఎదురుపడ్డాడు. అభిజిత్‌ని చూడగానే అతనికి కొన్ని సంతకాలు తీసుకోవల్సిన విషయం గుర్తొచ్చింది. కానీ ఈ సమయంలో పిలిస్తే బాస్ ఎలా రియాక్ట్ అవుతాడో అతనికి బాగా తెలుసు. అందుకే అభిజిత్‌ని పిలిచే సాహసం చెయ్యలేకపోయాడు.

అభిజిత్ మెట్లు దిగి తన కారు దగ్గరికి వెళ్ళబోతుంటే రోడ్డు పక్కన ఒక దృశ్యం అతన్ని ఆకర్షించింది, అక్కడ రోడ్డు పక్కన కొందరు గిరిజనులు వెదురుతో అల్లిన బుట్టలూ, టోపీలలాంటి వస్తువులు అమ్ముతున్నారు. వెదురు టోపీ అంటే ప్రవల్లికకి ఎంతో ఇష్టం. ఏదో సినిమాలో హీరోయిన్ పెట్టుకుంటే చూసిందట. అప్పట్నుంచీ అలాంటి వెదురు టోపీ కావాలని పట్టుపట్టింది. ఆ హీరోయిన్ కన్నా నువ్వే అందంగా ఉంటావని తను ఎంతో చెప్పి చూసాడు. వింటేగా. చిన్నపిల్లలా మంకు పట్టు పట్టి తనని హైదరాబాదులో షోరూములన్నీ తిప్పించింది. కానీ ఎక్కడా దొరకలేదు. చివరికి శిల్పారామంలో జరిగిన హస్తకళల ఎగ్జిబిషన్‌కి కూడా వెళ్ళారు. అక్కడ కూడా దొరకలేదు. ప్రవల్లికైతే ఆశ వదులుకుంది. తను మాత్రం ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు ప్రవల్లికని సర్‌ప్రైజ్ చెయ్యటానికి. ఎన్ని పెద్ద షోరూములు తిరిగినా దొరకని ఒక వస్తువు ఈ రోజు ఇలా తన ఆఫీస్ ముందే దొరకటం, చాలా నవ్వొచ్చింది అభిజిత్‌కి. వెంటనే వెళ్ళి ఒక టోపీ తీసుకుని వంద రూపాయలు నోటు ఇచ్చాడు. చిల్లర ఇవ్వబోతుంటే ఉంచుకోమన్నట్టు సైగ చేసి వెనుతిరిగాడు.

"ఇది చూస్తే ప్రవల్లిక ఎంత ఆనందపడుతుంది. ఇది తనకు వెంటనే ఇవ్వకుండా ఉడికించాలి" అనుకుంటూ కార్ స్టార్ట్ చేసాడు. ప్రవల్లికని ఉడికించటమంటే చాలా ఇష్టం అభిజిత్‌కి. అలా ఉడుక్కున్నప్పుడు కందగడ్డలా ఎర్రగా మారిన ఆమె ముఖాన్ని చూడమంటే మరీ ఇష్టం. అలా ప్రవల్లిక గురించే ఆలోచిస్తూ, కార్‌ని ఒక ఫ్లోరిస్ట్ షాపు ముందు ఆపి కిందకు దిగాడు. అతను షాపులోకి ప్రవేశించగానే

ఆ షాపు యజమాని స్నేహపూర్వకంగా నవ్వి, అప్పటికే అతనికోసం సిద్ధంగా ఉంచిన ఒక చిన్న ఫ్లవర్ బంచ్‌ని అతని చేతికి అందించాడు. నాలుగు ఎర్రగులాబీలతో అందంగా తయారు చేసిన ఫ్లవర్ బంచ్ అది. దాన్నందుకుని అతనికి డబ్బులు చెల్లించి తిరిగి కారెక్కాడు. ప్రవల్లికకి ఈ ఎర్రగులాబీలంటే ఎంతో ఇష్టం. ఏ రోజన్నా ఇవి మర్చిపోతే తను చేసే మారాం అంతా ఇంతా కాదు. అంతెందుకు తను 6 గంటలకి ఒక్క నిమిషం లేట్‌గా వెళ్ళినా తను చేసే గొడవ చూడాలి. దేవి గారిని ప్రసన్నం చేసుకోవాలంటే తల ప్రాణం తోకకొస్తుంది.

అభిజిత్ ఇక గమ్యస్థానం చేరుకుంటాడనగా రెడ్ సిగ్నల్ పడింది. కారు ఆపుచేసి చుట్టూ చూస్తున్న అభిజిత్‌కి అక్కడ ఆగి ఉన్న వాహనాల దగ్గరకొచ్చి అడుక్కుంటున్న ఒక ఆరేళ్ళ పిల్లాడు కనిపించాడు. వాణ్ణి చూసేసరికి అతని ఆలోచనలు నాలుగు నెలలు వెనక్కి వెళ్ళాయి. ఒకసారి తనూ ప్రవల్లిక షాపింగ్ నుంచీ వస్తుంటే దారిలో ఇదే పిల్లాడు అడుక్కుంటూ కనబడ్డాడు. తను యధాలాపంగా ఒక రూపాయి ఇవ్వబోయాడు. కానీ ప్రవల్లిక తనని చెయ్యి పట్టుకుని ఆపింది తను చిరాగ్గా చూసాడు మరీ అంత పిసినారితనం పనికిరాదన్నట్టుగా.

ప్రవల్లిక అదేమీ పట్టించుకోకుండా ఆ పిల్లాడివైపు తిరిగి "మాతో పాటు వస్తావా? భోజనం పెడతాను" అని అడిగింది. వాడు తల అడ్డంగా ఊపి తనకి భోజనం వద్దు, డబ్బులే కావాలని అన్నాడు.

"సరే. ఏం చేస్తావురా ఆ డబ్బుల్తో" అడిగింది ప్రవల్లిక.

"పాన్ పరాగ్ కొనుక్కుంటాను" అమాయకంగా చెప్పాడు వాడు.

వాడి మాటలకి కోపం పట్టలేక వాణ్ణి కొట్టడానికన్నట్టు చెయ్యెత్తింది ప్రవల్లిక. వాడి చెంప చెళ్ళుమనుండేదే అభిజిత్ ఆపకపోతే.

ఇదంతా చూసి ఆ పిల్లాడు మెల్లగా జారుకున్నాడు.

"చూడు అభిజిత్. పిల్లలెలా పాడయిపోతున్నారో" బాధగా అంది ప్రవల్లిక.

"వాడు ఎలా పోతే నీకేంటి? ఇవ్వాలనిపిస్తే ఓ రూపాయివ్వు. లేకపోతే వదిలెయ్. ఎందుకంత బాధ?" అన్నాడు అభిజిత్ విసుగ్గా.

ఆశ్చర్యంగా చూసింది ప్రవల్లిక. "వాడికి భోజనం పెట్టు. లేదా వాడికేదన్నా పనిచూపించు. అంతేగానీ ఇలా వాడికి రూపాయో, రెండు రూపాయలో ఇస్తే వాడు చెడిపోవటానికి నువ్వు పరోక్షంగా సాయం చేసినట్టే" కోపంగా అంది.

ఈసారి ఆశ్చర్యపోవటం అభిజిత్ వంతయ్యింది. "తనతో చిన్న చిన్న విషయాలకి గొడవపెట్టుకునే ప్రవల్లికలో ఇంత సామాజిక స్పృహ ఉందా?"

అప్పటిదాకా ఆమె చిలిపితనాన్నీ, అమాయకత్వాన్నీ ప్రేమించిన అతను అప్పటినుంచీ ఆమె వ్యక్తిత్వాన్ని కూడా ప్రేమించటం మొదలుపెట్టాడు.

"కానీ ఇంత మెచ్యూర్డ్‌గా ఆలోచించగలిగిన ప్రవల్లిక ఒక్కోసారి చిన్నపిల్లలా ప్రవర్తిస్తుంది ఎందుకు? తను ఎప్పుడైనా కసిరినా, కోపంగా ఒక చిన్న మాట అన్నా చిన్నపిల్లలా ఏడ్చేస్తుంది. అసలు ప్రవల్లిక తనకి పూర్తిగా ఎప్పుడన్నా అర్ధమైతే కదా? A woman's heart is a deep ocean of secrets అని ఏ కవి అన్నాడో కానీ అది అతనికి కూడా అనుభవంలోకి వచ్చింది. పూర్వం మన కవులు చాలామంది ఒకే కావ్యానికి రెండు మూడు అర్ధాలు వచ్చేలా శ్లేషకావ్యానికి అర్ధాలెన్నో సృష్టించిన ఆ దేవుడికైనా పూర్తిగా తెలుసో లేదో?"

తన వెనకాల మోగుతున్న హారన్ మోతలతో ఈ లోకంలోకొచ్చిన అభిజిత్ కారుని ముందుకి దూకించాడు. కొంచెం సేపటికి తను చేరవలిసిన ప్రదేశంవచ్చేసింది. అక్కడ అంతా ప్రశాంతంగా ఉంది. అతను కారు దిగి ఏ మాత్రం తడుముకోకుండా స్ట్రెయిట్‌గా వెళ్ళి ఒక చోట ఆగాడు. అక్కడ ఒక నల్లటి గ్రానైట్ రాయి మీద బంగారు రంగులో అక్షరాలుమెరుస్తున్నాయి.

ప్రవల్లిక

**w/o అభిజిత్**

జననం **19-1-1982**

మరణం 20 - 3 - 2007

దాని క్రింద పాలరాతితో ఒక బేస్ కట్టబడి ఉంది.

అభిజిత్ తను తెచ్చిన టోపీ, గులాబీ పూలుబేస్ మీద పెట్టాడు. ఆ బేస్మెంట్ మీద అతనికి తన భార్య ప్రవల్లిక కనిపిస్తోంది. ఆ బేస్మెంట్‌తో మాట్లాడసాగాడు.

ఒక నెల క్రితం ప్రవల్లిక యాక్సిడెంట్‌లో చనిపోయిన దగ్గరి నుంచీ అభిజిత్ ఇలానే చేస్తున్నాడు. మొదట్లో అందరూ అతనికి పిచ్చెక్కిందేమో అనుకున్నారు. అందరూ అతనికి ప్రవల్లిక చనిపోయిందని నచ్చచెప్పటానికి చాలా ప్రయత్నించారు.

"తను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన ప్రవల్లిక చనిపోయిందా?" నమ్మబుద్దికాలేదు అభిజిత్.

"చివరి దాకా తోడుంటానని మాటిచ్చింది కదా? ఇప్పుడు తననిలా ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోతుందా? అయినా ప్రవల్లిక తనని వదిలి ఎక్కడికి వెళ్ళింది? తను వేసే ప్రతి అడుగులో తన వెనకాలే వస్తుంది. తన శ్వాసలో నిక్షిప్తమై తనకి జీవనాధారం అయ్యింది. తన విజయంలో ప్రోత్సహిస్తూ, ఓటమిలో వెన్నుతడుతూ నిత్యం తనతోనే ఉంది. నేను కాదు పిచ్చి వాణ్ణి. ప్రవల్లిక చనిపోయిందని చెపుతున్న వీళ్ళంతా పిచ్చివాళ్ళు."

ఇక అతను ఎవ్వరి మాటలూ పట్టించుకోదలచుకోలేదు.

అభిజిత్ రోజూ తన ప్రవల్లికని కలుస్తూనే ఉన్నాడు. ప్రేమకు మరణం లేదు.



భాను స్వస్థలం మంగళగిరి, గుంటూరు జిల్లా, హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.




# ఆరాధ్య దేవత

- ఆర్. శర్మ. దంతుర్తి

*వంగూరి ఫౌండేషన్ రచనల పోటీలో బహుమతి పొందిన కథ*

"నమస్తే మాధవి గారు: నేను అమెరికా నుంచి ఈ ఇమెయిల్ పంపిస్తున్నాను. మీ ఈ మెయిల్ ఎడ్రస్ గూగుల్ మీద సంపాదించాను - ఫిషరీస్‌లో, చేపల వేట కంప్యూటర్ సహాయంతో ఎలా ఇంప్రూవ్ చేయవచ్చో అని మీరు పబ్లిష్ చేసిన పేపరు చూసి. మీరు కానీ అయిదేళ్ళ క్రితం సర్దార్ పటేల్ కాలేజీలో కంప్యూటర్ ఇంజినీరింగు చదువుకున్నారా? ఇదే పేరుతో నాకు తెలిసిన ఒకావిడ ఉన్నారు. లేకపోతే ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోరని ఆశిస్తున్నాను. ఏదైనా నాకు ఓ రిప్లై ఇవ్వగలరు ... రఘురాం."

"డియర్ రఘురాం సర్: అవును నేను ఎస్.పి. కాలేజీలో చదువుకున్నాను. నాకు పెళ్ళవక ముందు పేరు మాధవి కలువకొలను. పట్టాభిషేకం అయ్యాక అది కాస్తా మాధవి ఓరుగంటి అయ్యింది. మీరుగానీ మాకు కంప్యూటర్ ఇంజినీరింగులో పాఠాలు చెప్పిన ప్రొఫెసర్ రఘురాం కాదు కదా? ఇదే నిజమైతే నాకు మీ వివరాలు అన్నీ చెప్పండి. మీరు అమెరికా ఎప్పుడు వెళ్ళారు? మా వదిన గారిని అడిగానని చెప్పండి:-) రిప్లై కోసం ఎదురుచూస్తూ... మాధవి"

"హాల్లో మాధవి గారు: సో, నేననుకున్నట్టు మీరు నా స్టూడెంట్ అన్నమాట. అవును నేను మీకు పాఠాలు చెప్పిన రఘురాంనే. పాఠాలు చెప్పి విసుగెత్తి, రివైండ్ అండ్ ప్లేబేక్ అండ్ ప్లేబేక్ చేయలేక అక్కడ్నుంచి పి.హెచ్.డీ కోసం అమెరికా వచ్చాను. అదయ్యాక ఇప్పుడు టెక్సాస్‌లో పనిచేస్తున్నాను. మీవదినగారంటూ ఎవరూ లేరు ఎందుకంటే నాకు పెళ్ళవలేదు. అయినా ఎవరండీ ఈ వాగుడుకాయను చేసుకునేదీ?:) మీరు ఇప్పుడు ఎక్కడున్నారు? మీ క్లాస్మెట్స్ అందరితో ఇంకా కాంటాక్ట్‌లో ఉన్నారా? వాళ్ళందరి విశేషాలు చెప్పండి, మీ ఆయన ఏం చేస్తుంటారు? అడిగినట్లు చెప్పండి. చాలాకాలం తర్వాత మిమ్మల్ని కాంటాక్ట్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. మీ ఫ్రెండ్స్ ఎవరైనా అమెరికాలో ఉన్నారా?... రఘురాం."

"డాక్టర్ రఘురాం: మీ ప్రోగ్రెస్ చూసి కొంచెం అసూయపడ్డ మాట వాస్తవం. నేను డిగ్రీ పూర్తిచేసే సరికే తలతోకకి వచ్చింది. వావ్! పి.హెచ్.డీ? మీరు మాతో ఎప్పుడు చెపుతూ ఉండేవారు ఎప్పటికైనా డాక్టరేట్ తీసుకుంటానని. మొత్తమ్మీద సాధించారన్నమాట. చాలా సంతోషం. మా ఆయన పేరు సంతోష్. ఆయన కూడా ఇక్కడే ఢిల్లీలో పనిచేస్తున్నారు. మేమిద్దరం కంప్యూటర్ ఇంజినీర్లే కనక

తిట్టుకున్నా కొట్టుకున్నా మొగా, గిగా బైట్లలోనే:-) ఇంకా మా వదిన గారు లేకపోవడం దురదృష్టం. నా క్లాస్‌మేట్స్ నలుగురైదుగురు అమెరికాలో ఉన్నారని తెలుసు. కానీ మీ ఆరాధ్య దేవత మీకు అతి ద...గ్గి...ర..లో అమెరికాలోనే ఉంది.:-) వివరాలు తర్వాత....మాధవి."

"మాధవి గారు: మీ ఆయన గురించి తెలిసి 'సంతోషి'ంచాను. ఆయన పేరు ఎలాగూ సంతోష్ అన్నారు కదా:-) మీ మెయిల్ చూసి భలే ఆశ్చర్యపోయాను. ఎవరండీ నా ఆరాధ్య దేవత? వివరాలు చెప్పగలరా?... రఘురాం"

"డాక్టర్ రఘురాం: మీరు నాపేరుబట్టి గూగుల్ మీద నన్ను కనుక్కున్నారు మేము కంప్యూటర్ ప్రోగ్రామ్స్ రాస్తే అవి అసలు రన్ చేయకుండానే తప్పులు ఎక్కడో ఇలా ఓ సారి చూసి చెప్పేసేవారు. అలాంటి వారు కనకనే మేము అసలు ప్రోగ్రామ్స్ రన్ చేయకుండా లేబ్‌లో రిపోర్ట్‌లు సబ్మిట్ చేయడానికి భయపడేవాళ్ళం. మిగతా లేబ్స్‌లో రిపోర్ట్‌లు కాపీ కొట్టినా మీ దగ్గిర అది సాగేది కాదు. రిపోర్ట్‌లన్నీ షార్ప్‌గా చూసి కాపీ కొట్టినందుకు మాకు అక్షింతలు వేసేవారు. అలాంటి మెమరీ పవర్ ఉన్న మీరు, డాక్టర్ రఘురాం, ఎవరు నా ఆరాధ్య దేవత అని అడుగుతోంటే నవ్వొస్తోంది. నాటకాలు ఆడకండి. మీకు తెలుసు ఆవిడెవరో... మాధవి"

"మాధవిగారు: మీ ఈమెయిల్ చూసి ఆలోచన్లో పడ్డాను. నా స్టూడెంట్స్ చాలామంది నాకు గుర్తున్నారు. పేర్లు గుర్తులేకపోయినా, మనిషిని చూస్తే గుర్తుపట్టగలను. ఆ మధ్య ఇక్కడ పటేల్ స్టోర్స్‌లో ఒక స్టూడెంట్ కనిపించాడు. నాకు పేరు గుర్తురాలేదు కానీ అతను నాకు బాగా తెలుసు. నన్ను ఏడిపించక కొంచెం ఆవిడ పేరు చెప్పి పుణ్యం కట్టుకోగలరు.. రఘు. పి.ఎస్. అస్తమానూ డాక్టర్ రఘురాం అని ఎడ్రస్ చేయక్కర్లేదు. రఘు అని పిలిచినా నేనేమీ అనుకోను. నేను ఇప్పుడు మీ ప్రొఫెసర్ని కాదు కదా!"

"రఘురాం గారు: మీకు నిజంగా మీ ఆరాధ్య దేవతెవరో గుర్తులేదంటే నేన్నమ్మను. నాటకాలు కట్టిపెట్టండి. మేము లేబ్‌లో చిన్న తప్పు చేస్తే మమ్మల్ని ఏడిపించేవారు కదా? ఇప్పుడు నాది ఛాన్స్ మిమ్మల్ని ఏడిపించడానికి. అయినా చెపితే నాకేంటి లాభం?:-) :-) :-)"

"మాధవి గారు: అమ్మా మహాతల్లీ ముందు చెప్పేసి నా టెన్షన్ వదిలించండి. మీరు చెప్పినట్టు ఆవిడ నిజంగా నా ఆరాధ్యదేవతే అయితే మీకేం కావాలో అడగండి. ఇవ్వకపోతే చూడండి... రఘు."

"డియర్ జెజె: చాలా కాలం తర్వాత ఈమెయిల్ పంపిస్తున్నందుకు ఏమీ అనుకోకు. ఈ మధ్య వళ్ళు వంగట్లేదు ఏపని చేద్దామన్నా. మీ బావగారికి వెంటనే ఒక పాపాయి కావాలిట. ఇప్పుడెక్కడున్నావ్? ఇంకా ఆస్టిన్‌లోనే ఉన్నావా? అన్నట్టు ఈ మధ్య రఘురామ్ సర్ ఈ మెయిల్స్ పంపిస్తున్నారు నాకు. నా ఎడ్రస్ గూగుల్ మీద సంపాదించారట. అక్కడే అమెరికాలో ఉన్నారు. ఎక్కడున్నారో ఇప్పుడే చెప్పేది లేదు. నిన్ను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించేదాకా. నీకు చాతనైతే గూగుల్ మీద ట్రై చేసుకో. హ.హ్హా. ఇంకేమిటి విశేషాలు?....... మాధవి"

"మాధవి: ఏ రఘురాం గురించి నువ్వు చెప్పేది? మన కాలేజీలో ప్రొఫెసరేనా? ఎక్కడున్నారు. కెకెపిసి గారు ఇక్కడున్నారంటే నమ్మకం కుదరట్లేదు. ఆయన ఈమెయిల్ నాకు పంపించు. ఫోన్ నెంబరుందా? వెర్రి వెర్రి వేషాలు వెయ్యక వెంటనే చెప్పు... జెజె"

"జెజె: అబ్బ, ఆశ, అప్పడం వడ, కెకెపిసి అనేసరికి అంత 'వెంటనే' కావాల్సొచ్చిందా? నాకు ఈమెయిల్స్ పంపడానికి నీకు టైము లేదు కానీ, నేను మాత్రం కెకెపిసి ఈమెయిల్, ఫోన్ నెంబరూ నీకిచ్చెయ్యాలా అడగ్గానే? బానే ఉంది సంబడం. నిన్ను ఇంకా ఏడిపించకుండా ఏవీ ఇచ్చేది లేదు... మాధవి"

"మాడ్: మా మాంఛిదానివి కదూ. ఇదేనా స్నేహితురాలికి చేసే హెల్ప్? కెకెపిసి డిటైల్స్ పంపించకపోతే నీతో జట్టు పీస్:-(..జెజె"

"జెజె: సరే, సరే ఇదిగో కిందన ఇస్తున్నాను ఆయన ఈ మెయిల్ ఎడ్రస్. మీఇద్దరూ మాట్లాడుకున్నాక నన్ను మర్చిపోతే, అప్పుడు చూపిస్తా ఈ మాధవి ఎంత మంచిదో:-) ... మాడ్"

"ట్రింగ్", "ట్రింగ్"

"హల్లో, థిస్ ఈజ్ రఘు స్పీకింగ్"

"నేను గుర్తున్నానాండి?"

"ఎవరండీ మీరు? మీ పేరైనా చెప్పలేదు. ఎక్కడ్నుంచీ మాట్లాడుతున్నారు?"

"నేను మీకు బాగా తెలిసినదాన్నే. నా గొంతు గుర్తుపడతారనుకున్నానే."

"ఏంవిటండీ ఇదీ? రాత్రి పదింటికి ఫోన్ చేసి ఇలాగేనా మాట్లాడ్డం? కాస్త పేరుచెప్పొచ్చుగా? తెలుగు మాట్లాడుతున్నారు కనక మనిద్దరం ఎక్కడో ఆంధ్రాలో కలిసాం అనుకుంటా. పోనీ నేను మీకేలా తెలుసో చెప్పండి."

"ఎందుకండీ అంత తొందర నా పేరు తెలుసుకోవడానికి? ఎలాగా తెలుస్తుంది మీకు ఇప్పుడు కాకపోతే, రేపో ఎల్లుండో. పోనీ కాలర్ ఐ.డి మీద చూడండీ!" సన్నగా నవ్వు.

"ఏడిసినట్టే ఉంది. కాలర్ ఐ.డి మీద అన్నోన్ కాలర్ అని ఉంది. ఆ మాత్రం తెలీదనుకున్నారా?"

"ఓకె, ఓకె కెకెపిసి గారూ రేపు మళ్ళీ ఇదేవేళకి ఫోన్ చేస్తాను. అప్పటివరకు మీకు గుర్తొస్తుందేమో!"

"మాధవి గారు: మీరు కానీ నాకు నిన్న రాత్రి ఫోన్ చేసారా? ఇపుడు ఇండియా నుంచీ అమెరికా ఫోన్ చేయటం అంత ఖరీదు కాదని విన్నాను. ఫోన్ చేసినావిడ పేరు చెప్పకుండా పెట్టేసింది. మళ్ళీ రేపు చేస్తుందిట. ఫోన్ కంపెనీకి ఫోన్ చేసి ఆవిడ నంబరు కనుక్కోవచ్చు. కానీ రేపెలాగా మళ్ళీ చేస్తానంది కదా? ఎంత ట్రై చేసినా ఆవిడ వాయిస్ గుర్తు రాలేదు. నన్ను మాత్రం కెకెపిసి అని పిల్చింది. కెకెపిసి అంటే మీగ్గానీ తెలుసా? మీరే చేసినట్లైతే మీ వాయిస్ నేను గుర్తుపట్టలేదు. సారీ.. రఘు."

"రఘుగారు: నేను మీకు ఫోన్ చేయలేదు. కెకెపిసి అంటే నాకు తెలుసు కానీ చెప్పను ఇప్పుడు, అడక్కండి ప్లీజ్. కొంపతీసి ఫోన్ చేసినావిడకానీ మీ ఆరాధ్య దేవతేమో?:-).. మాధవి"

'ట్రింగ్", "ట్రింగ్"

రఘు స్పీకింగ్"

"నేను గుర్తొచ్చానాండీ?"

"లేదండి. పేరు చెప్పి కొంచెం పుణ్యం కట్టుకుంటారా? నన్నేడిపిస్తే మీకేంవిటానందం?"

"తప్పకుండా చెప్తాను మహాశయా. కానీ ముందు మీ డైటైల్స్ అన్నీ చెప్పండి. అమెరికా ఎప్పుడొచ్చారు? ఎక్కడున్నారిప్పుడు, ఏం చేస్తున్నారూ అన్నీ చెప్పండి ముందర."

"ఇంకా నయం. నా సోషల్ సెక్యూరిటీ నెంబరిమ్మన్నారు కాదు. చూడు తల్లీ, నాకేమో మీరెవరో గుర్తులేదు. మీరేమో నన్ను పర్సనల్ డిటైల్స్ అన్నీ అడుగుతున్నారు. ఇండియాలో మా ఫేమిలీ, పెళ్ళి సంబంధాలకని నా ఫోన్ నంబరు చాలా మందికి ఇచ్చారట.

వాళ్ళతో వేగలేక ఛస్తున్నాను. ఇది కానీ పెళ్ళి సంబంధాల విషయం అయితే ఇప్పుడే చెపుతున్నాను, ఇది ఇక్కడితో ఆపెయ్యడం మంచిది. లేకపోతే తర్వాత నేను కోపమొచ్చి మిమ్మల్ని తిట్టాననుకోండి. నా బాధ్యత లేదు."

సన్నగా నవ్వు. "నేనడిగిన డిటైల్స్ చెప్పండి. పేరు తప్పకుండా చెబుతాగ. మిమ్మల్ని డిజప్పాయింట్‌మెంట్ చెయ్యను. సరేనా?"

"ఒకే, డోకే. ఆరేళ్ళ క్రితం పి.హెచ్.డికి అమెరికా వచ్చి పడ్డాను. ఓ ఏడాది క్రితం పట్టా పుచ్చుకుని ఇప్పుడిదిగో హ్యూస్టన్ నగరంలో మోటరోలా రీసెర్చి డివిజన్‌లో ఉద్యోగం వెలిగిస్తున్నాను. ఈ ఆరేళ్ళలో ఓ రెండుసార్లు ఇండియా వెళ్ళొచ్చాను. ఇంకా డిటైల్స్ కావలిస్తే చెప్పండి."

"ఏమిటి, మీరుండేది హ్యూస్టన్‌లోనా? నేను ఫోన్ చేసేది ఆస్టిన్ నుంచి, మీ పేరు ఎల్లో పేజెస్‌లో చూసి మీ ఫోన్ నెంబర్ సంపాదించాను. మీ ఫోన్ ఏరియా కోడ్ చూసి ఏ కాలిఫోర్నియాయో అనుకున్నానే."

"ఒకే, మీ పేరు?"

మళ్ళీ అదే నవ్వు. "డాక్టర్ రఘురాం, నన్ను ఇంకా గుర్తుపట్లే?" తెరలు తెరలుగా నవ్వు.

"ఆగండాగండి, మీరు జేజేనా? మీ నవ్వు పట్టి చెప్పేసాను. నాకు ఇప్పుడే గుండె కొట్టుకోవడం మానేసింది. ఇప్పుడు చెప్పండి ఏం చేస్తున్నారు ఆస్టిన్‌లో? ఎప్పుడొచ్చారు అమెరికా? మీ హజ్బెండ్ ఏం చేస్తుంటారు?"

"హమ్మయ్య. ఇప్పటికి తెలిసిందన్నమాట. మరో సంగతి. ఇప్పటినుంచీ జెజె అని పిలుస్తే పలికేది లేదు. మీరు నాకిప్పుడు ప్రొఫెసర్ కాదు కదా?"

"అదేమిటండోయ్! ప్రొఫెసరెప్పుడూ ప్రొఫెసరే, స్టూడెంట్ ఎప్పుడూ స్టూడేంటే. పోనీ జాబిలీ అని పిలవమంటారా?"

"అదేంటీ? ఆఖరికి పొద్దున్నే రేడియోలో కూడా 'శుభ్ర జ్యోత్స్న పులకిత యామినీం....' అని వినిపిస్తూంటే? ఇంటి పేరు పెట్టా నన్ను పిలవడం.?

"సరే అయితే. ఒక్కమాట. ఈ వీకెండుకి నేను ఆస్టిన్ వస్తే మిమ్మల్నీ, మీ ఫామిలీని కలవడం కుదురుతుందా?"

"మా ఫామిలీ అంటే నేనూ, మా ఇద్దరు రూమ్మేట్సే, అసలిప్పుడు ఫోన్ చేసింది మిమ్మల్ని ఆస్టిన్ రమ్మని పిలవడానికే కదా! నేను డిగ్రీ వచ్చాక ఓ మూడేళ్ళు ఇండియాలో పని చేసి, ఎం.ఎస్ చేయడానికి ఆస్టిన్ వచ్చాను. మాధవి మీ ఈ మెయిల్ అడ్రస్ ఇచ్చింది. మిగతాదంతా నా ప్రతాపమే."

"గ్రేట్! అయితే మిమ్మల్ని వచ్చే శనివారం ఆస్టిన్‌లో కలుస్తాను. ఆస్టిన్‌లో మాంఛి దేశీ రెస్టారెంట్ చూడండి భోజనానికి. ఈలోపల ఈమెయిల్ పంపించండి. ఇంతకీ కెకెపిస్ అన్నారుగా నన్ను? అంటే ఏమిటో చెప్పండి మాధవిగారిని అడిగాను, ఆవిడ చెప్పనంది."

మళ్ళీ నవ్వు, తనకెంతో ఇష్టమైన జెజె నవ్వు. "అది మీకు కాలేజీలో మేం పెట్టిన నిక్ నేమ్. కొన్ని రోజులాగితేగానీ, చెప్పేది లేదు."

"మాధవిగారు: మెనీ మెనీ థాంక్స్. నిన్న రాత్రే నేను జ్యోత్స్నతో ఫోన్‌మీద మాట్లాడాను. తన వాయిస్ మొదట్లో నేను గుర్తుపట్టలేదు కానీ నవ్వుతూంటే తెలిసిపోయింది. జెజేనేనా నా ఆరాధ్యదేవతన్నారూ? మీకెలా తెలిసింది?:-) మగాడెప్పుడూ ఒకే అమ్మాయిని ప్రేమిస్తాడంటారు. నేను జ్యోత్స్నని ప్రేమించాననడం అండర్ స్టేట్‌మెంటే, మా ఇద్దర్నీ కలిపినందుకు మీకు చాలా థేంక్స్. ఈ శనివారం నేను ఆస్టిన్ వెళుతున్నాను జ్యోత్స్నని కలవడానికి. ఇంతకీ కెకెపిసీ అంటే చెప్పరేం?... రఘు."

"రఘురాం గారూ: జ్యోత్స్న క్లాసులో ఉంటే మీరు పాఠాలు చెప్పే తీరే వేరు. ఆవిడ కాలేజీకి రాకపోతే మీ తీరే వేరు. ఇక లేబ్‌లో అయితే చెప్పఖ్ఖర్లేదు. పిల్లి కళ్ళు మూసుకు పాలుతాగుతూ తనని ఎవరూ చూడట్లేదనుకుంటుందట. అలాగే మీరూనూ. జ్యోత్స్నని చూడగానే మీ కళ్ళల్లో కనిపించే 'వెలుగు' గురించి ప్యూన్ దగ్గరనుంచీ మీ సాటి ప్రొఫెసర్లదాకా తెలియని వాళ్ళెవరూ లేరు, కెకెపిసి అంటే చెప్పను ఇప్పుడే అంతగా ఆగలేకపోతే, ఆస్టిన్ వెళుతున్నారుగా, జెజెనే అడగండి:-)... మాధవి... పి.యస్. ఒకప్పటి ప్రొఫెసర్ని కదా అని ఎక్కువగా వాగి జ్యోత్స్నని విసిగించకండి. అది అసలే ఎక్కువగా మాట్లాడే రకం కాదు. అతివాగుడుతో దగ్గర్లో ఉన్న ఆరాధ్య దేవతని దూరం చేసుకోకండి:-)"

"జెజె: రఘురాంగారు ఈమెయిల్ పంపించారు. ఆయనొచ్చినప్పుడు ఎప్పటిలాగా నోరుమూసుకుని కూర్చోకు. ఆయన నిన్ను చూస్తే, కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తూ కూర్చోడం తప్ప ఏఁవీ చెయ్యడు కదా? నిన్ను లవ్ చేయడం అనే మాట అండర్ స్టేట్‌మెంటే అని నాకు పంపించిన ఈ మెయిల్లో (కిందన కట్ అండ్ పేస్ట్) అన్నారు. ఆయనా నువ్వూ ఒకర్నొకరు అలా చూస్తూ కూర్చుంటే పుణ్య కాలం కాస్తా గడిచిపోతుంది...మాధవి"

**శనివారం. ఆస్టిన్, టెక్సాస్:**

"ఇప్పుడు చెప్పండి జ్యోత్స్నగారు. ఎం.ఎస్ ఇంకా ఎంతకాలం ఉంది. తర్వాతేం చేస్తారూ?"

"ఫస్ట్‌థింగ్స్ ఫస్ట్. నన్ను గారూ అనడం మానేయండి."

"సరే, సారీ"

"ఇంకో రెండు నెలల్లో ఎం.ఎస్ అయిపోతోంది. నాన్నగారు ఇప్పటికే వారం వారం ఫోన్ చేసి చంపుతున్నారు పెళ్ళి చేసుకోమని. అమ్మైతే ఇంక చెప్పఖ్ఖర్లేదు. సో నెక్స్ట్ పెళ్ళి తప్పదు. ఆ తర్వాత ఓ ఏడాది ఆగి ఉద్యోగం వేట మొదలు పెట్టాలి. "

"ముందే ఉద్యోగం మొదలుపెట్టి పెళ్ళి చేసుకోండి. గ్రాడ్యుయేషన్ తర్వాత ఓ ఏడాది గేప్ వస్తే జాబ్ రావడం కష్టమేమో? మీ ఇంట్లో వాళ్ళు ఏమైనా సంబంధాలు చూసారా? మీకేమైనా నచ్చాయా?"

"ఆ చూద్దాం లెండి. మీ గురించి చెప్పండి మీకు జాబ్ ఉంది చదువైపోయింది. గ్రీన్ కార్డొచ్చిందా? పి.హెచ్.డి చేసి రీసెర్చ్ జాబ్‌లో ఉంటే మొదటి కేటగిరీలో గ్రీన్ కార్డు వస్తుందని విన్నానే? ఇంతకీ మీ పెళ్ళెప్పుడు?"

నా గ్రీన్ కార్డు పేపర్లు ఆల్రెడీ పంపించారు. అది శాంక్షనైతే, వెంటనే ఇండియా వెళ్ళి పెళ్ళి చేసుకోవడం, ఆవిడ ఇక్కడికొచ్చాక ఇద్దరూ కలిసి వీసా స్టేటస్ ఎడ్జస్ట్ చేసుకోవడం చెయ్యాలి."

"అమ్మాయ్ ఇక్కడే దొరికితే? మీ వాళ్ళు ఒప్పుకుంటారా?"

"అమ్మాయ్ ఇక్కడే దొరికినా, పెళ్ళి మాత్రం ఇండియాలోనే, లేకపోతే అమ్మ ఒప్పుకోదు. అయినా నాలాంటి వాగుడుకాయని నన్ను బాగా తెలిసిన అమ్మాయే చేసుకోదూ. ఇంక ఇక్కడెవరు చేసుకుంటారూ?"

"బాగా తెలిసిన అమ్మాయే చేసుకోదని ఎవరు చెప్పారూ? ఎంతమంది నడిగారేం?" నవ్వు; పాఠాలు చెప్పిన మూడేళ్ళలో అహోరాత్రాలూ తనని వెంటాడిన తళుకులీనే కళ్ళలో చిలిపి నవ్వు. ఆ కళ్ళలోకి మతిపోయేలా చూడ్డం తప్ప తానేం చేయగలడూ?

"ఇంక ఎవ్వర్నీ అడగలేదు. అడిగాక నో అంటే నేను తట్టుకోలేను."

"ఇందాకటినుంచీ చూస్తున్నాను. నా కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూడ్డం తప్ప వేరే ఏమీ పని లేదా? క్లాసులో పాఠాలు చెప్పినప్పుడూ అలాగే చూసేవారు కదా?" ఇంకొంచెం నవ్వు; తాను పరిసరాలు మర్చిపోయి తన్మయత్వంతో చూస్తుంటే, వాలిన కళ్ళలో సిగ్గరి నవ్వు.

"క్లాసుకొస్తే నేను మీ కళ్ళలోకి చూట్టం తప్ప ఏంవీ చేసేవాడిని కాదటగా? కాలేజీ ప్యూన్ దగ్గర్నుంచీ, స్టాఫ్ మెంబర్ల వరకూ అందరికీ తెల్సటా? ఇంతమందికి తెలుసునని నాకు మాత్రం తెలియదు. నిన్న మాధవి ఈమెయిల్లో చెప్పేదాకా."

"హతోస్మి. ఇప్పటికైనా తెలిసింది కదా? అదలా ఉంచండి. మీరు అడగబోయే అమ్మాయి ఎస్ అంటే మీకే మంచిది కదా? అడక్కుండా చూస్తూ కూర్చుంటే, అమ్మాయ్ అమ్మా నాన్నల మాట విని రెండు మూడు నెలల్లో ఇంకెవర్నో చేసేసుకుంటుంది. అప్పుడో?"

"అడిగితే ఎంతదూరమైనా వెళ్ళి నా ఆరాధ్యదేవత నడుగుతాను కానీ, రోడ్డు మీద పోతూ మొహమాటానికి హాయ్ అనే ప్రతీ తెల్లమ్మాయినీ, మూడొందల పౌండ్ల నల్లమ్మాయినీ అడుగుతానా?"

ఈసారి తెరలు తెరలుగా నవ్వు. క్లాసులో తాను వేసిన జోక్స్‌కి మెచ్చికోలు కళ్ళతో, మొదటి బెంచీలోంచే కిసుక్కున వినిపించే మనోహరమైన నవ్వు. తన హృదయంలో ఎప్పటికీ చెరిగిపోని స్మృతుల్లో గలగలా పారే గోదావరిలా ఆహ్లాదమైన నవ్వు.

"సరే కానివ్వండి. ఇంత దూరం వచ్చారు. అడగడానికి ఇంక ఆలశ్యం దేనికి?" సప్త సముద్రాలు దాటి వేలమైళ్ళు వచ్చేసినా తనని వెతికి వెంటాడి అయస్కాంతంలా దగ్గరకి లాక్కున్న జాబిలి కళ్ళలో ఆత్మవిశ్వాసం తోడైన నవ్వు.

"ఆ... ఆ..ఓ, వావ్! అందుకేనా నన్ను ఆస్టిన్ రమ్మందీ?"

"లేకపోతే ఇంకెందుకు పిల్చాననుకుంటున్నారు?" మళ్ళీ కొంటె నవ్వు. తను కళ్ళు తిప్పుకోలేని నవ్వు. ఇష్టమైన ఫీలింగ్స్ అన్నీ నాభిలోంచి గుప్పించి పైకి తీసుకొచ్చి నోటితో స్పష్టంగా చెప్పాలని ప్రయత్నించినప్పుడు మాట రాకపోతే. స్వచ్ఛమైన కళ్ళలో ఆ ఫీలింగ్స్ అన్నీ క్లియర్‌గా చూపించే శుభ్ర జ్యోత్స్న నవ్వు. తాను ఎన్నిసార్లు చూసినా తనివి తీరని పండు వెన్నెల చిందించే ఆ కాటుక కళ్ళల్లో తనని మళ్ళీ చూడమని ఛాలెంజ్ చేసే నవ్వు.

**విజయవాడ, ఇండియా:**

"జ్యోత్స్నా, అక్క వెళ్ళి ఒకసారి మాట్లాడి వస్తుంది రఘురాం ఫేమిలీతో, అతనికి బేక్ గ్రౌండ్ అదీ తెలుసుకుంటే మంచిది కదా? అయినా వాళ్ళకి మనం నచ్చాలి కూడాను. అలాగ అమెరికాలో చూసేసి నేను వీణ్ణి తప్ప ఇంకెవరినీ చేసుకోనూ అనడం ఏం బావుంది?"

"అమ్మా, రఘురాం గారు నాకు ఇక్కడే ఇండియాలో ఉన్నప్పుడు కాలేజీలో ప్రొఫెసర్, ఈయున్ని అమెరికాలో ఓసారి చూసి చేసుకోవట్లేదు. నీకి అంత పట్టింపుంటే, అక్కని పంపించు. కానీ ఇండియా వచ్చేముందే మేము డిసైడ్ చేసుకున్నాము. ఇంక వేరే సంబంధాలు చూడకండి. నేను ఎవర్నీ చూడను. మాధవీ నువ్వు కూడా చెప్పవే."

"అబ్బే, ఇంకేముందీ చెప్పడానికి? ముందునుంచే రఘురాంకి జ్యోత్స్న అంటే చెప్పుకోలేనంత ఇష్టం. అసలు ఆయన నన్ను ఈమెయిల్లో కాంటాక్ట్ చేసింది జ్యోత్స్న గురించేననుకుంటాను. కెకెపిసి అని ఆయనకి నిక్‌నేం పెట్టింది మేమే కదా?"

"జ్యోత్స్నా, జాతకాలు కలవాలి, అవధానులు గారిని పిలిచి అడుగుదాము. ఏమంటారో"

"అమ్మా, పంచాంగం చూసుకునేవాళ్ళకి మంచీ చెడూ అది చూడకపోతే అన్నీ మంచి రోజులే. ఆ పంచాంగం అక్కడ పారేసి, నేను చెప్పేది విను. రఘురాం గారికి గ్రీన్ కార్డు అప్లికేషన్ అప్రూవ్ అయ్యింది. పెళ్ళయితే ఇద్దరికీ ఒకేసారి గ్రీన్ కార్డు ఇస్తారు. అందుకనే, ఇక్కడకి వచ్చేటప్పుడు అక్కడే పెళ్ళిచేసుకుని గ్రీన్ కార్డు అప్లికేషన్ ఇచ్చేసి వచ్చాము. ఇక్కడ పెళ్ళి మీ ఆనందం కోసమే తప్ప, మా ఇద్దరికీ ఎప్పుడో నెలక్రితం పెళ్ళైపోయింది. ఆ అవడం కూడా మామూలుగా కాదు. మేరేజ్ లైసెన్సుకి అప్లై చేసి, ఆ సర్టిఫికెట్ ఇమ్మిగ్రేషన్ వాళ్ళకిచ్చేసి వచ్చాము. ఇంకా పంచాంగం అదీ చూస్తానంటావా? కానియ్యి."

"ఏయ్ జెజె, నువ్వేనా నోట్లో నాలిక లేని నువ్వేనా ఇది చెప్పేది? నీతో నాలుగేళ్ళు చదివిన నేనే నమ్మలేకపోతున్నాను. నీ పెళ్ళికి నన్ను పిలుస్తానన్నావ్ కదా? రెండో పెళ్ళికి పిలుస్తున్నావన్నమాట. మొత్తమ్మీద నోరు విప్పి మాట్లాడ్డం నేర్చుకున్నావు. నీలో వచ్చిన మార్పుకి 'జేజే'లు.

ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు, కొత్త ఢిల్లీ:

"మాధవి గారు, మీకు ఎలా థేంక్స్ చెప్పాలో తెలియట్లేదు. మిమ్మల్ని కాంటాక్ట్ చేయకపోతే జ్యోత్స్న గురించి ఎప్పటికీ నాకు తెలిసేది కాదేమో."

"నాటకాలు ఆడకండి. అసలు మీరు నన్ను కాంటాక్ట్ చేసింది మీ ఆరాధ్య దేవత కోసమేగా?"

"అదీ నిజమే. ఆఖరి అనౌన్స్‌మెంట్ వచ్చింది. ఇంక మేము లోపలికి వెళ్ళాలి ప్లేన్ ఎక్కడానికి. ఇప్పుడైనా చెప్పండి, కెకెపిసి అంటే ఏమిటో. ఇంక నన్ను ఏడిపించడం భావ్యం కాదు. ప్లీజ్"

"జోత్స్నా నువ్వు చెప్పవే!"

"కాదు నువ్వే చెప్పు. అది ఆయనకు నువ్వు పెట్టిన పేరే కదా?"

"ఆ మాత్రం తెలియదా ప్రొఫెసర్ గారూ? కెకెపిసి అంటే ఎప్పుడూ మీరు జ్యోత్స్నని చూడగానే చేసేదే?" నవ్వు.

"జోత్స్న నవ్వుని మెచ్చుకోవడం?"

"కాదు. కెకెపిసి అంటే, కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడ్డం."




# మేలి ముసుగు

- మద్దూరి శివప్రసాద్

*వంగూరి ఫౌండేషన్ రచనల పోటీలో బహుమతి పొందిన కథ*

చల్లని వెన్నెల్లో, ప్రశాంత యమునా తీరంలో ముంతాజ్ అద్భుతలావణ్యాన్ని, షాజహాన్ అమరప్రేమను ప్రతిబింబిస్తూ ఠీవిగా నిలబడి ఉంది తాజ్‌మహల్. జీవంలేని పాలరాళ్ళతో సజీవమైన ఆ మహోన్నత కళాఖండాన్ని సృష్టించిన నాటి భారతీయ శిల్పుల చాతుర్యానికి గర్వంతో ఉప్పొంగి పోయాయి మా హృదయాలు. పౌర్ణమి నాటి పండు వెన్నెల్లో తాజ్‌సౌందర్యాల్ని ఆస్వాదించి తరించడానికి బయలుదేరి ఆనాటి మధ్యాహ్నమే ఆగ్రా చేరుకున్నాం మా విహార యాత్రా బృందమంతా. ప్రయాణపు బడలిక తీర్చుకుని, చంద్రోదయ సమయానికి తాజ్ చేరుకున్నాం సుధాంశుని అమృత కిరణాలు ఆ కళా సృష్టిపై బడి వింత సోయగాల్ని సంతరించుకుంటున్నాడు అంతటి అందాన్ని తన ఒడ్డున ఉంచుకుని కూడా తనకేమీ తెలీనట్టు అమాయక ముగ్ధత్వంతో ప్రశాంతంగా సాగిపోతుంది యమున. నిజంగా ఆ దృశ్యాన్ని ఏకాళిదాసో ప్రశాంతంగా చూసినట్టయితే మరో కమనీయ కావ్యాన్ని సృష్టించి ఉండేవాడేమో!

నెమ్మదిగా అందరం కలిసి తాజ్‌లోపలి కడుగుపెట్టాం. ప్రతి అణువులోనూ సౌందర్య దివ్య జ్యోత్స్నలను వెదజల్లే ఆ శిల్ప సముదాయాన్ని తనివితీరా చూశాము. మనస్సంతా మధురనుభూతితో నిండిపోయింది. ముంతాజ్ అందాల ఖని. మూర్తీభవించిన లావణ్యరాసి. ఆమె అందాలన్నిటినీ ప్రోగుజేసి యుగయుగాలుగా చెక్కు చెదరకుండా ఉండేందుకు తాజ్‌మహల్‌లో భద్రపరచారేమో అనిపించింది. తృప్తిపడిన మనస్సుతో బయటకు వచ్చాం అందరం. మాలో కొందరు వెన్నెల్లో కాస్సేపు యమునా నది ఒడ్డున ఇసుకలో గడిపితే బావుంటుందేమో అని యోచించటంతో అటువెపు బయలుదేరాం.

అక్కడకు చేరింతర్వాత కొందరు ఆ చల్లని ఇసుకను చూసి అక్కడే కూర్చుని లోకాభిరామాయణం ప్రారంభించారు. మరికొందరు పాటలు, పాడగలవారు, తాము పాడగలము అనుకున్న వాళ్ళు విజృంభించి తమ సంగీతంతో హోరెత్తించేస్తున్నారు. నాట్యాచార్యులు భరత నాట్య విన్యాసాన్ని, రాక్ ఎన్ రోల్ మెళుకువల్ని టీకా తాత్పర్యా సహితంగా ప్రదర్శిస్తున్నారు. భోజనప్రియులు తెచ్చుకున్న ఫలహారాలతో కుస్తీ పడుతున్నారు.

ప్రేయసి కోసం అంతటి మహోన్నత సృష్టినే నిర్మించగలిగిన షాజ్‌హాన్ ప్రేమను గురించి తలపోస్తూ నడుస్తున్న నాకు కొద్ది దూరంలో ఒక ఇసుక దిబ్బపై కొన్ని తెల్లటి రాళ్ళు వెన్నెల్లో మసక మసగ్గా కనబడగానే అటువేపు నడిచాను. దగ్గరకు వెళ్ళి చూడగానే పాలరాతితో మలచిన చక్కటి శిల్పాలు కనబడ్డాయి. యుగాల తరబడి అక్కడ పారవేసి ఉన్నట్లు కొన్ని పూర్తిగా శిధిలమై పోయాయి.

మరికొన్ని ఇసుకలో కూరుకుని కొంత భాగాలు మాత్రమే బయటకు కనబడుతున్నాయ్. కానీ వాటి అందం, లావణ్యం ఏమాత్రం చెదిరిపోలేదు. అవన్నీ ఒకే స్త్రీమూర్తి శిల్పాలని సులభంగా తెలిసిపోయింది. కానీ ముఖ సౌందర్యం తెలియకుండా ఆ స్త్రీ మేలిముసుగు ధరించినట్లు చెక్కాడు శిల్పి. ప్రతి వంపులో, ప్రతి రేఖలో ముగ్ధమనోహర సౌందర్య దీపికలు వెల్లివిరుస్తున్నాయ్. అంతటి సౌందర్యవతి ఉంటుందా అనిపించింది. ఇంత చక్కటి శిల్పాల్ని చెక్కిన శిల్పి ఎవరు? ఇవి ఊహా శిల్పాలా? లేకపోతే నిజంగా ఇంత అందమైన స్త్రీ ఏ కాలంలోనైనా ఉందా? చక్కటి ఈ మూర్తుల్ని ఎందుకు ఇలా పడేసి ఉంచారు? అని అనేక సందేహాలు కలిగాయి.

ఏంచేయాలో తోచక నిలబడిపోయిన నాకు "బాబూ" అన్న పిలుపు వినబడగానే ఉలిక్కిపడ్డాను. అదో స్త్రీకంఠం. వేయి కోయిలలు ఒకేసారి గొంతెత్తి పాడినట్లు, మరికొన్ని వేల వీణాతంత్రులు సవరించినట్లు చాలా శ్రావ్యంగా ఉందా ధ్వని. ఎవరా అని చుట్టూ పరికించి చూసాను. ఎవరూ కనబడలేదు. దూరంగా మా బృందంలో వాళ్ళు మాత్రం మసక మసగ్గా తప్ప.

మళ్ళీ "బాబూ" అన్న అదే కంఠ ధ్వని వినిపించింది.

"ఎవరు మాట్లాడుతున్నది?" అసహాయంగా అరిచాను.

"నేను బాబూ, నీ ఎదురుగా ఉన్న శిల్పాన్ని"-

ఆశ్చర్యపోయాను. శిల్పాలు మాట్లాడటమా? రాజకుమారుల కథలో చదివాను, సినిమాల్లో చూశాను శిల్పాలు మాట్లాడటం - నిజంగా శిల్పం మాట్లాడుతుందనే సరికి ఆశ్చర్యం, భయం కలిగాయి. అయినా ధైర్యం చేసి దగ్గరకు వెళ్ళి చూసాను. ఆ శిల్పం కూడా మిగతా వాటిలాగే స్త్రీ ప్రతిమ. సగం వరకూ ఇసుకలో కప్పడిపోయింది. నడుం నుంచీ పైభాగం మాత్రమే కనబడుతోంది మేలిముసుగు వేసుకున్నట్లు మలిచినా ఎందుకో కళ్ళనుంచీ కన్నీరు కారుస్తున్నట్లు కనబడింది. నీటిచుక్కలు ముసుగు క్రింది నుంచీ ఇసుకపైకి జారిపడుతున్నాయ్.

"నాకు తెలుసు బాబూ! మేమిక్కడ దిక్కులేని స్థితిలో ఎందుకు పడి ఉన్నామని అడుగుతున్నావు కదూ?" అని అడిగిందా శిల్పం.

నిజంగా ఆశ్చర్యం వేసింది. శిల్పం మాట్లాడటమే కాకుండా నామనస్సులోని భావాల్ని సైతం ఎలా తెలుసుకుందా అని.

నేను తేరుకునే లోపలే ఆ శిల్పం 'నీకు మా చరిత్ర తెలుసుకోవాలనుందా బాబూ' అని అడిగింది.

అంగీకారంగా తల ఊగించాను.

✷✷✷

చనిపోయిన ప్రేయసి కోసం, ఆమె పేరు చరిత్ర యుగయుగాలుగా నిలిచిపోవటానికి అంతకు ముందు ఎవరూ కనీవినీ ఎరుగని మహోన్నత సృష్టి చేయాలి అని షాజహాన్ ప్రయత్నిస్తున్న రోజులవి. దేశంలోని శిల్పాచార్యులందరికీ ఆహ్వానాలు వెళ్ళాయి. వాళ్ళందరితో చక్కటి శిల్పాలు చేయించి వాటిని తన భార్య స్మృతి మందిరంలో ప్రతిష్ఠింప చేయాలని చక్రవర్తి తాపత్రయం. అందుకు తగ్గట్టుగానే అనేక మంది శిల్పులు వేల సంఖ్యలో వచ్చారు.

ఆ సమయంలోనే దక్షిణ భారతం నుంచీ రామశర్మ అనే యువశిల్పి వచ్చాడు. అతనో చక్కని శిల్పి, కళాతపస్వి, కానీ ఎన్నో రోజులనుంచీ పీడిస్తున్న దారిద్ర్య దేవత శృంఖలాలనుంచీ రాజాశ్రయంతో బయటపడదామనే ఆశతో చాలా దూరం నుంచీ ఎలాగైతేనేం రాజధాని చేరుకున్నాడు. చక్రవర్తి ప్రేయసి స్మృతికోసం మందిరం నిర్మిస్తున్నాడన్న వార్త విని తన శిల్పాల్లో అద్భుత స్త్రీ రూపాన్ని మూర్తీభవింప జేయాలనుకున్నాడు.

కానీ రామశర్మకు ఎన్నో విధాల సుందర రూపాల్ని ఊహించుకుని రాతిమీద చెక్కినా సంతృప్తి కలగేది కాదు. అందమైన స్త్రీ నెవరినన్నా చూసి ఆమె సోయగాలను రాతిలో సృష్టించడానికి రోజూ రాజధాని నగరమంతా అందమైన యువతుల కోసం తిరిగాడు. మిగతా శిల్పులు కొందరు సుందరీమణులను తమ దృక్పథంలో పెట్టుకుని తయారు చేస్తున్న శిల్పాలను చూశాడు. కానీ వాటన్నిటిలో

సౌందర్యం పరిపూర్ణత లేదనిపించింది. ఏదో ఒక వంక కనబడేది వాటి అందంలో. రామశర్మ ఓపిక సన్నగిల్లసాగింది. సృష్టికి ప్రతి సృష్టి చేయాలన్న ఆవేశం, చేయలేకపోతున్నాను అనే ఆవేదనా అతన్ని పీల్చి, పిప్పిచేయసాగాయి.

ఒకరోజు జరిగిన సంఘటనలో శిల్పి జీవితంలో నూతనాధ్యాయం ప్రారంభమైంది. ఆ రోజు సాయంకాలం నగరానికి దగ్గరలో ఉన్న రాజోద్యాన వనం ప్రక్కనుంచీ నడిచి వెళుతున్నాడు. ఆ సమయంలోనే ఉద్యానవనం నుంచీ ఒక మేనా బయటకు వచ్చింది. చుట్టూ శిల్కు తెరలు కట్టి ఉండడంవల్ల లోపలెవరున్నారో తెలియడం లేదు. అంతలో ఒక బిచ్చగాడు ఆశగా మేనా వంక చూస్తూ చేతులు చాచాడు. సిల్కు తెరలను వత్తిగించుకుని ఒక సున్నితమైన హస్తం బయటకు వచ్చి బంగారు నాణాన్ని ఒక దానిని బిచ్చగాడి చేతుల్లోకి విసిరింది. ఆ చేతిని చూసిన శిల్పి హృదయంలో వేయి దీపాలు వెలిగినట్లయింది. తానింతకాలం నిర్విరామంగా వెదుకుతున్న వస్తువేదో లభించినట్లయింది. రత్నకంకణం ధరించిన ఆ చేతి సోయగం, ధరించిన వజ్రపుటుంగరాల్ని సైతం చిన్నబరుస్తున్న ఆ సన్నని నాజూకైన వేళ్ళ లావణ్యం అతనిలో వింత అనుభూతుల్ని రేకెత్తించినయి. ఆమె వెళ్ళిన వేపే ఆశగా చుస్తున్న అతన్ని వెనకగా వస్తున్న సైనికాధికారి భుజం పై చరిచి, "ఎందుకు భయ్యా! అలా అందని పండ్ల కోసం అర్రులు చాస్తావు? ప్రమాదం జాగ్రత్త!" అని హెచ్చరించి సాగిపొయ్యాడు. ఇంటికి తిరిగివచ్చిన శిల్పి మనస్సు అశాంతికి లోనైంది. ప్రతి క్షణం ఆ మృదు హస్తమే కనబడసాగింది. ఏదో తెలీని ఆవేశంలో నిర్విరామంగా శ్రమపడి ఆ చక్కటి చేతిని ఆధారంగా ఒక స్త్రీ రూపాన్ని పాలరాతిపై మలిచాడు. కానీ ముఖబింబాన్ని ఊహించటం శక్తినిమించిన పనికావటంతో ఆ స్త్రీ మేలిముసుగు వేసుకున్నట్లు తయారు చేయగలిగాడు.

తాను పూర్తి చేసిన విగ్రహాన్ని చూసి ఉప్పొంగి పొయ్యాడు శిల్పి. తన జన్మకేదో సార్థకత్వం లభించినట్లయింది. తాజ్‌మహల్ నిర్మాణంలో నియమింపబడ్డ ముఖ్య శిల్పాచార్యుడు ఆ సుందర శిల్పాన్ని చూసి యువ శిల్పిని అనేక విధాల మెచ్చుకుని ఆ విగ్రహాన్ని మందిరంలో ప్రతిష్ఠించటానికి స్వీకరించాడు.

రామశర్మ నవ్యోత్సాహంతో ఆ మూర్తినే అనేక భంగిమల్లో జీవం పోయసాగాడు. కానీ అన్నిట్లో ఆ శిల్పాలకు మేలిముసుగులుండటం వల్ల ముఖం గుర్తుపట్టడానికి వీలయ్యేది కాదు. కొద్దిరోజుల్లో రామశర్మ పేరు దిశదిశల ప్రాకిపోయింది. అతని శిల్పాలని చూడటానికి చాలాదూరం నుంచీ ప్రజలు వచ్చేవాళ్ళు.

ఒకరోజు పని ఎలా సాగుతుందో చూడటానికి వచ్చిన చక్రవర్తి ఆ సుందర ప్రతిమల్ని చూడటం తటస్థించింది. వాటిరూపు, రేఖా విలాసాలకు ఆశ్చర్యపడి అంత చక్కటి కళాఖండాల్ని సృష్టించిన శిల్పిని తీసుకు రమ్మని ఆజ్ఞాపించాడు. రామశర్మను షాజహాన్ ఎదుటకు తీసుకుని వచ్చారు.

ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అంతటి చిన్న వయస్సులో సాధించిన అతని ప్రతిభను మెచ్చుకున్నాడు చక్రవర్తి.

"అయినా శిల్పీ! నీ శిల్పాలన్నిటికీ ముసుగు వేసి ముఖారబింబాన్ని దాచేశావెందుకు?" అని అడిగారు నవ్వుతూ.

"నేనా యువతిని చూడలేదు జహాపనా! కేవలం ఆమె చేతిని మాత్రమే చూశాను. దాని ఆధారంతో శిల్పాన్ని తయారు చేశాను."

బిగ్గరగా నవ్వారు షాజహాన్

"పరిహాసానికి వేళాపాళా ఉందయ్యా! చేతిని చూసి శిల్పాన్ని చెక్కావంటే ఎవరన్నా నమ్ముతారనుకున్నావా? బహుశా ఈమెకు తన మొహాన్ని నలుగురుకి చూపటం ఇష్టం లేకపోయి ఉంటుంది. అవునా?"

"లేదు జహాపనా! నేనింతవరకూ ఆమెను చూడలేదు"

రక్తారుణిమ దాల్చింది చక్రవర్తి ముఖం.

"ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?"

"తెలుసు ప్రభూ!" వినయంగా జవాబిచ్చాడు శిల్పి.

"అయితే రెండు వారాలు గడువిస్తున్నాను. ఈ యువతి శిల్పాన్ని ముసుగులేకుండా తయారు చేయి. లేకపోతే - రాజదండనకు గురికావాల్సి ఉంటుంది."

షాజహాన్ విసురుగా అక్కడినుంచీ వెళ్ళిపోయాడు.

శిల్పాచార్యుడు రామశర్మ భుజం మీద ఆప్యాయంగా చెయ్యి వేసి, "అనవసరంగా మూర్ఖపు పట్టుదలకు పోవద్దు బాబూ! నీకు చక్కటి భవిష్యత్తు ఉంది. నీ ప్రతిభకు అఖిలభారతావని జోహారు అర్పించే రోజు త్వరలో వస్తుంది నాయనా! నీ చేతులారా పాడు చేసుకోకు. త్వరలో చక్రవర్తి కోరినట్టు శిల్పాన్ని తయారు చెయ్యి" అని దీవించాడు. నిరాశగా నవ్వి కదిలిపోయాడు శిల్పి.

అర్ధరాత్రి రాజధాని నగరం అంతా సుఖ నిద్రలో ఉంది. శిల్పి ఇంటి తలుపు ఎవరో తట్టినట్లయింది. మంచంపై పడుకుని నిద్రపట్టక నిరాశగా శూన్యంలోకి చూస్తున్న శిల్పి లేచి భారంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి తలుపు తీశాడు.

తలుపు తీయగానే కనబడింది తలుపు తట్టిన చెయ్యి. ఏ సుకుమార హస్తం తన ప్రతిభను నలుదిశల వ్యాపింపజేయడానికి కారణభూతమైందో, ఏసుకుమార హస్తం వల్ల తానీనాడు చక్రవర్తి ఆగ్రహం గురి అయ్యాడో ఆ హస్తం గల వ్యక్తి బయట నిలబడి ఉంది. కానీ నల్లటి ముసుగు వేసుకుని ఉంది. ఆమె లోపలకు వచ్చి తలుపు గడియపెట్టింది. ముసుగు తీసిన ఆమె సౌందర్యాన్ని చూసి మ్రాన్పడిపోయాడు రామశర్మ. దివినుండీ భూవికి దిగివచ్చిన సౌందర్య దేవతలా ఉంది ఆమె.

"శిల్పీ! నేనెవరో తెలుసా?"

తెలీదన్నట్టు తల అడ్డంగా ఆడించాడు.

"తెలుసుంటే ఇంతటి సాహస కార్యానికి పూనుకునేవాడివి కాదు. నా ప్రతిమలను తయారుచేసి ఈనాడు ప్రాణాపాయంలో చిక్కుకునేవాడివి కాదు. భగవాన్! ఎంతపని జరిగింది." ఆవేశంగా నుదురు కొట్టుకుంది.

శిల్పి ఆమె మాటల్ని వినటంలేదు. అతని కళాహృదయం ఆమె అందాల్ని ప్రతి కోణం నుంచీ పరిశీలిస్తుంది.

"నేను షాజహాన్ చక్రవర్తికి స్వయంగా సోదరిని. ఈ సంగతి అన్నయ్యకు తెలిస్తే నిన్ను బ్రతకనివ్వడు. రాచరికపు స్త్రీ నలుగురిలో వెల్లడి కావటం మొగల్ ఆచారానికే విరుద్ధం. కాబట్టి ఇక్కడినుండీ పారిపో. నాకోసం, నా ప్రతిమను సృష్టించటం కోసం అనవసరంగా నీ ప్రాణాలు పోగొట్టుకోకు!" అని చెప్పి త్వరగా చీకటిలోకి వెళ్ళిపోయింది.

శిల్పికి ఆమె మాటలు ఒక్కటీ చెవికెక్కలేదు.

ఆమె సౌందర్యాన్ని చూచిన అతని హృదయం ఉప్పొంగిపోయింది. ఏదో తెలియని ఆవేశం ఆవహించింది. ఆ అందానికి రాతిలో జీవం పొయ్యక పోతే తన జీవితానికి సార్ధకం లేదనిపించింది. ఇంటి తలుపులన్నీ మూసి అహోరాత్రులు ఆమె శిల్పాన్ని చెక్కటం ప్రారంభించాడు

రెండువారాలు గడిచిపొయ్యాయి.

చక్రవర్తి పంపిన అధికారులు శిల్పి ఇంటికి వచ్చి, లోపల గడియ వేసి ఉండటం చూసి, తలుపు తట్టారు కానీ తలుపు తెరుచుకోలేదు. విఫల ప్రయత్నం మీద తలుపులు బ్రద్దలు కొట్టి లోపలకు ప్రవేశించి అక్కడి దృశ్యాన్ని చూసి మ్రాన్పడిపోయారు. ఒక అతిలోక సుందరి కాళ్ళ వద్ద శిల్పి సొమ్మసిల్లి పడి ఉన్నాడు. దగ్గరకు వెళ్ళి, ఆ సుందరి సజీవం కాదని, శిల్పమని తెలుసుకుని మరింత ఆశ్చర్యపోయారు. శిల్పికి ఆహారమిచ్చి సేద దీర్చారు. శిల్పానికి ఒక వస్త్రం కప్పి ఆ శిల్పితో సహా దర్బారులో చక్రవర్తి ఎదుట హాజరు పరిచారు.

శిల్పం తయారయ్యిందని తెలియగానే సంతోషంతో ఉప్పొంగిపొయ్యారు షాజహాన్.

"సెభాష్ శిల్పీ! నీ జన్మ ధన్యమయ్యిందయ్యా! నీ పేరు చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుంది."

శిల్పి నిశ్శబ్దంగా తలవంచుకుని విగ్రహం ప్రక్కన నిల్చున్నాడు చక్రవర్తి తీయడమే సమంజసమని సూచించాడు.

చక్రవర్తి లేచి శిల్పాన్ని సమీపించసాగాడు.

సభ అంతా ఆత్రంగా పరికిస్తున్నారు.

షాజహాన్ శిల్పాన్ని అంటిపెట్టుకున్న వస్త్రాన్ని తొలిగించాడు.

వెంటనే ఆయన మొహంలో రంగులు మారాయి. కోపంతో కంపించిపొయ్యాడు.

శిల్పాన్ని రెండు చేతుల్తో బలంగా పైకెత్తి విసురుగా నేలకు కొట్టాడు. సభంతా దిగ్భ్రాంతులయ్యారు.

మరుసటి రోజు సూర్యోదయాన్ని చూడటానికి శిల్పి నోచుకోలేదు.

అంతకు ముందు శిల్పి చెక్కిన శిల్పాలన్నిటిని అక్కడినుంచీ తీసి దూరంగా పారవేయమని ఆజ్ఞాపించాడు.

* * *

"ఇదీ కథ - మేమే ఆ అదృష్టహీనమైన శిల్పాలం. కొన్ని యుగాలుగా ఇక్కడ పడియున్నాం!"

తన కథనం ముగించింది శిల్పం.

"మిమ్మల్ని ఇన్ని రోజుల్నుంచీ ఎవరూ చూడలేదా! కళాహృదయమున్న మానవుడెవడూ ఇలాంటి చక్కటి శిల్పాలు పడి ఉండటానికి ఒప్పుకోడే" అని అడిగాను ఆవేశంగా.

తను చెప్పాల్సింది అయిపోయింది. ఇంక మాట్లాడను అన్నట్లు మూగనోము పట్టింది శిల్పం.

ప్రపంచ ఖ్యాతిని పొందాల్సిన శిల్పజీవితం అలా ముగిసినందుకు రెండు అశ్రుకణాలు కళ్ళనుండీ జారిపోయాయి. వేడినిట్టూర్పు విడిచి భారంగా అడుగులు వేసుకుంటూ మా బృందాన్ని కలుసుకోవటానికి సాగిపోయాను బరువెక్కిన హృదయంతో.

యమునా నది నిశ్చలంగా సాగిపోతూంది.

("తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?" అన్న శ్రీశ్రీ ప్రశ్న ఈ కథ నేను వ్రాయటానికి Inspirational Back ground గా పని చేశాయి. ఈ కథ, కథలోని సంఘటనలు కేవలం కల్పితాలు. ఇది నిజంగా జరిగిన సంఘటనా అని తెలుసుకోవడానికి చరిత్ర పుస్తకాలు వెతకొద్దు. - రచయిత)

* * *